
# సంస్కృతి మార్క్సిజం


రావు కృష్ణారావు



డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ

# సంస్కృతి- మార్క్సిజం

## రావు కృష్ణా రావు



డా. చెలికాని రామారావు గారు.

15.7.1901 – 25.9.1985

డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ

రామచంద్రపురం, తూర్పు గోదావరి జిల్లా

# సంస్కృతి - మార్క్సిజం రచన : రావు కృష్ణారావు

ప్రథమ ప్రచురణ : మార్చి, 2021

కాపీలు : 1000

టైటిల్ డిజైన్ : సుభాష్

© సర్వ హక్కులూ రచయితవి

**Rao Krishna Rao**
Phone : 99483 77168
Email: raork54@yahoo.com

**వెల : ₹ 40/-**

ప్రతులకు

విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవ చేతన, నవ తెలంగాణా
మరియు ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభించును

ప్రచురణ

**డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ**
రామచంద్రపురం, తూర్పు గోదావరి జిల్లా - 533 255.
డా॥ చెలికాని స్టాలిన్, ఫోన్ : 98493 48162.

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు,
తిరుపతి, కాకినాడ, ఒంగోలు,
శ్రీకాకుళం, కడప, విజయనగరం.

హెచ్చరిక : ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ

అంకితం

# రేణక్కకు



## డాక్టర్ చెలికాని రేణుకాదేవి

**02.05.1949 – 20.11.2018**

# ప్రచురణ కర్తల మాట

మానవ జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసే అంశాల్లో సంస్కృతి ఒకటి. “సంస్కృతి” భావనను బిన్న అర్థాలలో ఉపయోగిస్తున్నారు. అదే విధంగా సంస్కృతిని వివిధ తాత్విక ధోరణులలో వివిధ రకాలుగా విశ్లేషించారు. సంస్కృతిని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే దానిని మార్క్సిస్టు దృక్పథం నుండి అర్థం చేసుకోవాలి. సంస్కృతిని మార్క్సిస్టు దృక్పథంలో విశ్లేషించిన రచనలు తెలుగులో గతంలో అందుబాటులో లేవు. ఈ లోపాన్ని పూరిస్తూ 2019 లో శ్రీ రావు కృష్ణారావు 'మార్క్సిజం- సాంస్కృతిక సిద్ధాంతాలు' అనే పుస్తకం రచించారు. దానికి కొనసాగింపుగా సంస్కృతిని మార్క్సిస్టు దృక్కోణంలో విశ్లేషిస్తూ ఈ అంశాలను మరింత సరళంగా సామాన్య పాఠకులకు అర్థమయ్యేలా వ్రాయాలని ఉద్దేశ్యంతో ఈ పుస్తకం రాయడం జరిగింది. అంతేకాకుండా సంస్కృతిని  సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వీలుగా సంస్కృతి లోని వివిధ అంశాలను ముఖ్యంగా భారతీయ సంస్కృతి, వినిమయ సంస్కృతి, పెట్టుబడిదారీ సంస్కృతి వంటి వాటిని ఈ పుస్తకంలో వివరించడం జరిగింది.

సంస్కృతి పట్ల అశాస్త్రీయ భావనలు ప్రబలంగా ఉన్న ఈ రోజుల్లో ఈ పుస్తకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంస్కృతిని శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి సామాన్య పాఠకులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. అదేవిధంగా సంస్కృతి యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకుని ఆ రంగంలో పనిచేయవలసిన అవసరాన్ని వామపక్ష వాదులకు ఈ పుస్తకం గుర్తు చేస్తుంది. వారికి సైద్ధాంతిక అవగాహన లోను ఆచరణలోనూ ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆశిస్తున్నాం. ఈ రచనను పుస్తక రూపంలో ముద్రించడానికి అనుమతించినందుకు డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ తరపున శ్రీ రావు కృష్ణా రావు గారికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాం.

**చెలికాని స్టాలిన్**

అధ్యక్షులు

డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ

# ఒక మాట

ప్రపంచ కమ్యూనిష్టు ఉద్యమం విఫలమవ్వడానికి ఒక ప్రధాన కారణం కమ్యూనిష్టులు సాంస్కృతిక రంగంలో పోరాటాన్ని విస్మరించడమేనని ఒక బలమైన వాదన. ఈ వాదనను చర్చకు పెట్టడానికి నేను 'మార్క్సిజం- సాంస్కృతిక సిద్ధాంతాలు'* రాసాను. దీన్ని విశాలాంధ్ర సెప్టెంబరు 2019 లో ప్రచురించింది. ఈ పుస్తకం చదివిన చాల మంది వామపక్ష కార్యకర్తలు కొన్ని భాగాలు అర్ధం చేసుకోవడానికి కష్టంగా ఉన్నాయని చెప్పారు. నేను రాసేవన్నీ సాధారణ కార్యకర్తల కోసమే కాబట్టి ఆ పుస్తకంలో కొన్ని భాగాలు తొలగించి, మరి కొన్ని భాగాలు చేర్చి, మిగిలిన భాగాల్లో కూడా అవసరమైన అదనపు సమాచారం చేర్చి ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నాను. చదివి చూడండి.

*'మార్క్సిజం- సాంస్కృతిక సిద్ధాంతాలు' విశాలాంధ్ర బుక్ హౌస్‌లలో లభ్యం.

## విషయ సూచిక


| | |
|---|---|
| ముందుమాట | 1 |
| 1.సంస్కృతి అంటే ఏమిటి | 4 |
| 2.సంస్కృతి-సమాజం | 18 |
| 3.ఆర్థిక నిర్మాణం-సంస్కృతి | 21 |
| 4.సంస్కృతి-రాజకీయార్థ శాస్త్రం | 27 |
| 5.భారతీయ సంస్కృతి | 36 |
| 6.సంస్కృతి-ఆధిపత్యం | 48 |
| 7.పెట్టుబడిదారీ సంస్కృతి | 52 |
| 8.సరుకుల ఆరాధన | 77 |
| 9.సామ్రాజ్యం-సంస్కృతి | 90 |
| 10.వినిమయ సంస్కృతి | 95 |
| 11.అడ్వర్‌టైజింగ్ | 120 |
| 12.ప్రస్తుత పెట్టుబడిదారీ సంస్కృతి విమర్శ | 128 |
| 13.మార్క్సిజం-సంస్కృతి | 141 |

# 'మార్క్సిజం- సాంస్కృతిక సిద్ధాంతాలు'

# పుస్తకానికి ముందుమాట

ఇటీవల మా మిత్రుడు పి.ఎస్.వి. ప్రసాద్ మాటల సందర్భంలో "పర్యావరణ సంక్షోభం కన్నా మనుషుల్లో విలువల సంక్షోభం ఎక్కువ భయపెడుతున్నది" అన్నాడు. నిజానికి ఈ రెండు సమస్యలకు మూలం ఒక్కటే. అదే పెట్టుబడి దారీ విధానం. అయితే దేన్ని ముందు పరిష్కరించాలి? అందుకు ఏంచెయ్యాలి? పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చివేస్తే వీటితోపాటు ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం లాంటి సమస్యలన్నీ తీరి పోతాయని చరిత్రలో సోషలిష్టు దేశాలు నిరూపించాయి. మరి ఆ వ్యవస్థలు ఎందుకు కూలి పోయాయి? మానవులందరి కనీస జీవితావసరాలు తీరడం అనేది ఒక 'ఉత్తమ మానవ విలువ' గా అక్కడి ప్రజలు గుర్తించ లేదా? ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం సమస్యలను ఎంతో కొంత పరిష్కరించిన వ్యవస్థలు కనీస అవసరాలు తీరడం అనేది ఒక మంచి మానవ విలువగా ఆ సమాజాల్లో ప్రతిష్టించలేక పోయాయా? ఇతర పెట్టుబడి దారీ దేశాల్లో అతి కొద్ది మంది అనుభవిస్తున్న సంపద, విలాస వస్తువుల పట్ల సోషలిష్టు దేశాల ప్రజల్లో అంత మోజు ఎందుకు ఉంది? కనీస అవసరాలు తీరిన తర్వాత మనుషులకు భౌతిక, విలాస వస్తు సంపదల కన్నా మానసిక, కళాత్మక, సృజనాత్మక కార్య కలాపాలు నిజమైన ఆనందాన్ని ఇస్తాయని అక్కడి ప్రజలు ఎందుకు గ్రహించ లేకపోయారు? ఇది వ్యవస్థల వైఫల్యం కాదా? సోషలిష్టు దేశాలు కూలి పోవడానికి ఎన్ని వస్తుగత కారణాలు, కుట్ర సిద్ధాంతాలు చెప్పుకున్నా పై ప్రశ్నలకు సమాధానం చెప్పుకోక తప్పదు. ఎందుకంటే ఈ వ్యవస్థలు ఎటువంటి ప్రజా ప్రతిఘటన లేకుండా మారిపోయాయి. అంటే ప్రజలు ఆ వ్యవస్థలను కాపాడుకోవాలని కోరుకోలేదు. ఎందుకు? ఇందులో సాంస్కృతిక అంశాలు ఇమిడి లేవా? కొంతమంది చెబుతున్నట్లుగా ఆ దేశాల్లో సాంస్కృతిక విప్లవాలు జరగక పోవడమే కారణమా? ప్రజల ఆర్థిక జీవితానికి

సోషలిష్టు భద్రతను కల్పించిన వ్యవస్థలు ఆ ప్రజలకు సోషలిష్టు సంస్కృతిని అందించలేక పోయాయా?

ఇక వర్తమానానికి వస్తే మన అంతిమ లక్ష్యం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి ప్రజాస్వామ్యయుత సోషలిష్టు వ్యవస్థను సాధించడం. కాని ఎలా? గ్లోబలైజేషన్ పుణ్యమా అని సంఘటిత కార్మిక వర్గం సంఖ్య రీత్యా, ఐక్యత రీత్యా బాగా బలహీనమయ్యింది. మరి ఎలా? మార్గం ఏమిటి? ఆర్థికం, రాజకీయం, పర్యావరణం, సాంస్కృతికం ఇలా అన్ని రంగాల్లో ఏక కాలంలో పోరాటం చెయ్యాలని సాధారణంగా చెప్పుకునేది వినడానికి బాగానే వుంటుంది. ప్రజల ఆర్థిక అవసరాలు తీరడానికి చేసిన పోరాట ఫలితాలను రాజకీయ విజయాలుగా మార్చుకోవడంలో విఫలమవుతున్నాం. రైతు సమస్యల పరిష్కారం కోసం పని చేసిన చోట రాజకీయ విజయాలు దక్కుతున్నాయి. ఇది ఏం సూచిస్తున్నది? గ్రామీణ ప్రజలకు ఇంకా పూర్తిగా పెట్టుబడి దారీ సంస్కృతి వంట పట్టక పోవడమే కారణమా? అది కాకపోతే మరో కారణం ఏమిటి?

పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటంలో పర్యావరణ పరిరక్షణ పోరాటాన్ని ప్రధాన భాగం చెయ్యాలని కొంత మంది అంతర్జాతీయ మేధావులు బలంగా వాదిస్తున్నారు. ఈ విధానం అభివృద్ధి చెందిన దేశాల్లో కొంత ఫలితాన్నిస్తున్నది కూడా! మన దేశంలో మెజారిటీ ప్రజలు దైనందిన జీవన పోరాటంలో కూరుకుపోయి ఉన్నారు. పెట్టుబడి దారీ వ్యవస్థ అందించే సౌకర్యాలను పొందుతున్న విద్యావంతులు ఆర్థిక ప్రయోజనాల విషయంలో తప్ప మిగిలిన విషయాలు వేటిపై కూడా స్పందించటం లేదు. దానికి తోడు వీరిలో ఎక్కువ మంది కుల, మత, ప్రాంతీయ తత్వాలకు, మూఢత్వానికి మహారాజ పోషకులుగా వున్నారు. రోజు రోజుకి కుంపటిలా మారుతున్న భూగోళంపై మన పిల్లలు, మనుమలు జీవించగలరా? అనే ప్రశ్నను వారు వారి మనసులో మొలకెత్తనీయడం లేదు. అంటే ఆలోచించడానికి భయపడు తున్నారు అనుకోవాలా? లేక డబ్బుకి తప్ప మిగిలిన అన్నిటికి కుటుంబం, వారసులు, చివరకు తన జీవితానికి కూడా పరాయి వారై పోయారను

కోవాలా? తన సంతానం ద్వారా ఈ భూమిపై తన జాతి(species) ఉనికి నిరంతరాయంగా కొనసాగాలనే వాంఛ జీవులన్నిటికీ సహజాతం. మనిషికి కూడా ఉండే ఆ వాంఛను పరాయీకరణ ధ్వంసం చేసిందా? లేక 'అలా జరగదులే దేవుడున్నాడు' అనుకుంటున్నారా? రెండు సందర్భాలలోనూ సాంస్కృతిక సమస్య ఇమిడి లేదా?

సంఘటిత కార్మిక వర్గం తన ఆర్థిక ప్రయోజనాలు తప్ప మరి దేన్నైనా పట్టించుకుంటున్నదా? ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు రేపు సంస్థను మూసేసినా సరే, ఈ వేళ మా జీతాలు పెంచితే చాలు అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. జీతాల కోసమే అయినా సమ్మె చేస్తుంటే నలభై ఏళ్ల లోపు వయసున్న వారు పాల్గోవడం లేదని సీనియర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు వాపోతున్నారు. పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాల గురించి వామపక్ష మేధావులు, నాయకులు ఎక్కువగా మాట్లాడుతున్నారు. అయితే పెట్టుబడిదారీ వర్గం దగ్గర 'ఫాసిజం' అనే బ్రహ్మాస్త్రం ఉంది. దాన్ని ఎదుర్కొనే అస్త్రాలేవీ మన దగ్గర లేవు. ఫాసిజం అనేది ఆర్థిక మూలాలు గల సాంస్కృతిక సమస్యే.

ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎప్పటిలాగే రాజకీయార్థిక పోరాటాలకు పరిమితమైతే లాభం లేదు. పెద్ద ఎత్తున సాంస్కృతిక పోరాటానికి, అందులో భాగంగా సైద్ధాంతిక పోరాటానికి పూనుకోవాలి. ప్రజాస్వామ్య విలువల క్షీణత ఫాసిజానికి గొప్ప బలం. అందుచేత మన రాజకీయ పోరాటం అంతా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ మీదనే కేంద్రీకరించాలి. మన ఆర్థిక పోరాటం అల్పసంఖ్యాకులు, అవకాశ వాదులుగా మారిపోయిన సంఘటిత కార్మికుల కోసం కాక 80% శాతం ప్రజలకు విస్తరించాలి. కిసాన్ రాలీ వంటి గొప్ప ఉద్యమాలు నిర్వహించాలి.

సాంస్కృతిక పోరాటాల ప్రాధాన్యతను, వాటి వెనుకనున్న సైద్ధాంతిక మూలాలను అతి క్లుప్తంగా పరిచయం చేసి ఆలోచన రేకెత్తించడమే ఈ పుస్తకం ఉద్దేశ్యం. ఇవి నేరుగా మనకు ఉపయోగ పడవు. మనం ఎలా ఆలోచించాలో నిర్ణయించుకోవడానికి ఉపయోగ పడతాయి.

# సంస్కృతి అంటే ఏమిటి?

కల్చర్‌ను తెలుగులో 'సంస్కృతి' అని అంటున్నాం. మన ప్రాంతంలో సంస్కృతి అంటే వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు, మత సంబంధ ఆచార వ్యవహారములు, పండుగలు, కళలు మొ. మాత్రమే. తెలుగు సంస్కృతి అంటే పంచె కట్టడం, పప్పు, కూరలతో అన్నం తినడము, ఉగాది, సంక్రాంతి లాంటి పండగలు జరుపుకోవడం వంటివి అన్న మాట. ఇవన్నీ సంస్కృతిలో అతి చిన్న భాగం మాత్రమే కాని అవే సంస్కృతి కాదు. సుమారు నూటేభై ఏళ్ల క్రితమే టైలర్ సంస్కృతిని ఇలా నిర్వచించాడు.

"మానవ శాస్త్ర (ఆంత్రొపాలజి) విశాల అర్థంలో తీసుకున్నప్పుడు సంస్కృతి లేదా నాగరికత అనేది జ్ఞానం, నమ్మకాలు, కళలు, నీతి నియమాలు, చట్టం, సంప్రదాయం, అలాగే సమాజ సభ్యునిగా సముపార్జించిన సామర్థ్యాలు, అలవాట్లు " –టైలర్[1]--Primitive Culture - 1871.

సోషియాలజీలో సాధారణంగా సంస్కృతిని “అన్ని సామాజిక బృందాల సభ్యులు తమ సామాజిక పరిస్థితులను అర్థవంతం చేసుకోవడానికి అభివృద్ధి చేసిన భాషలు, సంప్రదాయాలు, విశ్వాసాలు, నియమాలు, కళలు, సాహిత్యం, జ్ఞానం, ఉమ్మడి గుర్తింపు, జ్ఞాపకాలు” అని నిర్వచిస్తుంటారు.

సంస్కృతి ఒక జీవనవిధానం. తినే తిండి, కట్టే బట్ట, మాట్లాడే భాష, కొలిచే దేవుడు మొదలైనవన్నీ సాంస్కృతిక అంశాలే. క్లుప్తంగా చెప్పుకోవాలంటే మనం ఆలోచించే, పని చేసే విధానం సామాజికంగా ఎలా వ్యక్తం అవుతుందో అదే సంస్కృతి. సమాజ సభ్యులుగా మనకు వారసత్వంగా లభించిన భావాలు, భావోద్వేగాలు, ఆలోచనా రీతులు, మొదలైన విషయాలే కాక వస్తువులు కూడా సంస్కృతిలో భాగాలే! సమాజ సభ్యులుగా మానవులు సాధించిన విజయాలన్నీ సంస్కృతిలో భాగం అవుతాయి. చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, సాహిత్యం, వాస్తు, శిల్ప కళ, తత్వశాస్త్రం, మతం, సైన్స్, మొదలైనవన్నీ సాంస్కృతిక అంశాలే! అంతేగాక సంప్రదాయాలు, ఆచారాలు,

పండగలు, ఆటలు, వేడుకలు మొదలగు భిన్న జీవన విధాన పద్ధతులన్నీ కూడా సంస్కృతిలో భాగాలే! సంస్కృతితో సంబంధం లేని మానవ జీవితం ఏమీ ఉండదు.

ఆవిధంగా చెప్పుకున్నప్పుడు మానవ నిర్మిత పాదార్థిక జీవితానికి, మానసిక జీవితానికి చెందిన బృంద జీవిత అంశాలన్నీ సంస్కృతి లోనికే వస్తాయి. ఇవి ఒక తరం నుండి మరో తరానికి వారసత్వంగా లభిస్తాయి. మానవులు అలవరచుకున్న బహిరంగ ప్రవర్తన, అంతర్గత ప్రవర్తనా రీతులను కూడా సంస్కృతిగానే పరిగణించాలని చాల మంది సామాజికవేత్తల అభిప్రాయం. ఇవి చిహ్నాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తాయి. పురుషులు తలపాగా ధరించడం సామాజిక హోదాకు గుర్తుగా చాల కాలం కొనసాగింది. అది తర తరాలుగా లభించిన సాంస్కృతిక చిహ్నం. చారిత్రికంగా లభించిన, సంక్రమించిన అర్ధ ధోరణులు ఈ చిహ్నాలలో మూర్తీభవించి ఉంటాయి. అంటే తలపాగాకు అర్ధం సామాజిక హోదా అన్నమాట. వీటి ద్వారా ప్రజల మధ్య అర్ధవంతమైన సమాచార మార్పిడి జరుగుతుంది. అంటే తలపాగా ధరించిన వ్యక్తి సామాజిక హోదా కల వాడని, అగ్రకులానికి చెందిన వాడని అర్ధమవుతుంది. అంతే కాదు తలపాగా కట్టే తీరు కూడా కొన్ని విషయాలను తెలియచేస్తుంది. ఈ రోజుల్లో చినిగిన జీన్ పేంటు ఆధునికతకు, నాగరికతకు గుర్తుగా పరిగణిస్తున్నారు.

మరింత విస్తృతమైన, ఆధునిక నిర్వచనం ప్రకారం సంస్కృతి ఒకానొక ప్రత్యేక సమాజంలో మానవులు జీవించి, చనిపోయే మొత్తం జీవిత వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. సంస్కృతిలో నిర్వచించ గలిగే, అలాగే ఇతర సంస్కృతులతో తేడా చూపించగలిగేందుకు అవసరమైన అంశాలు ఉంటాయి. అంటే ఒక సంస్కృతిలో నిర్వచించడానికి కొన్ని సాధారణ లక్షణాలు, అలాగే ఇతర సంస్కృతులతో పోల్చడానికి, తేడా గ్రహించడానికి అవసరమైన కొన్ని

ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. దీని ప్రకారం సంస్కృతి అనేది మొత్తం సమాజ జీవితాన్ని ఆవహించి ఉంటుంది.

సంస్కృతి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి, ఒక దేశం నుండి మరో దేశానికి భిన్నంగా ఉంటుంది. ఆహార విహారాలే కాక ఆచారాలు, నమ్మకాలు సామాజిక ప్రవర్తనలు ఇలా చాల విషయాల్లో ఈ తేడా ఉంటుంది. ప్రజా బృందాలను వాటి సంస్కృతిని బట్టే భిన్నంగా గుర్తిస్తాము.

సంస్కృతి అనే మాటకు గల అర్థాలను, ఆ మాట చరిత్రను క్లుప్తంగా చూద్దాం. ఈ మాటకు సంస్కృత నిఘంటువులు కృషి, అనుశీలన, అభివృద్ధి, సంవర్ధనం, ప్రచోదనం, ఉన్నతి, ఉత్కర్ష లాంటి అర్థాలను ఇస్తున్నాయి. స్థూలంగా ఇవి యూరోపియన్ భాషలు culture మాటకు ఇచ్చే అర్థాలను పోలి ఉన్నాయి. సంస్కృతి అనే మాటకు మూలం 'కృ' లేదా 'క్రి' అనే సంస్కృత మాట. క్రి అంటే చెయ్యడం. ఈ మూల పదం నుండి మూడు మాటలు వచ్చాయి. 'ప్రకృతి' అంటే ప్రాథమిక పదార్థం, లేక పరిస్థితి. రెండోది 'సంస్కృతి' అంటే మెరుగు పరిచిన పదార్థం, లేక పరిస్థితి. ఇక 'వికృతి' అంటే మార్చిన, లేదా శిథిలమైన పదార్థం, పరిస్థితి. ప్రకృతి మెరుగై సంస్కృతి అవుతుంది. అది విచ్ఛిన్నమై, లేదా పాడై వికృతి అవుతుంది. తెలుగు నిఘంటువులు మాత్రం నాగరికత, సంస్కారం, లోపం లేకపోవడం మొ. అర్థాలను ఇస్తున్నాయి. ఇవి మనం వాడుతున్న అర్థంలో నప్పవు.

మనం Civilization కు తెలుగు మాటగా 'నాగరికత' మాటను వాడుతున్నాం. సంస్కృతికి, నాగరికతకు ఇప్పుడు స్పష్టమైన తేడాను చూపుతున్నారు. ఆటవిక జీవితం గడిపే తెగకు కూడా సంస్కృతి ఉంటుంది. నాగరికత ఉండదు.

కొంత మంది నాగరికత, సంస్కృతి అనే మాటలను సమానార్థకాలుగా వాడుతుంటారు. అయితే వాటికి స్పష్టంగా వేరువేరు అర్థాలున్నాయి. నాగరికత అంటే ఆహార, వస్త్ర, సమాచార మొదలైన రంగాలలో మరింత

మెరుగైన జీవనవిధానాలు కలిగి ఉండటం. తమ అవసరాలను మరింత బాగా తీర్చేలా ప్రకృతిని ఉపయోగించుకోగల సామర్ధ్యం ఉండటం. మెరుగైన సామాజిక, రాజకీయ నిర్మాణం కలిగి వుండటం.

మరో పక్క సంస్కృతి అనేది జీవన విధానమే గాని ఆ విధాన స్థాయిని సూచించదు. అంటే గణ జీవితం గడుపుతున్న ప్రజల కన్నా కేపిటలిజంలో ప్రజలది ఉన్నత నాగరికత అని చెప్పగలం గాని, ఉన్నత సంస్కృతి అని చెప్పే వీలు లేదు. సంస్కృతిని ఇతర సంస్కృతులతో పోల్చవచ్చు గాని ఒక దాని కన్నా మరొకటి గొప్పదని చెప్పడాన్ని ఆంత్రొపాలజి అంగీకరించదు.

మనకు వారసత్వంగా మన పూర్వీకుల నుండి లభించిన సాంస్కృతిక అంశాలను 'సాంస్కృతిక వారసత్వం' అంటారు. వీటిలో మంచివీ ఉంటాయి, కాలం చెల్లినవీ, ప్రగతికి అడ్డం పడేవి కూడా ఉంటాయి.

కల్చర్  అనే మాట ఇంగ్లీష్ భాష లోని అతి క్లిష్టమైన పదాలలో ఒకటి. దానికి కారణం ఇది అనేక ఐరోపా భాషల్లో అనేక రకముల అర్ధాలతో పరిణామం చెందుతూ రావడము! 'COLERE' అనే లాటిన్ మాటకు 'నివసించు', 'వ్యవసాయం చేయు', 'రక్షించు', 'ఆరాధనతో గౌరవించు' మొదలైన అర్ధాలున్నాయి. తర్వాతికాలంలో ఈ అర్ధాలు కొన్ని వేరు పడి 'CULTURA' అనే మాటకు 'ఒక దిశలో అభివృద్ధి చేయు' అనే అర్ధం ఖరారయ్యింది. 'కల్చర్' అనే మాట మొదట్లో ముఖ్యంగా మొక్కలు, పశువులను 'పెంచి పోషించు' ప్రక్రియగా వాడుకలో ఉండేది. ఇంచు మించు 19వ శతాబ్దం వరకూ ఈ అర్ధమే వాడుకలో ఉండేది. ఆ మాటకు ఉన్న విస్తృత సంక్లిష్ట అర్ధాల సముదాయాన్ని పరిశీలిస్తే అది సాధారణ మానవ అభివృద్ధి, ఒక ప్రత్యేక జీవనవిధానాల మధ్య, అలాగే ఈ రెండింటికి కళ, తెలివితేటలు, నైపుణ్యాలతో కూడిన పనులు, ఆచారాలకు మధ్య గల సంక్లిష్ట సంబంధాన్ని సూచిస్తుంది. ఆర్కియాలజిలోను, కల్చరల్ ఆంత్రొపాలజిలోనూ, కల్చర్ అంటే ప్రధానంగా భౌతిక ఉత్పత్తి సూచకం అనే విషయం

గమనించాలి. అంటే ఒక సమాజంలో మానవులు తమ జీవితావసరాలను తీర్చుకోవడానికి చేసే ఉత్పత్తి యొక్క విధివిధానాలను సూచించేదిగా సంస్కృతిని చూడటం. అయితే చరిత్ర, సాంస్కృతిక అధ్యయనాలలో (cultural studies) కల్చర్ భాష, కళలు వగైరా సంకేత (sign) వ్యవస్థలను సూచిస్తుంది. ఇలా చేయడం సంస్కృతిని భాష, కళలు వగైరాతో సమానార్థకం చేయడం, విషయాన్ని గందరగోళ పరచడమే కాక, అంతకు మించి భౌతిక, సంకేత ఉత్పత్తుల మధ్య సంబంధాన్ని మరుగు పరుస్తుంది.

19వ శతాబ్దానికి ముందు ప్రాథమికంగా 'సంస్కృతి' అంటే ప్రకృతి వృద్ధికి తోడ్పాటు ఇవ్వడం. మానవులకు వర్తింపజేస్తే 'శిక్షణ ఇవ్వడం' అనే అర్థం ఉండేది. 19 వ శతాబ్దంలో కల్చర్ ఒక 'స్వతస్సిద్ధ వస్తువు' (thing in itself) అంటే సర్వ స్వతంత్ర విషయం అయ్యింది. అప్పుడు ఇది మానవ పరిపూర్ణత (perfection) ను సూచించే భావన, లేదా మానసిక అలవాటు అనే అర్థం పొందింది. 'సమాజం మొత్తం మీద మేధా వృద్ధి యొక్క సాధారణ స్థితి' అనేది రెండో అర్థంగా వచ్చింది. ఇక మూడవ అర్థం 'కళల సాధారణ సమాహారం'. 19వ శతాబ్ది చివరలో సంస్కృతి 'భౌతిక, మేధా, ఆధ్యాత్మికముల (Spiritual) తో కూడిన మొత్తం జీవిత విధానం' అనే అర్థాన్ని పొందింది.

కల్చర్‌ను సులభంగా నిర్వచించలేము. దానికి కారణం భిన్న భాషల్లో విభిన్న అర్థాలు ఉండటంవల్ల కాదు. అయితే కల్చరల్ ఆంత్రొపాలజి (సాంస్కృతిక మానవశాస్త్రం) లోని భావమే సాంస్కృతిక అధ్యయనాలలో కేంద్ర స్థానంలో ఉంది. అందుచేత కొంతమంది ప్రతిపాదించే 'ఉన్నత సంస్కృతి, 'శిక్షితుల (elite) సంస్కృతి', 'మంద (mass) సంస్కృతి' అనే వాటికి కల్చరల్ ఆంత్రొపాలజిలో చోటు లేదు. సంస్కృతికి 250 పైగా నిర్వచనాలు ఉన్నాయి. అయితే కల్చరల్ ఆంత్రొపాలజి ప్రధానంగా ఆదిమ (primitive) సమాజాలను అధ్యయనం చేసింది. వర్గ సమాజాన్ని, లేదా మన

దేశం లాంటి కుల సమాజాన్ని అధ్యయనం చేస్తే వివిధ వర్గాల మధ్య, కులాల మధ్య కొన్ని అయినా సాంస్కృతిక వ్యత్యాసాలు స్పష్టంగా కనిపిస్తాయి.

ఆంత్రొపాలజిలోనే మరో నిర్వచనం కూడా ఉంది. సంస్కృతి అంటే "మానవులు సంపాదించు కొన్న జ్ఞానం లోని అతి పెద్ద భాగం. అలాగే వివిధ పనులు చేసే విధానం. ఇవి నేర్చుకున్నవీ, నిర్మించినవే కాని, శిశువు పుట్టుకతో నే వచ్చినవి కావు."

ఈ నిర్వచనానికి చాల ప్రాధాన్యత వుంది. దీని ప్రకారం మాట్లాడగలిగే సామర్ధ్యం శిశువుకు పుట్టుకతోనే వస్తుంది. ఆ శిశువు మాట్లాడటం నేర్చుకునే భాష నేర్చు కొన్నదే గాని పుట్టుకతో వచ్చినది కాదు. తెలుగు సంస్కృతిలో జన్మించిన బిడ్డను ఆఫ్రికా తరలిస్తే ఆ బిడ్డ ఆఫ్రికాలో స్థానిక భాషను, సంస్కృతిని అలవరచుకుంటుంది గాని తెలుగు సంస్కృతిని కాదు. ఆ బిడ్డకు, తోటి ఆఫ్రికా బాలలకు సంస్కృతి పరంగా ఎటువంటి తేడా ఉండదు. మన దేశం లోని అనాథ బాలలను చాలామంది విదేశీయులు దత్తత చేసుకుంటు న్నారు. అలా అక్కడ పెరిగిన వారిని తరవాత చూస్తే వారు పూర్తిగా ఆ సంస్కృతినే జీర్ణించుకున్నారని అర్థమవుతుంది. దీన్ని బట్టి మనం గ్రహించాల్సిన అతి ముఖ్య విషయం ఏమిటంటే సంస్కృతి జీవ పరంగా, జన్యువుల ద్వారా మనుషులకు లభించదు. అది సామాజిక వారసత్వంగా సమాజం నుండి లభిస్తుంది. జాతి, కులం, మతం, ప్రాంతం, భాష, యాస లాంటి ఉన్మాదాలు పెరిగిపోతున్న కాలంలో దీన్ని అర్ధం చేసుకోవడం, ప్రచారం చేయడం చాల అవసరం. వివిధ సాంస్కృతిక విషయాలు తల్లిదండ్రుల నుండి జీవ పర వారసత్వంగా లభిస్తాయనే తప్పుడు అభిప్రాయం చాలా విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. స్వార్థపరులు దీన్ని తమ అవసరాలకు వాడుకుంటున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాంతీయ వాదాన్ని ప్రోత్సహించే క్రమంలో కూడా సంస్కృతిని వాడుకుంటున్నారు.

తను పెరుగుతున్న సమాజంలో వాడుకలో నున్న భాష యొక్క జ్ఞానం, వ్యాకరణం, ప్రపంచాన్ని అర్థం చేసుకునే తీరు మనిషి సాంస్కృతిక వారసత్వంలో కీలక విషయం. ఎన్ని విధాలుగా చెప్పుకున్నా సంస్కృతికి సూటి నిర్వచనం లేదు. అనేకానేక వివాదాలు కొనసాగుతున్నాయి.

"ప్రజలు నిరంతరాయంగా కొత్త, విదేశీ, ఇతర సంస్కృతుల నుండి కొన్ని అంశాలను ఇముడ్చు కొని రూపాంతరీకరించే, ప్రవహించే సృజనాత్మక ప్రక్రియే సంస్కృతి" అనేది మరో నిర్వచనం. ఈ నిర్వచనం ప్రకారం ఏ సంస్కృతికి చెందిన వారైనా మా సంస్కృతి పరిశుద్ధం, పవిత్రం, కల్తీ లేనిది అని చెప్పుకోవడం కుదరదు. అన్ని సంస్కృతులు కొన్నిటిని ఇచ్చి, మరి కొన్నిటిని పుచ్చుకుంటాయి. రోజూ స్నానం చేయడం భారతదేశం నుండి ప్రపంచమంతా నేర్చుకుందని గొప్పగా చెబుతుంటారు. కాని సబ్బుతో రుద్దు కొని స్నానం చేయడం మనకు ఎప్పటి నుండి వచ్చింది? అందుచేత ప్రపంచంలో ఏ సంస్కృతీ కూడా పరిశుద్ధం కాదు. నిజానికి ఏదేనా సంస్కృతి ఎవరి నుండి ఏమీ తీసుకోకుండా ఉండి పోతే చాలా వెనుకబడి పోయి బహుశా అనాగరిక దశలోనే ఉండిపోవచ్చు. ఈ నిర్వచనంలోనే మరో ముఖ్య విషయం కూడా వున్నది. సంస్కృతి నిరంతరం కొత్త వాటిని చేర్చుకోవడం, అలా చేర్చుకున్న వాటిని తనకు అనుకూలంగా మార్చుకోవడము చేస్తూ నిరంతరం పరిణామం చెందుతూ ఉంటుంది. అందుచేత మాది 'ప్రాచీన సంస్కృతి', 'సనాతన సంస్కృతి' లాంటి మాటలకు అర్థం ఉండదు. ఇప్పుడు మనం జీవిస్తున్న విధానమే మన సంస్కృతి. అందులో పాతవి ఉంటూనే నిరంతరం కొత్తవి చేరుతుంటాయి.

**సంస్కృతికి ఉండే కొన్ని సాధారణ లక్షణాలు**.

1.సంస్కృతి అనేది నేర్చు కొని సొంతం చేసుకునేదే గాని పుట్టుకతో వచ్చేది కాదు. పుట్టిన తర్వాత కుటుంబం నుండి, సమాజం నుండి భాష,

ప్రవర్తనా పద్ధతులు, విలువలు, అభిరుచులు, సెంటిమెంట్లు మొదలైన వాటన్నిటినీ నేర్చు కుంటాడు.

2.సంస్కృతి అనేది ఎవరో ఒకరికి చెందినదిగా ఉండదు. ఒక ప్రజా బృందం ఉమ్మడిగా పంచుకొని పాటిస్తున్నప్పుడు మాత్రమే అది సంస్కృతి అనిపించు కుంటుంది. అంటే సంస్కృతి వైయక్తికం కాదు. అది ఎల్లప్పుడూ ఉమ్మడి వ్యవహారమే.

3.సంస్కృతి పోగుబడ్డది. తరతరాలుగా పోగుబడుతూ కొంత భాగం అంతరిస్తూ, మరికొంత కొత్తది పుడుతూ వర్తమాన తరానికి అందుతుంది. హఠాత్తుగా ఒక తరం ప్రజలు రూపొందించుకున్నది కాదు.

4.సంస్కృతి స్థిరంగా మార్పు లేకుండా ఉండిపోయేది కాదు. నిరంతరం మార్పులు, చేర్పులు జరుగు తుంటాయి. మన జీవితంలోకి కొత్త జ్ఞానం, కొత్త భావాలు, కొత్త వస్తువులు ప్రవేశిస్తుంటాయి. దానితో ఆ మేరకు సంస్కృతిలో మార్పులు వస్తుంటాయి.

5. సంస్కృతి మన ప్రవర్తనా ధోరణులను అనుమతించడం, లేదా నిషేధించడం ద్వారా మనల్ని నియంత్రిస్తుంది. ఏదేనా ఒక సామాజిక, వ్యక్తిగత కార్యకలాపాన్ని ఎలా నిర్వహించవలెనో చెప్పకనే చెప్పుతుంది. ఆదర్శ ప్రవర్తనా రీతిని ప్రబోధిస్తుంది.

6. సంస్కృతి వైవిధ్య భరితమైనది. ఒక విశాల సంస్కృతిలో స్వల్పంగా భిన్నమైన అనేక పాయలు ఉంటాయి.

ఇవన్నీ అన్ని సంస్కృతులకు వర్తించే సర్వ సాధారణ లక్షణాలు.

**మానవ జీవితంలో సంస్కృతి ప్రాధాన్యత.**

నర జంతువు సమిష్టి శ్రమ, సమిష్టి జీవనం ప్రారంభించి మానవునిగా అవతరించినప్పుడే సంస్కృతి కూడా పుట్టింది. మనిషి సంస్కృతిలో పుట్టి,

సంస్కృతిలో పెరిగి, సంస్కృతిలో జీవించి సంస్కృతి లోనే చనిపోతాడు. అంటే సంస్కృతి మనుషుల జీవితాన్ని మొత్తం ఆవహించి ఉంటుంది. ఏదో ఒక రకమైన సంస్కృతి లేని ప్రజలు, మనిషి ఉండరు. మానవుని జీవితానికి సంబంధించిన ఆధ్యాత్మిక విషయాలనుండి అన్ని పాదార్థిక విషయాలు సంస్కృతికే చెందుతాయి. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా ఇతర మనుషులతో సంబంధాలు సామాజిక ఉనికికి తప్పనిసరి షరతు. అయితే ఆ సంబంధాలలో ఇతరులతో మన ప్రవర్తనా తీరును తీర్చిదిద్దేది సంస్కృతే! ఈ ప్రవర్తన కొన్ని సందర్భాలలో ప్రగతి నిరోధకమైనదిగా కూడా ఉండవచ్చు. ఉదాహరణకు, సామాజిక హోదాను బట్టి ఎదుటి వారిని గౌరవించడం మన సంస్కృతి ద్వారా మనకు అలవడిన చెడ్డ లక్షణము. డబ్బు, అధికారాలను సామాజిక హోదాకు కొలమానం చేసింది కేపిటలిజం. దీంతో మనల్ని దోచుకుంటున్న, అణచి వేస్తున్న వారినే గౌరవించే మన సంస్కృతి మనకు శాపం అయ్యింది. దుర్మార్గ మేమంటే మనతో చేయి కలిపి పనిచేసే మన కన్నా తక్కువ కులానికి చెందిన శ్రామికుడిని అలా గౌరవించము.

మానవులంతా జంతువుల వలె సహజ ప్రకృతిలో కాక మానవులచేత నిర్మితమైన సమాజంలో జీవిస్తూ అందులోనే అర్థాన్ని*(meaning- ఈ అధ్యాయం చివర వివరణ వుంది) కనుక్కుంటారు అని సంస్కృతి భావన ప్రతిపాదిస్తుంది. మనమంతా జీవిస్తూ, ఎదుర్కొనే సంక్లిష్ట దైనందిన ప్రపంచమే (everyday world) సంస్కృతి. ప్రకృతి పరంగా లభించిన వారసత్వాన్ని మానవుడు ఎప్పుడు అధిగమించాడో, అంటే జంతు దశను దాటి, సామాజిక జీవితం ఆరంభించినప్పుడే, అప్పటి నుంచే కల్చర్ మొదలైంది. అందుచేత వ్యవసాయం, తోటల పెంపకం, పశు పోషణల ద్వారా ప్రాకృత ప్రపంచాన్ని మార్చుతూ పెంచిపోషించడమే సంస్కృతిలో కీలకమైంది. ఇలా తన జీవితావసరాలను తీర్చుకోవడానికి ప్రాకృత ప్రపంచాన్ని మార్చే సామర్థ్యం, అలా మార్చడానికి సమిష్టిగా శ్రమించే క్రమంలో భాషను, సంకేతాలను నిర్మించుకునే సామర్థ్యం అనే రెండూ అన్ని

సంస్కృతులకు వర్తించే అత్యంత ప్రధానమైన సాధారణ అంశములు. భాషను ఉపయోగించడమంటే విస్తృత అర్ధంలో అన్ని రూపాల సంకేత వ్యవస్థల్ని, ఆవాహన చేసి ఆలింగనం చేసుకోవడమే. సాహిత్యం, సంగీతం, మొ. కళలన్నీ సంకేత వ్యవస్థలే.

వ్యక్తికి సంబంధించిన వరకు సంస్కృతి ముఖ్యంగా సామాజీకరణం ద్వారా వ్యక్తిలో మూర్తీభవిస్తుందని, ఇంచుమించు సంపూర్ణంగా వ్యక్తి సంస్కృతిని జీర్ణించుకుంటాడని సాంస్కృతిక వేత్తల అభిప్రాయం. సామాజీకరణం (Socialisation) అంటే కుటుంబంలో పుట్టిన బిడ్డలు సామాజిక నియమములు, ఆచారాలు, పని పద్ధతులు మొ. అన్నీ నేర్చుకొని సమాజ సభ్యులుగా ఎదిగే క్రమం. ఇలా నేర్చుకోవడం ద్వారానే సంస్కృతిని వ్యక్తి సొంతం చేసుకుంటాడు. సంస్కృతి వ్యక్తిని తనలో చేర్చుకుంటుంది. అడవిలో పెరిగిన వానికి సంస్కృతి ఉండదు.

ఆంత్రొపాలజిలో కల్చర్ అతి కీలక మైన భావన. ఆంత్రొపాలజి తన దృష్టి అంతా 'మానవులు ఎలా బృందాలుగా ఏర్పడతారు? విభిన్న బృందాలు విభిన్న మార్గాలలో ఎలా జీవిస్తాయి?' అనే దానిపై కేంద్రీకరిస్తుంది. అందుచేత 19వ శతాబ్దంలో 'సాంస్కృతిక వైవిధ్యం' అనే భావన ఆంత్రొపాలజిలో అగ్రస్థానం ఆక్రమించింది. ఈ సాంస్కృతిక వైవిధ్యం 'సంస్కృతి' అనే ఏక వచన భావనకు వ్యతిరేకం. 'సంస్కృతులు' అనే భావననే అంగీకరిస్తుంది.

ఏకవచనంలో సంస్కృతి అనే భావన 18 వ శతాబ్ది యూరప్ చింతనంలో పుట్టి 19 వ శతాబ్దంలో ప్రాముఖ్యతను సంతరించు కుంది. 'సంస్కృతి అనేది ఒకటే' అనే భావన సామ్రాజ్యవాదులు ప్రచారం చేశారు. సామాజిక పరిణామవాద భావనలో పుట్టి పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి అనుబంధంగా మారి ఈ ఏకవచన సంస్కృతి విశ్వవ్యాప్త స్థాయిని అందుకుంది. దీని ప్రకారం నాగరికతలు కాల గమనంలో అభివృద్ధి చెందుతాయి. అలాగే మానవాళి

మరింత సృజనాత్మకంగా, హేతుబద్ధంగా రూపొందుతుంది. అంటే ప్రజల సాంస్కృతిక సామర్థ్యం పెరుగుతుంది. వెనుకబడిన వలస దేశాలను నాగరీకరించే బాధ్యతను సామ్రాజ్యవాద దేశాలు వహిస్తాయన్నమాట.

పాశ్చాత్య సామ్రాజ్య భావనకు, మరీ ముఖ్యంగా జాత్యహంకారానికి విరుద్ధంగా ఆధునిక ఆంత్రొపాలజి చాలా ఉదార వైఖరి కలిగి ఉంటుంది. సంస్కృతిని ఎల్లప్పుడూ బహు వాచకంగానే పరిగణించాలనీ, ప్రతీ సంస్కృతిని దాని ప్రత్యేక సందర్భంలో అంచనా వేయాలని వాదిస్తుంది. దీని ప్రకారం ఏ సంస్కృతీ మరో దాని కన్నా గొప్పది కాదు. ప్రతీ సంస్కృతి నిశ్చితమైనది, జడమైనది కాక నిరంతర పరిణామంలోని ఒక జీవనవిధానం. శాస్త్ర, సాంకేతిక బలం సంస్కృతికి కొలమానం కాదు.

సంస్కృతి అంటే ఒక క్రమ పద్ధతిలో ప్రతీ ఒక్కరు సమన్వయమైన సమస్తం (whole). అందుచేత అందరూ, సమస్తం, స్థిరమైన నమ్మకాల వ్యవస్థ, జ్ఞానం, విలువలు, మారని పని విధానాలు మొ.. వాటి ప్రభావంతో సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతారు. ఎక్కడా రాయబడని ఈ నియమ నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తులు ఆ సంస్కృతికి పరాయి వారు, లేదా దానిలో భాగం కాని వారు. సంస్కృతి గతితర్కం ఏమంటే అది ఒకానొక మానవ బృందాన్ని ఒక క్రమపద్ధతిలో నడిపిస్తుంది. వారి మనుగడ అదే. అదే సమయంలో మంచివైనా, చెడ్డవైనా మార్పులను నిరోధిస్తుంటుంది. సంస్కృతి నియమ నిబంధనలను ఉల్లంఘించేవారు అభివృద్ధి కాముకులు కావచ్చు, లేదా అభివృద్ధి నిరోధకులు కావచ్చు. మారవలసిన అవసరం ఎంతగా వున్నా మార్పులను అడ్డుకునే శక్తులు బలంగా ఉన్నప్పుడు సర్వసాధారణంగా 'సాంస్కృతిక అరాచకం' నెలకొంటుంది. ఒకానొక మానవ బృందం తమ జీవితావసరాలను తీర్చుకునే విధానంలో, అంటే ఆర్థిక వ్యవస్థలో మార్పులకు అతీతంగా సంస్కృతి మనుగడ సాగించలేదు. అదే సమయంలో ఆర్థిక జీవితం మారినంత త్వరగా నమ్మకాలూ, ఆచారాలు, సాధారణ ఇంగిత జ్ఞానమూ

మారవు. కొత్త జీవన పరిస్థితుల్లో సైతం పాత నమ్మకాలు, ముఖ్యంగా ఆర్థిక జీవితానికి పెద్దగా అడ్డంకి కానివి కొనసాగుతాయి. కొత్తగా తయారు చేయించిన ఎడ్ల బండిని రైతు గ్రామ దేవత గుడికి తెచ్చి కోడిని కోసి బండికి బొట్టు పెట్టే ఆచారం  ఇంకా కొనసాగుతున్నది. కోటి రూపాయల హైటెక్ కారుకు విఘ్నేశ్వర పూజ చేయించి నిమ్మకాయలు కట్టడం మనం నిత్యం చూస్తూనే ఉంటాము. దాని వల్ల కారు యజమాని ఆర్థిక జీవితానికి నష్టం లేదు. అందుచేత ఆ ఆచారం కొన సాగుతుంది. కాని కుల వృత్తులే చెయ్యాలనే నియమం అతని అభివృద్ధికి ఆటంకం అవుతుంది. కుల నియమాలు ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక జీవితానికి అడ్డంకి. ఇలాంటి అనేక నియమాలు రద్దై ఆ మేరకు సంస్కృతి మారుతుంది. కొన్ని బలమైన సాంస్కృతిక విషయాలు ఆర్థిక జీవితంతో సంఘర్షిస్తూనే, ఆర్థిక ప్రయోజనాలకు నష్టం చేస్తూనే దీర్ఘ కాలం కొనసాగే అవకాశం ఉంది.

సంస్కృతి 'స్థానికం' (లోకల్) గా చాలా చిన్న ప్రత్యేక ప్రాంతాల్లోనూ, అలాగే చాలా పెద్ద ప్రపంచవ్యాప్త స్థలాల్లోనూ పనిచేయగలదు. చిన్న స్థానిక సంస్కృతులు అన్నీ ఇంచు మించు అంతరించి పోయాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో దాని సరుకు ఉత్పత్తి-పంపిణీ యంత్రాంగంలోకి ప్రవేశించని ఏ జీవన విధానమైనా కాస్త ముందుగా, లేదా వెనుకగా అంతరించి పోవాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా అమలు అయ్యే సాంస్కృతిక ఆచరణలున్నాయి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా, అతి కొద్ది మినహాయింపులతో మరణించిన వారి శరీరాలను గౌరవంగా తొలగించే విధానాలు అమలు అవుతున్నాయి. అది దహనం కావచ్చు, ఖననం కావచ్చు మరో విధానం కావచ్చు. అంతకంటే మంచి ఉదాహరణ మంచినీరు మొదలుకొని అన్ని వస్తువులు, గౌరవపూర్వక నమస్కారం  వరకూ అన్ని సేవలు సరుకులుగా మారిపోవడం నేటి ఆధునిక పెట్టుబడిదారీ సంస్కృతిలో భాగంగా ప్రపంచ వ్యాపితంగా అమలులోకి రావడం చూడవచ్చు.

మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే ప్రపంచంలో ఎక్కడో మారుమూల అతి కొద్ది కుటుంబాలు మాత్రమే పాటించే సాంస్కృతిక ఆచరణలు ఉన్నాయి, అలాగే ప్రపంచమంతా ఆచరించు సాంస్కృతిక ఆచరణలూ ఉన్నాయి. అవీ ఇవీ కూడా సంస్కృతులే అని ప్రకటించడమే తప్ప ఫలానా సంస్కృతి గొప్పదని సాంస్కృతిక సిద్ధాంతాలు చెప్పవు. నిజానికి అలా పోల్చడానికి అవి వ్యతిరేకం.

సంస్కృతి ఒక వ్యక్తి చైతన్యాన్ని, ఉత్సాహాన్నీ (spirits) అత్యున్నత స్థాయికి తీసుకెళ్లగలదు. యూరపులో భూస్వామ్యం నుండి విముక్తమైన తొలినాటి కేపిటలిస్టు సంస్కృతి వ్యక్తిస్వేచ్ఛకు అగ్రస్థానం కల్పించి ఎందరో గొప్ప, గొప్ప శాస్త్రవేత్తలూ, ఆవిష్కర్తలూ, రచయితలు, మేధావులు, ధనవంతు లు ఆవిర్భవించడానికి కారణం అయ్యింది. అలాగే సంస్కృతి మొత్తం జనాభా ఆశలను అణచివేయగలదు. మన దేశంలో కర్మ సిద్ధాంతం, వైరాగ్య భావనలు, మోక్ష కాంక్షలతో ప్రజలను నిష్క్రియా పరులను చేసి అణచి వేయగలిగింది.

అసలు సంస్కృతి అనేది ఒకటి ఉందా? ఉంటే ఎక్కడుంటుంది? అది మనసులో ఉంటుందా? లేక ఆచరణకు సంబంధించిన విషయమా? కల్చర్ అనేది ఒకటి ఉంటే దాన్ని చేరుకొని, తెలుసుకునే దారి ఏది?

"ఆంత్రొపాలజిస్టుల లాగానే నా అభిప్రాయం కూడా ఏమంటే సంస్కృతి అంటే ఒక ప్రాంతంలో కలిసి జీవించే ఒక ప్రత్యేక ప్రజ జీవిత విధానం. వారి కళలు, సామాజిక వ్యవస్థలు, వారి అలవాట్లు, ఆచారాల్లోను, వారి మత విశ్వాసాల్లోను సంస్కృతి కనిపిస్తుంది. కానీ ఇవన్నీ కలిసిన మొత్తం మాత్రమే సంస్కృతి కాదు. అంతకంటే అది ఎక్కువ. ఇవన్నీ ఒక దానిపై మరొకటి తమ ప్రభావములను చూపుతాయి. ఒక దాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే అన్నిటినీ అర్థం చేసుకోవాలి.." -టైలర్

***మీనింగ్ (Meaning)**

సాంస్కృతిక అధ్యయనాలలో మీనింగ్ భావనకు చాల ప్రాధాన్యత ఉంది. ఐడియాలజీ, హెజమని మొదలైన కీలక భావనలు ఈ మీనింగ్ అనే భావనపై ఆధారపడి ఉన్నాయి. మీనింగ్ అంటే ఏమిటి? అది ఎక్కడుంటుంది? వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పడం చాల కష్టం. సింపుల్‌గా చెప్పుకునే ప్రయత్నం చేద్దాం. మీనింగ్ అనేది దైనందిన జీవితం (day-to- day life) లో ప్రజలు నియోగించు(deploy) వైఖరులు (attitudes), విశ్వాసాలు (beliefs), ప్రయోజనాలు (purposes), సమర్ధనలు (justifications), కారణాల (reasons) లో ఉంటుంది. ఏదేనా ఒక విషయం మనకు ఎంత ప్రధానమైనదో ఈ మీనింగ్ సూచిస్తుంది. అందుచేత మన చర్యలకు మార్గదర్శిగా ఉంటుంది. లేదా మన చర్యలను సమర్థిస్తుంది. ఇది సరళ వివరణ.

ఒక స్వతంత్ర వస్తుగత ప్రపంచం లోని విషయాల (items) ను సూచించడం ద్వారా మాటలు అర్ధాన్ని పొందుతాయని సాధారణ భావన. 'కుర్చీ' అనే మాట కుర్చీ అనే భౌతిక వస్తువు సారాంశము నుండి అర్ధాన్ని పొందుతుంది. తాత్వికంగా చెప్పుకుంటే మాట ఒక విషయాన్ని సూచిస్తుంది అనే వివరణను నామావళివాదం (nomenclaturism) అంటారు. దాని ప్రాతిపదికపై మీనింగ్ అంటే అర్ధమేమిటని అడిగితే సమాధానం దొరకదు. పైగా ఆ ప్రశ్న అసంబద్ధం అవుతుంది.

కొంత మంది సాంస్కృతిక సిద్ధాంతుల అభిప్రాయంలో మీనింగ్ అనేది వస్తువుల సూచికగా కాక సంకేతముల మధ్య తేడా ద్వారా జనిస్తుంది.

Notes:

1.Edward Burnet Tylor: British Anthropologist-(2.10.1832-2.1.1917)

# 2. సంస్కృతి, సమాజం

సంస్కృతికి సమాజం నిలయం. అది ఒక సమాజాన్ని ఆలంబనం చేసుకుని మాత్రమే ఉండగలదు. వ్యక్తి సమాజసభ్యునిగా ఆ సంస్కృతిని సొంతం చేసుకుంటాడు. సమాజ సభ్యునిగా మాత్రమే ఆ సంస్కృతి అతనిలో ఉంటుంది. ఆ వ్యక్తి సన్యసించి అడవిలోకి వెళ్ళిపోతే ఆ సంస్కృతి అతనిది కాదు. అతను ఆ సంస్కృతికి చెందదు. అడవిలో నగ్నంగా తిరిగినప్పటికీ అడవిలోని ఏ జీవి అడ్డుచెప్పదు. అదే సమాజంలో అయితే సంస్కృతి అంగీకరించదు. అందుచేత సంస్కృతి నూటికి నూరుపాళ్ళు 'సామాజికులైన మానవుల' వ్యవహారం. అది వారిని ఆశ్రయించి మాత్రమే ఉంటుంది. వారి దైనందిన జీవిత పనులలో, ఆలోచనల్లో, నమ్మకాల్లో వ్యక్తమవుతుంది. భౌతిక ఆచరణ లేని సంస్కృతి ఉండదు. అలాగే ఆలోచన, విశ్వాసాలు, అభిరుచులు మొ. అన్నీ సంస్కృతిలో భాగం. ఇక్కడ ముఖ్య విషయం ఏమిటంటే సంస్కృతి విడి వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. సమాజంలో పరస్పర సంబంధాలు, చర్యలతో కూడిన ఆచరణలో నిమగ్నమైన వ్యక్తుల యొక్క ఉమ్మడి ఆస్తి. ఆ ఆస్తి వారికి తమ పూర్వీకుల నుండి సమాజం ద్వారా ముట్టినది. దాన్ని మారిన జీవనపరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పులు, చేర్పులు చేసుకుని అందులో జీవిస్తారు. ఆ సంస్కృతిని వారు తమ పిల్లలకు సమాజం ద్వారా అందచేస్తారు.

సాంస్కృతిక విలువలు, భావనలు, ఆచరణలు అన్ని సమాజంలో పుట్టడటమే కాదు, సమాజంలో మాత్రమే అర్థాన్ని పొందుతాయి. కాలక్రమంలో సమాజంలో వాటి అర్థాలు, ప్రాధాన్యతలు మారిపోతాయి. మన సంస్కృతిలో భాగమైన భోగిమంట మరో సంస్కృతికి అర్థరహితం. ఒకానొక సాంస్కృతిక ఆచరణ సామాజిక మార్పులను బట్టి దాని విలువ కోల్పోవడం లేదా పెరగడం జరుగుతుంది. ఉదాహరణకు నగరాల్లో మోటారు వాహనాలు మితిమీరి వాడటం వల్ల వాయుకాలుష్యం ప్రమాదకరంగా మారింది. దీనివల్ల

సంవత్స రానికి ఒకసారి జరిగే దీపావళి, భోగిమంటలు క్రమంగా ప్రతికూల సాంస్కృతిక విలువగా, అర్ధ రహితంగా మారుతున్నాయి. అదే సమయంలో నిత్యం వాడే మరింత ప్రమాదకరమైన మోటారు వాహనాలు ఉన్నత సాంస్కృతిక విలువలకు చిహ్నాలుగా మారిపోయాయి. నెల రోజులపాటు లక్షలు, కోట్ల సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించడం గొప్ప భక్తి, ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువగా మారింది. మంచివైనా, చెడ్డవైనా సాంస్కృతిక మార్పులు సామాజికంగానే జరుగుతాయి.

సంస్కృతిలో భాష ఒక ప్రధాన భాగం. భాషను బట్టి సంస్కృతిని గుర్తించే సాంప్రదాయం ఉంది. భాష సమిష్టి జీవితం నుండి, సమాజం నుండి పుట్టి అభివృద్ధి చెందుతుంది. మన కున్న అనేకానేకమైన సంకేతాలలో భాష అతి ప్రధాన సంకేత వ్యవస్థ.

వొలిషినోవ్[2] అభిప్రాయం ప్రకారం 'మనం చూస్తున్నట్లుగా భాషతో సహా ప్రతీ సంకేతం సామాజికంగా వ్యవస్థీకృతమైన వ్యక్తులు మధ్య పరస్పర సహకారం, సమాచార మార్పిడి నుండి పుట్టుకొస్తాయి. అందుచేత సంకేత రూపాలు సామాజిక వ్యవస్థలో భాగస్వాములైన వారిచేత, అలాగే వారి ప్రత్యక్ష పరస్పర చర్యల చేత తీర్చిదిద్దబడతాయి. ఈ రూపాలు మారినప్పుడు సంకేతాలు కూడా మారతాయి. వర్గానికో ప్రత్యేక భాష, సంకేతాలు ఉండవు. అంటే సమూహమంతా ఆ భాషను, సంకేతాలను ఉపయోగిస్తారు. దీని ఫలితంగా వర్గాలను బట్టి విభిన్న వైఖరి గల యాసలు ప్రతీ భావజాల సంకేతంలో చొరబడతాయి. సంకేతం వర్గపోరాట రంగం అవుతుంది. పాలకవర్గం బహు యాసలు, లేదా ఉచ్చారణలను అంతం చేయడం ద్వారా ఒకే అర్థాలను ఇచ్చే సంకేతాలను రుద్దుతుంది'.

ఇప్పుడు ఒక ఉదాహరణ చూద్దాం.

మన సమాజంలో పసుపు రంగును శుభ సూచకంగా భావించడం సాంప్రదాయకంగా వస్తోంది. పసుపు రంగును శుభ సూచక సంకేతంగా అంగీకరించింది మన సమాజమే! అలాగే కాషాయ రంగును వైరాగ్యానికి, సన్యాసులకు సంకేతం చేసింది కూడా సమాజమే. అంటే ఒక వస్తువుకు, లేదా ఆచరణకు, మాటకు, భావనకు ఒక సంకేత అర్థం ఏర్పడేది సమాజమంతటా ఆ అర్థం స్థిరపడినప్పుడే! ఒకరో, ఇద్దరూ 'నలుపు శుభ సూచకం' అంటే చెల్లదు. అయితే ఈ సంకేత అర్థాలు కాలక్రమంలో కొత్తవి పుట్టవచ్చు, పాతవి మారవచ్చు. ఎలా జరిగినా సమాజం అమోదించి స్వీకరిస్తేనే అది సంస్కృతిలో భాగమవుతుంది. హిందూ జాతీయోన్మాదానికి, ద్వేష పూరిత రాజకీయాలకు చిహ్నంగా కాషాయరంగుకు కొత్త సంకేతార్థం రూపొందుతోంది. సూర్యోద యాన్ని సూచించే ఎరుపు రంగును మార్పుకు సంకేతంగా వాడటం ప్రాచీన కాలం నుండి వుంది. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు, వామపక్షాలు మార్పును కోరుతూ ఎర్ర జెండాలు వాడటం వల్ల ఎరుపు వారికి సంకేతమైంది. అంటే కార్మిక వర్గం ఎరుపు రంగును తమ సంస్కృతిలో భాగం అయిన సంకేతంగా సొంతం చేసుకుంది. ఎరుపు అందరికీ ఎరుపే. అయితే అది కార్మికులకు, కమ్యూనిష్టులకు భావోద్వేగాన్ని కలిగించే ప్రత్యేకమైన సంకేతం. సోవియట్ పడిపోయిన తర్వాత, ప్రపంచవ్యాప్తంగా వామపక్షాలు బలహీనమైన తర్వాత అందరూ ఎరుపు రంగును వాడుతున్నారు. ఎరుపు రంగు తమ సంకేతంగా కలిగి ఉండే సాంస్కృతిక హక్కును కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు క్రమంగా కోల్పోతున్నాయి.

Notes:

1. Valentin Voloshinov-(18.6.1895-13.6.1936) రష్యన్ భాషా వేత్త, మార్క్సిస్టు.

# 3. ఆర్థిక నిర్మాణం-సంస్కృతి

## (Economic structure and culture)

సాంస్కృతిక అధ్యయనాలకు  లోపల, వెలుపల ఉన్న వర్తమాన రచయితలు కొంత మంది ఆర్థికమే సాంస్కృతికమని విశ్లేషిస్తున్నారు. మరి కొంత మంది ఆర్థికానికి, సంస్కృతికి సంబంధం లేదంటారు.

సంస్కృతిని నానాటికి మరింతగా ఆర్థిక పరిమితుల్లోనే చూస్తున్నారు. కళలు, సంస్కృతి అనే వాటిని వాణిజ్య విషయాలు కావని ఒకప్పుడు వాదించినవారు సైతం ప్రస్తుతం ప్రధానంగా అవి ఆర్థికమేనని అంటున్నారు. ఆర్థిక వ్యవస్థలో కళలు, సంస్కృతి అనేవి ఒక ప్రత్యేక విభాగంగా అవతరించాయి. మీడియా అతి పెద్ద పరిశ్రమగా, వ్యాపారంగా అవతరించింది. కంపెనీలు తమ బ్రాండ్లను ఆకర్షణీయంగా, ప్రజలను ఆకట్టుకునే విధంగా రూపొందించేందుకు, వాటి ప్రచారానికి పెద్ద మొత్తాలు ఖర్చు చేస్తూ కళలను, సంస్కృతిని ఆశ్రయిస్తు న్నాయి. వివిధ దేశాల ప్రజల మధ్య సాంస్కృతిక సంబంధాలను, మార్పిడులను పెంచుతాయి అని భావించే ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక సౌకర్యాలు అతి పెద్ద వ్యాపారం. వ్యాపారమే ఒక గొప్ప కళ అయిపోయింది. ఆర్థికానికి సంస్కృతికి మధ్య విభజన రేఖలు మసకబారాయి.

సాంస్కృతిక అధ్యయనం దానికదే ఒక శాస్త్ర శాఖ కాదు. అది వివిధ శాఖల సాయంతో సాగే ఒక అధ్యయన శాఖ. ఇటీవల కొన్ని సాంస్కృతిక అధ్యయనాల్లో వాణిజ్య ధోరణులు ప్రధాన అధ్యయన విషయం అయ్యింది. అయితే ఈ సాంస్కృతిక అధ్యయనాలు ప్రజలను కేవలం వినియోగదారులుగా చూడవు. కొత్త సామాజిక విలువల, సాంస్కృతిక చిహ్నాల ఉత్పత్తిదారులుగా చూస్తాయి.

మార్క్సిస్టు ధోరణితో జరిగే సాంస్కృతిక అధ్యయనాల పద్ధతి చారిత్రక భౌతికవాదం. అయితే మార్క్సిస్టులు కాని వారు కూడా చారిత్రక భౌతికవాద పద్ధతిని ఉపయోగించుకుంటారు. సాంస్కృతిక అధ్యయనాలు 'మానవులు వారున్నట్లుగా ఎలా రూపొందారు?, వారు సాంస్కృతిక, సామాజిక రంగాల్లో తమ పాత్రను ఎలా పోషిస్తారు?' అనే విషయాలను అధ్యయనం చేస్తాయి. అవి తన ఎజెండా, విశ్లేషణా పద్ధతులను అర్ధశాస్త్రం, రాజకీయ శాస్త్రం, మీడియా అండ్ కల్చరల్ స్టడీస్, సామాజిక శాస్త్రం, సాహిత్యం, విద్య, చట్టం, సైన్స్ అండ్ టెక్నాలజీ స్టడీస్, ఆంత్రొపాలజి, చరిత్రలనుండి తీసుకుంటాయి. కేపిటలిజంలో ఏ శాస్త్రమైనా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, ముఖ్యంగా వారిలాభాలకు ఉపయోగపడితేనే వాటికి ప్రోత్సాహముంటుంది. నయా ఉదారవాద దశ ప్రారంభమైన తర్వాత మన దేశంలో సామాజిక శాస్త్రాలు, స్థానిక భాషలు క్రమంగా క్షీణిస్తూ అంతరించే దశకు చేరుకున్నాయి.

మానవ జీవితంలో మనుషులు జీవించి ఉండటానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తి, పంపిణీలు అత్యధిక ప్రాధాన్యత కలిగి వుంటాయి. అంటే ఆర్ధిక వ్యవస్థదే అగ్ర తాంబూలం. మిగిలిన శాస్త్రాలన్నీ ఆర్ధిక వ్యవస్థకు ఉపయోగ పడేవి, లేదా ఆర్ధిక అవసరాలు తీరిన మనుషుల వికాసానికి దోహదం చెయ్యడం ద్వారా మరింత సమర్ధవంతంగా మానవులు తమ ఆర్ధిక, ఆత్మిక అవసరాలను తీర్చుకునేలా వారిని తీర్చిదిద్దేవిగా ఉంటాయి. అమల్లో ఉన్న ఆర్ధిక వ్యవస్థను రక్షించేది రాజ్యం. ఆ రాజ్యాధికారాన్ని నిలుపుకోవడం, లేదా సాధించడం అనేవి రాజనీతి శాస్త్ర ప్రధాన విషయం. ప్రకృతిశాస్త్రాలు ఉత్పత్తిని, ఉత్పత్తి శక్తులను పెంచడమే ధ్యేయంగా పని చేస్తాయి. సామాజిక శాస్త్రాలన్నీ సామాజిక వ్యవస్థ గురించి అధ్యయనం చేస్తాయి. సామాజిక వ్యవస్థ సభ్యుల ఆర్ధిక అవసరాలను తీర్చుకోవడానికి ఏర్పడి కొనసాగుతున్న ఒక ఏర్పాటు. మనుషుల ఆర్ధిక జీవితాన్ని విస్మరించి, దానితో సంబంధం లేకుండా ఏ శాస్త్రం ఉండదు. కేపిటలిజాన్ని కూలదోయడానికి చేసే పోరాటం బలపడ టానికి, విజయవంతం కావడానికి ఆర్ధిక, రాజకీయ, సాంస్కృతిక

పోరాటాలను అత్యుత్తమంగా మేళవించాలి. రాజకీయాధికారం సాధించిన తర్వాత కూడా సాంస్కృతిక పోరాటానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి కొనసాగించాల్సి ఉంది. *కేపిటలిజం తన అధికారాన్ని నిలుపుకుని కొనసాగించడానికి సంస్కృతిని ప్రధాన సాధనంగా ఉపయోగించుకుంటున్న వాస్తవాన్ని గ్రహిస్తే సంస్కృతికి, ఆర్థిక నిర్మాణానికి ఉన్న సంబంధం తేటతెల్లమవుతుంది.* అందుచేత సంస్కృతి అధ్యయనంలో కూడా ఆర్థిక విషయాలు ఎక్కువ భాగాన్ని ఆక్రమిస్తాయి. అదీ గాక ఉత్పత్తి యొక్క ఒక పార్శ్వం సాంస్కృతిక సంబంధమైనదే.

ప్రజలు ప్రధానంగా పాలక వర్గ ఆధిపత్య సంస్కృతి యొక్క అధీనంలో, ప్రభావంలో ఉంటారు. పాలకవర్గ భావజాలం, సంకేతాలను స్వీకరించి, వాటికి అనుగుణంగా మారతారు. అయితే పాలక వర్గాల భావాలను ఆచరించే వస్తు సంపదలు, అవకాశాలు వీరికి ఉండవు. మంచి ఇల్లు, కారు, బేంక్ బేలెన్సు ఉన్నవారికే సామాజిక హోదా, గుర్తింపు ఉంటాయని, అదిచాల సహజం అనీ, అందులో అసంబద్ధత ఏమీ లేదని ప్రజలందరి చేత విశ్వసింప చేస్తారు. ఇవి వేలల్లో ఒకరికి కాని ఉండవు. అయినా అందరూ వాటినే నమ్ముతారు. పాలకవర్గాల ప్రధాన బలం ఇదే. *సమిష్టి అవసరాలు, ప్రయోజనాల కోసమే సామాజిక నిర్మాణం జరిగిందని, వ్యక్తి బాగు సమాజ బాగుతో విడదీయలేని విధంగా ముడిపడి ఉందనే స్పృహ ఏమాత్రం కలగకుండా కేపిటలిజం జాగ్రత్తపడుతుంది.* ఏ వ్యక్తి అయినా తగినంతగా శ్రమించక పోయినా చట్టబద్ధంగా లాభాన్ని సంపాదించడం తప్పుకాదు. లాభం లేకుండా ఎవరూ ఏ పనీ చేయరనేది సహజ న్యాయం హోదా పొందుతుంది. ఇలా పాలకవర్గాలకు మేలుచేసే, వారు అధికారంలో కొనసాగడానికి తోడ్పడే భావాలు ప్రవర్తనలను ప్రజలకు అలవాటు చేస్తారు. ప్రజలు వాటిని స్వీకరించి కొత్త అర్థాలను తీస్తారు, ఉదాహరణకు, 'అందరూ స్వార్థపరులే', 'స్వార్థం లోకనీతి' మొదలగు నిర్ధారణలకు వస్తారు. స్వార్థ గుణం వల్ల తొంభై శాతం ప్రజలకు ఒరిగేది ఏమీ లేకపోయినా దాన్నే నిత్య

సత్యంగా నమ్ముతారు. అది అక్కడితో ఆగదు. పాలకుల అవినీతి ప్రస్తావన వస్తే 'తినని వాడు ఎవ్వడు?' అనే ప్రశ్నతో సమాధానం చెప్పటంతో ఆగకుండా, వాడు తింటే తిన్నాడు, మనకూ కాస్త పడేస్తాడా, లేదా? అని ఆలోచిస్తున్నారు. పాలకులు తినేసేది, తమకు పడేసేది కూడా ప్రజల సొమ్మేననే స్పృహ రానీయదీ వ్యవస్థ. ప్రజలు సమాజం నుండి ఎలియనేట్ అయ్యి సమాజం పట్ల ఒకవిధమైన శత్రుత్వం కలిగి ఉంటారు. ప్రజలందరి అంటే సమాజం సొమ్ము తమదికూడా అనే భావనను ఏమాత్రం లేకుండా చేస్తుందీ వ్యవస్థ. పెట్టుబడిదారీ సంస్కృతి బలం ఏమిటో ప్రజల విశ్వాసాల్లో తెలుస్తుంది. లాభం కోసం ముందు పెట్టుబడి పెట్టడం పెట్టుబడిదారీ వ్యవస్థ నియమం. 'ఎన్నికల్లో కోట్లు ఖర్చు చేశాడు, ఇప్పుడు అదంతా లాభంతో సహా రాబట్టుకోవాలి కదా! మరి తినడా?' అనేది జనసామాన్యం మాట. అంటే ప్రజాసేవ లాభసాటి వ్యాపారం అనేది చాలా సర్వసాధారణ విషయంగా ఆమోదం పొందింది. మనకు తెలియకుండానే పాపం, పుణ్యం, విద్య, వైద్యం, పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు మొదలైన అన్ని జీవిత వ్యవహారాల్లోను, ఈ పెట్టుబడిదారీ వ్యాపార నియమాలు ఎక్కువగానో తక్కువగానో ప్రవేశించాయి.

పెట్టుబడిదారీ సంస్కృతి తన ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజల విశ్వాసాలను, ప్రవర్తనను తీర్చి దిద్దుతుందని చెప్పుకున్నాం. పెట్టుబడిదారీ సంస్కృతి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రవర్తించలేనివారు సైతం ఆ సంస్కృతే గొప్పదనే విధంగా వారిని నమ్మిస్తుంది. వినిమయం ఇటువంటి సబ్‌కల్చర్‌కి (sub culture)[1] కేంద్ర స్థానంలో ఉంటుంది. అది సభ్యుల హోదాను 'వినిమయదారులు' గా దిగజార్చడం ఇక్కడ విరోధాభాస (paradox). వారు తమ శరీరాలపై పరాయితనం (alienation),[2] భిన్నత్వం, శక్తి హీనతలను చెరగని విధంగా లిఖించుకుని కొత్త ఫ్యాషన్ల ఉత్పత్తిదారులుగా మారుతారు.

కేపిటలిజం సంస్కృతిని ఎంత శక్తివంతంగా తన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకో గలుగుతున్నదో చిన్న ఉదాహరణ చూద్దాం.

1970 లలో బ్రిటిష్ ఆర్థికవ్యవస్థ క్షీణ దశలో ఉన్నప్పుడు 'పంక్' లు (punks=ఇదొక తిట్టు) చెత్తను, లేవెట్రీ సామానులను అలంకారంగా, నలిగి వెలిసిపోయిన, చినిగిన మురికి దుస్తులు ధరించడం ద్వారా బ్రిటిష్ ఎలైటిస్ట్ సంస్కృతి పట్ల అరాచక ధిక్కారాన్ని వెల్లడించారు. అయితే కేపిటలిజం ఈ ఫేషన్లను సరుకులుగా మార్చి ఆ మొత్తం సంప్రదాయాన్నే తన సొంతం చేసుకుంది. అంటే తనను ధిక్కరించే సంస్కృతిని తనకు లాభాలు తెచ్చే సంస్కృతిగా మార్చుకోవడమే కాక ధిక్కరించే వారిని నిరాయుధుల్ని చేయగలిగింది. ఒక పక్క బ్రిటిష్ మీడియా పంక్‌లు దెయ్యాలని, బహిరంగ ప్రదేశాల్లో నైతికంగా భయానక పరిస్థితులను సృష్టిస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్న సమయంలోనే మ్యూజిక్, ఫేషన్ పరిశ్రమలకు చెందిన కంపెనీలు కొత్త సంగీత ధోరణులు, ఫేషన్లను పట్టుకోడానికి పోటీలు పడి ఫంక్‌ల వద్దకు వేగులను పంపాయి. అలా తనపై ధిక్కార సంస్కృతిని కూడా కేపిటలిజం సొంతం చేసుకొని లాభసాటి వ్యాపారంగా మార్చుకోగలిగింది. ఈ రోజున ప్రపంచ వ్యాపితంగా చినిగిన, వెలిసిన జీన్ పేంట్లను వేలం వెర్రిగా కొనడం మనం చూస్తున్నాం. తనకు వ్యతిరేకంగా పుట్టిన దాన్ని కూడా తనకు లాభాలను తెచ్చేదిగా మార్చుకోగల సామర్థ్యం కేపిటలిజానికి ఉందని ఇలాంటి విషయాలు రుజువు చేస్తాయి. ఇది సరుకుల్లో రెండు అంచుల పదును గల మదుపు. ప్రతిఘటనాత్మక వస్తువులను స్వాయత్తం (appropriate) చేసుకుని వాటిని తిరిగి సరుకులుగా మార్చడం అనే ప్రక్రియను గ్రహించిన సాంస్కృతిక అధ్యయనాలు విమర్శనాత్మక రాజకీయార్థశాస్త్రం ద్వారా సామాజికార్థిక విశ్లేషణ చేయడం తప్పనిసరి అని గ్రహించారు.

Notes:

1. sub-culture : అతి సరళంగా చెప్పుకోవాలంటే సమాజంలోని ఒక మైనారిటీ బృందం యొక్క విలువలూ నమ్మకాలూ ధోరణులూ జీవిత విధానాలను సూచిస్తుంది ఈమాట. ఈ బృంద సంస్కృతి ఆధిక్య సంస్కృతితో సంబంధం కలిగి ఉంటూనే దానితో విభేదిస్తుంది. సబ్ కల్చర్ భావన చాలా ప్రధానమైనది. ఎందుకంటే ఇది ఒక సమాజంలోని సంస్కృతుల వైవిధ్యాన్ని గుర్తించేందుకు ఉపకరిస్తుంది.

2.Alienation= చివరి అధ్యాయం చూడండి. నేను కూర్చిన మార్క్సిస్టు తత్వ శాస్త్ర నిఘంటువు చూడండి( LSC ప్రచురణ). నేను రాసిన ఎలియనేషన్ పుస్తకం 2021 జనవరిలో విడుదలయ్యింది. (విశాలాంధ్ర ప్రచురణ).

# 4. సంస్కృతి, రాజకీయార్ధశాస్త్రం
(Culture and Political Economy)

సాంస్కృతిక అధ్యయనాలు, రాజకీయార్ధశాస్త్రం ఒకదానికొకటి శత్రువులు కాకపోయినా పొసగని విషయాలని రుజువు చేయడానికి చాలామంది చాలా చాల కష్టపడ్డారు. కానీ కల్చరల్ స్టడీస్‌లో అడుగడుగునా పొలిటికల్ ఎకానమీ తారసపడుతుంది.

2000 వ సంవత్సరం నాటికి వివిధ అధ్యయనాల ప్రకారం, ప్రపంచ వ్యాపితంగా కోట్లాది ప్రజలు సంప్రదాయ పద్ధతుల్లో సాగే వ్యవసాయ రంగం నుండి పారిశ్రామిక, సమాచార ఆర్ధిక వ్యవస్థలలోకి లాగబడ్డారు. ఇది ఆర్ధికంగానే గాక, సాంస్కృతికంగా ప్రజల జీవితాల్లో పెను మార్పు. ఈ ఆర్ధిక మార్పు పేదరికం, ఆకలి స్థాయిలను పెంచింది. చాలా దేశాల ఆర్ధిక వ్యవస్థలు వనరుల సమ పంపిణీలోనూ, వ్యవసాయరంగంలో అర్ధాకలితో బతుకుతున్నవారిని ఆదుకోవడంలోనూ విఫలమయ్యాయి. ప్రాథమిక సరుకుల ఉత్పత్తి రంగంలో పనిచేసే కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా మారింది.

అన్ని నియంత్రణలనూ తొలగించిన అత్యంత స్వేచ్ఛాయుతమైన మార్కెట్ విధానాలు ప్రపంచ కార్పొరేట్ కేంద్రీకరణకు దారితీశాయి. కంపెనీల స్వాధీనం, విలీనాలు మొదలైన వాటిద్వారా ఇలా కేంద్రీకరించారు. ఈ విధానా లు కార్మికులకు ఉన్న రక్షణలన్నింటినీ తొలగించి లేబర్ మార్కెట్‌ను అస్థిరం చేసి లేబర్ చౌకగా లభించేలా చేశాయి. భారీ లేఆఫ్‌లు ప్రకటించాయి. ఇవన్నీ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడానికి ఆయా దేశాల ప్రభుత్వాలే చేశాయి. లేబర్‌ను కారు చౌకగా అందించడంలో చైనా ముందు ఉంది. ఈ విధానాల అమలు వెనుక ఐ. ఎం. ఎఫ్., ప్రపంచ బేంక్‌ల నిర్బంధాలున్నాయి.

ఈ పరిణామాలను అతి కొద్ది దేశాల్లో మాత్రమే కార్మికోద్యమాలు తట్టుకుని నిలిచాయి. ప్రభుత్వ చట్టాల రక్షణ ఉన్నప్పుడు చాల బలంగా కనిపించిన దేశ దేశాల కార్మిక సంఘాలు చతికిలబడ్డాయి. అంతకు మించి కార్మికోద్యమాల పట్ల సాంస్కృతిక అధ్యయనాల విమర్శనాత్మక ఆసక్తి విపరీతంగా పెరిగింది. దీనితోపాటు శతాబ్దపు చివరి భాగంలో పెట్టుబడి విస్తరణకు చాలక యంత్రమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో భారీ స్థాయిలో జాతి, వర్గ విభజనలు, అసమానతలు అతి ముఖ్యంగా కనిపించ సాగాయి. ఇవన్నీ ఐక్యరాజ్యసమితి నివేదిక (UNDP)1999 లో స్పష్టంగా చెప్పడం జరిగింది. ఈ నివేదిక ప్రకారం 1990 ల చివరికల్లా OECD[1] దేశాల్లో నివసించే 19 శాతం జనాభా ప్రపంచ వ్యాపిత ఇంటర్నెట్ వినియోగదారుల్లో 91 శాతంగా ఉన్నారు.1990 ల చివరి నాటికి అమెరికా 'సాంస్కృతిక పరిశ్రమ' అత్యధిక ఆర్థిక శక్తిని పొంది ప్రధాన మైలురాయిని దాటింది. ఆ నివేదిక ప్రకారం 'విమానాలు, ఆటోమొబైల్స్ కాక, వినోదం (Entertainment) ఏకైక అతి పెద్ద ఎగుమతి పరిశ్రమగా అవతరించింది' –( UNDP, page 6).

అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్‌లలో జరుగుతున్న అత్యధిక వినిమయాన్ని ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రత్యేకంగా పేర్కొంది. అక్కడ ప్రపంచ జనాభాలో 5 వ వంతుగా(20 శాతం) ఉన్న ధనికులు ప్రపంచ ఉత్పత్తి లో 90 శాతాన్ని వినిమయం చేస్తున్నారు. ఇందులో కేవలం అమెరికా ఒక్క దేశం వాటా 25 శాతం పైనే ఉంది. ఈ 5 వ వంతు ధనికులకూ ప్రపంచ జనాభాలోని అట్టడుగు 5 వ వంతు పేదలకూ మధ్య ఆదాయ వ్యత్యాసం 1960 లో 30:1 గానూ, 1990 లో 60:1 గానూ ఉండగా 1997 లో అది 74:1 నిష్పత్తిలో ఉంది. అంటే 1997 లో ప్రపంచ జనాభాలో 20 శాతం ధనికుల ఆదాయం 74 రూపాయిలుంటే 20 శాతం పేదల ఆదాయం ఒక్క రూపాయి ఉందన్న మాట. ఈ వ్యత్యాసం ఇప్పుడు మరింత భారీగా పెరిగి ఉంటుంది. ఈ గణాంకాలు అసమానతలు ఎంత

వేగంగా పెరిగిపోయాయో తెలియజేస్తు న్నాయి. 2000 సం. నాటికి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో నెలకొన్న ఆదాయ, సంపదల విపరీత అసమానతలు, ప్రపంచస్థాయి వర్గ విభజనలు కల్చరల్ స్టడీస్‌కు పంటికింద రాయిలా తగిలాయి. కల్చరల్ స్టడీస్‌కు విమర్శనాత్మక రాజకీయార్థశాస్త్రంతో సంబంధం లేదనే వారు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. డేవిడ్ హార్వీ[2] 1999 లో ఇలా అన్నాడు. "అందరికంటే పైనున్న ముగ్గురు అత్యంత ధనికుల సంపద బాగా వెనుకబడిన దేశాల, ఆ దేశాల్లోని 60 కోట్ల ప్రజల మొత్తం జాతీయోత్పత్తి కన్నా ఎక్కువ. 358 మంది ప్రపంచ బిలియనీర్ల మొత్తం సంపద ప్రపంచంలోని 230 కోట్ల మంది బీదల సంపదకు సమానం. ఈ 358 మంది సంపద, మొత్తం ప్రపంచ ప్రజల సంపదలో 38 శాతం."

సాంస్కృతిక అధ్యయనకారుల్లో చాల మంది తాము సైద్ధాంతికంగా మార్క్సిస్టు రాజకీయార్థశాస్త్ర కుటుంబానికి చెందిన వారమని అంగీకరిస్తారు. సాంస్కృతిక అధ్యయనాలకు, మార్క్సిస్టు రాజకీయార్థశాస్త్రానికి ఉన్న సంబంధాలు భావజాలం, రాజ్యం, వర్గం (class. కులం కాదు)[3] మొ.. వాటి అధ్యయనాల్లో అతి స్పష్టంగా కనిపిస్తాయి. సంస్కృతి గురించిన మార్క్సిస్టు రాజకీయార్థశాస్త్ర విమర్శనాత్మక దృక్పథం పరిధిలోకి వచ్చే అధ్యయనాలు అసంఖ్యాకం. వాటిలో ప్రచారం, ఐడియాలజీ, టెలి కమ్యూనికేషన్స్, మీడియా, ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్, సినిమా, ఎలక్ట్రానిక్ మీడియా, మేధో హక్కులు, అడ్వర్టైజింగ్, మార్కెట్ రిసెర్చ్, టూరిజం, ఫేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొ. కొన్ని మాత్రమే. సంస్కృతి యొక్క రాజకీయార్థశాస్త్రంలో కమ్యూనికేషన్స్ అండ్ మీడియా స్టడీస్ ప్రాబల్యం వహిస్తున్నాయి. ఎందుకంటే ఆధునిక సమాజాల్లో రాజకీయ, ఆర్థిక జీవితాల్లో ఇవి అత్యంత కీలక స్థానం ఆక్రమిస్తున్నాయి. కేపిటలిజాన్ని, దానికి ప్రధాన ఆయుధంగా ఉన్న కేపిటలిస్టు సంస్కృతిని పెంచి పోషించడంలో మీడియా ప్రధాన పాత్ర పోషిస్తున్నది.

ఆర్థిక, వాణిజ్య, శ్రామిక, పారిశ్రామిక వ్యవస్థలను అధ్యయనం చేసే రాజకీయార్థికవేత్తలు ఎల్లపుడూ న్యాయం, సమానత్వం, అధికార వికేంద్రీకరణ, వనరుల పంపిణీ, సామాజిక సంక్షేమం మొదలైన నైతిక సమస్యలను ఎదుర్కొంటారు. ఈ సమస్యలను రాజకీయార్థశాస్త్రంతో పాటు కల్చరల్ స్టడీస్ అధ్యయనం చేస్తాయి.

పెట్టుబడిదారీ రాజకీయార్థిక వ్యవస్థపై మార్క్స్ చేసిన విమర్శలో ప్రైవేటు ఆస్తి వ్యవస్థ, దాని అనుబంధ ఉప ఉత్పత్తులపై (అంటే ప్రైవేటు ఆస్తి వ్యవస్థ నుండి పుట్టిన ఇతర అంశాలు) విమర్శ అతి ప్రధానమైనది. ఆ ఉప ఉత్పత్తులలో ప్రధానమైనవి ఉత్పత్తి సంబంధాలలో వ్యవస్థా పరంగా నిర్మితమైన అసమాన తలు. అంటే వర్గాల మధ్య అంతరాలు, బేధాలు. వస్తువును తయారు చేయడం లో వినియోగించిన శ్రమ వల్ల ఆ వస్తువుకి 'విలువ' ఏర్పడుతుంది. ఏ వస్తువుకైనా తప్పనిసరిగా ఉండవలసినది 'ఉపయోగపు విలువ'. కేపిటలిజంలో ఈ రెండింటి కన్నా 'మారకపు విలువ'కు -అంటే డబ్బు రూపంలో ధరకు- మాత్రమే ఏకైక ప్రాధాన్యత ఉంటుంది. దానివల్ల డబ్బుకి అన్నిటికీ మించిన ప్రాధాన్యత ఏర్పడుతుంది. 'విలువ' ను 'ఉపయోగపు విలువ' నుండి, 'శ్రమ' నుండి వేరు చేయడంలో డబ్బు పాత్ర వల్ల డబ్బు సమాజంలో అతి ప్రధాన సాంస్కృతిక విలువగా అవతరిస్తుంది. ఆర్థిక ప్రయోజనం లేని, వ్యాపార సంబంధం కాని జీవితాన్ని ప్రజలు ఊహించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

ఆస్తి సంబంధాలపై మార్క్స్ చేసిన విమర్శలో రెండు అతి ప్రధాన అంశాలున్నాయి. మొదటిది ప్రైవేటు ఆస్తి వ్యవస్థలో ఆస్తిపరులు వనరులపై, సాంకేతిక సాధనాలపై నియంత్రణ కలిగి ఉంటారు. వీరు ఆస్తిలేని వర్గం శ్రమపై తమ యాజమాన్యం ద్వారా ఇది సాధిస్తారు. రెండోది కార్మికులు ఈ సంబంధం నుండి తమను తాము విముక్తం చేసుకోడానికి పోరాడుతారు. అదే సమయంలో బూర్జువా వర్గం శ్రామికులను దోచుకోడానికి, అణచి

ఉంచడానికి మరింత గట్టిగా పనిచేస్తుంది. దీని వల్ల బూర్జువా, కార్మిక వర్గాలు రెండూ నానాటికి మరింతగా తమ వర్గ స్పృహను పెంపొందించు కుంటాయి.

కార్మిక వర్గ స్పృహ పెరుగుతుందనే విషయంలో మార్క్స్ అంచనాలు నిజం కాలేదు. దానికి ప్రధాన కారణం మారిన ఉత్పత్తి పరిస్థితులు. ఉత్పత్తి ఒకే చోట జరగకుండా ప్రపంచమంతా విస్తరించారు. అంతగా నైపుణ్యం, భారీ యంత్రాలు అవసరంలేని శారీరక శ్రమను కాంట్రాక్ట్ పద్ధతి ద్వారా అసంఘటిత రంగానికి, చిన్న తరహా పరిశ్రమల రంగానికి బదిలీ చేశారు. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం, ఆటొమేషన్‌ల ద్వారా ఉత్పత్తిలో కార్మికుని నిమిత్త మాత్రుడిని చేశారు. వస్తువుల ఉత్పత్తిలో తన పాత్ర ఉందనే ఆలోచనే రాని పరిస్థితి ఏర్పడింది. ఉన్నత సాంకేతికతతో నిర్మితమైన భారీ యంత్రాలను విద్యావంతు లైన సాంకేతిక నిపుణులు నడుపుతున్నారు. వారు కలలో కూడా తమను తాము కార్మికులుగా భావించరు. అందుకు తగ్గ సాంస్కృతిక వాతావరణం వారి చుట్టూ నిర్మితమైంది. కేపిటలిజంలో సామాజిక హోదా, ఐడెంటిటీలకు డబ్బు, ఆదాయం పరమ ప్రమాణాలై పోయాయి. ఐడెంటిటీ అంటే సామాజిక గుర్తింపును కోరుతూ తనగురించి తను ఏర్పరుచుకునే భావన అనుకోవచ్చు. ఆదాయాల్లో అంతరాల రీత్యా చూసినప్పుడు ధనిక వర్గంలో ఎన్ని అంతరాలున్నాయో కార్మిక వర్గంలోనూ అన్ని అంతరాలు ఏర్పడ్డాయి. అధిక ఆదాయం కల వేతనజీవులు ధనిక వర్గ సంస్కృతిని అందిపుచ్చుకునే ఆశతో ధనికుల పట్ల ఆరాధనా భావంతో, పేద కార్మికుల పట్ల చిన్న చూపుతో ఉంటున్నారు.

మార్క్సిస్టు రాజకీయార్ధశాస్త్రం పెట్టుబడిదారీ ఆస్తి సంబంధాలు కార్మికులను, పెట్టుబడిదారులను వస్తుగత శత్రువులను చేస్తాయని, ఆ సంబంధాలు తీవ్ర భావోద్వేగ శత్రు సంబంధాలుగా వ్యక్తమవుతాయని చెప్పింది. కాని వర్తమాన ప్రపంచంలో ప్రజాస్వామ్యం, వ్యక్తిస్వేచ్ఛ, రాజకీయ హక్కులు, మొ.. అంశాల భావజాలంతో ఉదారవాదం ఆ శత్రు పూరిత భావోద్వేగాలను

ఉపశమింప చేయడంలో నేటి వరకూ విజయవంతం అవుతూ వస్తోందని విమర్శకుల అభిప్రాయం.

కేపిటలిస్టు ఆస్తి సంబంధాల గురించి మార్క్స్ చేసిన విమర్శలో మరో ముఖ్య విషయం 'విలువ' యొక్క బహుళ రూపాలను కనుక్కోవడం. దాని ప్రాథమిక రూపంలో ఒక 'సరుకు' ఒక స్థిరమైన (నిర్దిష్ట) అంతర్గత విలువను కలిగి ఉండదు. కాని దాన్ని తయారుచేయడానికి మనిషి పడ్డ కష్టంతో నిండి ఉంటుంది. ఈ మానవతావాద[4] చట్రంలో మార్క్స్ శ్రమను విలువ యొక్క సారాంశంగా చూశాడు.అంటే సరుకుకి విలువను కలిగించేది శ్రమ. ఆ విధం గా ఆయన మానవ జీవితానికి అత్యంత ఆవశ్యకమైనదిగా 'శ్రమకు' పట్టాభిషేకం చేశాడు. కాని అంతటితో ఆగలేదు. ఒక సారి ఒక సరుకు ఇతరులకు అందుబాటులోకి వచ్చినపుడు దాని 'విలువ' ను దానిలోని 'ఉపయో గపు విలువ' ద్వారా మళ్ళీ తాజాగా అంచనా వేయడం, అర్థంచేసుకోవడం జరుగుతుంది. ఒక సరుకుయొక్క విలువ భిన్న అవసరాలు, ఆకాంక్షలు, వాంఛలనుబట్టి చాలా భిన్నంగా, అసమానంగా అంచనా వేయడం జరుగు తుందని మార్క్స్ గుర్తించాడు. వస్తువులే కాక చాలా రకాల సేవలు కూడా సరుకులే. అంతేకాక ఈ గతిశీల గుణమే 'ఉపయోగపు విలువ' అని కూడా పేర్కొన్నాడు. ఉపయోగ విలువ ఒక వస్తువు, లేదా సేవ యొక్క భౌతిక పార్శ్వాన్ని వివరిస్తుంది. శ్రమ సరుకు విలువకు సారాంశాన్ని కల్పించేట్లయితే మన జీవితంలో సామాజిక ఉపయోగాల వైవిధ్యం ఉత్పత్తులకు వాటి అర్థాన్ని లేదా ఉపయోగపు విలువను కలుగజేస్తుంది.

చాలామంది సాంస్కృతిక అధ్యయనకారులు సంభ్రమాశ్చర్యాలతో మార్క్స్ చెప్పిన ఈ విషయాలను స్వీకరించి భిన్న ప్రజా బృందాలు తమ జీవితాలకు అర్థాన్ని కల్పించుకోవడం, పెంచుకోవడంతో వినిమయ వస్తువులు, మీడియా ఉత్పత్తులు, సేవలు, షాపింగ్ మొ.. వాటిని ఎలా

ఉపయోగిస్తున్నారో లోతుగా అధ్యయనం చేయసాగారు. అయితే వీరు మార్క్స్ చెప్పిన విలువ, ఉపయోగపు విలువ మొ.. సాంకేతిక పదాలను వాడరు. వినిమయం గురించి జరిగిన, జరుగుతున్న అధ్యయనాలు ఇన్నీ అన్నీ కాదు. వీటికి నేపథ్యం అంతా ఇంచుమించుగా మార్క్సిస్టు రాజకీయార్థశాస్త్రం అందించిన భావనలే.

అనేక విషయాలను ఏక కాలంలో చర్చించే రంగంగా సాంస్కృతిక అధ్యయనాలు సామాజిక, రాజకీయ నిర్మాణాలను, వాటి మధ్య పరస్పర సంబంధాలను పరిశోధిస్తాయి. వీటి లక్ష్యం మెరుగైన సమాజం కోసం, జీవితం కోసం పోరాడే సజీవ, సహజ ప్రత్యామ్నాయమే! సాంస్కృతిక రూపాలను వాటి ఉత్పత్తి, సమాజంపై వాటి ప్రభావాలు, చరిత్రల సంబంధంలో పరిశోధించడాన్ని 'కల్చరల్ మార్క్సిజం' గా పిలుస్తున్నారు. ఇది సాంస్కృతిక అధ్యయనాలకు ఒక మార్గదర్శి అయ్యింది.

వర్తమాన సాంస్కృతిక అధ్యయనాల్లో అతి కీలక అధ్యయన విషయం 'అధికారం'. అధికారం, సమాజ నిర్మాణాల గురించిన మార్క్సిస్టు భావాలు సాంస్కృతిక అధ్యయనాలపై మౌలిక ప్రభావాన్ని చూపాయి. సోవియట్ యూనియన్, తూర్పు యూరపు దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోవ డం, చైనా, వియత్నాంలు పెట్టుబడిదారీ పంథా చేపట్టడం, రాడికల్ ఇస్లాం ప్రభావం మొ. అన్నీ 'మార్క్సిజం అంతం అయిందనడానికి రుజువులు' అనే వాదనలున్నాయి. అయినా మార్క్సిస్టు ప్రతిపాదనలు వర్తమాన సంస్కృతిలో సాంస్కృతిక ప్రత్యేకతలు, అణచివేత, సామాజిక నిర్మాణాలను సైద్ధాంతికంగా అవగాహన చేసుకోవడంలో కీలక ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి.

20వ శతాబ్దపు రెండవ అర్ధభాగంలో సాంస్కృతిక అధ్యయనాల ఆవిర్భావం సమాజం, సంస్కృతులను అధ్యయనం చేసే విభిన్న మార్గాలను ప్రభావితం చేశాయి. జార్జి లూకాక్స్, ఆంటోనియో గ్రాంసీ, ఎర్నెస్ట్ బ్లాక్, వాల్టర్ బెంజమిన్, అడార్నో, ఆల్తూజర్, రేమండ్ విలియమ్స్, ఫ్రెడరిక్

జేమ్సన్, టెర్రీ ఈగల్టన్ లాంటి అనేక మంది మార్క్సిస్టు సిద్ధాంత వేత్తలు విభిన్న సాంస్కృతిక రూపాలు, వాటికి ఆర్థికవ్యవస్థ, చరిత్రలతో గల పరస్పర సంబంధాలను శోధించడానికి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని వినియోగించారు.

సాంస్కృతిక అధ్యయనాలు రాజకీయార్ధ శాస్త్రాన్ని ఎందుకు విస్మరించలేవో తెలిపే ఒక ఉదాహరణ చెప్పుకుందాం.

డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో లో బానిసలుగా చెరబట్టిన బాలల చేత తుపాకీ తలకు గురిపెట్టి బలవంతంగా conflict minerals[5] ను తవ్విస్తున్నారని వారికి సరిపడిన తిండికూడా పెట్టకుండా చాల ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయించి దోచుకుంటున్నారని సాక్ష్యాలతో వెల్లడయ్యింది. ఇది మాత్రమే అయితే రాజకీయార్ధశాస్త్రం ప్రమేయాన్ని సహించని సాంస్కృతిక అధ్యయన కారులకు పెద్ద సమస్య కాదు. అది 'స్థానిక సమస్య' లేదా 'స్థానిక సంస్కృతి' అని తేలికగా తీసి పడేస్తారు. సమస్య అక్కడితో ఆగలేదు. అంత క్రూర దోపిడితో ఉత్పత్తి అయిన ఆ ఖనిజాలను ప్రపంచంలోని అతి పెద్ద కంపెనీలు కారు చౌకగా కొంటున్నాయి. వీటిని ICT[6] ఉత్పత్తుల తయారీ లో ఉపయోగిస్తారు. ఈ ICT సరుకులను ప్రపంచమంతా వాడుతున్నారు. అవి లేకుండా నేడు సంస్కృతి గురించి మాట్లాడటం అసాధ్యం. అలాంటప్పుడు ఈ అధ్యయన కారులు ICT సరుకుల ఉత్పత్తి, వాటి విస్తృత వినియోగం, సాంస్కృతిక సంబంధమైనవి కావని ప్రకటించాలి. అప్పుడు సాంస్కృతిక అధ్యయనం అనేది ఏమీ మిగలదు.

## Notes:

1.OECD=Organisation for Economic Co-operation and Development- సభ్య దేశాలు 36. 1961 లో స్థాపించారు.

2. డేవిడ్ హార్వీ (David Harvey) బ్రిటన్‌కు చెందిన సుప్రసిద్ధ మార్క్సిస్టు మేధావి. అమెరికాలో స్థిరపడ్డాడు.

3. గత రెండు దశాబ్దాలనుండి కులానికి 'సామాజిక వర్గం' అనీ, ముఠా తగాదాలకు 'వర్గ పోరు' అనీ పేర్లు పెట్టి విడవకుండా ప్రచారం చేశారు. ఈ మాటలు ఇప్పుడు జనామోదం పొందాయి. ఇది పెట్టుబడిదారీ వర్గం చేసిన కుట్ర. ఇది పీడితులకు చెందిన సంకేతాలను వారికి లేకుండా చేయడంలో భాగమే. వామ పక్షాలు ఈ కుట్రను ఎదుర్కోవడంలో విఫలం కావడమే కాక వారిలో చాలామంది అనాలోచితంగా ఈ మాటలను వాడేస్తున్నారు.

4. ఇక్కడ మానవతా వాదమంటే సాటి మనిషి పట్ల చూపే ప్రేమ, దయ, కరుణ వంటి వాటితో కూడినదనే అర్థం కాదు. మనిషి స్వీయ చొరవకు ప్రాధాన్యతను ఇస్తూ సామాజికశాస్త్రంలో మనిషికి కీలకస్థానం కల్పించడం.

5.Conflict Minerals=cassiterite, wolframite, coltan, gold, tungsten, tantalum ..etc.

6.ICT=Information and Communication Technology. It refers to all equipment, applications and services that involve communication. Computers, cellphones, televisions, radios and satellite systems are all part of ICT.

# 5. భారతీయ సంస్కృతి

'భారతీయ సంస్కృతి' అనేది ఒకే సంస్కృతి కాదు. అనేక సంస్కృతుల సహజీవనం. సంస్కృతికి ప్రధాన ప్రమాణాలుగా పరిగణించే వేటిని చూసినా మనం దేశమంతా ఒకే సంస్కృతి ఉందని చెప్పలేము. భాష, ఆహారం, వస్త్రాలు, పండుగలు, సంగీతం, సాహిత్యం, నృత్య రీతులు, ఆచార వ్యవహారాలు, కులాలు, మతాలు... ఇలాంటి వాటిలో కొన్ని పోలికలున్నా వైవిధ్యమే ఎక్కువ. భారతీయ సంస్కృతిని 'భిన్నత్వంలో ఏకత్వం' అనడం ఒక విధంగా సరియైనదే.

గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ ఇళ్ళ నిర్మాణం, హరప్పా సంస్కృతిలో ఇళ్ళ నమూనాను పోలి వుంటుందని పురావేత్తలు చెపుతున్నారు. హరప్పా నాగరికతలో తల్లి దేవతను, పశుపతిని పూజించే ఆచారముండేది. అది నేటికీ కొనసాగుతున్నదంటారు. ఈ యధార్థాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారు. వేల ఏళ్ళ నుండీ మనది చెక్కు చెదరని ఏకశిల లాంటి సనాతన సంస్కృతి అని ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి అతి ప్రాచీన సంస్కృతికి చెందిన అవశేషాలు ప్రతీ సంస్కృతిలోను, అన్ని దేశాల్లోను కొనసాగుతాయి. అందులో మనదేశం, మన సంస్కృతి ప్రత్యేకత ఏమీ లేదు. మన ప్రత్యేకత అనేక జాతులు, సంస్కృతులు, భాషలు, మతాలు, భౌతికవాదాలు, నాస్తికత్వాల సమ్మేళనం కావడమే.

వేల ఏళ్ళ నుండీ అనేక జాతులు, అనేక ఖండాల వారు భారత ఉపఖండం వలస వచ్చి ఇక్కడ స్థిర పడ్డారు. వీరిలో ప్రోటో ఆస్ట్రాలాయిడ్లు, నీగ్రోయిడ్స్, మంగోలాయిడ్స్ ప్రధానమైన మానవ జాతులు. అలాగే ఇరానియన్లు, గ్రీకులు, కుషాణులు, శకులు, హూణులు, అరబ్బులు, టర్కులు, మొఘలులు, యూరోపువారు ఇక్కడికి వచ్చి స్థానిక జనాభాలో కలిసిపోయారు. అలా కలిసిపోయిన వారు తమ సాంస్కృతిక అలవాట్లను ఇక్కడ వివిధ సంస్కృతులతో మిళితం చేశారు. ఉదాహరణకు క్రీ.పూ. 2వ

శతాబ్దం లో మాత్రమే కుట్టిన వస్త్రాలు ధరించడం కుషాణులు, శకులు, పార్ధీనియన్ల ద్వారా భారత ఉపఖండంలో ప్రవేశించింది. అంతకు ముందు ఇక్కడి వారు కుట్టని వస్త్రాలు ధరించే వారు. ఇప్పుడైతే పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో చొక్కాలు, పేంట్లు, మొదలైనవి ధరిస్తున్నారు. ఇలా నేర్చుకున్న వివిధ విషయాలు మనసంస్కృతిని సంపద్వంతం చేశాయనే చెప్పవచ్చు. పలు సందర్భాలలో అనేక ఘర్షణలు జరిగినా మొత్తంమీద ప్రజలు శతాబ్దాలుగా సర్దుకు పోతూ, అనేక ఇతర సాంస్కృతిక విషయాలను ఇముడ్చుకున్నారు.

మన సాంస్కృతిక వైవిధ్యం ప్రధానంగా ప్రాంతాలను బట్టి, భౌగోళిక పరిస్థితులను బట్టి నిర్ణయించబడింది. ఉదాహరణకు తీర ప్రాంతమైన కేరళలో కొబ్బరి ఎక్కువ పండుతుంది కాబట్టి వంటకు కొబ్బరి నూనె వాడతారు. అలాగే మైదాన ప్రాంతమైన ఉత్తర ప్రదేశ్‌లో ఆవాలు పండుతాయి కాబట్టి వంటలకు ఆవనూనె వాడే అలవాటు వుండేది. అదే సమయంలో ఒకే సందర్భానికి భిన్న ఆచార వ్యవహారాలు కనిపిస్తాయి. మన ప్రజల జీవనాధారం ప్రధానంగా వ్యవసాయం కాబట్టి పంట చేతికి రావడం ఒక ముఖ్య సందర్భం. అలా పంట వచ్చే సందర్భంలో పంజాబులో భాంగ్రా నృత్యం చేస్తే, ఆంధ్రలో సంక్రాంతి, తమిళనాడులో పొంగల్ పండుగలు చేస్తే అస్సాంలో బిహూ నృత్యం చేస్తారు.

దేశంలోని ఒక మతంవారు, లేదా ఒక కులంవారు అంతా ఒకే సంస్కృతి కలిగి లేరు. తమిళనాడు బ్రాహ్మణులకు, కాశ్మీరీ బ్రాహ్మణులకు పోలికే వుండదు. మన దేశంలో కొన్ని ప్రాంతాల్లో బ్రాహ్మణులు చేపలు తింటారు. కేరళలోని ముస్లిములకు, ఉత్తర ప్రదేశ్ లోని ముస్లిములకు చాలా తేడాలు చూడవచ్చు. మన దేశంలో సంస్కృతి ప్రధానంగా ప్రాంతీయమైనదిగా కనిపిస్తుంది. అందుకే ప్రతీ భారతీయునికి చాల ఐడెంటిటీలు ఉంటాయి. భారతీయుడు, స్త్రీ, లేదా పురుషుడు, ఉత్తరాది లేదా దక్షిణాది వాడు, ఆంధ్రుడు, హిందువు, ముస్లిము, కులం, రాయలసీమ, ఉత్తరాంధ్ర,

కోస్తాంధ్ర, గోదారోళ్ళు, నెల్లూరోళ్ళు ఇలా పదుల సంఖ్యలో ఐడెంటిటీలు ఉంటాయి. ఇవే కాక రైతులు, కూలీలు, చేతివృత్తుల వారు, ఉద్యోగులు, గ్రామీణులు, నగరవాసులు, ఇలా అనేకానేక ఐడెంటిటీలు, సాంస్కృతికంగా తేడాలు వుంటాయి. సందర్భాన్ని బట్టి ఆయా ఐడెంటిటీలు ప్రాధాన్యత వహిస్తాయి.

మన దేశంలో ప్రధానమైనవి ఎనిమిది మతాలున్నాయి. తిరోగమన వాదులు భారత సంస్కృతి అంటే వైదిక సంస్కృతేనని, అది అవిచ్ఛిన్నంగా కొనసాగుతోందని ప్రచారం చేస్తున్నారు. కాని అది పచ్చి అబద్ధమని చరిత్ర తెలుపుతోంది. వేదకాలంలోనే వేదాలను ధిక్కరించిన చార్వాకులున్నారు. వేద ప్రామాణ్యాన్ని తిరస్కరించి, దేవుని ఉనికిని ప్రస్తావించని బౌద్ధం మెజారిటీ ప్రజల్లో, భూభాగాల్లో వ్యాపించడమే కాక, విదేశాలకు కూడా వ్యాపించింది. సాంఖ్యం వంటి భౌతికవాద తత్వాలు ఇక్కడే పుట్టాయి. అయితే హిందూ మతం వాటన్నిటినీ తనలో కలిపేసుకుని భావవాద భాష్యాలు చెప్పింది. వేదకాలంనాటి గోమాంస భక్షకులు గోభక్తులుగా మారిపోయి గోపూజలు చేసినా గోమాంస భక్షణ కొనసాగింది.

తమ రాజకీయ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి స్వార్థపర శక్తులు హిందూ మతాన్ని, సంస్కృతిని వాడుకుంటున్నాయి. హిందూ సంస్కృతి మెజారిటీ ప్రజలను ఏకం చేయడానికి నేరుగా ఉపయోగపడదు. అలా ఉపయోగ పడకపోగా కులపరంగా ప్రజలను వేల కులాలుగా విడదీసింది. సారంలో అది గొప్ప విభజన శక్తి. చివరకు వ్యక్తిని కూడా అతని జీవితం నుండి వేరుపడి తామరాకుపై నీటి బొట్టులా జీవించమని, అప్పుడే మోక్షం సాధ్యమని బోధిస్తుంది.

ఈ సందర్భంలో ప్రముఖ చరిత్రకారులు బి.ఎస్.ఎల్. హనుమంతరావు గారి అభిప్రాయాలు చూద్దాం.

"భారతీయ సంస్కృతిలో విశిష్టమైనవిగా పరిగణించే లక్షణాలన్నింటికీ భారత ఉపఖండ భౌగొళిక పరిస్థితులే చాలావరకు కారణాలుగా నిరూపించవచ్చు. క్రియాత్మకంగాని భావనా దృష్టి,, కర్మసిద్ధాంతం, నిష్కామకర్మభావం, వర్ణ వ్యవస్థ, జాత్యహంకారాన్ని పెంచే ఏకాకిత్వము భారత సంస్కృతికి విశిష్ట లక్షణాలు! ఇవన్నీ భారతదేశ భౌగోళిక పరిస్థితుల ప్రభావం వల్లనూ భారతదేశ చారిత్రక సంఘటనల ఫలితంగాను ఏర్పడినవేనని సోదాహరణంగా వివరించవచ్చు,

ఆధ్యాత్మికత భారతీయ సంస్కృతికి పునాది అనీ, కేవలం ప్రాపంచికమైన పునాదులు గల పాశ్చాత్య నాగరికత కంటే భిన్నమైనదనీ తరచు వింటూ ఉంటాము. పాశ్చాత్య చరిత్రకారులు, విమర్శకులు సైతం ఈ విషయాన్ని ప్రశంసిస్తూ ఉండడం గమనించదగింది. తమ సంస్కృతిలోని ఆధ్యాత్మిక వైలక్షణ్యాన్ని భారతీయులెప్పుడు గుర్తించారో చెప్పలేము. వాస్తవానికి భారతీయ సంస్కృతిలో గతించిన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని భారతీయుల దృష్టికి తెచ్చినవారు భారతదేశ విజేతలైన పాశ్చాత్యులే! ఈ పాశ్చాత్యులు భారతీయుల దృష్టిలో తుచ్ఛమైన ఐహిక నాగరికతా సంస్కృతులను నిర్మించుకొన్నవారే.

"మన దేశంలో విపరీతంగా విన్పిస్తున్న ఆధ్యాత్మిక వాదానికి ప్రయోజనం ఐహిక సుఖాల కోసం మనంపడే ఆరాటాన్ని తాపత్రయాన్ని కప్పిపుచ్చడమే !" అంటూ ఇటీవల సి.డి.ఖోస్లా పండితుడు వ్రాసినాడు. "ఉన్నత నాగరికతా శిఖరాల నుండి మనం ఏనాడో పతితులమైనాము. ఇంకా ఆ శిఖరాలనే అధిరోహించి ఉన్నామని ఇతరులను మోసగించడానికి చేసే ప్రయత్నమే నేటి ఆధ్యాత్మికతను గురించిన ఉపన్యాసాలు. వాస్తవానికి మన వర్తకులలో గాని, రాజకీయ నాయకులలోగాని, ఏ వర్గం ప్రవర్తనలో గానీ ఆధ్యాత్మికత అణు మాత్రం కూడా గోచరించడం లేదు కదా. అయినప్పుడు నేటి మన ఆధ్యాత్మిక వాదం కేవలం అవినీతికరమైన పెద్ద మోసం"

నాటివరకు కేవలము అంతర్వాణియో, ఆకాశవాణియో, దివ్యజ్ఞానమో జ్ఞానార్జనకు సాధనాలుగా వుండేవి. దీని అసమర్ధతకు, మోసానికి ప్రజల అజ్ఞానమే శ్రీరామరక్ష. దీని ప్రయోజనాన్ని సామర్థ్యాన్ని నిరాకరించి శాస్త్రీయమైన మార్గాన్ని సూచించాడు కపిలుడు. ఇంద్రియ గోచరం గానిది, ప్రయోగ సాదృశ్యాలకు నిలవనిదీ విజ్ఞానం కాదన్నాడు. 'దర్శనము' అనే మాటకు నిజమైన అర్ధమే అది. ఈ ఆలోచనాక్రమంతోనే 'రక్తతర్పణలు కోరే దేవుడు' హేతువాదానికి నిలబడడనీ, అందుచే అతడు లేడనీ, తనది 'అనీశ్వరవాద' మని నిర్భయంగా చాటినాడు, సత్యాన్వేషణకు కపిలుడు సూచించిన సాధనలే ఐరోపాలో మధ్య యుగాంతంలో సర్ రోజర్ బేకన్ సూచించి క్రైస్తవమతాధికారుల ఆగ్రహానికి గురి అయినాడు." — 'భారతీయ సంస్కృతి ఒక పరిశీలన' అనే గ్రంథం నుండి.

మతవాద రాజకీయ శక్తులకు హిందూ మతంలోని వైరుధ్యాలు, చీలికలు బాగా తెలుసు. అయినా పాలక వర్గాల ప్రయోజనాల కోసం పాటుపడే వీరు మధ్యతరగతి సహాయంతో 'హిందూ సంస్కృతి' ప్రాతిపదికపై పెద్ద ఓటు బేంకును సృష్టించుకొనేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో వీరు కొంతవరకు సఫలమయ్యారు కూడా. కులాల, ప్రాంతాల కుంపటి అయిన హిందూ మత సంస్కృతిని ఐకమత్యం ప్రబోధించి ఒక్కటి చేయలేరు. విభజించి పెద్ద భాగాన్ని తమ వెంట నిలుపుకోవడం వీరి ఎత్తుగడగా వుంది. ముస్లిం, దళిత ప్రజలను మిగిలిన అన్ని కులాలకు ఉమ్మడి శత్రువులుగా చూపి, ఆ శత్రుత్వం ప్రాతిపదికగా వారిని ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారు. హిందూ మత సంస్కృతికి నేటి పెట్టుబడి దారీ ప్రపంచంలో, అలాగే మన పెట్టుబడిదారీ దేశంలో భౌతిక పునాది లేదు. అయినా వీరు కొంతవరకూ విజయవంతం కాగలుగుతున్నారు. వామపక్ష భావజాలం వ్యాపించడానికి కావలసిన భౌతిక పరిస్థితులు సమృద్ధంగా వున్నాయి. అయినా వామపక్ష భావాలు, రాజకీయాలు బలపడటం లేదు. కమ్యూనిష్టులందరూ అలోచించాల్సిన విషయమిది. 'పెట్టుబడిదారీ

సంస్కృతిలోని సంక్షోభం ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజానికి ఆజ్యం పోస్తున్నది' అని సూత్రీకరించి ఊరుకొంటే 'పరిస్థితులను మార్చడంలో మనిషి క్రియాశీల చొరవ' ను తిరస్కరించడమే అవుతుంది.

మతాన్ని ప్రాతిపదిక చేసుకొని భారత సంస్కృతిని హిందూ సంస్కృతిగా నిర్వచించే ఆనవాయితీ వుంది. హిందూ మతసంస్కృతి భిన్నత్వంలో ఏకత్వం అని చెప్పవచ్చు. ఇందులో ఏకత్వం కంటే భిన్నత్వం పాలు చాల ఎక్కువ. హిందూ మత విశ్వాసుల ఆరాధనా పద్ధతులు, ఇతర తంతులు ఒక ప్రాంతానికి, మరో ప్రాంతానికి చాల భిన్నంగా వుంటాయి. అదీగాక బహు దేవతారాధన పద్ధతి వల్ల ఒక్కో ప్రాంతంలో ఒక్కో దేవతకు ప్రాధాన్యత ఎక్కువ. బెంగాల్లో కాళి, మహారాష్ట్రలో గణపతి, తమిళనాడులో మురుగన్ ఇలా ప్రాంతాన్ని బట్టి దేవతల ప్రాధాన్యత వుంటుంది. అంతే గాక, శైవులు, వైష్ణవులు వేరు. సూఫీ అయిన సాయిబాబా ప్రముఖ హిందూ దేవతగా పరిణమించాడు. మధ్య తరగతి ఆదాయాలు గణనీయంగా పెరగడం వల్ల వైభవోపేత జీవితానికి చిహ్నమైన వైష్ణవం ఈ మధ్య కాలంలో చాల ప్రాచుర్యం పొందుతున్నది. వైరాగ్య చిహ్నమైన శైవం ప్రాభవం తగ్గుతున్నది. దక్షిణ భారత దేశంలో ఒక ప్రముఖ శైవ శాఖ అయిన లింగాయతులు వేదాలు అపౌరుషేయాలనే వాదన అంగీకరించరు. ప్రాథమిక హిందూ విశ్వాసాలను సూత్రప్రాయంగా తిరస్కరి స్తారు. కర్మ సిద్ధాంతాన్ని నమ్మరు. అందుచేత హిందూ సంస్కృతి అంతా ఒక్కటే అనేది అబద్ధం.

అతి ముఖ్యమైన విషయం మరొకటి వుంది. జనాభాలో అధిక సంఖ్యాకులైన శూద్రులు అగ్ర వర్ణాల దేవతలను, అంటే పౌరాణిక దేవతలను ఆరాధించడం ఇటీవలి పరిణామం. గతంలో వీరు గ్రామ దేవతలను పూజించే వారు. ఈ ప్రజలది సమాంతర సంస్కృతి అని చెప్పవచ్చు. జానపద సంగీతం, నృత్యం, కథలు, ఇతర ప్రదర్శనా కళలే కాక రామాయణాలు, పురాణాలు కూడా వీరికి సొంతంగా వుండేవి. ఇవన్నీ అగ్రవర్ణ సంస్కృతికి భిన్నమైనవి.

వీరిని వేరుచేసి, అణచివుంచిన భూస్వామ్య సంస్కృతి బలహీనమయ్యాక, జీవన పరిస్థితులు మారుతుంటే ఈ శూద్ర కులాలన్నీ తమ సంస్కృతిని క్రమేణ వదులుకుంటూ, అగ్రవర్ణ సంస్కృతిని అందిపుచ్చుకునే, సాంస్కృతికంగా పైకి ఎగబాకే ప్రయత్నంలో వున్నాయి. అగ్రవర్ణాలు కూడా వీరిని, ముఖ్యంగా ఆర్థికంగా బలపడిన వారిని చాలవరకూ తమ సంస్కృతిలో కలుపు కుంటు న్నాయి. మతవాదులకు ఇది ఉపయోగపడుతున్నది. మతవాదులు మరో ప్రయత్నం చేస్తున్నారు. తమ రాజకీయాస్త్రమైన శ్రీరాముని హిందువుల ప్రధాన దేవతగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. నిరంతరం రాజకీయార్థిక ప్రాపకం కోసం తపించి పోయే వైష్ణవ జియ్యర్లు, శైవ ప్రవచన కారులు ఈ ప్రయత్నాలకు శతవిధాల సాయపడుతున్నారు. రాముని కథ పితృస్వామ్య సంస్కృతికి ప్రతీక.

ఇంగ్లీషు భాషకు భారతదేశం అందించిన ఒక పదం 'కమ్యూనలిజం' అనీ, మతం రాజకీయాలతో మిళితం కావడమే కమ్యూనలిజమని ఎం.ఎన్. శ్రీనివాస్[1] అభిప్రాయం.

'స్త్రీని పూజించడమే మన సంస్కృతి' అని ప్రవచనకారులు, పాలకవర్గాల వారు చెబుతుంటారు. గత సంస్కృతిని పరిశీలిస్తే ఇది పచ్చి అబద్ధమని తెలుస్తుంది. స్త్రీని గౌరవించమని చెప్పే ఆ నోటితోనే భర్త బట్టలుతికిన నీళ్ళు నెత్తిపై చల్లుకోవాలని, స్త్రీకి గాయత్రి మంత్ర జపం చేసే అర్హత లేదని చెబుతు న్నారు. స్త్రీలకు స్థానం లేని హిందూ మతానికి నేడు మహారాజ పోషకులు స్త్రీలే కావడం విషాదం. హిందూ ధర్మశాస్త్రాల గొప్పతనం గురించి ప్రవచన కారిణులు చెబుతుంటే బానిసలే బానిసత్వాన్ని సమర్థించడం అంటే ఏమిటో అర్థమవుతుంది. భూస్వామ్య సమాజం పెట్టుబడిదారీ సమాజంగా మారే క్రమంలో పురుషులకు లభించిన స్వేచ్ఛ సాపేక్షంగా స్త్రీలకు లభించలేదు. భూస్వామ్య వ్యవస్థ స్త్రీని భోగ్య వస్తువుగా, దాసిగా చూస్తే పెట్టుబడిదారీ వ్యవస్థలో స్త్రీ సరుకుగా, సేవకురాలుగా మారింది. పాలక వర్గాలు పైకి ఏమి

చెప్పినా 'లాభం తెచ్చేది ఏదైనా సరుకే' అనే నియమానికి కట్టుబడి స్త్రీని విలాస వస్తువుగా, ఆమె అందం వినిమయ సరుకుగా చేయడానికి కృషి చేస్తున్నది. ఇదంతా ఒక ఎత్తయితే స్త్రీని అణచి వుంచే శక్తిగా స్త్రీయే సమర్థంగా ఉపయోగ పడుతున్నదనే ఆరోపణ ఉంది.

## కులం.

హిందూ సంస్కృతిని కుల సంస్కృతి అనికూడా చెప్పవచ్చు. కులం అనేక విధాల మన సంస్కృతిని పట్టి పీడిస్తున్నది. ఈ కుల సమస్య చాల సంక్లిష్టమైనది. తీవ్ర భావోద్వేగాలతో ముడిపడి వున్నది. ఈ సమస్యను సాకల్యంగా చర్చించడం ఈ పుస్తకం పరిధికి మించిన పని. ఈ పుస్తకం ఉద్దేశ్యం ప్రధానంగా పెట్టుబడి దారీ వ్యవస్థలో సంస్కృతికి, మార్క్సిజానికి ఉండే సంబంధాన్ని క్లుప్తంగా చర్చించడం. భారత దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతున్నా కుల వ్యవస్థ కూడా బల పడుతుండటానికి కారణాలు ఏమిటి?

భూస్వామ్య సమాజంలో మానవులను బంధించి ఉంచిన ఆర్థిక, సామాజిక సంకెళ్లను కేపిటలిజం విచ్ఛిన్నం చేస్తుందని, మార్క్సిజం భావిస్తుంది. అయితే అదే సమయంలో కనబడని కొత్త సంకెళ్లతో బంధిస్తుందని కూడా భావిస్తుంది. కేపిటలిజం పాత కులవ్యవస్థకు పునాదిగా వున్న 'కులవృత్తి' వ్యవస్థను నాశనం చేసి జీవించడానికి వేతన కూలీగా పని చేయడం తప్ప మరో దారి లేకుండా చేసింది. అన్ని కులాలు ఇంచుమించుగా తమ కులవృత్తులను వదులుకుంటున్నాయి. నిజానికి ధర్మశాస్త్రాలలోని కుల, వర్ణ నియమాలు నూటికి నూరు శాతం గతంలో కూడా అమలు కాలేదని కుల అధ్యయన వేత్తల అభిప్రాయం. అనేక మంది శూద్రులు రాజ్యాలు ఏలడం దీనికి రుజువుగా చూపుతున్నారు. పాత సాహిత్యంలోని కుల పరమైన

నిబంధనలు దోపిడీని కొనసాగించడం కోసం అణచివేత భావజాలాన్ని ప్రజలపై రుద్దే ప్రయత్నమని, ఈ ప్రయత్నం చాల వరకూ సఫలమైనా, ఈ సాహిత్యంలో అతిశయోక్తులు ఎక్కువని వీరు చెబుతున్నారు.

కుల వ్యవస్థ యొక్క ప్రధాన లక్షణం, తీవ్ర అణచివేతతో కూడిన ఆధిపత్యం. దీని ద్వారా, అగ్ర వర్ణాలకు చెందిన పాలక వర్గాలు తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకున్నాయి. ఈ అణచివేతకు కేవలం బలప్రయోగం మాత్రమే కాక, భావజాల ప్రచారాన్ని జోడించారు. ఈ భావజాలం వంట పట్టించుకున్న నిమ్న కులాలు తిరగబడకుండా అణకువ, వినయ విధేయతలు ప్రదర్శించారు. అదే భావజాలాన్ని వంటబట్టించుకున్న అగ్రకులాల లోని పేదలు సైతం అహంభావ పూరిత ఆధిక్యతను ప్రదర్శిస్తూ కుల వ్యవస్థను సమర్థించారు. దీనివల్ల ఆర్థిక సమస్య మరుగునపడి, కుల వ్యవస్థ ప్రధానంగా సామాజిక హోదా సమస్యగా కనిపించ సాగింది. నిజానికి కుల వ్యవస్థ దోపిడీ, ఆధిపత్య సామాజిక సంబంధాలపై నిర్మించబడింది. కులాల వారీగా అదనపు విలువను పిండుకొని, పంపిణీ చేసేందుకు ఈ వ్యవస్థ నిర్మించబడింది.

కేపిటలిజం పాత అణచివేత, దోపిడీ విధానాల్లో మార్పుని, కొన సాగింపును రెండింటినీ అమలుచేస్తుంది. అందులో భాగంగా జాతి వివక్షత, కుల వివక్షతలను పెట్టుబడిదారీ పరిస్థితులకు అనుగుణంగా మలిచి ఉపయో గించుకుంటున్నది. తన ఆర్థిక విధానానికి ఆటంకమైన మేరకు కుల వ్యవస్థను మార్చి వేసి బలహీనం చేసింది. అంటే ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల్లో కుల వ్యవస్థ అడ్డు పడుతుంది కాబట్టి అక్కడ కుల వివక్షకు చోటు లేకుండా చేసింది. ఆ రంగాల్లో చౌకగా వేతన శ్రామికులు లభించడమే కేపిటలిజానికి అత్యంత ఆవశ్యకం. అంతే గాక కొనుగోలు దారులుగా ప్రజలకు, శ్రామికులకు కుల పట్టింపులు ఉండకూడదు. ఈ సందర్భాలలో ఆ ప్రజల, శ్రామికుల కుల రాహిత్యం దానికి లాభ దాయకం. పూర్వం మన దేశంలో అగ్రవర్ణాల

సమక్షంలో శూద్రులు కాలికి చెప్పులు, తలకు పాగా, భుజంపై కండువా ధరించడం, వాహనాలపై ప్రయాణించడం, కుర్చీ, బల్ల మొ. వాటిపై కూర్చో వడం నిషిద్ధం. ఈ నిషేధం ఆయా వస్తువుల గిరాకీని తగ్గిస్తుంది. అందుచేత పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ నిబంధనలన్నిటినీ రద్దు చేసింది. కాని ఓటర్లుగా ఆ శ్రామికులు వర్గాలుగా రూపొందకుండా కులాలవారీగా చీలిపోవడం కూడా దానికి చాలా అవసరం. కులాలుగా చీలిపోయిన ప్రజలు తన వర్గ పాలనకు ప్రమాదకారులు కాలేరని పెట్టుబడిదారీ వర్గానికి బాగా తెలుసు. అందుచేత కేపిటలిజం ఆర్థిక రంగంలో కులం పాత్రను తగ్గించి, రాజకీయ రంగంలో దానికి ప్రధాన పాత్రను కల్పించింది.

మన దేశంలో నయా హిందుత్వ వాదుల వాదన ప్రకారం కులం అనేది కేవలం 'అణచివేత లేని శ్రమ విభజన' మాత్రమే! వారు కుల సంబంధాలలోని అంతస్తుల వారీ హోదాలు, దోపిడీలను మరుగు పరిచే ప్రయత్నం చేస్తారు. అదే సమయంలో నయా ఉదారవాదం కుల వ్యవస్థలోని సానుకూల అంశాలను ప్రముఖంగా పేర్కొంటుంది. వెనుకబడిన దేశాల్లో పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి కులతత్వం బాగా ఉపయోగ పడుతుందని నయా ఉదారవాద సిద్ధాంతులు వాదిస్తారు. ఎలాగంటే ఎవరైనా పారిశ్రామిక వేత్తకు అతని కులస్తులందరూ కులాభిమానంతో సహకరించి దేశ పారిశ్రమికీకరణకు సాయ పడతారట. అయితే పెట్టుబడిదారీ విధానంలో ఉండే పోటీ తత్వం వల్ల అన్నదమ్ములే గొంతులు కోసుకొనే పరిస్థితులను మనం చూస్తున్నాం. ఈ విషయంలో కమ్యూనిస్టులుగా మనం గ్రహించవలసిన ముఖ్య విషయం ఒకటుంది. కులాన్ని ఉద్ధరిస్తానంటూ బయలు దేరిన నాయకుకులు డబ్బు, హోదా, పలుకుబడి మొ. విషయాల్లో తమతో సరితూగే ఇతర కులాల వారితో పెళ్ళి సంబంధాలు కలుపుకుంటున్నారు. సెలెబ్రిటీలు కుల మతాలకు అతీతంగా పెళ్ళి చేసుకుంటున్నారు. ఒక మతంపై ద్వేషం ప్రాతిపదికగా మనుగడ సాగిస్తున్న రాజకీయ పార్టీ నాయకులు తాము ద్వేషిస్తున్న మతానికి చెందిన

వారితో వైవాహిక సంబంధాలు ఏర్పరచుకుంటున్నారు. ద్వేషించబడుతున్న కుల, మతాలకు చెందిన కొంతమంది ద్వేషిస్తున్న పార్టీలో పనిచేస్తున్నారు. మొత్తంమీద పెట్టుబడిదారులు, ధనికులకు కుల పట్టింపు, కులతత్వం లేవని అర్థమవుతుంది. వారికున్నది ధనిక వర్గ స్పృహ మాత్రమే. అదే సమయంలో శ్రామిక జనులలో కుల స్పృహ ఉన్నంతగా వర్గ స్పృహ లేదు.

ఒక పక్క సాంప్రదాయ అర్థంలో కుల వ్యవస్థ బలహీనం అవుతున్నా, సామాజిక, రాజకీయ జీవితంలో కుల ఐడెంటిటీ ప్రాధాన్యత విపరీతంగా పెరుగుతోంది. కులంలోనే పెళ్ళి కొనసాగుతోంది. కుల సంఘాలు గౌరవప్రద వ్యవహారంగా మారి వికసిస్తున్నాయి. ప్రభుత్వాలే కుల స్పృహను పెంచడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. రాజకీయ జనసమీకరణకు, ఎన్నికలకు కులాన్ని చాల అవసరమైన ఇరుసుగా మార్చేశారు.

కుల సమస్యలో ఆర్థిక కారకాన్ని నొక్కి చెప్పడం దాని లోని సాంస్కృతిక అంశాలను తిరస్కరించడం కాదు. నేడు జరుగుతున్న విధంగా దాన్ని కేవలం సాంస్కృతిక సమస్యగా చూడరాదని చెప్పడం కోసమే!

ఆర్థికంగా ఎదుగుతున్న దిగువ కులాల వారు ఉన్నత హోదా చిహ్నాల్ని సొంతం చేసుకోవడం ద్వారా సామాజిక హోదాల్లో ఉన్నత స్థానం సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రక్రియనే 'సంస్కృతీకరణ' అంటున్నారు. ఈ ప్రక్రియలో సాధ్యమైన మేరకు ఉన్నతకులాల సాంప్రదాయాలు, ఆచారాలు, విశ్వాసాలు, జీవన విధానాలను స్వీకరించడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో ఇలా దిగువ కులాలకు చెందినవారి సంస్కృతీకరణకు ఒకటి రెండు తరాలు పడుతుంది. ఆర్థిక అభ్యున్నతి, రాజకీయాధికార సాధన, విద్య, నాయక త్వం, కొత్త భావాలు, విలువలను గ్రహించడం, తమ అంతస్తును పెంచుకో వాలనే బలమైన వాంఛ మొదలైనవన్నీ సంస్కృతీకరణకు దోహదపడ్డాయని ఎం. ఎన్. శ్రీనివాస్ అభిప్రాయం.

రాజకీయం కులాన్ని పూర్తిగా ఆవహించింది. కుల రాజకీయాన్ని సంస్కృతిగా మార్చితే, అప్పుడు ఆ సంస్కృతిలో రాజకీయార్ధ శాస్త్రానికి, దోపిడీ వ్యతిరేక వర్గ పోరాటానికి స్థానం ఉండదు. వాటితోపాటు పెట్టుబడి, కుల, వర్గ విభజనలు, బాహ్య రాజకీయ ఆధిపత్యం, రాజకీయ ఘర్షణలు, సంస్కృతిగా మారిన రాజకీయ పరిధిలోకి రావు. అటువంటి ఘర్షణలను వివరించడం మాత్రమే సంస్కృతి బాధ్యత అవుతుంది.

Notes:

1. ఎం. ఎన్. శ్రీనివాస్ కుల సమస్యపై లోతైన అధ్యయనాలు జరిపిన పరిశోధకుడు.

# 6. సంస్కృతి- ఆధిపత్యం

## (Culture and Domination )

ఈ రకమైన సాంస్కృతిక విశ్లేషణా సంప్రదాయం యొక్క మూలాలు మార్క్స్ రచనల్లో ఉన్నాయి. మార్క్స్, ఎంగెల్స్‌లు కలిసి రచించిన 'జర్మన్ ఐడియాలజీ' లోని ఈ వాక్యాలు సుప్రసిద్ధం. "ప్రతి యుగంలోనూ పాలకవర్గ భావాలే పాలించే భావాలు. అంటే సమాజాన్ని పాలించే భౌతిక శక్తి అయిన వర్గమే ఆ సమాజ పాలక మేధో శక్తి కూడా! భౌతిక ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కల వర్గమే మేధో ఉత్పత్తిసాధనాలపై యాజమాన్యం కలిగి ఉంటుంది. అందుచేత మామూలు మాటల్లో చెప్పాలంటే మేధో ఉత్పత్తి సాధనాలు లేని వారి భావాలు అవి ఉన్నవారి భావాలకు లోబడి ఉంటాయి. పాలక భావాలు ఆధిపత్య పాదార్థిక సంబంధాల బావ రూప వ్యక్తీకరణ (ideal expression) తప్ప వేరేమీ కాదు. అంటే భావాలుగా గ్రహించిన ఆధిపత్య పాదార్థిక సంబంధాలన్న మాట. ఆ పాదార్థిక సంబంధాలే ఒక వర్గాన్ని పాలక వర్గాన్ని, దాని భావాలను ఆధిపత్య భావాలను చేస్తాయి."

ఇందులో రెండు విషయాలున్నాయి. ఒకటి సాంస్కృతిక ఆధిపత్యం కాగా రెండోది ఆధిపత్యానికి గల ఆర్థిక లేదా వర్గ ప్రాతిపదిక. ఇటువంటి ఆధిపత్యానికి ఒక చక్కని ఉదాహరణ కర్మ సిద్ధాంతం, కుల వ్యవస్థలు. చారిత్రిక పరిస్థితుల నుండి పుట్టిన వీటిని ప్రజలను అణచి ఉంచడానికి సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. మనుషులు తమ బాధలకు కారణాలను వెతికే క్రమం లో పుట్టినదీ కర్మ సిద్ధాంతం. దీన్ని ఉపయోగించుకుని దోపిడీ, అణచివేతలు, వారి పూర్వ జన్మల కర్మ ఫలితమని ప్రజలు నమ్మేలా పాలకులు నూరిపోశారు. క్రైస్తవం అయితే మనుషుల బాధలకు కారణం ఆదాము, అవ్వలు చేసిన ఆది పాపం (Original Sin) కారణం అంటుంది. బౌద్ధం కోరికలే దుఃఖానికి కారణం అంటుంది. ఇవన్నీ కూడా పీడితులకే వర్తిస్తాయి. అలాగే ఇప్పుడు నిరుద్యోగానికి కారణాలు అధిక జనాభా, నైపుణ్యాల కొరత

అని చెప్పి నమ్మిస్తు న్నారు. ఈ సమాజంలో సార్వత్రిక మారకపు విలువ సాధనమైన డబ్బు మనిషి ప్రాణాలకు ధర కట్ట కలుగుచున్నది. ఇది అసహజమని ఎవరూ అనుకోని పరిస్థితి.

'సాంస్కృతిక ఆధిపత్యం' ఆర్థిక/వర్గ ఆధిపత్యాన్ని నేరుగా, ఉన్నదున్న ట్లుగా ప్రతిబింబించదు. ఉదాహరణకు మన దేశంలో అగ్ర కులాలకు చెందిన పేదలు కూడా ఆర్థిక, వర్గ ఆధిపత్యం లేక పోయినా సాంస్కృతిక ఆధిపత్యం కలిగి ఉండటం చూడవచ్చు.

అయితే మార్క్యూజ్,[1] హేబర్‌మాస్[2] ల సూత్రీకరణల ప్రకారం 'కార్మిక వర్గం పై బూర్జువా సంస్కృతి ఆధిపత్యం' భావన ఇక చెల్లదు. వారి దృష్టిలో 'మలి దశ (అభివృద్ధి చెందిన) కేపిటలిజంలో వర్గాలు, వర్గ చైతన్యం విచ్ఛిన్నమై మసకబారి పోయాయి. ఈ దశలో కేపిటలిస్టు పాలకవర్గాలు 'వినిమయ తత్త్వం' అనే తప్పుడు చైతన్యాన్ని ప్రజలపై రుద్దే 'సాంస్కృతిక ఆధిపత్య రూపం' నెలకొంది' అని మార్క్యూజ్ వక్కాణిస్తాడు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం, మీడియాలను ఉపయోగించడం ద్వారా వినిమయ తత్వాన్ని వ్యాపింపజేయడం జరుగుతోంది. హేబర్‌మాస్ కూడా సంప్రదాయ వర్గాధిపత్య భావన ప్రాధాన్య తను తగ్గించి, దానికి బదులుగా మలి దశ కేపిటలిజంలో రాజ్యం, దాని పాలనా యంత్రాంగాలు సాంకేతిక, రేషనల్ భావజాలాలను ప్రజలపై రుద్ది తద్వారా సంస్కృతిలోకి ప్రజల జీవితంలోకి చొరబడుతున్నాయని భావించాడు.

ఆల్తూజర్ కూడా 'పునాది—ఉపరి నిర్మాణాన్ని నిర్ణయిస్తుంది' అనే వ్యాఖ్యానం పట్ల విమర్శనాత్మక దృక్పథాన్ని కలిగి ఉన్నాడు. అయితే 'తనను తాను పునరుత్పత్తి చేసుకునే ఆధిపత్య వర్గం' భావజాలం, సంస్కృతులను నియంత్రిస్తుంది అనే భావనను సమర్థించాడు. 'ఉత్పత్తి సంబంధాలను పునరుత్పత్తి చేసే సాధనంగా రాజ్య భావజాల యంత్రాంగం పని చేస్తుంది'

అనే భావన ఆల్తూజర్ సూత్రీకరణల్లో సంస్కృతికి గల కీలక పాత్రను సూచిస్తుంది.

అయితే ఎవరు ఎన్ని సూత్రీకరణలు చేసినా, మళ్ళీ మళ్లీ సూత్రీకరించినా, అతి కీలకమైన 'ఆధిపత్య భావజాలం' భావన అలాగే నిలిచి ఉంటుందని అనేక మంది వాదిస్తున్నారు. సమాజంలోని ప్రధాన వైరుధ్యాలను మరుగు పరిచిన ఫలితంగా 'ఆధిపత్య వర్గాలకు ప్రయోజనం, అధీన వర్గాలకు జడ స్తబ్దత' అనేవి ఈ భావనలో ఉన్నాయని వీరి వాదన.

'ఆధిపత్యంగా సంస్కృతి' అనే దాన్ని సమర్థించే వారు మీడియాను 'సాంస్కృతిక పరిశ్రమ' గా వర్ణించారు. ఈ సాంప్రదాయంలో సంస్కృతిని దానికదే ఒక ఆర్థిక సంస్థ (institute) గా పరిగణిస్తారు. సంస్కృతిని పరిశ్ర మగా భావించే వారిని మార్క్సిస్టు క్రిటికల్ సంప్రదాయానికి చెందిన వారుగా పరిగణించవచ్చు. ఇందులో 'ఆధిపత్య ఆర్ధిక వర్గం' వెనక్కు వెళ్లి ఆధిపత్యం, హెజమని భావనలు ప్రముఖంగా ముందుకు వచ్చాయి.

మూలంలో మార్క్స నుండి వచ్చిన ఒక విశ్లేషణా పాయ సంస్కృతిని, మరీ ముఖ్యంగా మతం, భావజాలాలను సమాజ ప్రతిఫలనంగా, లేదా చట్టబద్ధం చేసే, లేదా సమ్మతిని సృష్టించే యంత్రాంగంగా పరిగణిస్తుంది.

సమాజాన్ని ఒక క్రమపద్ధతిలో నడపడానికి చాలా పరిస్థితులు కావాలి. అధికారాన్ని నియమబద్ధం చేయడం, దోపిడీ చేయబడుతున్నామనే ఫీలింగ్ రాకుండా చేయడం అన్నింటి కన్నా ముఖ్యమని మార్క్స, వెబర్ లు భావించారు. అంతేకాదు ఏ నిర్దిష్ట సామాజిక శ్రమ విభజన నిర్మాణం అయినా ఈ పరిస్థితు ల్లో అనిశ్చితులను సృష్టిస్తుందని మార్క్స, ఎంగెల్స్‌లు ఉద్ఘాటించారు. ఈ అనిశ్చితాల వల్ల ఏ సామాజిక శ్రమ విభజన కూడా వాటిని నియంత్రించ కుండా మనలేని స్థితి ఏర్పడుతుంది. అందుచేత సామాజిక వ్యవస్థ నిర్మాణం, నిర్వహణలు శ్రమ విభజన, అధికారాన్ని

క్రమబద్ధీకరించడం, నమ్మకాన్ని, అర్థాన్ని, చట్టబద్ధతను నిర్మించడం అనేవాటన్నిటి పైనా ఆధారపడి ఉంటుందని వారు భావించారు.

Notes:

1.Herbert Marcuse- Important member of Frankfurt school.

2.Jurgen Habermas-(B.18.6.1929.) German Marxist philosopher and sociologist.

# 7. పెట్టుబడిదారీ సంస్కృతి- మార్క్సిజం

సంస్కృతి గురించి మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రత్యేకంగా ఏమీ రాయలేదు. అయితే సంస్కృతి ఒక అధ్యయన శాఖగా, ఒక ఉద్యమంగా మార్క్సిజం నుంచే పుట్టింది. కార్మికోద్యమ వైఫల్యాలకు కారణాలు వెతికే మార్క్సిస్టుల ప్రయత్నం నుండి, మరీ ముఖ్యంగా న్యూ లెఫ్ట్ ఉద్యమం నుండి సాంస్కృతిక అధ్యయనాల శాస్త్రం ఆవిర్భవించింది. ఇది ఆరంభం నుండి బ్రిటీషు కార్మికోద్యమ రాజకీయాలతో సన్నిహిత సంబంధాలు కలిగి వుంది.

సాంస్కృతిక అధ్యయనం ఒక విప్లవ రాజకీయ కార్యక్రమం కాదు. మరే ఇతర రాజకీయ కార్యాచరణకు ప్రత్యామ్నాయం కూడా కాదు. అది సాహిత్యం, సామాజిక చరిత్ర, రాజకీయ మార్పులను, వాటి మధ్య పరస్పర సంబంధాలను, ప్రభావాలను విమర్శించి, విశ్లేషిస్తుంది. సమాజాన్ని, సామాజిక జీవితంలో పుట్టుకొచ్చిన విలువలు, సాంప్రదాయాలను అర్ధం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా చరిత్రలోను, వర్తమానంలోను సామాజిక మార్పులో 'సంస్కృతి' నిర్వహిస్తున్న పాత్రను అధ్యయనం చేస్తుంది. ఈ సాంస్కృతిక అధ్యయనాలు శాఖోపశాఖలుగా విస్తరించాయి. కొన్ని శాఖలు వామపక్ష రాజకీయాలకు వ్యతిరేకంగా నిలిచాయి.

సంస్కృతి పాదార్థిక జీవన ప్రక్రియలో అంతర్భాగం. అంటే మన జీవితావసరాలను ఉత్పత్తి, పంపిణీ, వినిమయం చేసే క్రమంలో మాత్రమే సంస్కృతి పుట్టి అభివృద్ధి చెందుతుంది. అది ఉత్పత్తి, పంపిణీ, వినిమయ ప్రక్రియ నుండి పుట్టినా తిరిగి ఆ ప్రక్రియ పై ప్రభావం చూపుతుంది. భౌతిక జీవితంతో సంబంధం లేని ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితం ఉండదు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితం లేకుండా మానవ జీవితం ఉండదు. జంతువు లకు భౌతిక జీవితం ఉంటుంది గాని ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవితం ఉండదు. ఆధునిక ప్రపంచంలో మార్క్సిజాన్ని విస్మరించి మనుషుల

పాదార్థిక జీవితాన్ని కూలంకషంగా, సమర్ధవంతంగా విశ్లేషించడం సాధ్యం కాదు. పాదార్థిక జీవిత క్రమంలో జనించే సంస్కృతిని అర్థంచేసుకోవడానికి పాదార్థిక జీవితాన్ని సక్రమంగా అర్థం చేసుకోవాలి. అందుచేత మార్క్సిజం సాయం లేకుండా సంస్కృతిని సక్రమంగా విశ్లేషించలేము.

సంస్కృతి సారం కేవలం సంస్కృతిలో మాత్రమే ఉండదు. అంటే సంస్కృతి మరి దేనితో కూడా సంబంధం లేని సర్వ స్వతంత్ర వ్యవస్థ కాదు. సాంస్కృతికేతర పాదార్థిక జీవితంతో సంబంధంలో మాత్రమే అది ఉంటుంది. సంస్కృతి మానవ జీవితంలో భాగం. మరొక విధంగా చెప్పుకోవాలంటే అది జీవన విధానం. కొన్ని విలువలు, నియమాలు, విధానాలతో జీవించడం. కేవలం బతికి ఉండటం కోసం, తన జాతి కొనసాగడం కోసం జంతువుల్లా ప్రాకృతికంగా జీవించడం సంస్కృతి కాదు. అయితే మానవులు సాంస్కృతిక జీవితం నిర్మించుకోవాలంటే ముందు వారు బతికి వుండాలి. కనీస జీవపరమైన అవసరాలు తీర్చుకోవాలి. ఇతర జంతువులకు భిన్నంగా మానవులు సమిష్టి శ్రమ ద్వారా తమ జీవితావసరాలను తీర్చుకునే ప్రయత్నంలోనే సంస్కృతి పుట్టుకొస్తుంది. జీవితావసరాలను తీర్చుకోవడానికి చేసే పనులను 'ఆర్థిక కార్యకలాపాలు' అంటాము. ఈ ఆర్థిక జీవితం నుంచే సంస్కృతి పుడుతుంది.

సంస్కృతిని కొంత మంది విశ్లేషకులు భావజాలంగా పరిగణిస్తున్నారు. సాంస్కృతిక ఆచరణలకు మూలాలు ప్రధానంగా భావజాల రూపంలో ఉన్నా, భావజాల పరిధిలోకి రాని, భావజాల పరమైన వివరణ ఇవ్వలేని ఆచారాలు, తంతులు కూడా సంస్కృతిలో ఉంటాయి. సంస్కృతి ప్రపంచ ఉత్పత్తి వ్యవస్థలలో పాతుకుని ఉంటుంది. అది వాటిలో, వాటిని నిర్మించే భాగంగా ఉంటుంది. ఆర్థిక ప్రక్రియలు, శాస్త్ర-సాంకేతికతలు, సంస్థలు, రాజ్య రాజకీయాలు, సాంస్కృతిక కార్యకలాపాల మధ్య సంక్లిష్ట పరస్పర చర్యలు ఉంటాయి. సంస్కృతిని ఆర్థిక, రాజకీయ తదితర రంగాల నుండి పూర్తిగా

విస్పష్టంగా వేరుచేసి చూపించలేము. ఆ కార్యకలాపాలను నిర్వహించే తీరును సంస్కృతి నిర్ణయిస్తుంది. ఉదాహరణకు ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయం సాగుతోంది. అది ఆర్థిక కార్యకలాపం. అయితే ఈ వ్యవసాయం చేసే పద్ధతుల్లో కేవలం సాంస్కృతిక మైన తేడా ఉంటుంది. ఉదాహరణకు వ్యవసాయ ఉపకరణాలు, పని పద్ధతులు భిన్నంగా ఉంటాయి. మన ప్రాంతాల్లోవాడే నాగలి, కొడవలి, ఎడ్లు మొ. ఇతర ప్రంతల్లో వాడే వాటికి భిన్నంగా ఉంటయి. కొన్ని చోట్ల పొలం దున్నడానికి గుర్రాలను, గాడిదలను వాడతారు. ఇటీవలి వరకూ మన రైతులు ఏరువాక, కోబలి మొదలైనవి పాటించారు. రైతుల మధ్య ఉండే ఆర్థికేతర సంబంధాలు సాంస్కృతిక పరమైనవి. ఇవి ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి భిన్నంగా ఉంటాయి. ఈ సాంస్కృతిక సంబంధాలు లేకుండా శుద్ధమైన ఆర్థిక వ్యవసాయ సంబంధాలు ఉండవు. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించిన ఆధునిక కాలంలో రైతులు, కూలీలు, వ్యాపారులు, వినియోగ దారుల మధ్య డబ్బు సంబంధాలు-డబ్బుతోనే వస్తు సేవల మారకం- తప్ప మరెటువంటి సంబంధాలు లేకున్నా, ఆ డబ్బు సంబంధం కూడా కేవలం ఆర్థిక సంబంధం మాత్రమే కాక ఒక రకమైన సంస్కృతి కూడా.

గత సమాజాల్లో వ్యక్తుల జీవితంపై సంస్కృతి ప్రభావం ఎక్కువని, ఇప్పుడు సాంస్కృతిక విలువలు నశిస్తున్నాయని అనడం తరచూ వినపడు తుంది. సంస్కృతికి మనం చెప్పుకునే నిర్వచనం వల్ల అలా అనిపిస్తుంది. మత విశ్వాసాలతో ముడిపడిన ఆచారాలు, ఆచరణలు, అలవాట్లను గతంలో ప్రజలు అతిక్రమించ కుండా అమలు చేసే వారనే మాట నిజమే! అయితే అవి మాత్రమే సంస్కృతి కాదు. నిజానికి కేపిటలిజంలోనే సంస్కృతి ప్రభావం చాల ఎక్కువ. ఇప్పుడు అమలవుతున్నది సంస్కృతిలా అనిపించని సంస్కృతి. ఉదాహరణకు డబ్బు సంస్కృతి. కేపిటలిజం తనను తాను ఒక సంస్కృతిగా వ్యక్తం చేసుకుంటున్నది. అందుచేత చాల మంది విశ్లేషకులు కేపిటలిజం కేవలం ఒక ఉత్పత్తి వ్యవస్థ మాత్రమే కాదని, అది ఒక సంస్కృతి కూడా అని

చెబుతున్నారు. కేపిటలిజంలో సమాజం, రాజకీయాలపై ఒక క్రమపద్ధతిలో ప్రభావం చూపే విధంగా ఆర్థిక ప్రక్రియల, సంబంధాల వ్యవస్థీకరణ ఉంటుంది. పెట్టుబడి ఒక సామాజిక సంబంధం. అయితే అది శత్రు పూరిత సామాజిక సంబంధం.

ఒక విధంగా చూస్తే సంస్కృతి అనే భావన కేపిటలిజంపై విమర్శ నుండి పుట్టిందని చెప్పవచ్చు. సంస్కృతి సమిష్టి జీవన కార్యకలాపాల ఫలితం. అది తిరిగి మన జీవన కార్యకలాపాలపై తన ప్రభావం చూపుతుంది. అయితే మార్పుకు వ్యతిరేకులైన సంప్రదాయవాదులు, సమూల మార్పుని కోరే రాడికల్ విమర్శకులు ఇరువురూ కూడా కేపిటలిజాన్ని సంస్కృతికి శత్రువుగా పరిగణి స్తారు. అయితే కేపిటలిజాన్ని, సంస్కృతిని ఆలోచనల్లో విడదీయగలం కాని వాస్తవంలో అలా విడదీయడం అసాధ్యం. కేపిటలిజమే ఒక సంస్కృతి, ఒక జీవన విధానం. ఆ సామాజిక జీవన ఆచరణలను వాటిని పుట్టించిన విశాల ఆర్థిక, సామాజిక సంబంధాల నిర్మాణాలనుండి వేరు చేయలేము. కేపిటలిజం పని విధానం, దాని చలన నియమాలను అధ్యయనం చేయకుండా కేపిటలిస్టు సంస్కృతిని అర్ధం చేసుకోలేము.

సాంస్కృతిక అధ్యయనాలపై మార్క్స్ రచనల ప్రభావం తొలి రోజుల నుండి అతి ప్రధానమైనది. ప్రపంచ వ్యాప్తంగా సాంస్కృతిక అధ్యయనాలకు ప్రాచుర్యం కల్పించిన రేమండ్ విలియమ్స్(1921-1988) మార్క్స్ రచనల వల్ల ప్రభావితుడైన వాడే. 'మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల నాకు ఆసక్తి ఎందుకంటే సోషలిజం, కమ్యూనిజం ఇప్పుడు చాలా అవసరం' అని చెప్పాడు. అయితే మార్క్సిస్టులమని చెప్పుకుంటున్నవారు మార్క్స్ సిద్ధాంతానికి చెబుతున్న భాష్యా లను, అర్ధం చేసుకుంటున్న తీరును ఆయన వ్యతిరేకించాడు.

విలియమ్స్ ప్రతిపాదించిన మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం ప్రకారం సామాజిక, సాంస్కృతిక జీవితం వైవిధ్య భరితమైనదే కాక సంక్లిష్టమైనది కూడా! సామాజిక జీవితంలో నిరంతరాయంగా మార్పులు జరుగు

తుంటాయి. అయితే ఈ మార్పు ముందే నిర్ణయమైన విధంగా కచ్చితమైన పద్ధతిలో జరగదు. సమాజం మారే క్రమంలో యాదృచ్ఛిక సంఘటనలు జరుగుతాయి. ఆ విషయం గుర్తించి తీరాలని ఆయన వాదన. అంటే సామాజిక పరిణామంలో యాంత్రిక చలనం, యాంత్రిక మార్పు, నియతి వాదాలను విలియమ్స్ తిరస్కరించాడు. సంస్కృతికి పరిమిత స్వయం ప్రతిపత్తి ఉంటుంది. అది ఆర్థిక జీవితం నుండి జనించినా, దాన్నుంచి సాపేక్షంగా స్వతంత్రంగా ఉంటుంది. అయితే ఆర్థిక నిర్మాణాలు, వాటి పర్యవసానంగా ఏర్పడే సామాజిక సంబంధా లను దారిచూపే తాడుగా (గైడింగ్ థ్రెడ్), సంస్కృతి ఆ తాడుకు అల్లుకున్న తీగగా అర్థం చేసుకోవాలని విలియమ్స్ ప్రతిపాదించాడు. ఇక్కడ తాడులా పనిచేసే ఉత్పత్తి వ్యవస్థ లేకుండా దానిపై అల్లుకునే తీగలాంటి సంస్కృతి ఉండదని అర్థం. అలాగే తీగలా అల్లుకున్న సంస్కృతి లేకుండా దారి చూపే తాడు లాంటి ఉత్పత్తి వ్యవస్థ ఒక్కటీ విడిగా ఉండదు. అటువంటి మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతాన్ని నిర్మించడానికి కృషి చేశాడు. ఆయన కొన్ని మార్క్సిస్టు భావనలకు, ముఖ్యంగా చారిత్రక భౌతికవాదానికి తిరిగి భాష్యం చెప్పే ప్రయత్నం చేశాడు. పునాది ఉపరి నిర్మాణానికి పరిమితులు విధిస్తుంది గాని, నేరుగా నిర్ణయించదని ఈయన వాదన. మార్క్స్ వాడిన 'డిటర్మిన్' అనే అర్థాన్ని ఇచ్చే జర్మన్ మాటకు 'నిర్ణయించు' అనే అర్థంతో పాటు 'పరిమితులు విధించు' అనే అర్థం కూడా వుందని నిరూపించాడు. మార్క్స్ ఈ రెండో అర్థంలోనే ఆ మాట వాడాడని విలియమ్స్ వాదన.

రేమండ్ విలియమ్స్ మార్క్స్ సిద్ధాంతం పరిధిలోనే 'పునాది- ఉపరి నిర్మాణం' అనే విభజనను అధిగమించేందుకు తీవ్ర ప్రయత్నం చేశాడు. ఆయన ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి రెండు వేరువేరు రంగాలు కావని, ఏకీకృత సామాజిక-సాంస్కృతిక ఆచరణ యొక్క రెండు పార్శ్వాలని భావించాడు.

ఆ నాటికి మార్క్సిస్టులుగా ప్రసిద్ధులైన వారిపట్ల ఏవగింపుతో తను మార్క్సిస్టుగా పిలిపించు కోవడానికి ఇష్టపడక పోయినా చివరివరకూ మార్క్స్ సిద్ధాంతానికి నిబద్ధుడై వున్నాడు. 1975 లో ఆయన ఇలా చెప్పుకున్నాడు. 'అది కేపిటలిస్టు సమాజ విధ్వంసాన్ని కోరుకునే అర్థంలో అయితే నేను చారిత్రక భౌతిక వాదిని అని చెప్పుకోవడానికి ఎంత మాత్రం తటపటాయించను'. ' నేను, మొత్తం సంస్కృతికి తన పరిధిని విస్తరింప చేసిన మార్క్సిజం అనే ఉద్యమంలో భాగ స్వామిని. ఆ ఉద్యమానికి చెందిన వాడిగా వుండటం నాకు సంతోషం' అని కూడా చెప్పుకున్నాడు.

ఎడ్వర్డ్ పి. థాంప్సన్ అనే బ్రిటీషు మార్క్సిస్టు సంస్కృతికి, మానవ అనుభవానికి ప్రాధాన్యత కల మార్క్సిజం కావాలని వాదించాడు. రాజకీయంగా స్టాలినిజాన్ని, సైద్ధాంతికంగా ఆల్తూజర్ స్ట్రక్చరిలిజంను వ్యతిరేకించాడు. కొలకోవిస్కీ వంటి వారు మార్క్స్ పై చేసిన దాడులను తీవ్రంగా ప్రతిఘటించాడు.

థాంప్సన్ సిద్ధాంతం సోషలిస్టు మానవతావాదం. దీనికి ప్రాతిపదిక ఎలియనేషన్, సరుకు ఆరాధన, మూర్తీ కరణ గురించి మార్క్స్ చేసిన రచన ల్లోను అలాగే మనిషి, చరిత్రల గురించిన మార్క్స్ భావనల్లోను ఉందని ఆయన వాదన. థాంప్సన్ అభిప్రాయం ప్రకారం సోషలిస్టు మానవతా వాదంలో సోషలిస్టు సిద్ధాంతానికి, దాని ఆకాంక్షకు నిజమైన మనుషులే కేంద్రంగా ఉంటారు. అంతేగాని 'పార్టీ, మార్క్సిజం-లెనినిజం-స్టాలినిజం, రెండు శిబిరాలు, కార్మికవర్గ అగ్రగామి దళం' వంటి ఊదరగొట్టే అమూర్తీకరణలు కాదని వాదించాడు. సోషలిస్టు మానవతా వాదం కమ్యూనిజం యొక్క విప్లవాత్మక దృక్పథాన్ని పునరుద్ఘాటిస్తుంది. నిజమైన మనుషులకు విప్లవం తేగల శక్తి ఉందని విశ్వసిస్తుంది గాని, 'కార్మికవర్గ నియంతృత్వం' మాత్రమే ఏకైక మార్గమని నమ్మదు.

మార్క్సిజాన్ని కొంతమంది తత్వవేత్తలు 'సంబంధాల తత్వశాస్త్రం' అంటారు. ఒక సైద్ధాంతిక విధానంగా మార్క్సిజం ఆరంభం నుండి, సామాజిక సంస్కృతికి, మానవ ఆచరణకు, ఇతర అంశాలకు మధ్య పరస్పర సంబంధాల గురించి భౌతికవాద వివరణను అభివృద్ధి చేయడం మీద దృష్టి పెట్టింది. ఈ సంబంధాలను ఎలా చిత్రించారనే దానిమీద వాదోపవాదాలన్నీ కేంద్రీకృతం అయ్యాయి. సామాజిక జీవితం యొక్క సాంస్కృతిక లక్షణాలు పునాదిచే నిర్ణయించబడే నిష్క్రియాత్మక ఉపరి నిర్మాణంగా పరిగణించాలా? లేక మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంత వేత్తలు వాదిస్తున్నట్లుగా సామాజికాభివృద్ధి యొక్క స్వభావం, మార్గాలపై సాంస్కృతిక విషయాలకు నిర్ణయాత్మక ప్రభావం ఉందా? ఈ రెండో భాష్యం వల్ల మార్క్సిజం సంపద్వంతము అవుతుంది కదా!

ఎంగెల్స్, ప్లెఖనోవ్‌ల ద్వారా అభివృద్ధి చెందిన 'గతితార్కిక భౌతిక వాదం' ప్రకారం సంస్కృతి సామాజికార్థిక కారకాలచే నిర్ణయించబడుతుంది. దీనికి స్పందనగా మానవతావాదం, రూపవాదాలు భావాలు, జ్ఞానం, భాష, భావజాలం, చైతన్యాలకు సామాజికంగా మరింత స్వయం ప్రతిపత్తి, మరింత ప్రాధాన్యత ఉన్నాయని వాదించాయి.

సంస్కృతికి, సమాజానికి మధ్య గల సంబంధం గురించి ప్రత్యామ్నాయ విశ్లేషణలు మార్క్సిస్టు సిద్ధాంతంలో గల ఖాళీలను, అడ్డంకులను ఎత్తి చూపుతాయి గాని, సమాజం గురించి మార్క్సిజం చేసిన ప్రాథమిక ప్రతిపాదనలను తిరస్కరించవు. సామాజిక పరిస్థితులే సాంస్కృతిక ఆచరణలకు ముడిసరుకు.

మార్క్స్ సిద్ధాంతంలో సంస్కృతి ప్రాధాన్యత గురించిన విశ్లేషణ మార్క్స్ సుప్రసిద్ధ సూత్రీకరణతో ప్రారంభమవు తుంది. అది "ఉనికిని నిర్ణయించేది చైతన్యం కాకపోగా సామాజిక ఉనికే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది." ఇది సాధారణ సూత్రీకరణ. అంటే స్థూలంగా అన్ని విషయాలకు వర్తించే

సూత్రీకరణ. మార్క్సిస్టు సిద్ధాంతంలో సర్వసాధారణంగా ఈ సూత్రీకరణ ప్రకారమే సాహిత్యం, కళలు, భావజాలం, చైతన్యాలను జీవన పరిస్థితుల నుండి పుట్టినవిగా పరిగణించడం జరుగుతోంది. జర్మన్ ఐడియాలజీ నుండి ఉటంకించిన పై సూత్రీకరణ 'పునాది-ఉపరి నిర్మాణం' నమూనాలో భాగం. ఈ నమూనా ప్రతిపాదిస్తుందనిపించే ఒకే దిశలో మాత్రమే పనిచేసే కారణత్వం 'సాంప్రదాయ మార్క్సిజం' లో సంస్కృతిని ఎలా అర్థం చేసుకోవాలో నిర్ణయించింది. అంటే పునాది ఉపరి నిర్మాణాన్ని, ఆర్థిక సంబంధాలు సంస్కృతిని నిర్ణయిస్తాయన్నమాట. ఇది వన్ వే ట్రాఫిక్ లాంటిది. అంటే పునాది ఉపరి నిర్మాణాన్ని నిర్ణయిస్తుంది. ఉపరి నిర్మాణం తిరిగి పునాదిపై ప్రభావం చూపుతుందని ఎంగెల్స్ వివరణ ఇచ్చినా ఆ దిశగా విశ్లేషణ జరగలేదు. ఎంగెల్స్ రచనల నుండి అభివృద్ధి చెందిన 'గతితార్కిక భౌతికవాదం' అటువంటి విశ్లేషణకు అవకాశం ఇవ్వలేదు.

సాహిత్యం, కళలపై మార్క్స్, ఎంగెల్స్‌ల రచనల్లోని పాఠ్య భాగాలు అన్నీ కలిపితే అయిదు వందల పేజీలున్నా, వాటిలో మనకు ఒక సమగ్ర సాంస్కృతిక సిద్ధాంతం దొరకదు. అందుచేత 'పునాది- ఉపరి నిర్మాణ' నమూనాయే దిక్కయింది. 'సాంప్రదాయ మార్క్సిజం' సమర్ధకులు, విమర్శకులు కూడా ఈ నమూనా మీదే తమ దృష్టి కేంద్రీకరించారు.

మార్క్సిస్టు విశ్లేషణ ప్రకారం, ఉపరి నిర్మాణం రాజకీయ, చట్ట, న్యాయ, విద్యా, సాంస్కృతిక వగైరా సంస్థలను కలిగి ఉంటుంది. ఇవి రాజకీయ, మత, నైతిక, తాత్విక, సౌందర్యాత్మక, సాంస్కృతిక మొదలగు వాటికి సంబంధించిన నిర్దిష్ట సామాజిక చైతన్య రూపాలు. పునాది ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల మొత్తం. ఈ పునాది మొత్తం మీద ఉపరి నిర్మాణం యొక్క సారాన్ని, రూపాన్ని తీర్చిదిద్దుతుంది, లేదా నిర్ణయిస్తుంది.

ఇందులో సంస్కృతి, సాంస్కృతిక ఉద్యమాల పాత్ర ఏమిటి? సామాజిక విప్లవ దశలో ఆర్థిక పునాదిపై నియంత్రణ కోసం జరిగే పోరాటానికి

రాజకీయ అధికారం సాధనం. ఈ రాజకీయాధికార సాధన ప్రాథమికం అవుతుంది. రాజకీయం ఉపరి నిర్మాణానికి చెందినది. అంటే పునాది, ఉపరి నిర్మాణాల మధ్య సంబంధం యాంత్రికమైనది కాదు. గతితార్కికమైనది. అంటే పునాది నుండి పుట్టిన ఉపరి నిర్మాణం పునాదిని మార్చే సాధనం. అలా పునాదిని మార్చడానికి సాధనమైన ఉపరి నిర్మాణం, పునాది మారినంత త్వరగా పునాదికి అనుగుణంగా మారిపోదు. దానికి సుదీర్ఘ కృషి అవసరం. ఆ కృషి విప్లవానికి అంటే ఆర్థిక పునాది మార్పుకు చాలా ముందు కాలం నుండి మొదలై విప్లవానంతరం కూడా చాలా కాలం కొనసాగాల్సి ఉంటుంది. సాంస్కృతిక మార్పులను పరిమాణాత్మక మార్పులు గాను, విప్లవాన్ని గుణాత్మక మార్పు గాను అర్థం చేసుకోవాలి. విప్లవాన్ని తెచ్చేది మనుషులు, వారినావహించిన భావాలు. విప్లవ దశలో సైతం దోపిడీ వర్గాల సంస్కృతి పీడితులపై తీవ్ర ప్రభావం చూపుతూ విప్లవ చైతన్యాన్ని, విప్లవ లక్ష్యాలను, చివరకు విప్లవాన్ని దెబ్బతీయగలదు. విప్లవం అంటే ఆర్థిక దోపిడీని అంతం చేయడమే కాదు. ఆ దోపిడీని సులభతరం, ఆమోదయోగ్యం చేయడానికి పాలక వర్గం సృష్టించిన భావజాలాన్ని, సంస్కృతిని ధ్వంసం చేయాలి. అలా దోపిడీ సంస్కృతిని నిర్మూలి స్తూనే సోషలిస్టు సంస్కృతి బీజాలు నాటాలి. ఇలా జరగక పోతే విప్లవం విజయవంతమైనా దాని లక్ష్యం నెరవేరదని చరిత్ర రుజువు చేసింది.

సోవియట్, చైనా, తదితర సోషలిస్టు వ్యవస్థలు కూలిపోవడానికి కారణం, పెట్టుబడిదారులు బలప్రయోగం ద్వారా అధికారంలోకి రావడం కాదని, కేవలం కమ్యూనిష్టు పార్టీలు వర్గ పోరాటాన్ని సాంస్కృతిక రంగానికి విస్తరించడంలో విఫలమవ్వడమేనని, ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం సాంస్కృతిక రంగంలో విసిరిన సవాళ్లను కమ్యూనిష్టు ఉద్యమం ఎదుర్కోలేక పోయిందని  మార్క్సిస్టు విశ్లేషకుల అభిప్రాయం. శ్రేయో రాజ్యం, సంస్కరణ వాద భావనలు, పోస్ట్ కొలోనియల్, పోస్ట్ మోడర్నిస్ట్ ప్రతీఘాత విప్లవ భావాలు, ఐడెంటిటీ రాజకీయాలను కమ్యూనిస్టులను భావజాల పరంగా

నిరాయుధుల్ని చేయడానికి ఉపయోగించారు. దీనంతటిలో మీడియా అత్యంత ప్రధాన పాత్ర పోషించింది.

కమ్యూనిస్టుల్లో ప్రబలిన ఆర్థిక నియతివాద భావనల వల్ల భావజాల రంగంలో వర్గ పోరాటాన్ని వదిలివేశారు.

నిరంతరం కొత్త రకం సరుకులను కనుక్కొని తయారుచేయడం, వాటిని అమ్మడానికి కొత్త మార్కెట్లను వెతకడం అనేవి కేపిటలిజానికి చోదక శక్తులని మార్క్స్ చెబుతాడు. ఆ కొత్త సరుకులు పూర్తిగా కొత్త రకం కావచ్చు, లేదా పాత వాటికే మార్పులు, చేర్పులు చేసి ఉండవచ్చు. అలాగే మార్కెట్ కూడా కొత్త ప్రజా బృందం కావచ్చు, కొత్త ప్రాంతం కావచ్చు, లేదా పాత వారినే కొత్త మార్గాల్లో ప్రలోభపెట్టి కొనిపించవచ్చు. మొత్తంమీద కేపిటలిజం అదే తర్కంతో పని చేస్తుంది. ఇలాంటి తర్కంతో పనిచేసే, లేదా ఆ తర్కానికి అనుగుణంగా నడిచే సమాజంలో పుట్టుకొచ్చే సాంస్కృతిక అంశాలు చాల సంక్లిష్టమైనవి, చాల విస్తారమైనవి కూడా. వీటిని అర్థం చేసుకోవడానికి కేపిటలిజం పని విధానాన్ని తెలుసుకోవాలి.

ఇది కేపిటలిజం కథలో సగం మాత్రమే. కేపిటలిజాన్ని కేవలం 'అన్నిటినీ సరుకులుగా చేసే' ప్రక్రియల చేతనే నిర్వచించలేము. కేపిటలిజం లేకుండానే మార్కెట్ ఆర్థికవ్యవస్థ ఉండటం సాధ్యమే! కేపిటలిజాన్ని నిర్వచించేది పెట్టుబడి పాలన. పెట్టుబడి అంటే మరింత సంపదను సృష్టించే ప్రత్యేక రకం సంపద. ఆ పెట్టుబడి, దాన్ని నియంత్రించే పెట్టుబడిదారులకు సంబంధించినదీ కేపిట లిజం. ఉత్పాదక సంపద పెట్టుబడిగా కొద్దిమంది వద్దే పోగుపడటం, పెట్టు బడిని పోగుచేయడానికి అధిక లాభాల కోసం నిరంతర తీవ్ర ప్రయత్నాలు, అలాగే వేతన వ్యవస్థ కేపిటలిజం విశిష్ట లక్షణాలు. లాభాపేక్షతో సహా ఈ విశిష్ట లక్షణాలే సామాజిక కార్యకలాపాలన్నిటినీ నడిపిస్తాయి. పెట్టుబడిపై ఆధిపత్యం, వేతన వ్యవస్థ, పెట్టుబడిదారులకు వేతన శ్రామికులపై, వినియోగదారులపై కనిపించని ఆధిపత్యాన్ని కల్పిస్తాయి. ఈ

ఆధిపత్యం, ఆధిపత్యానికి లొంగి జీవించడం నేటి సమాజం యొక్క ప్రధాన సాంస్కృతిక సమస్యలు.

లాభార్జన కోసం, శక్తిమంతులైన పోటీదారులతో పోటీపడి తమ ప్రత్యేక స్థానం నిలుపుకోవడం కోసం పెట్టుబడిదారులు, పెట్టుబడిదారీ సంస్థలు తరచుగా కొన్ని ప్రత్యేక ఉత్పత్తి రంగాల్లో గుత్తాధిపత్యం కోసం ప్రయత్నిస్తుంటారు. గుత్తాధిపత్యం సాధించిన రంగాల్లో కొత్త ఆవిష్కరణల్నే కాక ఉత్పత్తిని కూడా పరిమితం చేస్తారు. సరుకుల ఉత్పత్తిలో నిమగ్నమైన పెట్టుబడి దారులు తమకు అవకాశము ఉన్నంత వరకూ ఒకే రకమైన సరుకులను విస్తారమైన మార్కెట్లలో అమ్మి వాటికి కొన్ని ప్రమాణాలను ఏర్పరుస్తారు. పోటీ దారులు ఆ సరుకుల ఉత్పత్తి రంగంలోకి ప్రవేశిస్తే అవే ప్రమాణాలను పాటించవలసి వస్తుంది. ఎలక్ట్రానిక్ వస్తువులతో సహా అనేక రకాల వస్తువుల విషయంలో మనం ఈ గుత్తాధిపత్యాన్ని, ప్రమాణీకరణను (స్టాండర్డ్డైజేషన్) ను చూడవచ్చు. దానితో వినియోగదారుల అభిరుచులను కూడా ప్రమాణీకరిస్తారు. ఇలా **అభిరుచులకు ప్రమాణాలు ఏర్పడటం** ఒక ప్రధాన సాంస్కృతిక అంశమనే విషయం గుర్తించాలి. గుత్తాధిపత్యంతో పాటు ప్రమాణీకరణ ఆ వస్తువులను ఉత్పత్తి చేసే పెట్టుబడిదారుల ప్రయోజనాలకు, అంటే వారి లాభార్జనకు, పెట్టుబడిని పోగు చేయడానికి దోహదపడతాయి. అంటే ఆర్థిక విషయాలు 'అభిరుచుల ప్రమాణీకరణ' ద్వారా సంస్కృతిని నిర్ణయిస్తున్నాయి. ఇలా ప్రమాణీకరించబడిన అభిరుచుల సంస్కృతి గుత్త పెట్టుబడి దారుల ప్రయోజనాలకు అనుగుణం గాను, కొత్త, చిన్న పెట్టుబడిదారుల ప్రయోజనాలకు విరుద్ధం గాను పని చేస్తుంది. ఒకే నాణ్యత కల వస్తువులలో బ్రాండ్‌ను బట్టి ధరల్లో హెచ్చు వ్యత్యాసాలు ఉండటమే కాక, వస్తువు నుండి స్వతంత్రంగా బ్రాండ్‌కు ఒక ప్రత్యేక విలువ ఏర్పడటం మనం చూస్తున్నదే. దీని వల్ల మరో పరిణామం ఏమంటే గుత్తాధిపత్యం లేని రంగాల్లో కూడా సరుకుల్లో వైవిధ్యం లోపించే ధోరణి కనిపిస్తుంది. మన ఆహారధాన్యాలు, పండ్లు, కాయగూరలు మొదలైనవాటి లభ్యతలో వైవిధ్యం

నానాటికి తగ్గిపోవడం మనం చూస్తున్నదే! జీవితావసర వస్తువుల వైవిధ్యం సాంస్కృతిక అంశమే! గుత్తాధిపత్యం, ప్రమాణీకరణ అనేవి నిజానికి పెట్టుబడిదారీ సమర్ధకులు ఘనంగా కీర్తించే 'మార్కెట్ నియమాల' కు విరుద్ధమైనవి.

మార్క్సిస్టు దృక్పథంతో సంస్కృతిని అధ్యయనం చెయ్యాలంటే కచ్చితంగా మార్క్స్ చేసిన ఆర్థిక విమర్శకు కట్టుబడి ఉండాలి. మార్క్సిస్టు ఆర్థిక విమర్శ ద్వారా సాంస్కృతిక విమర్శను బలోపేతం చెయ్యాలి. ఆధునిక కాలంలో విభిన్న సామాజిక సాంస్కృతిక రంగాలకు స్థూలంగా ఆర్థిక వ్యవస్థ నియమాలను దాని తర్కాన్ని వర్తింపు చేయాలి. కాని అదే సమయంలో ఆ నియమాలను, తర్కాన్ని బండగా సాంస్కృతిక విషయాలకు వర్తింపజేయ కూడదు. మొత్తంమీద విశాల ఆర్థిక రంగం లోపల సంస్కృతి పనిచేసినా దానికి సాపేక్షంగా స్వాతంత్ర్యం ఉంటుంది. అంతే కాక సంస్కృతి తిరిగి ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. ఆర్థిక వ్యవస్థలో మార్పులు వచ్చినంత వేగంగా వాటిని అనుసరించి సంస్కృతిలో అన్ని విషయాలు మారిపోవు. అయితే ఆర్థిక వ్యవస్థ ఇరుసు గానే సామాజిక సాంస్కృతిక విషయాలు తిరుగుతాయి అనేది నిజం.

మానవ చైతన్యం అతని జీవన స్థితిగతుల, పరిస్థితుల యథాతథ దర్పణ ప్రతిబింబం కాదని, అది వక్రీభవనం చెందిన ప్రతిబింబమని మార్క్సిస్టు విశ్లేషకులు చెబుతారు. ఇదే నియమం సంస్కృతికి కూడా వర్తిస్తుంది. సంస్కృతి ఆర్థికవ్యవస్థకు యథాతథ ప్రతిబింబం కాదు.

మార్క్స్ 'విలువ-శ్రమ సిద్ధాంతం' ప్రకారం శ్రమ నేరుగా సరుకులను, వాటి 'ఉపయోగపు విలువ' ను సృష్టిస్తుంది. కేపిటలిజానికి ముందు ఉన్న ఉత్పత్తి వ్యవస్థలలో సొంత, లేదా సామాజిక వినియోగం కోసం వస్తువులను తయారు చేయడం జరుగుతుంది. చాల పరిమితంగా మారకం జరుగుతుంది. పెట్టుబడి సరుకులను లాభాలకు వాహకాలుగా తీర్చిదిద్దుతుంది. మార్కెట్

వ్యవస్థ సరుకులను కొనడం, అమ్మడం చేస్తుంది. కాని మార్కెట్లే సరుకులకు విలువను కల్పిస్తాయని, ఆ విలువ ఎంత ఉండాలో నిర్ణయిస్తాయన్నట్లుగా ఈ వ్యవహారం కనిపిస్తుంది. మారకపు విలువ, లేదా అమ్మకపు ధర శ్రమ ఖరీదు కన్నా ఎక్కువ ఉండాలి. పెట్టుబడిదారుకి లాభం సంపాదించి పెట్టడానికి శ్రామికుడు తనకు లభించే వేతనం కన్నా అనేక రెట్లు ఎక్కువగా శ్రమించాలి. శ్రమను వేతనానికి అమ్ము కోవడం వల్ల ఉపయోగపు విలువలు కల సరుకులను ఉత్పత్తి చేసే దాని సొంత ఉపయోగపు విలువనుండి అది తొలగించబడి అది కూడా ఒక సరుకుగా మారిపోతుంది. మార్కెట్ దాని ధరను నిర్ణయిస్తుంది. ఆ శ్రమ శక్తి వెల దాని ఉత్పత్తి ఖర్చుకు సమానంగా ఉండేలా మార్కెట్ చూస్తుంది.

ఉత్పత్తి శక్తులు అంటే నిపుణులైన, అలాగే నైపుణ్యాలు లేని శ్రామికులు. వీరు తమ సొంత బానిసత్వ, దోపిడీ పరిస్థితులను తామే పునరుత్పత్తి చేసుకొని తీరాలి. పెట్టుబడి దారీ వ్యవస్థలో ఈ పునరుత్పత్తి పరిస్థితులే 'ఉత్పత్తి యొక్క సామాజిక సంబంధాలు' అవుతాయి. ఈ సందర్భంలో లాభం 'కొరత' తో కూడా ముడిపడి ఉంటుంది. ఈ రకమైన కొరతల్లో ఉపాధి కొరత ముఖ్యమైనది. కొరత వల్ల శ్రామికులు తమ శ్రమ శక్తిని, తమని తాము పునరుత్పత్తి చేసుకోవడానికి, అందు కోసం జీవించి వుండటానికి అవసరమైన దాని కన్నా చాల ఎక్కువ సమయం పనిచేయాల్సి ఉంటుంది. శ్రమశక్తిని పునరుత్పత్తి చేయడమంటే ఆహారం, నిద్రించే వసతి సమకూర్చుకోవడం. తమని తాము పునరుత్పత్తి చేసుకోవడమంటే భవిష్యత్ శ్రమ అవసరాల కోసం పిల్లల్ని కని, పెంచడం. శ్రమ దాని సొంత బానిసత్వం కోసం పనిచేయటం కేపిటలిజానికి అవసరం. బానిసత్వం కేవలం ఆర్థికమైనది కాదు, అది ఒక ప్రధాన సంస్కృతి కూడా!

సరుకు ఉత్పత్తి వ్యవస్థ మొత్తానికి ఇంధనం అందించేది 'కొరత' సృష్టి, నిర్వహణ. పారిశ్రామిక రిజర్వు సైన్యం, అంటే నిరుద్యోగ శ్రామిక ప్రజను

సృష్టించడం, ఆ నిరుద్యోగ పరిస్థితులు ఎప్పుడూ ఎంతోకొంత ఉండేట్లు చూడటం ద్వారా పెట్టుబడిదారీ వర్గం వేతనాలను కనిష్ట స్థాయిలో ఉంచ గలుగుతుంది. అలాగే సరుకుల ధరలు తగ్గిపోకుండా మార్కెట్‌లో ఎంతోకొంత సరుకుల కొరతను కలుగజేస్తుంది. ఒకవేళ సరుకులు మారకపు విలువను కోల్పోతే, అంటే అమ్ముడు పోకపోతే వాటిని, వాటిని తయారు చేసిన శ్రమను తొలగించడం జరుగుతుంది. వ్యాపార విజృంభణ కాలానికి ముందు తప్పని సరిగా వ్యాపార విధ్వంస కాలం, లేదా మార్కెట్ కరెక్షన్ గడుస్తుంది. సరుకుల అధికోత్పత్తి జరిగినప్పుడల్లా స్టాక్ మార్కెట్ నేల చూపులు చూస్తుంది. అత్యంత సృజనాత్మకంగానూ, విస్తరించే క్రమంలోనూ ఉన్నప్పుడు కేపిటలిజం, తన యువ సంతానాన్నే తినేస్తుంది.

సంక్షోభ సమయంలో కేపిటలిజం ఉన్న ఉత్పత్తులనే కాక వివిధ దశల్లో సృష్టించబడిన ఉత్పత్తి శక్తులలో గణనీయమైన భాగాన్ని వివిధ దశల్లో ధ్వంసం చేస్తుంది. మార్క్స్ మాటల్లో పెట్టుబడి అనే ‘మృత శ్రమ’ రక్త పిశాచిలా శ్రామికుల రక్తాన్ని త్రాగి జీవిస్తుంది. మార్క్స్ చెప్పినట్లుగా అత్యధికంగా నాగరికత, జీవితావసర సాధనాలు, పరిశ్రమ, వాణిజ్యం ఉన్నప్పుడే కొరత ఏర్పడుతుంది.

సరుకును మూలాల్లో విశ్లేషిస్తున్నప్పుడు ఉపయోగపు విలువలను కేవలం భౌతిక విషయాలుగా, వస్తువులుగా భావించ కూడదు. ఆ ఉపయోగపు విలువలు కేవలం భౌతిక జీవితావసరాలకు మాత్రమే పరిమితం కాదు. మానసిక అవసరాలు కూడా! చాల ఆకలిగా వున్న మనిషికి తక్షణ అవసరం ఆకలిని తీర్చుకోవడమే అయినా, లేక మనిషి చాల అవసరమని ఊహించుకున్న మరో అవసరం అయినా ఏది ముఖ్యమో మనం నిర్ణయించే వీలు లేదు. అలాగే ఆ అవసరాలను తీర్చే వస్తువులు, లేదా చిహ్నాల యొక్క ఉపయోగపు విలువలను కూడా పోల్చలేము. ఇంట్లో తిండికి బియ్యం లేకున్నా చిరుగుల చొక్కా తొడగలేక బియ్యం కన్నా ముందు కొత్త చొక్కా అత్యవసరమని భావించి

కొనొచ్చు. ఈ విషయంలో సామాజిక వాస్తవికత యొక్క పాదార్థిక, మానసిక లేదా సాంస్కృతిక అంశాలలో స్పష్టమైన విభజన ఏమీ లేదని మార్క్స్ నొక్కి చెప్పాడు. ప్రతీకాత్మక విలువలు(చిహ్నాలు) మౌలికంగా భిన్నమైనవి కాకపోగా అవి కూడా ఒకరకం ఉపయోగపు విలువలు. నువ్వు ఎవరివో, లేదా నువ్వు ఎలా గుర్తించబడాలని కోరుకుంటున్నావో చెప్పడానికి ఉపయోగించే ఒక సరుకును ప్రతీక, చిహ్నం, సంకేతం అనవచ్చు. నీకు హోదా కల్పిస్తుందని, లేదా నీ హోదా నిలపడానికి అవసరమని నీవు భావించే సరుకును నువ్వు కలిగి వుండటం, నువ్వు దాన్ని ఉపయోగించి పొందే ఉపయోగపు విలువకు సమానం కావచ్చు, లేదా కొన్ని సందర్భాలలో అంతకంటే అధికం కావచ్చు కూడా! చొక్కా ఉపయోగపు విలువ మన శరీరాన్ని కప్పి ఉంచడం అనుకుంటే వెయ్యి రూపాయల చొక్కాకి వంద రూపాయల చొక్కాకి అట్టే తేడా ఉండదు. వెయ్యి రూపాయల చొక్కా తన హోదాకు చిహ్నమను కుంటే ఆ చొక్కా ఉపయోగపు విలువను ఆ వ్యక్తి ఇంచుమించు వెయ్యి రూపాయలుగా భావించవచ్చు. అంటే సరుకు వినిమయం ఒక మనిషికి, ఒక పాదార్థిక వస్తువుకి మధ్య ఉండే వైయక్తిక సంబంధం కాదు. అది సామాజికంగా, సాంస్కృతికంగా వ్యక్తులకు, సరుకు లకు మధ్య ఏర్పడి సర్వ వ్యాప్తంగా మారినది. ఈ సందర్భంలో 'బ్రాండెడ్ చొక్కా తొడగటం ఒక హోదానిస్తుంది' అనే భావం సమాజం ద్వారా ఏర్పడిన సాంస్కృతిక అంశమే! అంటే బ్రాండెడ్ దుస్తులు ధరిస్తేనే సమాజంలో నీకు హోదా, గౌరవం లభిస్తాయనే నమ్మకాన్ని ఎక్కువ మందిలో కలిగిస్తే అది ఒక సంస్కృతిగా మారిపోయి ఆ దుస్తులు అమ్మే పెట్టుబడిదారులకు అధిక లాభాలు వస్తాయి. ఇలా ఇంచుమించు లాభాలు తెచ్చే అన్ని ఆర్థిక విషయాలు రకరకాల సాంస్కృతిక ముసుగుల్లో మనకు దర్శనమిస్తాయి.

అంతే కాదు గతంలో డబ్బుతో సంబంధం లేని అనేక సాంస్కృతిక విషయాలు కేపిటలిజంలో ఆర్థిక విషయాలుగా మారిపోతాయి. గతంలో వినోద కార్యక్రమాలు, క్రీడలు, దైవదర్శనం మొదలైనవి డబ్బుతో పని లేని

శుద్ధ సాంస్కృతిక విషయాలుగా ఉండేవి. ఇప్పుడవన్నీ డబ్బుతోనే పొందగలం. డబ్బు ఖర్చు చేయకుండా పుణ్యం సంపాదించుకోలేము. అలాగే పాపాన్ని పరిహరిం చుకోలేము. డబ్బు ఖర్చు చేయకుండా పిల్లలపై మనకు గల ప్రేమను మనం వ్యక్తం చేయలేము. 'ఏదీ ఉచితంగా రాదు' అనే సత్యాన్ని ప్రజల మనస్సుల్లో హత్తుకునేలా నాటగలిగింది కేపిటలిజం. ఒక మేరకు ప్రజలు దీన్ని అంగీక రించగానే విద్య, వైద్యం, మంచినీరు లాంటి వాటిని వ్యాపారాలుగా మార్చగలి గింది. మిగిలిన అన్ని విషయాల్లాగానే గౌరవం, గుర్తింపు కూడా డబ్బుతోనే పొందగలమని కేపిటలిజం ప్రజలను నమ్మిస్తుంది. నువ్వు గౌరవం పొందాలంటే డబ్బు సంపాదించాలి, దాన్ని ఖర్చు చేయాలి. అంటే గౌరవం, హోదాలకు చిహ్నాలైన సరుకులను, సేవలను కొనాలి. గౌరవం, హోదా మొదలైన చిహ్నాలన్నీ సాంస్కృతిక అంశాలే. ఒక విధంగా చూస్తే సరుకుల విలువకు ప్రతినిధి అయిన డబ్బు కూడా సాంస్కృతిక విషయమే! దీనంతటి సారాంశం ఏమిటంటే కేపిటలిజం తన వ్యాపార ప్రయోజనాలకు సంస్కృతిని ఒక సాధనంగా ఉపయోగించడం వల్ల అన్ని జీవిత రంగాలను కేపిటలిస్టు సంస్కృతి ఆవహిస్తుంది. అందుకే కేపిటలిజమే ఒక సంస్కృతి అంటారు విశ్లేషకులు.

సరుకుల ఉత్పత్తే కేపిటలిజం యొక్క మౌలిక విధి అని మార్క్స్ చెప్పాడు. అయితే అది ఎంత సృజనాత్మకమైనదో అంతే విధ్వంసకరమైనదని ఆయన వ్యాఖ్యానించాడు. వినియోగ దారులను ఆకర్షించడానికి కేపిటలిజం చేసే వృధా అంతా ఇంతా కాదు. పత్రికల్లో ప్రచారానికి ఎంత పేపరును వృధా చేస్తున్నారో అందరికీ తెలిసిందే! ఇక వస్తువుల పేకింగ్ విషయం చెప్పనక్కరలేదు. కార్ల అమ్మకాలు పెంచుకోవడానికి పెట్టుబడిదారులు చెయ్యని కుట్రలు లేవు. ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి ప్రజా రవాణాను మూసి వేయించారు. కారు, లేదా బైకు కొనడానికి రుణాలు ఇవ్వడానికి బేంకులు పోటీపడేలా చేశారు. మరో వైపు 'కారు, లేదా బైకు లేనివాడు మనిషి కాదు' అనే భావాన్ని వ్యాప్తి చేసి ప్రజలను బ్లాక్ మెయిల్ చేసి కొనిపించారు. ప్రస్తుతం

60 శాతం వాయు కాలుష్యానికి, భూతాపానికి ఆటో మొబైల్ పరిశ్రమే కారణం. ఇలా ఏ విషయం చూసినా లాభం కోసం చేసే ప్రకృతి విధ్వంసం అంతా ఇంతా కాదు. కేపిటలిస్టు సామాజిక సంబంధాలు ఆహారం, దుస్తులు, విద్య ఇలా ప్రతీ విషయంలోను, వాటిని సరుకులుగా మార్చే ప్రయత్నంలో ఇదే చేస్తాయి. ఒకప్పుడు ఉమ్మడిగా ఒక సమిష్టి ప్రజా బృందానికి చెందిన, లేదా ఎవరికీ చెందని వనరులను వ్యక్తులు, బృందాలు సొంతం చేసుకోవడాన్ని 'ఆదిమ సంచయనం' అన్నాడు మార్క్స్. అలాగే ఈ వనరులను మారకపు విలువ, అంటే డబ్బుకు అమ్మగల సరుకులుగా మార్చడాన్నే సరుకీకరణ అన్నాడు. మార్క్సిస్టు సాంప్రదాయంలో సామాజిక విమర్శకు కేంద్రం ఏమిటంటే, ఒక సామాజిక వ్యవస్థగా కేపిటలిజం గతంలో వినియోగించని ప్రకృతి వనరులను దోచేసి సరుకులుగా మార్చడమే కాక, ప్రజల కనీస జీవితావసరాలను, చాలా ఇతర విషయాలను కొనుగోలు చేయాల్సిన సరుకులుగా మార్చి వేస్తుంది.

మార్క్స్ రాజకీయార్ధ శాస్త్ర విమర్శలో స్పష్టంగా కనిపించే సాంస్కృతిక అంశాలు రెండు ఉన్నాయి. ఒకటి పాదార్థిక దోపిడీ, రెండోది ఆధిపత్యం. అలాగే వాటితోపాటు పాదార్థిక ప్రక్రియలకు బూర్జువా పండితులు చెప్పే ఆధిపత్య భాష్యాలకు ప్రజామోదం పొందడం కూడా ఇమిడి ఉంటుంది. కేపిటలిజంలోని రోజువారీ జీవిత ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, భావాలు దాని దోపిడీ, ఆధిపత్యాలను మరుగు పరిచి అంతా సక్రమంగా, న్యాయంగా జరుగుతున్నట్లు కనిపించేలా చేస్తాయి. ప్రపంచీకరణ జరుగుతున్న ఆధునిక ప్రపంచంలో సాంస్కృతిక పరిశ్రమ ప్రజలను అణచి ఉంచే 'మృదువైన శక్తి' గా సమర్ధవం తంగా పని చేస్తున్నది.

ఇలా గతితార్కిక పద్ధతిలో భావజాల విమర్శ మూలాలు మనకు కేపిటల్ గ్రంథంలో మార్క్స్ చెప్పిన 'సరుకుల ఆరాధన', 'డబ్బు ఆరాధన', 'పెట్టుబడి ఆరాధన'లలో కనిపిస్తాయి. ఇందులో ఇమిడి వున్న అంతరార్థం ఏమంటే

ప్రతీకాత్మక, గుర్తింపు సంబంధ సాంస్కృతిక ప్రక్రియలు మరో దాన్నుంచి పుట్టి నవి లేదా అద్దంలో ప్రతిబింబాలు కాకపోగా, అవి కేపిటలిజం యొక్క గుజ్జు అని. అవి ఏ విధంగా చూసినా నిష్క్రియాత్మక ఉపరి నిర్మాణాలు కావు.

లూకాక్స్ అభిప్రాయం ప్రకారం పెట్టుబడిదారీ సమాజ సంస్కృతి సరుకుల సంస్కృతిగా మారి పోయింది (reified). ఈ సంస్కృతిలో మనిషి సొంత(స్వీయాత్మక) ధర్మాలు వస్తువులు, సరుకుల ధర్మాలుగా మారిపోతాయి. ఆ సరుకులు వాటి ఉత్పత్తిదారుల అజమాయిషీలో ఉండవు. పైగా వారిమీద పెత్తనం చేస్తాయి. వారి జీవితాలను శాసిస్తాయి.

ఈ దృక్పథంలో చూచినప్పుడు సంస్కృతి ఎంతమాత్రం కేపిటలిస్టు ఆర్థికవ్యవస్థకు వ్యతిరేకి అయిన మరో ఇతర విషయం, లేదా వ్యవస్థ కాదు. అలా కాకపోగా కేపిటలిజమే చిహ్నాల (సింబల్స్) వ్యాఖ్యానంపై ఆధారపడిన ఒక 'సాంస్కృతిక నిర్మాణం'. ఆధునిక సంస్కృతి కేపిటలిస్టు సంస్కృతి. అందుచేత ఆర్థిక సంబంధాలు మార్క్సిస్టులు కాని వారి సిద్ధాంతాలతో సహా, ప్రతీ సాంస్కృతిక సిద్ధాంతానికి కేంద్రంగా ఉంటున్నాయి. ఆధునిక కేపిటలిజం సంస్కృతితో మూడు విధాలుగా ముడిపడి వుంది. ఒకటి- కేపిటలిజం తన స్వభావ రీత్యా ప్రతీకలను సృష్టించే సంక్లిష్ట సాంస్కృతిక ప్రక్రియలపై ఆధార పడుతోంది. రెండు- వర్తమాన ఆధునిక దశ రోజువారీ జీవితంలోను, సామాజిక పరిశోధనలోను మరింతగా ఈ సంకేతాలు అంగీకరించబడుతూ కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. మూడు- తన అనంతర దశకు అంటే కేపిటలిస్టు అనంతర దశకు పరిణామానికి కావలసిన బీజాలను కేపిటలిజమే నాటుతుంది. అంటే ఉత్పత్తి యొక్క పాదార్థిక శక్తులే కాక, ఈ సమాజ చారిత్రక లక్షణాన్ని అంటే ఇది శాశ్వతం కాదనే సత్యాన్ని తెలియ చేసే విమర్శనాత్మక ఆలోచనా తత్వం అభివృద్ధి చెందడానికి కూడా అవసరమైన పరిస్థితులను కల్పిస్తుంది.

దీనిని బట్టి మనకు అర్థమయ్యేది ఏమంటే, మన భౌతిక జీవితానికి ఆధారమైన ఆర్థిక కార్యకలాపాలలో యాంత్రికత, శుద్ధ పాదార్థికత లేవు. కేపిటలిజంలో '1' కి 1 సమానం కాదు. అది గణితాన్ని, ప్రకృతి శాస్త్రాలను ఉపయోగించు కుంటుందేగాని, ఆ నియమాల ప్రకారం ఆర్థిక వ్యవస్థ పనిచేయదు. ఉదాహరణకు శ్రామికుడికి అతడు చేసిన 8 గంటల నిర్దిష్ట శ్రమకు సమానమైన విలువ ఎలాగూ దక్కదు. ఎందుకంటే నిర్దిష్ట శ్రమను తూచే రాళ్లు లేవు. పోనీ సగటు శ్రమకు సమానమైన విలువలో సగం అంటే (4 పని గంటల ఫలితం) కూడా శ్రామికుడికి దక్కదు. ఇదే విధంగా వివిధ వస్తువులు అసలు విలువ కన్నా తక్కువకు గాని ఎక్కువకు గాని మారకం అవ్వడం మనం చూస్తున్నదే! కొన్ని వస్తువులైతే ప్రజలకు వాటి అవసరం ఉన్నా కొనుగోలు శక్తిలేక, అభిరుచులు మారిపోయి వృధాగా ధ్వంసం చేయబడతాయి. దీన్ని మార్కెట్ మహిమగా, లేదా మాంద్యంగా ప్రచారం చేస్తారు. మరికొన్ని వస్తువులను కొందరు కేవలం మానసిక కారణాలతో, వ్యవస్థ కల్పించిన తప్పుడు భావజాలానికి ప్రేరితులై కొంటారు. ఈ తప్పుడు భావజాలం సంస్కృతిలో భాగమే. అలాగే పెట్టుబడిదారుడు తన శ్రమశక్తిని దోచుకోవడం ద్వారా కాక, తన పెట్టుబడి ద్వారా లాభాలను పొందుతున్నాడని నమ్మడం కూడా భావజాలం వల్లే! ఇంకా మార్కెట్ గాని, సరుకులు గాని స్వతంత్ర శక్తులని, వాటిని మనుషులు నియంత్రించలేరని నమ్మడం. ఇలా చాల రకాల భావజాల, సాంస్కృతిక విషయాలు ఆర్థిక జీవితంలో పెనవేసుకొని పోయి ఉంటాయి. అందుచేత సంస్కృతిని ఆర్థిక జీవితం నుండి పూర్తిగా విడదీసి చూడటం తప్పు. కాని ఆర్థిక జీవితం అంతా సంస్కృతే అని భావించడం కూడా తప్పు. ఆర్థిక రంగానికి దాని సొంత నియమాలు ఉంటాయి. మనుషులు సమిష్టిగా, అంటే సామాజికంగా తమ అవసరాలు తీర్చుకోవడానికి చేసే శ్రమ నుండి, ప్రయత్నాల నుండి, ఆలోచనల నుండి పుట్టిన సంస్కృతి వారి శ్రమ, ప్రయత్నాలు, ఆలోచనల్లో విడదీయలేని విధంగా పెనవేసుకొని పోతుంది.

కేపిటలిజం చారిత్రకంగా ఒక విశిష్ట సామాజిక తర్కం. అది వ్యాఖ్యాన, లేదా భాష్య ప్రక్రియలపై ఆధారపడుతుంది. పాదార్ధిక ఆచరణలతో అర్థాలను విడదీయలేని విధంగా ముడివేసి వాటికి ప్రాధాన్యతను కల్పిస్తుంది. సరుకులకు విలువ అర్థాన్ని కల్పించి, భిన్న ఉత్పాదక చర్యలను అమూర్త శ్రమ పేరుతో సరి తూచుతుంది. తద్వారా శ్రమశక్తిని నిర్జీవ ఇంధనంలా పరిగణించే అవగాహన కలిగిస్తుంది. పెట్టుబడిని, సహజ వనరులను పోల్చ దగ్గ ఆదాయ వనరుగా పరిగణిస్తుంది. ఆ విధంగా కేపిటలిస్టు ఆర్థిక వ్యవస్థ పునరుత్పత్తికి, ప్రజా సమ్మతి పొందడానికి భాష్యాలు, అర్థాలు కీలకం. కేపిటలిజంలోని అంతర్గత వైరుధ్యాల వల్లే ఆ వ్యవస్థను కూల దోసే ప్రజా వ్యతిరేకత, విప్లవాలు పుట్టు కొస్తాయి. మనం చేయాల్సింది కేపిటలిజం చెప్పే భాష్యాలు, అర్థాలను విశ్లేషించి, విమర్శించి ఆ వ్యవస్థను ఆచరణలో అంగీకరిస్తున్న ప్రజలలో దాని పట్ల వ్యతిరేకత జనించేలా కార్యక్రమాలు చేపట్టడమే. ఆ కార్యక్రమాలు రాజకీ యార్థిక, సాంస్కృతిక పోరాటాల మేలు కలయిక గా ఉండాలి. భావజాలం సంస్కృతిలో అతి ప్రధాన భాగం.

మార్క్స్ ఒకప్పుడు 'అనుత్పాదక శ్రమ' అని పిలిచింది ఇప్పుడు పూర్తిగా కొత్త వర్గంగా ఏర్పడిందని, ఒక చిహ్నం యొక్క ఆరాధ్య విలువను గురించి నిరంతరం తపిస్తూ, దాన్ని ప్రచారం చేస్తోందని డేవిడ్ హార్వీ, ఫ్రెడ్రిక్ జేమ్సన్ లు నిరూపించారు. ఈ వర్గానికి చెందిన వారు సాంస్కృతిక శ్రామికుల్లా ఉత్పత్తి, అధికోత్పత్తి వ్యవస్థలను పోషిస్తున్నారు. వీరు వ్యవస్థకు బలి అవుతూనే దానికి ప్రచారం కల్పిస్తారు. వీరంతా ప్రధానంగా మధ్య తరగతికి చెందిన వారని వేరే చెప్పనక్కరలేదు. సకల అవలక్షణాలకూ నిలయమీ వర్గం. వీరు జీవన స్థితిగతు ల రీత్యా శ్రామిక జనులకు దగ్గరగా ఉంటారు. కాని శ్రామికులను వారి సంస్కృతిని ద్వేషిస్తుంటారు. తమతో సహా మొత్తం ప్రజలను దోచుకునే పెట్టు బడిదారీ వర్గం పట్ల ఆరాధన భావం కలిగి ఉంటారు. ఏ నాటికైనా ఆ వర్గంలో చోటు దొరుకుతుందనే ఆశతో ఉంటూ ఆ వర్గంపై విమర్శను తమపై విమర్శగా భావిస్తారు. పెట్టుబడిదారీ దోపిడీకి నైతిక

సమర్థన అందిస్తూ అది సహజం, న్యాయం అనే భావాన్ని ప్రజల్లో కల్పిస్తారు. వీరు పెట్టుబడి దారీ సంస్కృతిని ఉత్సాహంగా అమలు చేస్తూ, దాని వ్యాప్తికి విశేష కృషి చేస్తారు. అయితే పెట్టుబడిదారీ సంస్కృతి వల్ల ప్రజలతో పాటు వీరూ నష్టపోతుంటారు. వీరిలో అతి కొద్దిమంది ప్రజల తరపున పెట్టుబడి దారీ వర్గానికి వ్యతిరేకంగా నిలుస్తారు.

సామాజిక మార్పు బయటి నుండి ప్రమాణాలు, ఆదర్శాలు వర్తింపు చేయడం వల్ల కాక, కేపిటలిజంపైన, దాని అంతర్గత వైరుధ్యాల పని విధానం పైన ఆధారపడి మాత్రమే జరగాలని మార్క్స్ వక్కాణించాడు. 1843 లో రాసిన ఉత్తరంలో ఆయన 'ప్రపంచం యొక్క సొంత సూత్రాల నుంచే ఈ ప్రపంచం కోసం కొత్త సూత్రాలు అభివృద్ధి చెయ్యాలనుకుంటున్నాను' అని రాశాడు. ఇదే గతితార్కిక పద్ధతి. ఈ సమాజం, ప్రపంచాల్లోని సమస్యల పరిష్కారాలను వాటికి వెలుపల, లేదా పర లోకంలో కాక, ఇక్కడే వీటి లోనే వెతుకుతున్నానని మార్క్స్ ఆర్నాల్డ్ రూజ్ కి రాసిన ఉత్తరంలో చెప్పాడు.

కేపిటలిజంపై విమర్శ దాని అంతర్గత వైరుధ్యాలపై కేంద్రీకరించాలి. అలాగే దాని రెండు విధాల శక్తులను అంటే ఆధిపత్య, అదే సమయంలో ఉద్ధరించే దాని శక్తులను గుర్తించాలి. కేపిటలిజం యొక్క సార భూత ప్రభావశీల శక్తులుగా ఉన్న అర్థాలు, భాష్యాలు చివరకు దాన్నే కూల దోస్తాయి.

దీన్ని కాస్త వివరించు కుందాం. ఉదాహరణకు కేపిటలిజం గత సమాజాల్లో వ్యక్తులను బంధించి ఉంచిన అనేక భౌతిక, భావజాల బంధాలను తెంచి వేస్తుంది. అలా తెంచి వేయడానికి అది ఉత్పత్తిలో వ్యక్తి స్వేచ్ఛను అమలు చేస్తుంది. అంటే భూమికి, కులవృత్తులకు బంధించబడిన శ్రామికులను విముక్తం చేస్తుంది. తన ఈ చర్యకు మద్దతుగా 'వ్యక్తి స్వేచ్ఛ' ను మహోన్నత మానవ విలువగా ప్రచారం చేస్తుంది. ఇది సానుకూల అంశం. అదే సమయం లో భూస్వామ్య బంధనాలనుండి విముక్తమైన శ్రామికుడు తన

జీవితావసరాల ను తీర్చుకొని బతికి ఉండటానికి తన శ్రమ శక్తిని అమ్ముకొని తీరాల్సిన అగత్యాన్ని కల్పిస్తుంది. కేపిటలిజం వ్యక్తిని బంధించే ఈ గొలుసులు భూస్వామ్య బంధనాల వలె స్పష్టంగా కనిపించవు. వ్యక్తి కూలిపని చేయడానికి లేదా ఆకలి తో చావడానికి పూర్తి స్వేచ్ఛ కలిగి వుంటాడు. నిజానికి *కేపిటలిస్టు స్వేచ్ఛ వ్యక్తి తన శ్రమ శక్తిని అమ్ముకునే స్వేచ్ఛకు, సరుకులను ఎంపికచేసి కొనుగోలు చేసే స్వేచ్ఛకు మాత్రమే పరిమితం.* ఇవి కూడా అనేక పరిమితులతో అమలవుతాయి. స్వేచ్ఛ రెండు రంగాలకు చెందినది. ఒకటి పాదార్థిక అవసరాలు తీరడం ద్వారా లభించే స్వేచ్ఛ కాగా రెండో రంగం ఆధిపత్యం, పీడన, అణచివేత, ఎలియనేషన్, అభద్రతాభావం మొదలగు వాటి నుండి స్వేచ్ఛ. ఇవన్నీ భౌతిక జీవితం నుండి జనించినవే అయినా మానసికంగా, అంటే సాంస్కృతికంగా వ్యక్తమవుతాయి. కేపిటలిజం ప్రవచించేది, అమలు చేసేది బూటకపు స్వేచ్ఛనే అయినా అది ప్రజల్లో స్వేచ్ఛ పట్ల బలమైన ఆకాంక్షను నాటుతుంది. ఈ ఆకాంక్ష ఒక మేరకు పెరిగితే కేపిటలిజానికి అంతిమ ఘడియలు సమీపిస్తాయి. ఇక్కడ మనం గ్రహించాల్సింది ఏమంటే స్వేచ్ఛను పొందాలనే ఆకాంక్ష భావజాలానికి, అంటే సంస్కృతికి చెందుతుంది. కేపిటలిజం గురించి పాదార్థిక, లేదా సాంస్కృతిక అవగాహనల్లో ఏదో ఒక దాన్ని ఎంచుకోవడం సరైనది కాదు. ఈ రెండు అంశాలు అత్యంత సహజసిద్ధంగా విడదీయలేని విధంగా ముడిపడి ఉంటాయి.

ప్రజలను ఒక రకమైన స్వప్న ప్రపంచంలో జీవించే విధంగా చేసి కేపిటలిజం తను జీవిస్తుంది. విప్లవం ప్రధానంగా చైతన్యాన్ని సంస్కరిస్తుంది. అంటే విప్లవం ప్రజలను చెడ్డ కలలనుండి మేలుకొలుపుతుంది. కేపిటలిజం పతనం సమిష్టి అర్థాలను ఉత్పత్తి చేయడంతో కూడిన సాంస్కృతిక ప్రక్రియలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు సామాజిక స్పృహ, వర్గ చైతన్యం, దోపిడీ, అణచివేతల నుండి స్వేచ్ఛను పొందాలనే బలమైన వాంఛ

మొదలైనవి. అన్నింటి కన్నా ప్రధమ ప్రాధాన్యత కల విషయం పెట్టుబడిదారీ సంస్కృతిని తీవ్రంగా ద్వేషించడం.

కొంత మంది స్కాలర్ల అభిప్రాయం ప్రకారం, 'పెట్టుబడి అంటే మార్కెట్ లక్ష్యంగా సాగే ఉత్పత్తి ద్వారా సంపద సంచయనం యొక్క గతి సూత్రం. ఆర్థిక వ్యవస్థ అనేది మార్కెట్ల మొత్తం నిర్మాణం. ఈ మార్కెట్ల నిర్మాణానికి దాని సొంత ఆవశ్యక తర్కం ఉంటుంది. ఈ తర్కం సాంస్కృతిక రంగానికి అవతల ఉంటూ నే సంస్కృతిని తీర్చి దిద్దుతుంది. ఆర్థికం సంస్కృతికి 'అవతల ఉండే', నిజమైన కారకం అని దీని అర్థం. సంస్కృతిని తీర్చి దిద్దే నిజమైన కారకం ఆర్థికమే అనే వాదనతో ఏకీభవిస్తూనే, అదే సమయంలో చాల మంది సాంస్కృతిక సిద్ధాంత కారులు 'ఆర్థికం సంస్కృతికి ఆవల ఉండి దాన్ని నిర్ణయిస్తుంది' అనే వాదనను అంగీకరించరు.

ఆచరణకి, భాష్యానికి మధ్య గతితార్కిక పరస్పర చర్యలు ఉంటాయి. కేపిటలిజం యొక్క నిజమైన సామాజిక సంబంధాలు, దోపిడీ అలాగే అణచివేత చర్యల మూలాలు వస్తు ఆరాధన రూపాల్లో ఉండి అక్కడే పునరుత్పత్తి అవుతా యని మార్క్స్ భావించాడు. అటువంటి పని విధానాల గురించి తెలుసుకుని చైతన్యవంతులు అవ్వడం ద్వారా మానవాళి విముక్తం అవుతుంది. అందుచేత సమాజ పరిణామానికి పరస్పరం అల్లుకున్న సామాజిక, సాంస్కృతిక చర్యలు సరి సమానంగా ప్రాధాన్యత కలిగి ఉంటాయి.

మార్క్స్ ఆధునిక సమాజం గురించి కచ్చితమైన నమూనాను ప్రతిపాదించాడు. దీని ప్రకారం సరుకు రూపం కేపిటలిజానికి విలక్షణ సార భూత కేంద్రం( గుజ్జు) గా ఉంటుంది. దీన్నుండే ఇతర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రూపాలన్నీ జనిస్తాయి. దీని ప్రకారం సంస్కృతి ద్వితీయమైనది అనిపిస్తుంది. అయితే జాగ్రత్తగా పరిశీలిస్తే ఆయన సిద్ధాంతంలో సరుకు విశ్లేషణలో సాంస్కృతిక అంశాలు అంతర్భాగమని అర్థమవుతుంది. ఆయన

విశ్లేషణ ప్రకారం సరుకులన్నీ ఎటువంటి తేడా, వైరుధ్యం లేని కేవల వస్తువులు కాదు. లోతైన వైరుధ్యాలతో నిండినవి. విలువ, ఉపయోగపు విలువల మధ్య చీలిక సరుకులోని ప్రధాన వైరుధ్యం. వీటిలో ఉపయోగపు విలువ సరుకుకి ఆవశ్యక, తప్పనిసరి షరతు. అంటే ఉపయోగపు విలువ లేని సరుకు ఉండదు. కాగా విలువ ఆధిపత్యం వహిస్తూ, మారకపు విలువ, డబ్బు, పెట్టుబడుల ద్వారా ప్రపంచాన్ని తీర్చిదిద్దుతుంది.

వ్యక్తి స్వేచ్ఛ తన పతాక నినాదంగా బూర్జువా సంస్కృతి ప్రకటించుకుంటుంది. వ్యక్తి భావనకు ఆలంబనమైన 'నేను'(ది సెల్ఫ్) మన వ్యక్తిత్వాన్ని, స్వీయతను, ఐడెంటిటీని సూచిస్తుంది. అయితే సాంస్కృతిక సిద్ధాంత వేత్తలు స్వీయత్వం గురించిన అన్నిరకాల ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. 'సామాజిక ప్రపంచం యొక్క శృతిమించిన కమ్యూనికేషన్ వ్యవస్థలో మనల్ని మనం ఎలా అర్థం చేసుకుంటాం? ఎల్లప్పుడూ మొబైల్ ఫోనులో మాట్లాడుతూ, ఇమెయిల్లు పంచుకుంటూ, ఆగకుండా చాటింగ్ చేస్తూ మనమంతా పరస్పరం సంతోషదాయకంగా ఉన్నామా? అలాంటప్పుడు ఎలియనేషన్ ఎందుకంత విస్తృతంగా వ్యాపించి ఉంది? విలువల రాహిత్యం, సామాజిక అశాంతి ఎందుకంత క్రానిక్‌గా కొనసాగుతున్నాయి?' అని ప్రశ్నిస్తున్నారు.

అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో సమాచార మార్పిడి సాధనాలు వ్యక్తుల సొంతం కావడం, అదే సమయంలో వ్యక్తులు పట్టు పురుగుల్లా పట్టు గూళ్లు నిర్మించుకొని సమాజంలో ఏకాకిగా వైయక్తిక జీవులుగా మారడం ఆధునిక జీవిత లక్షణమని 1974 లోనే రేమండ్ విలియమ్స్ చెప్పాడు. వ్యక్తివాదం ఇంకా కొనసాగుతోందనే మాట నిజమే కాని అది వ్యక్తి స్వాతంత్ర్యా నికి సంబంధించిన బూర్జువా ఆదర్శంగా కాక, 'నిర్బంధ వైయక్తికం' గా మారింది. అంటే వ్యక్తివాదాన్ని అంగీకరించడం, అనుసరించడం మన ఇష్టా ఇష్టాలతో పని లేదు. 'మనిషి స్వేచ్ఛ' కేంద్రంగా ఉండే వ్యక్తివాదం కాక, సమాజాన్ని శత్రువులా చూసే, సాటి మనుషుల నుండి

వేరు చేసి ఒంటరిని చేసే, మనిషిని మానసికంగా భౌతికంగా నాశనం చేసే వ్యక్తివాద సంస్కృతిని ఆధార్ కార్డులా తప్పనిసరి చేసింది.

నేడు కేపిటలిజం అభివృద్ధి చెందిన తీరును మార్క్స్ ఊహించే అవకాశాలు లేవని, ఆయన చెప్పిన కొన్ని జోస్యాలను వదులుకుంటే ఆయన చేసిన ఆర్థిక విశ్లేషణ నేటి సాంస్కృతిక సిద్ధాంతానికి గొప్ప వనరుగా ఉండగలదని విశ్లేషకుల అభిప్రాయం.

ఒక మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతి అభిప్రాయం ప్రకారం 'సంతృప్తికరమైన మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతాన్ని నిర్మించాలంటే కర్తృత్వం(agency=పరిస్థితులను మార్చేమనుషులు), సంస్కృతుల ఆవశ్యకత ను తిరిగి ఉద్ఘాటించడం అవసరం. ఎందుకంటే స్టాలినిస్టు మార్క్సిజంలో వీటికి స్థానం లేకుండా పోయింది. అదే సమయంలో సమాజంలోని వివిధ వర్గాల సాంస్కృతిక ఆచరణలను అర్థం చేసుకోవాలంటే కేపిటలిజంపై మార్క్స్ చేసిన విశ్లేషణ అత్యావశ్యకం".

# 8. సరుకుల ఆరాధన, సంస్కృతి

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యేకమైన, అతి ప్రధానమైన మార్క్సిస్టు భావన 'సరుకుల ఆరాధన'. సాంస్కృతిక సిద్ధాంతానికిది అతి కీలకమైనది. సరుకుల ఆరాధన గురించి క్లుప్తంగా చెప్పుకుందాం. మానవ శ్రమతో తయారైన వస్తువులకు ఆ వస్తువుల్లో ఇమిడి వున్న శ్రమ వల్ల 'విలువ' ఏర్పడుతుంది. సరుకులు మారకం జరిగేటప్పుడు స్థూలంగా ఆ సరుకుల్లో ఉన్న విలువ ఆధారంగా మారకం జరుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అన్నిరకాల వస్తువులే కాక శ్రమకూడా సరుకుగా మారిపోతుంది. అన్ని సరుకుల మధ్య మారకంలో మధ్యవర్తిగా డబ్బు అవతరిస్తుంది. ఈ డబ్బుకి సొంత విలువ ఏమీ ఉండదు. అన్ని సరుకుల విలువను తనలో వ్యక్తం చేయగల ఒక సార్వత్రిక విలువ గల సరుకుగా అవతరిస్తుంది. శ్రమ ద్వారా తయారైన సరుకుల మారకం కోసం ఉనికిలోకి వచ్చిన 'డబ్బు' అనే సరుకు శ్రమను, ఆ శ్రమ సొంతదారులైన మనుషులను శాసిస్తుంది. సరుకులన్నిటి ప్రతినిధిగా డబ్బుకు ఆ శక్తి వస్తుంది. అంటే మనుషులు తయారు చేసిన వస్తువులు ఆ మనుషుల జీవితాలను శాసిస్తాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి నిజానికి అత్యంత విస్తారమైన మానవ సహకార శ్రమ ద్వారా జరుగుతుంది. ప్రపంచంలో మారుమూల నున్న ప్రజలు కూడా తమ ఉత్పత్తి, వినిమయాల్లో ప్రపంచ వ్యాపిత ప్రజలతో సంబంధంలో ఉంటారు. అయితే ఈ సంబంధాలు ఎంత మాత్రం కనిపించవు. రెండు సరుకుల మధ్య డబ్బు అనే మధ్యవర్తి ద్వారా జరిగే మారకమే కనిపిస్తుంది. ఎనిమిది గంటలు పనిచేయగల సామర్థ్యాన్ని అంటే నా 'శ్రమశక్తి' అనే సరుకును డబ్బుకోసం అమ్ముకుంటున్నాను. అంటే శ్రమ శక్తి అనే సరుకు, డబ్బు అనే సరుకుల మధ్య మారకం అంతే. ఇందులో అమ్మే నేను, కొనే పెట్టుబడిదారు కనిపించం. శ్రమశక్తి, డబ్బు అనే సరుకుల మధ్య సంబంధమే కనిపిస్తుంది. ఎందుకంటే నా సరుకును ఒకడు కాకపోతే మరో పెట్టుబడి దారుడు కొంటాడు. అలాగే నేను కాకపోతే మరొకరు శ్రమ శక్తిని అమ్ముతారు. మనుషులుగా మా ఇద్దరి మధ్య సంబంధం ఏమీ

ఉండదు. స్వేచ్ఛాయుత కొనుగోలు దారుగా, అమ్మకం దారుగా అంటే సరుకుల యజమానులుగా మేము లేబరు మార్కెట్లో ఎదురు పడతాం. మా మధ్య జరిగేది సరుకుల మారకమే కాని మానవ సంబంధాలు ఏర్పరచుకునే ప్రక్రియ కాదు. అందుచేత మనుషుల మధ్య సంబంధాలన్నీ కేవలం సరుకుల మధ్య సంబంధాలుగా కనిపిస్తాయి. మానవ సంబంధాలు మరుగున పడిపోవడం అనేది అత్యంత కీలక సాంస్కృతిక సమస్య. అలాగే వాస్తవమైన మానవ సంబంధాలు కనిపించకుండా అవి వారి ఉత్పత్తుల మధ్య సంబంధాలుగా కనిపించడం. ఇదే సరుకుల ఆరాధనకు ప్రాతిపదిక, దాని సారాంశం.

నా శ్రమశక్తి అనే సరుకు అమ్ముడుపోకపోతే, అంటే నన్ను ఎవరూ పనిలో పెట్టుకోకపోతే, తిండి, బట్ట కొనగల 'డబ్బు' అనే సరుకు లభించదు. అంటే నేనూ నా కుటుంబం బ్రతకాలో ఆకలితో చావాలో నిర్ణయించేది డబ్బు అనే సరుకు. అందుచేత నా జీవితాన్ని శాసిస్తున్నవి సరుకులు, ఆ సరుకులు అన్నిటికి అధిపతి అయిన డబ్బు. అతి క్లుప్తంగా చెప్పుకోవాలంటే 'సరుకుల ఆరాధన' సారాంశం ఇదీ. నిజానికి ప్రపంచ వ్యాపిత విస్తార సహకార శ్రమవల్ల పెట్టుబడిదారీ ప్రపంచం నడుస్తుంది. అయితే ఆ సహకారాన్ని, మానవ సంబంధాలను సరుకుల మార్పిడి, మరీ ముఖ్యంగా డబ్బు ద్వారా మార్పిడి అనేవి కనబడకుండా చేసి డబ్బు అనే ఏకైక సరుకు ప్రపంచాన్ని నడిపిస్తున్నట్టు కనిపిస్తుంది. అది నిజం కూడా! సరుకుల అధికోత్పత్తి జరిగి అమ్ముడుపోక పోతే వాటి ఉత్పత్తి రంగంలో పనిచేసే కార్మికుల ఉపాధి పోతుంది. వ్యక్తికి సరుకులు, వాటిని కొనగల సర్వోత్కృష్ట సరుకైన డబ్బు తగినంతగా ఉంటే అతని జీవితం సుఖవంతం అవుతుంది. అందుచేత ఆటవిక మానవుడు ప్రకృతి శక్తులను తాను అదుపు చేయలేనని, అవే తనకు మేలు గాని, కీడు గాని చేయగలవని నమ్మి ఆరాధించినట్లే ఆధునిక మానవుడు సరుకుల పట్ల ఆరాధన భావంతో ఉంటాడు. సైద్ధాంతికంగా చెప్పుకోవాలంటే మనుషుల మధ్య సంబంధాలు సరుకుల మధ్య సంబంధాలుగా కనిపిస్తాయి.

సరుకులకుండే లక్షణాలు, డబ్బుకు గల అపరిమిత శక్తులు సమాజం కల్పించినవే అయినా, అవే వాస్తవ మైనవిగా కనిపిస్తాయి. వాటిని సమాజం అదుపుచేయలేదు. అవే సమాజాన్ని అదుపు చేస్తాయి. ఈ పరిస్థితే సరుకుల ఆరాధనగా వ్యక్తం అవుతుంది.

ఇందులో మరో ముఖ్య సాంస్కృతిక సమస్య ఇమిడి ఉంది. నాకు ఇష్టమైతే నా శ్రమ శక్తిని అమ్ముకోవడానికి, లేదా పనిలోకి వెళ్ళకుండా మానివేయడానికి సమాన హక్కులున్న స్వేచ్ఛా రంగస్థలంగా మార్కెట్ కనిపి స్తుంది. పనికి వెళ్ళకపోతే ఆకలితో మాడి చావవలసి ఉంటుందని కూలీలు అందరికి తెలిసిన నగ్న సత్యం. ఇక్కడ విషాదం, వక్రోక్తి ఏమిటంటే ఆకలి చావు తో ముడిపడిన 'నిర్బంధం' మహోన్నత మానవ విలువ అయిన 'వ్యక్తి స్వేచ్ఛ' గా దర్శనమిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ అతి ముఖ్యమైన సాంస్కృతిక విలువ.

కేపిటలిస్టు సమాజంలో ఉత్పత్తియొక్క సామాజిక సంబంధాలు 'సరుకు' అనే ముసుగుతో కప్పి వేయబడతాయి అని మార్క్స్ చెబుతాడు. కేపిటలిస్టు సమాజానికి ఇరుసు సీల(linchpin)గా మానవ శ్రమకు బదులు సరుకులు కనిపిస్తాయి. అందువల్ల అంతిమంగా నిజమైన సామాజిక సంబంధాలు కనిపించని మర్మంగా మారిపోతాయి. వస్తువులు అంతర్గతంగా సహజ విలువ ను కలిగి ఉండవు. మానవ శ్రమవల్ల వాటికా విలువ వస్తుంది. కేపిటలిస్టు సమాజంలో ప్రజలు సరుకులను అంతర్గత విలువ కలిగినవిగా పరిగణిస్తారు. శ్రమకాలం చేత ఏర్పడేదిగా విలువ అనేది సరుకుల సాపేక్ష విలువలో పైకి కనిపించే సాపేక్ష ఒడిదుడుకుల క్రింద కప్పి వేయబడిన రహస్యంగా ఉంటుందని మార్క్స్ చెబుతాడు. అంటే వస్తువుకు విలువ కల్పించే శ్రమ శక్తికి ఒకానొక కాలంలో ఉండే ధరకు, మార్కెట్ ఒడిదుడుకుల మధ్య సరుకుల ధరలకు మధ్య సంబంధాన్ని ఊహించడం కూడా అసాధ్యంగా ఉంటుంది.

సరుకుల విశ్లేషణద్వారా మార్క్స్ పరాయితనం పాలైన (alienated) శ్రామికుని గురించి మనకు గొప్ప లోచూపును ఇస్తాడు. ఉత్పత్తియొక్క

సామాజిక ప్రక్రియలో శ్రామికుల పరస్పర సంబంధాలు శకలాలుగా వేరు పడి పోయి (atomistic), ఒక మేరకు శత్రు పూరితంగా ఉంటాయి. శ్రామికుడు తన శ్రమనుండి వేరు చేయబడతాడు. తను ఉత్పత్తిచేసిన వస్తువుపై ఒక చైతన్య పూరిత చర్యతో కూడిన నియంత్రణ ఉండదు. ఒక వస్తువుకు విలువను కల్పించేది మానవ శ్రమే అయినా ఆ శ్రమలో వ్యక్తి యొక్క చైతన్య పూరిత చర్య ఏమీ ఉండదు. అప్పుడు శ్రామికులు వారి ఉత్పత్తుల (వస్తువుల) పట్ల ఉదాసీనంగా ఉండిపోతారు. మార్క్స్ చెప్పిన దాని ప్రకారం సామాజిక సంబంధాలు శ్రామికుల మధ్య కాక సరుకుల మధ్య ఉంటే, అసలు శ్రామికుల మధ్య సామాజిక సంబంధాలు ఉండవా?

మార్క్స్ దీనికి చెప్పిన సమాధానం శ్రామికుల మధ్య నిజమైన సామాజిక సంబంధాలు కార్మికవర్గ విప్లవానికి ముందస్తు షరతు. అదే వర్గ స్పృహ, లేదా వర్గ చైతన్యం. ఈ చైతన్యంలో నిజమైన సామాజిక సంబంధాలు, కర్తలు జనిస్తారు. విప్లవానికి ముందు శ్రామికులు వర్గ చైతన్యాన్ని పొంది తీరాలి.

“సరుకు రూపం యొక్క మార్మిక లక్షణం ఆ సరుకులో ఉన్న మానవ శ్రమ యొక్క సామాజిక లక్షణం  ఆ శ్రమయొక్క ఉత్పాదితాల వస్తుగత లక్షణం గా, ఆ వస్తువుల సామాజిక-ప్రాకృతిక ధర్మాలుగా కనిపించడంలో ఉంది. కనుక వారి వెరసి మొత్తం(sum total) శ్రమతో ఉత్పత్తిదారుల సామాజిక సంబంధం వస్తువుల మధ్య సంబంధంగా, ఉత్పత్తిదారులనుండి వేరుగా, వారికి బయట ఉన్నట్లు కూడా కనిపిస్తుంది. ఈ ప్రత్యామ్నాయం (substitution) వల్లనే శ్రమ ఉత్పత్తులు సరుకులుగా మారతాయి. ..... దీన్ని పోల్చి చూపాలంటే మాయ పొరలు కప్పిన మత ప్రపంచం వైపు చూడాలి. ఆ ప్రపంచంలో మానవ మేధ ఉత్పత్తులు సజీవంగా ఉండే స్వతంత్ర అస్తిత్వాలుగా కనిపిస్తాయి. అవి ఒక దానితో ఒకటి సంబంధాన్ని ఏర్పరచుకోవడమే కాక మానవజాతితో కూడా సంబంధాలు ఏర్పరచుకుంటాయి. అదే విధంగా మానవుల చేతుల ఉత్పత్తులైన సరుకు

ప్రపంచంలో కూడా జరుగుతుంది. దీన్ని నేను శ్రమ ఉత్పాదితాలకు తనకు తానుగా అతుక్కున్న ఆరాధన అంటాను."--మార్క్స్ ,కేపిటల్ మొదటి సంపుటం.

శ్రామికులు తయారుచేసిన వస్తువులు మారకం కోసం మార్కెట్ లోకి ప్రవేశించినప్పుడు వినియోగదారుడు ఆ వస్తువులో ఉందని భావించే ఉపయోగపు విలువను బట్టి, వస్తువుల గిరాకీ, సరఫరాలను బట్టి ఆ వస్తువుల్లో (సరుకుల్లో) ఉన్న శ్రమ విలువకు ధర చెల్లించబడుతుంది. దీనివల్ల తన శ్రమ విలువపై గానీ, ఆ శ్రమద్వారా తయారైన వస్తువుల విలువ నిర్ణయించటంపై గానీ శ్రామికుని నియంత్రణ ఉండదు. కనీసం అతని ప్రమేయం కూడా లేకుండా పోతుంది. దీనివల్ల దేవుడిని సృష్టించిన మానవుడు తిరిగి ఆ దేవుడిమీద ఆధారపడినట్టు, సరుకులను తయారుచేసిన శ్రామికుడు తిరిగి ఆ సరుకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడినట్టు కనిపిస్తుంది. ఆ దేవుడు స్వయంభువు, సర్వాంతర్యామి, సకల ప్రపంచాన్ని నడిపించేవాడు అని ఎలా భావిస్తామో అచ్చం అలాగే సరుకులకు సొంత విలువ ఉంటుందని, అది పెరగడం తగ్గడం అనే వాటి ద్వారా శ్రామికుల వేతనాలే కాక వారికి పని దొరకడం కూడా ఆధారపడి ఉంటుందని అనిపిస్తుంది.

వినియోగదారులు ఒక సరుకు సాపేక్షంగా తమకు 'ఎంత విలువ చేస్తుంది' అని అంచనా వేసుకుంటారు. అంటే ఆ సరుకు ఎంత ధరకు కొనవచ్చునో తన అభిరుచులను బట్టి అంచనా వేసుకుంటాడు.(అయితే సరుకుల్లో ఉన్న శ్రమ విలువ ఆ సరుకు ధర హెచ్చుతగ్గులకు సాపేక్షంగా హద్దులు ఏర్పరుస్తుంది). ఇక్కడ జరిగేది సరుకుకు వస్తుగత విలువను ఆపాదించడం. కొనుగోలుదారూ అమ్మకందారూ కలిసి సరుకు విలువను సరుకుకే ఆపాదించడం జరుగుతుంది. ఆ సరుకు ఉత్పత్తిదారుల ప్రమేయం కనిపించదు. మొత్తంగా ఒక వస్తువుకు స్వతంత్ర, వస్తుగత విలువ, వాస్తవికత ఉన్నట్టు కనిపిస్తుంది. నిజానికి వస్తువు, లేదా సరుకుకు ఉత్పత్తిదారు,

అమ్మకందారు, కొనుగోలుదారు కల్పించే విలువకు అతీతంగా స్వతంత్ర విలువ అంటు ఏమీ ఉండదు.

సారంలో కేపిటలిజం సరుకులను ప్రధానంగా తన ప్రయోజనం కోసమే ఉత్పత్తి చేస్తుంది. ఒక సరుకు యొక్క అమూర్త 'మారకపు విలువ' యజమానులకు లాభం తెచ్చి వారిని సంపన్నులను చేయడం, శ్రామికులకు 'లేమి'ని ఇవ్వడమే కాక, అంతకు మించి అది 'సరుకుల ఆరాధన' కు ప్రాతిపదికగా ఉండి బలోపేతం చేస్తుంది. ఈ సరుకుల ఆరాధనమే కేపిటలిజంలోని అన్ని భావజాల రూపాలకు ప్రాతిపదిక.

సరుకుల ఆరాధన అనేది మార్కెట్ వ్యవహారాల నుండి జనించిన ఆర్థిక అంశం. అంటే పాదార్థిక విషయం. అయితే అది ఒక మానసిక స్థితిగా వ్యక్తం అవుతుంది. ఈ మానసిక స్థితి సాంస్కృతికం. ఈ పాదార్థిక, సాంస్కృతిక విషయాలు రెండూ వేరువేరు పరిణామాలు కాదు. ఒకే పరిణామానికి చెందిన రెండు పార్శ్వాలు. ఒకటి లేకుండా మరొకటి ఉండదు. మరో విధంగా చెప్పాలంటే అది ఏకకాలంలో వైయక్తికంగా నిర్ణయించబడే సామాజిక విషయం, అదే సమయంలో సామాజికంగా నిర్ణయించబడే స్వీయాత్మక జ్ఞాన సిద్ధాంతం. అంటే సామాజిక కార్యకలాపమైన మార్కెట్ కార్యకలాపాలు సరుకుల పట్ల ఆరాధన భావాన్ని వ్యక్తులలో కలుగజేస్తాయి. వ్యక్తులలో కలిగిన ఈ సరుకుల ఆరాధన సామాజిక అంశమై తిరిగి వ్యక్తుల చైతన్యంలో ఆయా వ్యక్తుల స్వీయాత్మక లక్షణాలను బట్టి ప్రతిఫలిస్తుంది.

దీన్ని ఎలా అన్వయించుకోవాలి? సరుకుల ఉత్పత్తి, పంపిణీ, వినిమయం ఆర్థిక కార్యకలాపమే గాని సాంస్కృతిక వ్యవహారం కాదు. సరుకుల ఆరాధన ఆర్థిక వ్యవహారం కాదు, అది సాంస్కృతిక అంశం. సరుకుల ఆరాధన లేక పోయినా ఆర్థిక వ్యవస్థ, మానవ జీవితం మనగలవు. అయితే లాభమే ఏకైక ధ్యేయంగా పనిచేసే కేపిటలిస్టు వ్యవస్థ పనితీరునుండి 'సరుకులను ఆరాధించే సంస్కృతి' జనించి కేపిటలిజం విశిష్ట లక్షణంగా రూపొంది, దాని మొత్తం పని

విధానంలో ఒక ప్రధాన భాగం అవుతుంది. మరో రకంగా చెప్పాలంటే 'సరుకులను ఆరాధించే సంస్కృతి' కేపిటలిజం మనుగడకు, దాని లాభార్జనకు ప్రాణవాయువుని అందిస్తుంది. అంటే సంస్కృతి ఆర్థిక వ్యవస్థకు ఆధారం, ఊత కర్ర అయ్యింది. డబ్బు ఆరాధన, పెట్టుబడి ఆరాధనలు కూడా ఇలాగే ఆర్థిక విషయాలను ప్రభావితం చేసే సాంస్కృతిక అంశాలు. నిజానికివి సాంస్కృతిక విషయాలుగా వ్యక్తమయ్యే ఆర్థిక అంశాలు.

సరుకుల సంకేతారాధన యొక్క తీవ్ర ప్రభావం ఏమంటే, అది వాస్తవ సామాజిక సంబంధాలను మరుగు పరుస్తుంది. శ్రామికులను ఒకరినుండి ఒకర్ని, వారి శ్రమ ఉత్పత్తుల నుండి ఎలియనేట్ చేస్తుంది. అలానే వినిమయ దారులను కూడా శ్రామికుల నుండి మొత్తం మీద భౌతిక ప్రపంచం నుండి ఎలియనేట్ చేస్తుంది. అంటే వారు భౌతిక ప్రపంచంలో జీవిస్తూ కూడా దాన్ని తమకు చెందినదిగా కాక పరాయి ప్రపంచంగా, లేదా తాము దానికి చెందిన వారము కాము అనే భావంతో ఉంటారు. ఎలియనేషన్ భౌతిక జీవితం నుండి పుట్టిన ఒక మానసిక స్థితి. అంటే అది ఒక సాంస్కృతిక అంశం.

మార్క్స్ చెప్పిన 'సరుకుల ఆరాధన' సిద్ధాంతం ప్రకారం పాదార్థిక, సాంస్కృతిక అంశాలు రెండూ పెనవేసుకొని పోయి ఉంటాయి. వీటిలో దేన్ని కూడా ద్వితీయమని, లేదా మరొక దాన్నుంచి పుట్టిందని చెప్పే వీలు లేదు. ఉపయోగపు విలువ, విలువలు ఇటు కేవలం ప్రకృతి పదార్థాలు కావు, అటు శుద్ధ సామాజిక-సాంస్కృతిక విషయాలు కావు. కేపిటలిస్టు ఆర్థిక వ్యవస్థ భిన్న మార్గాల్లో వీటిని జతచేసి వీటికి సామాజికత- పాదార్థికత, సంస్కృతి-ప్రకృతి ఉన్నాయని చెబుతుంది. వీటి పరస్పర ఆధారం ఆధునిక సమాజానికి చిత్రమైన ప్రత్యేక చలన సూత్రాలను కల్పిస్తుంది.

దీన్ని కొంత వివరించు కుందాము. ఉపయోగపు విలువ శుద్ధ ప్రాకృతిక మైనదిగా పొరబడ కూడదు. జీవుల కనీస జీవితావసర వస్తువులను మాత్రమే ప్రాకృతికమైన ఉపయోగపు విలువలుగా చెప్పగలం. మనం ఒక అవసరాన్ని

తీర్చే వస్తువు యొక్క ఉపయోగాన్ని 'ఉపయోగపు విలువ' గా అర్థం చేసుకుంటా ము. మనం ఉపయోగించే చాల వస్తువులు చారిత్రికంగా, సామాజికంగా ఉపయోగపు విలువలుగా రూపొందించబడినవి. ఉదాహరణకు సెల్ ఫోను మనకు గొప్ప ఉపయోగపు విలువ కల వస్తువు. గత సమాజాల్లో అటువంటి వస్తువే లేదు. అంటే సెల్ ఫోను గాలి, నీరు, ఆహారం లాగ ప్రాకృతికంగా ఉపయోగపు విలువ కలిగినది కాదు. మన అవసరాన్ని తీర్చే సెల్ ఫోను ఉపయోగపు విలువ భౌతికమైనదే! అయితే 'ఐ ఫోను' తనకు హోదా, గుర్తింపు ఇస్తుందని ఒక వ్యక్తి భావిస్తే, ఆ భావన నిజమైనా, అబద్ధమైనా అదికూడా అతనికి ఉపయోగపు విలువే! ఈ ఉపయోగపు విలువ సాంస్కృతిక సంబంధమైనది. సాంస్కృతికమైన ఉపయోగపు విలువలన్నీ కల్పితాలు, చెడ్డవి అనే నిర్ణయానికి రాకూడదు. మానవాభ్యుదయం కోసం, విప్లవం కోసం కృషి చేసే వారు ఆ కృషిలో పొందే ఉపయోగపు విలువలు మహోన్నతమైనవి. ఇక్కడ మనం గుర్తించాల్సిన అతి ముఖ్య విషయం ఏమంటే ఉపయోగపు విలువలు శుద్ధ పాదార్థికమైనవి మాత్రమే కాదు. అవి సాంస్కృతిక సంబంధమైనవి కూడా.

ఇక 'విలువ' గురించి చూద్దాం. వ్యక్తుల కృషి నిజమైన విలువలుగా మారాలంటే అవి సామాజికంగా గుర్తింపు పొంది తీరాలి. ఒక వస్తువును తయారు చేసినప్పుడు మనిషి శ్రమ ఆ వస్తువులోకి చేరుతుంది. ఆ వస్తువు విలువ అంటే ఇలా చేరిన శ్రమను కచ్చితంగా లెక్కిస్తే వచ్చేది కాదు. అదే రకం వస్తువులను తయారు చెయ్యడంలో వివిధ వ్యక్తులు వెచ్చించిన వివిధ (ఎక్కువ, తక్కువ) మొత్తాల శ్రమను సరాసరి చేయగా వచ్చిందే ఆ వస్తువు 'విలువ'. నైపుణ్యం కల చురుకైన శ్రామికుడు తక్కువ సమయంలోనే వస్తువును తయారు చేస్తే, అంత నైపుణ్యం లేని వానికి ఎక్కువ సమయం పట్టవచ్చు. కాని ఇరువురి వస్తువులకి మార్కెట్లో ఒకే ధర లభిస్తుంది. అంటే వస్తువు విలువ ఆ వస్తువులో దాగి ఉన్న శ్రమను కచ్చితంగా ప్రతిబింబించదు. ఉజ్జాయింపుగానే ప్రతిఫలి స్తుంది. సమాజంలో వస్తువుల మారకానికి ఈ

ఉజ్జాయింపు అత్యవసరం. విలువకు భౌతిక వాహకమైన 'మారకపు విలువ', అంటే 'ధర' విలువకు కచ్చితమైన ప్రతినిధి కాదు. ఎందుకంటే ధరను సరఫరా, గిరాకీ, కొరత, వినియోగదారుల అభిరుచుల్లో వచ్చే మార్పులు మొదలైన అనేక విషయాలు ప్రభావం చూపి నిర్ణయిస్తాయి. ఫేషన్ మారిపోయి ఏవైనా దుస్తులు, వస్తువులు అమ్ముడుపోక ధ్వంసం అయితే వాటి విలువ వాస్తవం కాకుండా ధ్వంసం అయినట్లే! అందుచేత 'విలువ' పూర్తి పాదార్ధికం కాదు. అది సాంస్కృతికం కూడా. అది సంస్కృతి లాగానే సామాజిక సంబంధాల నుండి పుట్టి నిర్వచించబడుతుంది.

సరుకుల ఆరాధన సర్వ సాధారణంగా డబ్బు ఆరాధనగా వ్యక్తమవు తుంది. ఆధునిక సమాజంలో కేంద్ర నైతిక విలువ ఆర్ధిక విలువే. కేపిటలిజంలో ఎల్లప్పుడూ ఆర్ధిక రంగమే ఆధిపత్య రంగం. ఉదాహరణకు ప్రపంచంలోకెల్లా అత్యుత్తమ విద్యా విభాగంగా విద్యా ప్రమాణాల రేటింగ్ సాధించిన మిడిల్ సెక్స్ తత్వశాస్త్ర విభాగాన్ని ఆ తర్వాత రెండేళ్లకే ఆర్ధిక కారణాలతో మూసేశారు. మార్క్సిస్టు సూత్రీకరణలో డబ్బు ఒక సామాజిక సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. అందులో ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను మార్పిడి చేసుకోవడం ద్వారా సామాజిక సంబంధంలోకి ప్రవేశిస్తారు. అంటే మారకపు విలువ కలిగిన సరుకులను మారకం చేసుకుంటారు. అందుచేత మారకపు విలువ 'డబ్బు' అనే మారువేషం వేస్తుంది.

"డబ్బు వాస్తవానికి శ్రమ, దాని ఉత్పత్తుల ఒక ప్రత్యేక వ్యక్తీకరణ తప్ప మరేమీకాదు. అయితే ప్రయివేటు ఉత్పత్తి ప్రాతిపదికకు విరుద్ధమైనదిగా అది ఎల్లప్పుడూ అంత్య విశ్లేషణలో ఇతర సరుకులతోపాటు ఒక ప్రత్యేక సరుకుగా కనిపించి తీరాలి"- మార్క్స్.

"మానవ జీవితానికి, సమాజానికి నన్ను సంధానించే బంధం డబ్బే అయినప్పుడు, అదే నన్ను, ప్రకృతిని, మనిషిని కలిపి కడుతున్నప్పుడు, డబ్బే అన్ని బంధాలకు బంధం కాదా?" - మార్క్స్, రాత ప్రతులు.

"మానవ, అలాగే సహజ గుణాలన్నిటినీ తలక్రిందులుగా, గందరగోళం చేయడం, అసాధ్యమైన వాటి మధ్య సయోధ్య కుదర్చడం లాంటి డబ్బు కుండే దైవశక్తి మనుషుల వేరుపడే, పరాయి అయ్యే, జాతి స్వభావ స్వీయ విసర్జన లక్షణంలో వుంది. పరాయిదైపోయిన మానవాళి సామర్ధ్యమే డబ్బు." మార్క్స్, రా. ప్ర.

ఆ విధంగా ఊహాత్మక కోరికలను వాస్తవంగా మార్చే సామర్ధ్యం డబ్బుకి ఉందని భావించడం జరుగుతోంది. రాత ప్రతులలో మార్క్స్ చెప్పినదాని ప్రకారం బింబాన్ని వాస్తవంగా, వాస్తవాన్ని కేవల ప్రతిబింబంగా మార్చే శక్తి మనుషులకు బాహ్యంగా ఉంటూ ఉమ్మడి మాధ్యమంగా పని చేసే డబ్బుకి ఉంది. ఈ శక్తి మనిషిగా మనిషి నుండి పుట్టేది కాదు. మానవ సమాజంగా సమాజం నుండి పుట్టేది. డబ్బు మనిషి, ప్రకృతుల నిజమైన ముఖ్య శక్తులను అమూర్త ఊహలుగా, హింసించే కిమ్మీరాలుగా (chimeras) మార్చి వేస్తుంది. అందుచేత లోపాలను నిజమైన ముఖ్య శక్తులుగా, అద్భుత కిమ్మీరాలుగా మార్చి వేస్తుంది. అయితే నిజానికివి అశక్తతలు. వ్యక్తి ఊహల్లో మాత్రమే ఉంటూ నిజమైన శక్తులు, సామర్ధ్యాలుగా మారతాయి.

"సరుకుల సమస్యను విడిగా చూడకూడదు. చివరకు అర్ధ శాస్త్రానికి సంబంధించిన కేంద్ర విషయంగా కూడా చూడకూడదు. దాని అన్ని పార్శ్వాల తో సహా పెట్టుబడిదారీ సమాజ కేంద్ర, నిర్మాణాత్మక సమస్యగా పరిగణించాలి. అలా చేస్తేనే సరుకు సంబంధాల నిర్మాణం బూర్జువా సమాజపు అన్ని వస్తు గత రూపాలతో పాటు వాటికి అనుగుణ్యమైన స్వీయ గత రూపాల నమూనా లభిస్తుంది." — లూకాక్స్.

మార్క్స్ చెప్పిన ఎలియనేషన్ సిద్ధాంతం ప్రకారం *మనుషులు తమ సొంత ఉత్పత్తుల నుండి వేరు పడిపోవడాన్ని హేతుబద్ధం గావించడం మనుషులు తమ నుండి తాము వేరుపడి పోవడానికి దారితీస్తుంది*. ఆవిధంగా వాస్తవికత మనుషులకు ప్రకృతికి మధ్య సంబంధంలా కనిపించదు. ప్రకృతితో మానవుని

సంబంధాలు, మానవ ఇంద్రియ సంవేదనలు సమాంతర మైనవి కావటం వల్ల మానవులు ఇంద్రియానుభూతులు కూడా క్రమేణ మారిపోతాయి.

## మూర్తీకరణ (reification)

మార్క్స్ 'సరుకుల ఆరాధన' భావన ఆధారంగా లూకాక్స్ మూర్తీకరణ భావనను అభివృద్ధి చేశాడు. ఇది కూడా మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అధ్యయనం చేయవలసిన మరో ముఖ్య విషయం. దీని ప్రకారం సజీవం, స్వీయాత్మకం, మానవ సంబంధమైనది నిర్జీవ వస్తువుగా మారడమే మూర్తీకరణ. మానవులు జీవితావసరాలు తీర్చుకునే ప్రయత్నంలో సమిష్టి శ్రమ, దానిఫలితంగా సమాజం వచ్చాయి. మానవులు లేని 'మానవసమాజం' ఉండదు. మనుజులందరూ కలిసి జీవించే ఒక వ్యవస్థ సమాజం. స్వీయాత్మక వ్యక్తుల ఉద్దేశపూర్వక పరస్పర చర్యలతో కూడిన ఈ సమాజం ఒక వస్తుగత ఉనికిని పొంది మనుషులకు పరాయిదైపోయి వారికి శత్రు స్థానంలో నిలుస్తుంది. అంటే సమాజం మనుషులకు లేదా సమాజ సభ్యులకు అతీత మైనది. సమాజాన్ని వారు నియంత్రించ లేరు, మార్చ లేరు. సమాజమే వ్యక్తులను నియంత్రిస్తుంది. మానవుల మధ్య సంబంధాల వల్ల సమాజం ఏర్పడింది. సజీవ మానవ సంబంధాలు ఎప్పుడైతే నిర్జీవ సరుకుల మధ్య సంబంధాలుగా కనిపించటం ఆరంభించాయో అప్పుడే ఆ సంబంధాలకు వేదికైన సమాజం స్వీయాత్మక ఉద్దేశాలున్న సజీవ వ్యక్తుల క్రియాశీల కార్య కలాపాల వ్యవస్థగా కాక, నిర్జీవ, వస్తువులాంటి వ్యవస్థగా దర్శనమిస్తుంది. ఏ విధంగాను దాన్ని మార్చలేము అనిపిస్తుంది. వాస్తవ మనుషుల మధ్య ఉత్పత్తి సంబంధాలు కనిపించకుండా కేవలం సరుకుల మధ్య సంబంధాలుగా మాత్రమే కనిపించినట్టే సమాజంలో సజీవమైనది, క్రియాశీలమైనది ఏమీ కనిపించకుండా కొండ వాలులో దొర్లే బండరాయిలా దాని గమనం

కనిపిస్తుంది. సామాజిక వ్యవస్థను, దాని గమనాన్ని మార్చాలని, మార్చగల మని అనిపించదు. మనకు లొంగని అదృశ్య శక్తిలా కనిపిస్తుంది.

మూర్తీకరణ వల్ల వ్యక్తులకు ఎన్ని సామర్థ్యాలున్నా, ఎంత ప్రతిభ ఉన్నా దానికి గుర్తింపు ఉండదు. అత్యంత నైపుణ్యంతో మనిషి తయారుచేసిన సెల్ ఫోన్‌కున్న ఆదరణ, గుర్తింపు దాన్ని తయారు చేసినవారికి ఉండదు. వ్యక్తిత్వం అంటే ఒక వ్యక్తికి ఉన్న శక్తి సామర్థ్యాలూ, నైపుణ్యాలూ, జ్ఞానం, మానసిక లక్షణాలతో కూడినది. దీనికి విలువ ఏమీ ఉండదు. ఆ వ్యక్తికి ఎంత సంపద ఉంది అనే దానితోనే అతనికి గుర్తింపు కూడా ఉంటుంది. అంటే మనిషి వ్యక్తిత్వానికి విలువ లేదు. వస్తువులకు మాత్రమే విలువ ఉంది. కేపిటలిస్ట్ ఉత్పత్తి, వినిమయాలు లాభదాయకంగా పనిచేయడానికి ఈ పరిస్థితి అవసరం. సంపదలనూ వస్తువులనూ కలిగి ఉండటం ద్వారా మాత్రమే వ్యక్తి గుర్తింపు పొందే పరిస్థితివల్ల నిజమైన వ్యక్తిత్వమంతా నశించి సంపదలనూ, వస్తువులనూ సంపాదించడమూ, వినియోగించడమే ఏకైక అత్యుత్తమ వ్యక్తిత్వ లక్షణంగా అవతరిస్తుంది. అంటే మనిషి వ్యక్తిత్వ పరంగా సార భూతమైన దాన్ని అంతా కోల్పోతాడు. తాను కోల్పోయిన వ్యక్తిత్వాన్ని వస్తు సంపదల్లో చూస్తాడు. అందాన్ని ఆస్వాదించే రసజ్ఞత మనిషిలో సామాజికంగా తర తరాల సాంస్కృతిక వారసత్వంగా అభివృద్ధి చెందుతుంది. ఇపుడు ఈ రసజ్ఞత అతను పెంచి పోషించుకున్నదీ, అతని అభిరుచికి తగినదీ కాదు. కార్లూ సెల్ ఫోన్లూ, బైకులూ, దుస్తులూ ఇలా అన్నింటిలోనూ వాటిని తయారు చేయించే వ్యాపారులు ప్రచారం చేసే ప్రమాణాల ప్రకారం లేదా పేషన్ ప్రకారం తన రసజ్ఞతను మార్చుకున్నాడు. చివరకు తన శరీర ఆకారం, జుట్టు, మేనరిజమ్స్, అన్నీ ఎవరో ఒక సెలబ్రిటీని అనుకరించి రూపొందించుకుంటున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో జీవిస్తున్న మనుషులకు వ్యక్తిత్వం ఉందని చెప్పలేం. అదే సమయంలో వీరు వ్యక్తిత్వాన్ని ఒక మేరకు అయినా వస్తువులకు ఆపాదిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే మనుషులకు విలువ, వ్యక్తిత్వం లేకుండా పోయి అవి వస్తువులకు ఆపాదించబడతాయి.

అంటే వస్తువులకు వ్యక్తిత్వం ఉన్నట్లుగా మనుషులు భావిస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇది ఒక అతి ముఖ్యమైన సాంస్కృతిక సమస్య. మనుషులు వస్తువులుగా పరిగణించబడే దానికి ఉదాహరణ ఏ ప్రమాదంలో అయినా మనుషులు చనిపోతే వెంటనే చేసే డిమాండ్ నష్టపరిహారం. మనిషి ఒక వస్తువు. వస్తువును నష్టపోయినందుకు పరిహారం కావాలి. ఇదే దీని సారాంశం. కుటుంబానికి ఆర్థిక సాయమనేది వట్టి మాట. ఎందుకంటే డిమాండు చేసే పరిహారం, అలాగే చెల్లించేది కూడా చనిపోయిన వ్యక్తుల ఆర్థిక హోదాను బట్టి ఉంటుంది కానీ ఆ వ్యక్తుల కుటుంబాల అవసరాలను బట్టి కాదు. కుటుంబాల ఆర్థిక అవసరాలను బట్టి ఇస్తే పేద వ్యక్తులకు ఎక్కువ మొత్తం, మధ్యతరగతికి తక్కువ డిమాండ్ చేయాలి. ధనికులకు ఏ సహాయం డిమాండ్ చేయకూడదు.

# 9. సామ్రాజ్యం- సంస్కృతి

గ్లోబలైజేషన్ గురించిన అవగాహనలో అతి ముఖ్య సందర్భం ఈ సామ్రాజ్యం. 16వ శతాబ్దం నుండి యూరోపియన్ సామ్రాజ్యవాదం, 20వ శతాబ్దం మధ్య నుండి అమెరికా సామ్రాజ్యవాదాలు రాజకీయ, సాంస్కృతిక అధ్యయనాల్లో ముఖ్య భాగాలుగా ఉన్నాయి.

'సాంస్కృతిక సామ్రాజ్యవాదం'(cultural imperialism) భావనను 1970ల నుండి సాంస్కృతిక సిద్ధాంత వేత్తలు చర్చిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరపు సామ్రాజ్యవాదం బలహీనమై అమెరికా ఒక బలమైన సామ్రాజ్యవాద దేశంగా అవతరించింది. ప్రపంచీకరణకు మార్గం సుగమం చేసిన అతి ముఖ్య విషయాలు రెండు. ఒకటి జెట్ విమానాలు కాగా, రెండోది ఇంటర్నెట్. దీంతో 'దేశాల మధ్య సమాచార ప్రవాహానికి ఏ అడ్డంకులూ లేవు' అనే సిద్ధాంతం అంతర్జాతీయ చింతన లో ఆధిపత్యం వహించ సాగింది. 'సమాచార స్వేచ్ఛా యుత ప్రవాహ' భావన పుట్టుక, విస్తరణ అనేవి అమెరికా ప్రపంచ ఆధిపత్యం విస్తరణతో ముడిపడి సాగాయి. స్వేచ్ఛాయుత సమాచార పంపిణీ అనేది అమెరికా సామ్రాజ్యవాదం ఆధిపత్యానికి ఎగబ్రాకడానికి కావలసిన అతికొద్ది ముందస్తు షరతులలో ఒకటి. 'మీడియా సాంస్కృతిక సామ్రాజ్యవాదం' సాధారణ సామ్రాజ్యవాద వ్యవస్థకు ఉపాంగం. అది స్వతంత్రమైనది కాదు. అభివృద్ధి చెందిన కార్పొరేట్ ఎకానమీలో మీడియా సాంస్కృతిక విభాగం నిర్ణయాత్మక పారిశ్రామిక, ఫైనాన్స్ రంగాల లక్ష్యాలను సమర్ధిస్తుంది. అమెరికన్ మీడియా అమెరికా ఆర్థిక ప్రయోజనాల మార్కెటింగ్ విభాగం కంటే కొంచెం ఎక్కువే!

మీడియా సాంస్కృతిక అధ్యయన కారుల్లో చాలామంది గ్లోబల్‌కి, లోకల్‌కి మధ్య గతితర్కం ఉందని వాదిస్తారు. సారంలో కేపిటల్ గ్లోబల్. సర్వ సాధారణ నియమంగా శ్రమ లోకల్. ఇంటర్నెట్ వాస్తవానికి కేపిటల్ యొక్క

కేంద్రీకరణకు, గ్లోబలైజేషన్‌కు దారితీస్తుంది. ఈ పని అది కచ్చితంగా నెట్‌వర్క్ ల వికేంద్రీకరణ శక్తిని ఉపయోగించడం ద్వారా చేస్తుంది. ఉత్పత్తి, దానికోసం జరిగే శ్రమ అనేక దేశాలకు విస్తరిస్తుంది. శ్రమను అతి సూక్ష్మ స్థాయికి విభజిస్తారు. ఉదాహరణకు నాలుగు భాగాలు నాలుగు దేశాల్లో తయారైన పార్కర్ పెన్‌ను చాల మంది చూసి ఉంటారు. నెట్‌వర్క్‌లు కేపిటల్ యొక్క మహా నెట్‌వర్క్‌లుగా వివిధ రంగాల కేపిటలిస్టు ప్రయోజనాలను ప్రపంచ స్థాయిలో సమగ్రం చేస్తాయి. అసలు ఘర్షణలుండవని కాదు. ఐతే అన్నిటిని అదుపుచేసే తర్కం కిందనే శ్రామికులు తమ సమిష్టి ఐడెంటిటీని కోల్పోతారు. వారి సామర్థ్యాలు, పని పరిస్థితులు, ప్రయోజనాలు, ప్రణాళికలు నానాటికి మరింత వ్యక్తిగతం అయిపోతాయి. కరోనా ప్రభావం వల్ల సాఫ్ట్‌వేర్ రంగంలో వర్క్ ఫ్రం హోమ్ విధానం అమల్లోకి వచ్చింది. ఉద్యోగి ఒంటరిగా పని చేస్తు న్నాడు. పెట్టుబడి, శ్రామికులు నానాటికి మరింతగా భిన్న కాలాలు, స్థలాలలో ఉండే ధోరణి పెరుగుతుంది. సమాచార ప్రవాహం మొదలయ్యే స్థలం, చేరుకునే స్థలాల మధ్య దూరం కంప్యూటర్ నెట్‌వర్క్‌ల ద్వారా మాయమవుతుంది. వారు ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తారు కాని ఒకరితో మరొకరికి సంబంధం ఉండదు. వీటన్నిటి సాంస్కృతిక పర్యవసానాలను అంచనా వేయడం చాల కష్టం.

## నయా ఉదారవాదం.

వర్తక వ్యాపారాలు నాగరికం చేస్తాయని ఆడం స్మిత్ చెప్పిన దాన్ని మార్క్స్ సమర్థించాడు. వాణిజ్యం ద్వారా ప్రపంచ వ్యాప్త ఏకీకృత ఆర్థిక వ్యవస్థ ఏర్పడి ప్రపంచాన్నంతా ఏకం చేసి వెనుకబడిన ప్రాంతాలను కూడా ఆధునికం చేసే శక్తిగా పనిచేస్తుందని మార్క్స్ అన్నాడు.

ఈవేళ ప్రపంచీకరణ వల్ల ఆధునికీకరణ జరుగుతున్న మాట నిజమే అయినా, దాని వల్ల కలిగిన విధ్వంసకర సామాజిక ఫలితాలు కేపిటలిస్టు వ్యతిరేక ఉద్యమం కొనసాగడానికి ప్రధాన కారణంగా పనిచేస్తున్నాయి.

కేపిటలిజం పట్ల ప్రజల్లో వున్న వ్యతిరేకతను సంఘటితం చేసి దాన్ని రాజకీయ శక్తిగా మలచడంలో ప్రపంచ వ్యాపితంగా వామ పక్షాలు విఫలం అవుతు న్నాయి. దాంతో ఈ విధ్వంసం కొత్త రూపాల్లో జాతీయవాద, మత వాద, జాతి తత్వ ఛాందస వాదాలను, ఫాసిస్టు ధోరణులను ప్రేరేపిస్తున్నది. ఇవి సాంస్కృతిక సమస్యల అధ్యయనాన్ని, సాంస్కృతిక పోరాటాన్ని అత్యవసరం, తక్షణ కర్తవ్యం చేశాయి.

"నయా ఉదారవాదమంటే వ్యక్తి స్వేచ్ఛ, పరిమిత ప్రభుత్వ జోక్యంపై ఆధారపడిన స్వేచ్ఛా యుత మార్కెట్ భావజాలం. ఇందులో మానవ స్వేచ్ఛ మార్కెట్లో హేతు బుద్ధి, స్వప్రయోజనం కల వ్యక్తుల చర్యలతో ముడిపడి ఉంటుంది." - అని స్టెడ్మన్ జోన్స్,2012 లో చెప్పాడు. 1930 చివర్లో పేరిస్‌లో జరిగిన ఒక అకడమిక్ సెమినార్‌లో మొట్టమొదట 'నియో లిబరలిజం' అనే మాటను వినియోగించారని ఈయన అభిప్రాయం.

నయా ఉదారవాద విధానాలను మొట్టమొదట అమలు చేసిన వారు మార్గరెట్ థాచర్, రోనాల్డ్ రీగన్లు. 1981 లో థాచర్ తన రాజకీయ విధానాల గురించి ఇలా చెప్పింది. నా "పద్ధతి ఆర్థికపరమైనది. కాని లక్ష్యం ఆత్మను మార్చడం".

నయా ఉదారవాదం ప్రధానంగా ఒక రాజకీయార్థశాస్త్ర సిద్ధాంతం. అది ఒక నాగరీకరించే సూత్రం కూడా. ఈ నాగరీకరణ విశాల అర్థంలో సామాజికీకరణ ద్వారా ప్రజల సామాజిక- సాంస్కృతిక ప్రవర్తనను తీర్చి దిద్దుతుంది.

నయా ఉదార వాదం ప్రకారం, 'వివేకవంతమైన ధన కాంక్ష' వ్యక్తికి ప్రోత్సాహక ప్రేరణ. ఏమైనా కాని అసమానత చెడ్డదేమీ కాదు. ఎందుకంటే నిజమైన పోటీలో విజేతలు, పరాజితులు ఉండాలి. పోటీ తత్వంతో కూడిన వ్యాపారంలో గిరాకీ, సరఫరాలు సమానంగా ఉంటాయి. వినియోగదారులు

కోరుకున్నవి అందుతాయి. వినిమయ రంగంలో ఎంపిక అతి కీలకమైనది. వినియోగదారుడే సర్వసత్తాధికారం కల రాజు. పోటీ తత్వం వల్ల ప్రయివేటు సంస్థల మార్కెట్ సమర్ధ వంతంగా పనిచేస్తుంది. అది ప్రజాపంపిణీ, సేవల నిమిత్తం పనిచేసే ప్రభుత్వ సంస్థల కన్నా ఎల్లప్పుడూ చాల మెరుగైనది. ప్రభుత్వ సంస్థలలో వృధా, బాధ్యతారహితమైన బ్యూరోక్రసీల వల్ల ప్రజలు పన్నులుగా చెల్లించిన తమ కష్టార్జితాన్ని నష్టపోతారు. విజయవంతమైన వ్యాపార పారిశ్రామికవేత్తలు, సర్వసత్తాక అధికారం కల వినిమయ దారులు, పన్ను చెల్లించే కష్ట జీవులే కేపిటలిస్టు క్రీడలో ప్రధాన ఆటగాళ్ళు. సోషలిజం ఆచరణలో పనికిరాదని ఇప్పుడు కచ్చితంగా తెలుసు. అది నవీన ఆవిష్కరణ లను అడ్డుకుంటుంది. మనకు వ్యక్తిగత స్వాతంత్ర్యం లేకుండా చేస్తుంది. మన విలువైన ధనాన్ని వృధా చేస్తుంది'.

వర్తమాన కేపిటలిజం, అంటే నయా ఉదారవాదం ప్రతీ విషయంలోను ప్రజల హృదయాలను, మెదళ్లను గెలుచుకోవడానికి భావజాల యుద్ధంలో నిమగ్నమై వుంది. ప్రధాన స్రవంతి మీడియా దీని ప్రధాన సైన్యం. ఈ మీడియాలో 'నయా ఉదారవాదం' అనే మాట వినిపించదు, కనిపించదు. అది ప్రశ్నించ వీలు లేని నిరూపిత సత్యం అన్నట్లుగా వ్యవహరిస్తుంది. సంస్కరణలు, సరళీకరణ, అభివృద్ధి లాంటి మాటలు వేద మంత్రాల్లా వినిపిస్తుంటాయి. నయా ఉదారవాదం సెలబ్రిటీ రోల్‌మాడల్స్ సాయంతో నేడు యువతకు ప్రవర్తనా పద్ధతులను, ఆలోచనా పద్ధతులను నేర్పిస్తున్నది.

నయా ఉదారవాదం ఆర్థిక విషయాలకు, ప్రభుత్వ రాజకీయాలకు పరిమితమైనది కాదని సమాజాన్ని పునర్వ్యవస్థీకరించి, వ్యక్తి ప్రవర్తనా నమూనాను రూపొందించి తీర్చిదిద్దే ప్రణాళికను కలిగి ఉంటుందని ఫోకాల్ట్ గుర్తించాడు. నయా ఉదారవాద క్రీడ రాజ్యానికి వ్యతిరేకంగా మార్కెట్‌ను బరిలోకి దింపుతుందని, అంతిమంగా రాజ్యమూ, దాని కార్యకలాపాలన్నిటినీ

మార్కెట్ యార్డుగా మార్చి వేస్తుందని ఆయన గొప్ప ముందు చూపుతో వివరించాడు.

నయా ఉదారవాదంలో ఎవరి వల్ల ఏ తప్పులు జరిగినా ఎవరికీ క్షమా భిక్ష దొరకదు. అది అతని తప్పైనా, మరొకరి తప్పైనా, వ్యవస్థ సంక్షోభమైనా, దురదృష్టమైనా వ్యక్తి తీవ్ర శిక్షకు గురవుతాడు. *స్వేచ్ఛగా, ఒంటరిగా, తనకు తనే ఏకైక బాధ్యునిగా ఉండమని ఈ నయా ఉదారవాదం వ్యక్తిని శపించింది.* అది సరిగ్గా ఇలాంటి వ్యక్తిత్వాన్నే పెంచి పోషిస్తుంది. సర్వసత్తాక స్వేచ్ఛాయుత వినియోగదారుని, సర్వ సమర్ధుడైన వ్యాపారిని కలుపుతుంది. విశేష మేమంటే ఇది యువతకు స్టీవ్ జాబ్స్ వంటివారిని చూపుతూ చాల ఆకర్షిస్తోంది.

నిర్దాక్షిణ్యమైన కేపిటలిస్టుకి స్టీవ్ జాబ్స్ మంచి ఉదాహరణ. వేదికలపై విన్యాసాలతో అతను నయా ఉదారవాద వ్యక్తికి జానపద హీరోగా మారాడు. అతను చివరి వరకూ అతని సామాజిక జీవితాన్ని 'కౌంటర్ కల్చర్ వ్యక్తి' లా సాగించాడు. అతను కాలేజి చదువు పూర్తిచేయలేదు. శాకాహారి. జెన్ బౌద్ధ అనుయాయి. బిలియన్ల కొద్దీ ధనం పోగు చేసుకున్నప్పటికీ జుకర్ బర్గ్ లాగానే వ్యక్తిగత ఆస్తి గురించి, అనవసర ప్రదర్శన గురించి ఏమాత్రం పట్టించుకోనట్లు ఉంటాడు. అతను సాదాసీదా వస్త్రాలను ధరించేవాడు. జాబ్స్ స్వయంగా ఏమాత్రం కనికరం లేని, క్రూరమైన దోపిడీ వ్యాపారవేత్త.

నయా ఉదారవాదం ఆర్ధిక వివేచన(రేషనాలిటీ) నే అన్నిటికి వర్తింపు చేస్తుంది. అలాగే విభిన్న స్వీయతను నిర్మిస్తుంది. గార్డియన్ పత్రిక నయా ఉదార వాదులను 'హృదయం లేని థాచర్ సంతతి' అని పేర్కొంది.

# 10. వినిమయ సంస్కృతి

## (Consumer Culture)

పెట్టుబడిదారీ సంస్కృతి అధ్యయనాల్లో వినిమయ సంస్కృతి ప్రధాన భాగం ఆక్రమిస్తోంది. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి, పంపిణీ రంగం నుండి పుట్టిన ఒక ముఖ్య సాంస్కృతిక అంశం ఈ వినిమయ వాదం. వస్తువు మారకపు విలువను కేవలం అందులో ఇమిడి వున్న శ్రమ ఒక్కటి మాత్రమే నిర్ణయించదు. శ్రమ విలువ దీర్ఘకాలంలో సరుకు మారకపు విలువను అంటే ధరను నిర్ణయించే ప్రధాన అంశం. వస్తువుకు దాని ఉపయోగపు విలువే ప్రధానం. ఉపయోగం లేని వస్తువులో ఎంత శ్రమ చేరి ఉన్నా దానికి మారకపు విలువ ఉండదు. ఆ ఉపయోగపు విలువ అందరి దృష్టిలో, అన్ని వేళలా సమానంగా ఉండాలని లేదు. ఎటువంటి వాస్తవ(ఉపయోగ) విలువ లేని ప్రాచీన వస్తువును ఒకరు కోటి రూపాయలకు కొన్నారనుకోండి. దాని అర్థం ఏమిటి? వేరెవరి దగ్గర లేని ప్రాచీన వస్తువుకు తను యజమానిని అనే భావంపై ఆధారపడిన ఆనందమే ఆ వస్తువు ఉపయోగపు విలువ. ప్రస్తుతం ఇదే రకమైన తప్పుడు(false) ఆనందం కలిగించే వస్తువులను కొనిపించి లాభాలను ఆర్జిస్తున్నది పెట్టుబడిదారీ విధానం. ఈ రకమైన దోపిడీపై చేయాల్సింది సాంస్కృతిక పోరాటమే. అలాగే కార్మికుల శ్రమశక్తి ధరను వీలైనంత తక్కువగా ఉంచడానికి, ఎక్కువ పని చేయించుకోవడానికి ఎన్ని చేయాలో అన్నీ చేస్తున్నదీ పెట్టుబడిదారీ వ్యవస్థ. యంత్రాలను, రోబోలను ప్రవేశ పెట్టడం లాంటి సాంకేతిక పద్ధతుల్నే కాక, ఉపాధి పోతుందనే భయం పునాదిపై నిర్మించిన స్వీయ నియంత్రణ పద్ధతులను, ఆశ పునాదిగా 'గాడిదను పరుగెత్తించే కేరట్' పద్ధతులను, స్వార్థ పూరిత వ్యక్తివాదాన్ని, దాన్నుండి పుట్టిన ద్వేష పూరిత పోటీ విధానాలను అవలంభిస్తున్నది. వీటన్నిటిపై భావజాల, అంటే సాంస్కృతిక రంగంలోనే పోరాడాల్సి వుంది.

*ఎక్కడైతే సామాజిక హోదా, విలువలూ కార్యకలాపాలూ వస్తు సేవల వినిమయంపై కేంద్రీకృతము అవుతాయో అటువంటి సంస్కృతిని విస్తృతార్థంలో వినిమయ సంస్కృతి అని నిర్వచించవచ్చు.* మరొకలాగ చెప్పాలంటే వినిమయ సంస్కృతిలో నువ్వు ఏం చేస్తావు? నువ్వు దేన్ని విలువైనదిగా చూస్తావు? నిన్ను నీవు ఎలా నిర్వచించుకుంటావు? లేదా గుర్తించబడతావు? అనేది చాల వరకు నీవు వినిమయం చేసే వస్తు సేవలను బట్టి నిర్ణయించడం జరుగుతుంది.

"ప్రభు వర్గంలోని తరగతి ఒక ఇంగ్లీషు కుటుంబ హోదాను ఎలా నిర్ణయిస్తుందో కచ్చితంగా అలానే ఒక కుటుంబం యొక్క కారు ఆ కుటుంబ సామాజిక హోదాను సూచిస్తుంది."- Sinclair Lewis, Babbit

వినిమయ సంస్కృతి మార్కెట్ కల్పించే పాదార్థిక సంస్కృతి యొక్క ఒక రూపం. ఆ విధంగా అది వినియోగదారుడికి, అతను వినియోగించే వస్తు సేవలకూ మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తుంది. సాంప్రదాయకంగా సామాజిక శాస్త్రాలు వినిమయాన్ని ఉత్పత్తి నుండి జనించే స్వల్ప, అప్రధాన విషయంగా పరిగణించేవి. అయితే ఇప్పుడు సోషియాలజిస్టులు ఒక సంస్కృతిగా వినియోగా న్ని అధ్యయనం చేయవలసిన అవసరాన్ని గుర్తిస్తున్నారు. దైనందిన జీవితంలో సామాజిక మార్పుకు దోహదం చేసే అంశాలు ఎలా పనిచేస్తున్నాయో తెలిపే ప్రధాన రంగం వినిమయ సంస్కృతి అనే వాదన బలంగా ఉంది. కేవల వినియోగమే వినిమయ సంస్కృతి కాదు. అది అంతకు మించినది. అది ప్రధానంగా పాదార్థికానికి, సాంస్కృతికానికి మధ్య సంబంధానికి చెందినది. అది వస్తువుల యాజమాన్యం వల్ల వచ్చే హోదా, అసమానతలకు సంబంధించి నది కాదు. ఈ అర్థంలో చూసినప్పుడు వినిమయ సంస్కృతి అంటే కేవలం వాణిజ్య ఉత్పత్తులను వినిమయం చేయడం కాదు. వినిమయ సంస్కృతితో ప్రజల సంబంధం అర్థవంతమైనది. అది కొన్ని ప్రత్యేక హోదా రూపాలను విలువలను ప్రతిబింబించడమే కాక

వాటిని శక్తివంతంగా పునరుత్పత్తి చేస్తుంది. ఈ అర్థంలో అది వర్తమాన సమాజ నిర్మాణానికి, మనుషులకు మధ్య సంబంధంలో కేంద్ర స్థానంలో ఉంటుంది. అంటే కేపిటలిజం పౌరులు తమ దైనందిన జీవితంలో పాటించవలసిన ప్రమాణాలను పునరుత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఆ సామర్థ్యాన్ని వినిమయ సంస్కృతి రుజువు చేస్తుంది. వినిమయ సంస్కృతి మనం ఎవరిమో, ఎలా ఉన్నామో వ్యక్తం చేసుకునే పరికరాలను అందిస్తుంది. కానీ అది అలా అందిస్తూనే, అదే సమయంలో ఒక రకమైన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఆ ఆర్థిక వ్యవస్థ *'సరుకులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛనే' వ్యక్తి స్వేచ్ఛ*గా చూపిస్తుంది. వినిమయ సంస్కృతి వస్తు సేవలను సమకూరుస్తూనే అదే సమయంలో మనుషుల మధ్య సంబంధాలలో చొరబడి వారిని విడదీస్తుంది.

వినిమయ సంస్కృతిని అర్థశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, సాంస్కృతిక అధ్యయనాలు అర్థం చేసుకునే విధానాల్లో భేదాలున్నాయి. సంస్కృతి అనేది అన్ని శాస్త్రాల సమన్వయంతో పని చేసేది మాత్రమే గానీ అదే ఒక శాస్త్ర శాఖ కాదు.

"ప్రపంచ జనాభాలో అధిక సంఖ్యాకులు 'గెలిచిన వానిదే అంతా' (winner-take-all) అనే ఆర్థిక వ్యవస్థలలో పెరుగుతున్నారు. ఇక్కడ వ్యక్తుల ప్రధాన లక్ష్యం తమ పేరాశ (greed)కొద్దీ సంపాదించ గలిగినంతా సంపాదించడమే! ఇటువంటి ఆర్థిక వాతావరణంలో స్వార్థం, శారీరక సుఖాలు ఇంకెంత మాత్రం నైతిక సమస్యలు కాకపోగా జీవిత ప్రధాన లక్ష్యాలు అయిపో యాయి. మనలో చాల మంది మంచి జీవితానికి, మరింత సంపద, భౌతిక వస్తువులు కలిగి ఉండటం తప్పనిసరి అని నమ్మేలా వంచించబడుతున్నారు. మనం బాగుండాలంటే మనం ధనవంతులై ఉండాలనే అభిప్రాయాన్ని జీర్ణించు కున్నాం. మనలో చాలామంది తెలిసో, తెలియకో మన శ్రేయస్సును, సాఫల్య తను అంచనా వేసుకోవడానికి, మన

లోనికి, మన చైతన్యం, మన చిత్తశుద్ధి లను చూడటం కాక, బయటకు అంటే మనకు ఎంత వుంది, మనం ఏం కొనగలం అని చూడటం నేర్చుకున్నారు. అదే విధంగా ఇతరుల యోగ్యత, సాఫల్యతలను వారి వివేకం, దయ, సమాజానికి వారి దోహదం మొ. వాటి ద్వారా కాక వారి దుస్తులు, కారు, సంపదల ద్వారా నిర్ణయించే దృక్పథాన్ని అలవరచుకున్నాం."- రిచర్డ్ ర్యాన్.

"మన సంస్కృతి ఎలా వుందంటే, నిన్ను చూసినప్పుడు నీ గురించి అడిగి తెలుసుకునే దాని కన్నా, నిన్ను చూసిన వెంటనే నువ్వేమిటో నిర్ణయించుకోవడానికే ప్రజలు తొందర పడుతున్నారు. అయితే దీనివల్ల ప్రమాదం ఏమిటంటే ఈ భౌతిక సంకేతాల ఐడెంటిటీ ద్వారా మాత్రమే(ఇతరులనే గాక) నిన్ను నువ్వు గుర్తించడం పట్ల నమ్మకం ఏర్పడటం మొదలవుతుంది. నీ గురించి నీకున్న ఇమేజ్‌ని ఇతరులు నిన్ను ఎలా చూస్తారో ఆ ఇమేజ్‌తో కలగలిపి అయోమయానికి గురి కావడం మొదలవుతుంది. నీ సొంత ఇమేజ్‌ని నీ సొంత విలువ (సంపద) తో కొలిచి గందరగోళ పడనారంభిస్తావు. అంతిమంగా నువ్వు కేవలం ఒక వస్తువుగా, అంటే నువ్వు నడిపే కారు, లేదా కొత్త బూట్లంత విలువైన వానిగా ఫీల్ అవుతావు." - Catalano & Sonnenberg, (1993,).

'కలిగి ఉండటమే ఉండటమా?' (to have is to be?) అనే సమస్యను సోషల్ సైకాలజీ ఎదుర్కొంటున్నది. మన ఐడెంటిటీని నిర్మించడం, వ్యక్తం చేయడం, నిలుపుకొని కొనసాగించడంలో భౌతిక వస్తువులను కలిగి ఉండటం అనేది కీలక విషయం అయిపోయింది.

భౌతిక వస్తు సంపదలను కలిగి ఉండటం, కొత్త వినిమయ వస్తువులను కొనడం రెండూ ఒకటి కాదు. ప్రజలు తమ ఐడెంటిటీని వ్యక్తం చేయడానికి, దాని స్థాయిని పెంచుకోవడానికి బాగున్నామని అనుకోవడానికి (feel good) సరుకులు కొంటారు. దాని ద్వారా తమ ఆదర్శ ఐడెంటిటీకి మరింత చేరువకావడానికి ప్రయత్నిస్తారు. ఇందులో ఆ సరుకుల ధర, ఉపయోగం

లాంటి రేషనాలిటీకి చోటు ఉండదు. నీ వినిమయ వాంఛలను తీర్చడానికి కిక్కిరిసిన మాల్స్ సరిపోకపోతే ఇంటర్నెట్ వుంది. ఒక్క క్లిక్ అంతే!

వస్తువుల కొనుగోలును ప్రేరేపించేవి నిజ అవసరాలు కాక, మానసిక అవసరాలు అయినప్పుడు దానికి పునాదిగా ఉండేది 'విలువ వ్యవస్థ'. ఈ విలువ వ్యవస్థ డబ్బు, ఇతర వస్తు సంపదలే ప్రధాన జీవిత లక్ష్యాలను సాధించే సాధనాలని, ఇవే జీవితంలో సంతృప్తిని, విజయాన్ని, ఆనందాన్ని ఇస్తాయని వక్కాణిస్తుంది. అయితే ఇవేవీ చివరకు మనం ఆశించినవి ఇవ్వవు. భౌతిక సంపదల కోసం వెంపర్లాడే వారు తక్కువ ఆనందం, తక్కువ సంతృప్తి, ఎక్కువ మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని పరిశోధనలు తెలుపుతున్నాయి. అయితే అతికొద్ది మంది మాత్రమే డబ్బు కోసం కష్టపడుతూ కూడా ఆనందంగా వుండగలుగుతున్నారని తెలుస్తున్నది.

గుర్తింపు ఆరాటం, వస్తు వ్యామోహం అనేవి నిర్బంధ కొనుగోలు తత్వాని కి దారితీసి కొనడం ఒక అదుపు చేయలేని వ్యసనంగా మారుతుంది. ఇది ప్రమాదకరమైన మానసిక, ఆర్థిక సమస్యలకు దారి తీస్తుంది. నిర్బంధ కొను గోలు తత్వం నానాటికి పెరుగుతోందని పరిశోధనలు తెలుపుతున్నాయి. 'నేను కొంటున్నాను కాబట్టి నేను ఉన్నాను' (I shop therefore I am) అనే భావజాలం ప్రబలుతున్నది. తక్షణ నివారణా చర్యలు అత్యవసరం.

మాస్ మీడియా వస్తు సంపదల ఆదర్శాలే కాక 'ఎలా కనిపించాలి', 'పరిపూర్ణ శరీరం' ('body perfect') గురించిన ప్రమాణాలను, విలువలను కూడా ప్రసారం చేస్తుంది. ఫేషన్ పరిశ్రమ తన వ్యాపార ప్రకటనల్లో చూపే బక్క చిక్కిన స్త్రీల శరీరాలు తీవ్ర ప్రతికూల ప్రభావాలను చూపుతూ ఆందోళనకరంగా మారాయి. అదే సమయంలో కండలు తిరిగిన పురుషుల ప్రచార చిత్రాలు కూడా అంతే నష్టం చేస్తున్నాయి. బార్బీ లాంటి బొమ్మలు కూడా పిల్లలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, కొన్ని రకాల వస్తు

సామాగ్రి తమను అందంగా తీర్చిదిద్దగలవని 11 ఏళ్లకే పిల్లలు నమ్ముతున్నారని అధ్యయనాలలో తెలిసింది.

అందుచేత వినిమయ సంస్కృతికి మనం చెల్లిస్తున్న వెల ఎంత? అది ఎంత నష్టం చేస్తున్నా అందులో నుండి బయటపడటం అంత సులభం కాదు. ఎందుకంటే అందులో పెద్ద లాభాలు ఇమిడి ఉన్నాయి. అది మన 'లోపలి బోను' (cage within) లా పని చేస్తుంది.

ఆధునిక కేపిటలిస్టు సమాజాల్లో మార్కెటింగ్, వస్తు సేవల వినిమయ ధోరణిని వినిమయ సంస్కృతి అంటున్నారు. ఆధునిక సమాజాల్లో హోదా తారతమ్యాలు ఏర్పడటం, దాన్నిబట్టి మార్కెట్ వివిధ విభాగాలుగా విడిపోవడం జరుగుతుంది. అందులో వ్యక్తుల అభిరుచులు వారి సామాజిక స్థానాలను అంటే వయసు, లింగం, కులం, వృత్తి, జాతి, మొ. మాత్రమే కాక వినియోగ దారునిగా ఆ వ్యక్తి యొక్క సామాజిక విలువలను, వ్యక్తిగత లైఫ్ స్టైల్‌ను కూడా ప్రతిఫలిస్తాయి.

గతంలో సోషియాలజిస్టులు 'వినిమయ సంస్కృతిని' పెట్టుబడిదారుల మోసపూరిత చర్యగానూ, కావాలని చేసే ప్రదర్శన గానూ పరిగణించే వారు. అదే సమయంలో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు వినిమయ సంస్కృతి అంటే 'వినియోగదారుని సార్వభౌమాధికారం' అని నిర్వచించారు. ఆధునిక సాంస్కృతిక అధ్యయనాలు ఈ రెండు వాదనలూ పాక్షికమైనవే అని తిరస్కరిస్తున్నాయి.

ఒక సాంస్కృతిక సిద్ధాంతి అభిప్రాయం ప్రకారం ఆధునిక పెట్టుబడిదారీ సమాజాల్లో మూడు కారణాల వల్ల వినిమయాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది.

1. ఉత్పత్తి ప్రక్రియకు నిరంతర ప్రోత్సాహం అందించడం, పనికి ప్రేరణ ఇవ్వడం. అంటే ఎక్కువ సరుకులు కొనాలంటే ఎక్కువ సంపాదించాలి. దానికోసం ఎక్కువ పనిచేయాలి.

2. అన్ని సామాజిక బృందాల హోదాల్లో తేడా తెలిపే ముఖ్య సంకేతంగా మారడం. అంటే వ్యక్తి కొనుగోలు చేస్తున్న, వాడుతున్న వస్తువులను బట్టి సమాజంలో అతనికి హోదా లభించడం.

3. మన సుఖాలకూ, మన కలలకూ వినిమయమే ప్రధాన మూలం కావడం. అంటే సౌకర్యవంతమైన జీవితానికి కావలసిన వస్తువులతో మనం సంతృప్తి చెందటం లేదు. అవసరం లేకపోయినా వివిధ వస్తువులను వాడటమే సుఖం అనే భావన బలపడింది. మరిన్ని వస్తువులను సొంతం చేసుకోవాలని మనం రోజూ కలలుకంటున్నాం.

వినిమయ సంస్కృతి కొత్త వాంఛలూ అవసరాలూ సృష్టిస్తుంది. ఉదాహరణకు గతంపై మక్కువ (nostalgia), పాత కళారూపాల అనుకరణ, ఆరాధన (pastiche)మొ. వాటికి కల్పిత అంశాలను చేర్చి టూరిజం పరిశ్రమ సహకారంతో కొత్త హెరిటేజ్ పరిశ్రమ అభివృద్ధి చెందింది. వస్తు సేవల ఉత్పత్తి నానాటికి సాంస్కృతిక వైవిధ్యాన్నీ మరింతగా స్వీయ వ్యక్తీకరణను, ఎంపిక స్వేచ్ఛను పెంచేదిగా ప్రత్యేక అవసరాలకోసం జరగడం క్రమేణ పెరుగుతోంది. ఈ విధంగా వినిమయ సంస్కృతి అనేక సాంస్కృతిక సమస్యలను ముందుకు తెస్తున్నది.

## వినిమయం- మీనింగ్

అన్ని సంస్కృతులు భౌతిక వస్తువుల్లో అర్థాన్ని వెతుకుతాయి. ప్రతీ వస్తువు ఒక అర్థాన్ని కలిగి ఉంటుందని ఆంత్రొపాలజిస్టులు, సోషియాలజిస్టులు చాలా కాలం నుండి చెబుతున్నారు. వస్తువులు మన సామాజిక హోదాకు ప్రాతినిధ్యం వహించవచ్చు, లేదా అవి మన అత్యంత ఆంతరంగిక

అనుభవాలకు నిర్దిష్ట ప్రతీకలు కావచ్చు. అవి మన గత అనుభవాలకు ప్రాతినిధ్యం వహించవచ్చు, లేదా మన వర్తమాన ఐడెంటిటీకి సంకేతం కావచ్చు, లేదా మనం ఎలా తయారవ్వాలని ఆశిస్తున్నామో దానికి సంకేతం కావచ్చు. తాత్విక కసరత్తు కోసం తప్ప వస్తువును దాని అర్థం నుండి వేరు చేయడం నిష్ప్రయోజనం.

అలాంటప్పుడు వినిమయం అర్థానికి సంబంధించిన విషయం. *'ఒకానొక వ్యక్తిలో ఏ ఆచరణల ద్వారా సరుకులు భాగంగా మారుతాయో ఆ ఆచరణల సముదాయం'* అనేది వినిమయ వాదానికి ఒక నిర్వచనం. దీనికి మూల రూపక నమూనా 'తినటం'. తినడం ద్వారా ఒక సరుకు (ఆహారం) వ్యక్తిలో భౌతికంగా భాగమవుతుంది. అయితే సరుకులు సంకేతాత్మకంగా వ్యక్తిలో భాగంగా మారే ఆచరణలే చాల ముఖ్యమైనవి. జీవితావసరాలు తప్ప మిగిలిన వస్తువులను కేవలం వాటి భౌతిక లక్షణాల కోసం వినియోగించరు. అవి వేటికి సింబల్స్ (ప్రతీకలు) గా పనిచేస్తాయో వాటికోసం వినియోగిస్తారు, అంటే వాటి అర్థాలు, సంబంధాలు, మన స్వీయ ప్రతిబింబంలో వాటి పాత్రలు. అంటే మన గురించి మనం ఏర్పరచుకునే ఇమేజ్‌లో కూడా ఆ వస్తువుల పాత్రే ప్రధానమై పోతుంది. ఒక సరుకు లాగ ఒక చిహ్నాన్ని (sign) మరొకరు ఇవ్వడం గాని, మారకం చేసుకోవడం గాని జరగదు. వ్యక్తులే ఒక 'వైవిధ్య సంకేతం' గా ఆ చిహ్నాన్ని సొంతం చేసుకుంటారు. ఆ చిహ్నం ఒక వాంఛకు వాహకంగా ఉంటుంది.

అర్థం యొక్క సామాజిక ఉత్పత్తి, వ్యక్తి ఆ అర్థాన్ని సొంతం చేసుకోవడం అనేవి తప్పనిసరిగా ఒకే ఒక సాంస్కృతిక ప్రక్రియతో ముడిపడిన అంశాలు. అందుచేతనే సామాజికంగా అర్థవంతమైన వస్తువు వినిమయంలో వైయక్తిక అర్థం ఉత్పత్తి కూడి ఉంటుంది.

ప్రపంచంతో మన సంబంధాన్ని భావజాలం ద్వారా గుర్తిస్తామని అది మానవుల సార్వత్రిక లక్షణమని ఆల్తూజర్ అభిప్రాయం. "భావజాలం అనేది

వ్యక్తులకు వారి నిజ అస్తిత్వ పరిస్థితులతో గల ఊహాత్మక సంబంధం యొక్క ఒక ప్రాతినిధ్యం(రెప్రజెంటేషన్)" అంటాడాయన.

ఈ ప్రపంచంలో మనగురించి మన యథార్థ, దైనందిన అవగాహన కనీసంగా కొంత వరకూ ఊహాత్మకమైనది అనడంలో ఎటువంటి సందేహం అక్కర లేదు. అది కేవలం అహంకారం నుండి తీవ్ర భ్రాంతులతో కూడిన మానసిక రుగ్మత వరకూ ఉండవచ్చు. ఒక వ్యక్తి స్వీయ ప్రతిబింబం ఇతరులు ఆ వ్యక్తిని ఎలా చూస్తారో అలా ఉండదు. అయితే కొంతమంది యువతులు సామాజికంగా ఆమోదమైన శరీరాకృతి కోసం ఆకలి చంపుకొని తమ జీవితాలను పణంగా పెడుతున్నారు. ఇతరుల ఆమోదం పొందే 'సమ్మతి వాదం' (కన్ఫర్మిజం) వివేకవంతమైనదిగా పరిగణించడం పరిపాటి. కాని కొన్ని పరిస్థితుల్లో ఇది పిచ్చితో సమానమవుతుంది.

పర్యావరణ దుష్పరిణామాలు ఎన్ని వున్నా మన వ్యవస్థ మరింత ఉత్పత్తి, వినిమయాలు జరిగేలా నిర్బంధిస్తుంది. వినిమయం దానికదే కేవలం వ్యక్తి సఫలతకే కాక, జాతీయ అభివృద్ధికి సూచిక అయిపోయింది. కేపిటలిస్టు వినిమయం చారిత్రకంగా నిర్మితమైన ఆలోచన, ఆచరణ, జోడించడాల (relating) పద్ధతి. ఇందులో ఒక వైరుధ్యం ఉంది. ఈ కేపిటలిస్టు వినిమయానికి ఇరుసు వినియోగదారుడు. 'కొనాలి, వినిమయం చేయాలి' అనే సాంస్కృతిక నిర్బంధం తప్ప, అతనికి ఇంకేం చేయడానికైనా సర్వహక్కులూ ఉన్నాయి. దీన్నే ఒకాయన ఇంకో విధంగా చెప్పాడు "we live in a society in which we have no choice but to choose." ఈ వినిమయ సంస్కృతి ఎంత బలవత్తరమైనదంటే 76% అమెరికా గృహస్థులు భారీగా అప్పుల్లో మునిగిపోయి ఉన్నారు. అప్పు పడిన ప్రతీ ఏడుగురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. 'లేదు నాకు అవసరమైనవి తప్ప మిగిలినవి నేను కొనను' అని ఎవరూ మొండి కేసే

అవకాశం లేదుగాని, ఒకవేళ వినిమయ తత్వాన్ని ప్రజలు తగ్గించుకుంటే ఎంతో పటిష్టంగా కనిపించే మొత్తం కేపిటలిస్టు దుర్గం కుప్ప కూలిపోతుంది.

వినిమయ సంస్కృతి అనే దానికి ఎటువంటి హద్దులు లేవు. అలాంటప్పుడు దాన్ని సంస్కృతి అనొచ్చా? నిజానికి దాని మూలం ఆర్థికం. అంటే వ్యాపారం, లాభం. కాని వాటికోసం అది సాంస్కృతిక రంగంలో ప్రవేశించి మొత్తం తనై కూర్చొంది.

"వినిమయం కేపిటలిజానికి చాలక శక్తి. వినిమయ డిమాండును ప్రేరేపించడం కేపిటలిజం అభివృద్ధి కొనసాగడానికి తప్పనిసరి షరతు. సాంస్కృతిక వైవిధ్యాలు చాలా ఉన్నాయి. కాని ప్రపంచ స్థాయిలో చూసినప్పుడు అమెరికా, పశ్చిమ యూరపు సాంస్కృతిక నమూనా పట్ల ఆకాంక్షే మూడవ ప్రపంచ దేశాలు, చైనా, గత సోవియట్ యూనియన్ దేశాల మార్కెట్లను సరళీకరించడం వెనుక నున్న చలన సూత్రం. అదే ఆర్థిక గ్లోబలైజేషన్‌కు చోదక శక్తి." అని ఒక సాంస్కృతిక విశ్లేషకుడు చెప్పాడు.

వినిమయ సంస్కృతిని పెంచి పోషించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తున్నది.

"న్యూస్ మీడియా వినిమయ సమాచారంతో నిండి పోయింది. కేవలం వాణిజ్య ప్రకటనల రూపంలోనే కాదు, వ్యాపార వార్తలు, లైఫ్ స్టయిల్స్, ఆర్థిక సూచికల రూపంలో కూడా! వీటన్నిటిలో అంతర్లీనంగా వినిమయ ప్రోత్సాహక సందేశాలు ఉంటాయి. కాని ఈ వార్తలు వినిమయ సంస్కృతిని అర్థం చేసుకునేందుకు కావాల్సిన ప్రాతిపదికను సమకూర్చవు. ఎందుకంటే ఈ వార్తా కథనాలు వర్తమాన సమస్యలు, ఆసక్తులు, ఏదేనా కంపెనీ ఆర్థిక సమస్యలు, లేటెస్ట్ ఫేషన్ ట్రెండ్స్ గురించి రాసిన నివేదికలు. ఇటువంటి కథనాలు వినియోగదారుని ఎంపిక స్వేచ్ఛ మాత్రమే నిజమైన స్వేచ్ఛగా, వినిమయాన్ని స్వీయ సాఫల్యతా సాధనంగా, షాపింగ్ ఒక వినోద రూపంగా

మారిన సంస్కృతికి మనం ఎలా చేరుకున్నామో మనకు చెప్పవు. ఈ కథనాలు వినిమయం మన సమాజాన్ని వ్యవస్థీకరించే కీలక అంగ లక్షణాల్లో ఒకటి ఎలా అయ్యిందో చెప్పవు." ఇది మరో సిద్ధాంతి వ్యాఖ్య. ఆయనే ఇంకా ఇలా చెప్పాడు.

"వినిమయ సంస్కృతికి ప్రత్యామ్నాయాలుగా ప్రాతినిధ్యం వహించే బూర్జువా ఉన్నత సంస్కృతి లాంటివి అంటే చిత్ర లేఖనం, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యం వగైరా నానాటికి మరింతగా సరుకులుగా మారుతున్నాయి. చివరకు పర్యావరణ ఆందోళన వంటి కచ్చితమైన వినిమయవాద వ్యతిరేక సాంస్కృతిక ఆచరణలు కూడా మరిన్ని సరుకులు అమ్మే మార్గంగా మారిపోయాయి."

పెట్టుబడి దారీ వ్యవస్థలో అన్ని జీవిత కార్యకలాపాలు ఆర్థిక (డబ్బు ద్వారా జరిగే) కార్యకలాపాలుగా మారి పోతాయి. అటువంటి దశలో మడి గట్టుకున్న శుద్ధ సాంస్కృతిక విషయాలంటూ మిగలవు. చరిత్రలో వినిమయం సంస్కృతిలో ఒక భాగం మాత్రమే కాని వినిమయం మాత్రమే సంస్కృతి కాదు. ఇప్పుడు వినిమయం పరిధికి అవతల సాంస్కృతిక అంశాలు ఏమీ మిగలని పరిస్థితి ఏర్పడింది. సంస్కృతి అంటే వినిమయం అనే పరిస్థితి ఏర్పడింది.

"వినిమయం ఇంకెంత మాత్రం కేవలం మన సాంస్కృతిక విలువలను ప్రతిబింబించేదిగా లేదు. అదే ఒక సాంస్కృతిక విలువగా అవతరిం చింది ....వినిమయ సంస్కృతి నమ్మ లేనంతగా విజయవంతం అవుతున్నది. అది కేవలం మన అవసరాలను, వాంఛలను తీర్చడంలో విజయవంతం కావడమే కాక, మన అవసరాలు ఎలా ఉండాలో తిరిగి నిర్వచించ గలుగుతున్నది. అంతేగాక వాంఛలను విస్తృతం చేయడంలో కూడా సఫలం అవుతున్నది."

'ప్రజల నల్ల మందు' గా మతానికున్న స్థానాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందిన సమాజాలలో టెక్నాలజీ ఆక్రమించిందని కొంతమంది అభిప్రాయం. టెక్నాలజీ నేటి వినిమయ సంస్కృతికి విశేష ప్రోత్సాహకారిగా ఉంది.

వినిమయ సంస్కృతిని అధ్యయనం చేసేటప్పుడు కేవలం వినియోగ దారుని పరంగా మాత్రమే చూడకూడదని, వినిమయాన్ని, అమ్మకాలను పెంచు కోవడానికి గొంతులు కోసుకునే పోటీలో వాల్ మార్ట్, అమెజాన్ లాంటి సంస్థలు సరుకులను చౌకగా అందిస్తూనే అత్యధిక లాభాలు గడించడం కోసం ఆ సంస్థల్లో పనిచేస్తున్న వారిని చేస్తున్న దారుణ దోపిడీని చూడాలని చాలామంది వాదిస్తున్నారు. అప్పుడు వినిమయం కేవలం సాంస్కృతిక విషయంగా చూడలేము.. అందుకే వినిమయాన్ని ఆర్థిక, రాజకీయ, సామాజిక విషయంగా చాలామంది పరిగణిస్తున్నారు.

వినిమయ సంస్కృతిని 'తప్పుడు చైతన్యం' నేపథ్యంలో విశ్లేషించడం తప్పు అనీ, దాన్ని 'సరుకుల ఆరాధన' లో భాగంగా విశ్లేషించాలని కొంతమంది విశ్లేషకుల అభిప్రాయం. భౌతిక రూపం లేని ఫైనాన్స్ కేపిటల్ యుగంలో లేప్ టాప్, స్మార్ట్ ఫోన్ల నిరంతర మంద్ర స్వరంతో పాటు ఘనమైనదంతా తత్కాలంలో ఆవిరైపోతున్నప్పుడు సరుకుల ఆరాధన భావనే మన యుగానికి అతి ముఖ్య వ్యవస్థీకరణ సూత్రం అని వీరి వాదన. 'all that solid melts into air' అనేది మేనిఫెస్టో లోని సుప్రసిద్ధ వాక్యం.

వినిమయ సంస్కృతి అనేది ఏదో చిన్న వ్యసనం, లేదా స్వల్ప సామాజిక రుగ్మత కాదు. తూర్పు యూరపు దేశాల సోషలిస్టు వ్యవస్థలు కూలి పోవడానికి ఇదే ప్రధాన కారణమని విమర్శకుల అభిప్రాయం. ఆ వ్యవస్థలు పెట్టుబడి దారీ వ్యవస్థలతో సమంగా -కొంత మందికే అయినా- ఆకర్షణీయమైన సరుకులను అందించలేక పోయాయి. అదే సమయంలో పెట్టుబడిదారీ వినిమయ సంస్కృతి పంపే శక్తివంతమైన ప్రలోభ పెట్టే సందేశాలకు భావజాల,

సాంస్కృతిక ప్రతిఘటనను నిర్మించ లేకపోయినందున కూలిపోయాయని వీరి అభి ప్రాయం.

చరిత్రలో అనేక సంస్కృతులు ఆనవాళ్లు కూడా లేకుండా నశించి పోయాయి. అయితే నేడు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న వినిమయ సంస్కృతి అటు ప్రకృతిని, ఇటు సంస్కృతిని సమూలంగా నాశనం చేసే దిశగా పనిచేస్తూ ఉంది. పెట్టుబడి దారీ వ్యవస్థ "నా (లాభం) తర్వాత ప్రళయం వస్తే రానీ!"(ఫ్రెంచి సూక్తి) అనే నినాదంతో పని చేస్తుందని మార్క్స్ చెబుతాడు. ఆయన చెప్పినట్లే అది నేటి తన లాభం కోసం ప్రపంచాన్ని అతి వేగంగా అంతం అంచులకు పరుగులు పెట్టిస్తున్నది.

"విధేయతను అంగీకరించే స్వేచ్ఛ తప్ప వారి అన్ని స్వేచ్ఛలు తొలగించబడ్డాయి." అని ఆల్తూజర్, 'ఐడియాలజీ అండ్ ద స్టేట్'అనే గ్రంధంలో చెప్పాడు.

ఆలోచనలోను, ప్రవర్తనలోను ఈ ప్రపంచం తనను తాను పునరుత్పత్తి చేసుకునే విధానంపై, సరుకుకు, దాని ప్రభావాలకు ప్రాధాన్యత పెరిగిపోవడం అనేది మరింత అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. ఒక వినిమయ సమాజంగా అది వ్యక్తులను తమను తాము వినిమయంద్వారా సంతృప్తిని పొందే వినిమయ దారులుగా భావించుకోమని ప్రేరేపిస్తుంది. వినిమయదారీ సమాజంలో సరుకులు ప్రధానంగా అవసరాలను తీర్చడం నుండి తన హోదాను తెలిపే, గుర్తింపునిచ్చే వాటిగా మారిపోతాయి.

ప్రకృతి, కేపిటలిజం అభివృద్ధుల గురించి మార్క్స్ చేసిన గొప్ప అధ్యయనం, విశ్లేషణలకు వర్తమాన ప్రపంచాన్ని అర్థంచేసుకోవడంలో గొప్ప ప్రాధాన్యత ఉంది.

మార్క్స్ అభిప్రాయంలో ఒక సరుకు "మున్ముందుగా మనకు వెలుపల ఉండే వస్తువు. దాని ధర్మాల చేత మానవ అవసరాలు తీర్చేది.....

ఉదాహరణకు ఆ అవసరాలు కడుపునుండి పుట్టినా, లేక స్వైర భావన నుండి(ఊహల నుండి) పుట్టినా వాటి స్వభావంలో తేడా ఉండదు."

ఈ వ్యవస్థలో ఉపయోగపు, మారకపు విలువలే ప్రధానమైనవి. ఒక వస్తువుకున్న ఉపయోగమే దాన్ని ఉపయోగపు విలువ చేస్తుంది. అయితే సరుకు ఉపయోగం ఆ సరుకు నుండి విడిగా ఉండదు. ఆ వస్తువుకు ఉపయోగపడే లక్షణాలను కల్పించడానికి వెచ్చించిన శ్రమ నుండి స్వతంత్రంగా ఉంటుంది ఉపయోగపు విలువ. కనుక ఉపయోగపు విలువలు వాటిని ఉపయోగించడం, లేదా వినియోగించడం లోనే వాస్తవం అవుతాయి. అందుచేత అవే, అంటే ఉపయోగపు విలువ కల సరుకులే సంపద అయ్యి, మారకపు విలువకు పాదార్ధిక కోశాగారాలు అవుతాయి. మరో వైపు మారకపు విలువ అనేది ఉపయోగపు విలువల మారకం కాక, అమూర్త మానవ శ్రమ మారకం. అందుచేత మారకపు విలువలు వస్తువుల మధ్య ఒక సంబంధాన్ని వ్యక్తం  చేసినప్పటికీ, అవి సామాజిక సంబంధాలు.

మార్క్స్ వాదన ప్రకారం కేపిటలిజంలో మారకపు విలువ ఉపయోగపు విలువపై ఆధిపత్యం చలాయిస్తుంది. మారకపు విలువలు ఆధిపత్యం వహించే సమాజంలో జీవించే వ్యక్తి తను ఇంకెంత మాత్రం సొంత, మానవ ప్రక్రియల చేత ప్రభావితం కావడం లేదని, తనవి కాని పరాయి శక్తులకే లొంగి జీవిస్తున్నానని భావిస్తాడు. ఈ పరాయి శక్తులు తన బతుకుకే కాక, తన చావుకు కూడా కారణమవుతున్నాయని నమ్ముతాడు. అతను జీవించే కేపిటలిస్టు సామాజిక ప్రపంచం ఒక వికట, వికృత ప్రపంచం. మార్క్స్ దీన్నే 'సరుకుల ఆరాధన' అన్నాడు.  ఇందులో వస్తువులను ప్రజలు నియంత్రించడం, పాలించ డం కాక వస్తువులే ప్రజలను పాలిస్తాయి. వస్తువులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుండగా మనిషి జీవితం విలువ పతనమౌతుంటుంది. దీనంతటికీ కారణం పెట్టుబడిదారీ లాభానికి మూలమైన అదనపు విలువను రాబట్టడమే. ఈ సంపద, వినిమయం పట్ల

తీవ్ర కాంక్ష మానవుని శక్తిని బలిపెట్టి, క్రింద తరగతులను అమానవీయం చేసి సృష్టించడం జరుగుతుంది. అలాంటప్పుడు వస్తువుల మీద యాజమాన్యం విజయవంతమైన జీవితానికి సూచిక అవుతుంది. అతను కొన్న వస్తువుల్లోనే వ్యక్తి సాఫల్యత ఉంది.

సరుకుల సమాజంగా మారిన సామాజిక ప్రపంచం వాటిని సృష్టించిన వారికి చెందదు. అది వారికి అర్థం కాదు. అలాంటప్పుడు మూర్తీకరణ అంటే ఒక సమాజం తన అవసరాలను సరుకుల మార్పిడి ద్వారా తీర్చుకోవడం. కేపిటలిస్టు సమాజంలో మూర్తీకరణ చాలా లోతుగా పాతుకుని ఉండి సామాజిక చైతన్యంపై ఆధిపత్యం చలాయిస్తుంది. అంటే అది మనిషి సామర్థ్యాలను, గుణ గణాలను నియంత్రించే ఒక సంపూర్ణ ప్రక్రియ.

లూకాక్స్ అభిప్రాయం ప్రకారం "పెట్టుబడిదారీ సమాజంలో జీవించే ప్రతీ మనిషికి మూర్తీకరణ ఆవశ్యక ప్రత్యక్ష వాస్తవికత. దాన్ని అధిగమించాలంటే ఎవరైనా మొత్తం అభివృద్ధిలో వ్యక్తం అయ్యే నిర్దిష్ట వైరుధ్యాలతో నిర్దిష్ట సంబంధంలో ఉండాలి. ఆ నిర్దిష్ట వైరుధ్యాల గురించిన ఎరుకతో, ఎప్పటికప్పుడు కొత్త వైన, నిరంతర ప్రయాసతో కూడిన, మూర్తీకృత అస్తిత్వ నిర్మాణాన్ని చెదరగొట్టే ప్రయత్నాల వల్ల మాత్రమే దీన్ని అధిగమించగలరు."

"వినియోగదారుడు ఈ ప్రపంచంలో దేనికి ప్రాతినిధ్యం వహిస్తాడు?... 'నథింగ్'..... ఎందుకంటే మొత్తం పరాయీకరణే!" అంటాడు బాడ్రిలార్డ్ అనే ఫ్రెంచి తత్వవేత్త.

ఉత్పత్తి స్థానంలో వినిమయాన్ని సామాజిక ప్రవర్తన కేంద్ర విధానం చేయడం తప్ప వినిమయదారు ఎప్పటికీ సామాజిక మార్పులను తెచ్చే క్రియాశీల కర్త కాలేడు.

తప్పుడు అవసరాలను సృష్టించడం అంటే సంకేత విలువలను సృష్టించడమే. సంకేత విలువల వినిమయానికి పరిమితులు, హద్దులు ఉండవు. "నేను షాపింగ్ చేయడం కోసమే షాపింగ్ చేస్తాను."

ఈ సూత్రీకరణ ప్రకారం వస్తువులు సంకేతాలుగా పనిచేస్తాయి. వినిమయ తత్వంలో కూరుకుపోయిన వ్యక్తులు వస్తువులను, వాటి సంకేతాలను తమకి ఇతరులకు మధ్య తేడాను, ఆధిక్యతలను చూపడానికి వినియోగిస్తారు.

అడార్నో, హార్క్‌హీమర్‌లు ప్రయోగించిన పదం 'సాంస్కృతిక పరిశ్రమ' కు మార్క్సిస్టు సిద్ధాంతంలో చాల ప్రాధాన్యత ఉంది. అది సంస్కృతి పారిశ్రామికం అవ్వడాన్ని సూచిస్తుంది. భారీ స్థాయిలో వినిమయ సరుకుల ఉత్పత్తి జరిగినట్లే వినోద పరిశ్రమలో వినోదపు సరుకులు ఉత్పత్తి అవుతాయి. ఆధునిక కేపిటలిస్టు సమాజంలో 'మారకమే' మానవ సంబంధాల ప్రధాన రూపం అయి పోతుంది.

వ్యక్తులను కూడగట్టి వినిమయ దారులుగా మార్చడానికి మార్కెట్ వంచనాత్మక ప్రలోభాన్ని సాధనంగా ఉపయోగిస్తుంది. ఈ ప్రలోభం వినిమయ సమాజంలో ఆధిపత్యాన్ని పునరుత్పత్తి చేసే అతి గొప్ప సాధనం. సరుకు యొక్క మారకపు విలువతో దాని ఉపయోగపు విలువను పోల్చి అంచనా వేసే సామర్థ్యాన్ని వినియోగదారుడికి లేకుండా నాశనం చేయడం ద్వారా మార్కెట్ ప్రలోభపెట్టడం సాధ్యమవుతుంది.

వినిమయ చైతన్యంలోని చీకటి కోణం ఏమిటంటే, వినిమయ దారులు శ్రమను, దాని దోపిడీని చూడరు, ఎదుర్కోరు. నిజమైన ఉత్పత్తి దారుకు, వినిమయ దారుకు సంబంధం ఉంటుందని చెప్పలేము. పైన చెప్పుకున్న ఉపయోగపు విలువపై మారకపు విలువ ఆధిపత్యం గురించి వినిమయ దారుకి తెలియదు. అయితే ఉపయోగపు విలువను బట్టే దాన్ని ఉత్పత్తి చేసిన శ్రమ విలువను లెక్కిస్తారు.

కేపిటలిజం దాని భిన్న రూపాల్లో ఉత్పత్తి చేసిన పరాయీకరణ, మూర్తీకరణలు పరస్పర సంబంధం కలిగినవి. అయితే పరాయీకరణ కేవలం కేపిటలిజం ఉత్పత్తి అని భావించరాదు. దాని మూలాలు మొత్తం చరిత్రలో ఉన్నాయి. *పరాయీకరణలో ముఖ్య విషయం ఏమిటంటే, శ్రామికుడు తన సొంత ఉత్పత్తుల చేతనే అణచి వేయబడతాడు. శత్రు పూరిత బాహ్య శక్తిగా మార్కెట్ పాలనలో శ్రామికుని పరాయీకరణ అతి తీవ్ర స్థాయికి చేరుకుంటుంది.*

"నేను ఆలోచించడం, ప్రేమించడం నేర్చుకుని ఉంటే అది ముప్పై శతాబ్దాల మానవ పరాయీకరణ యొక్క మాటలు, సంజ్ఞలు, అభివ్యక్తులు, పాటల ద్వారానే! మరోసారి నన్ను నేను ఎలా అందిపుచ్చుకోగలను, మనల్ని మనం తిరిగి ఎలా పొందగలం?"- హెన్రీ లెఫెబ్రె (Henri Lefebvre)

హెన్రీ లెఫెబ్రె అభి ప్రాయం ప్రకారం పరాయీకృత శ్రమ తన సామాజిక సారాంశాన్ని కోల్పోయింది. నిజానికి శ్రమ సారాంశం సామాజికమైనప్పటికీ, అది ఒక వైయక్తిక లక్ష్యం రూపాన్ని , వాస్తవికతని సంతరించుకుంటుంది. అంతకు మించి శ్రమ సామాజికం కాబట్టి, శ్రమశక్తి కొనుగోలు, అమ్మకం రూపం తీసుకుంటుంది. వ్యక్తి తన కార్యకలాప సామాజిక పరిస్థితులను అనుభూతి చెందలేడు. శ్రామికుడికి మొత్తం సామాజిక సృజనాత్మక కార్యకలాపం 'జీవనోపాధి అనే బాహ్య ఆవశ్యకత' రూపం ధరిస్తుంది.

ఆ విధంగా సామాజిక శ్రమ వ్యక్తికి ఒక శాస్తిలా, నిగూఢ శిక్షలా కనిపిస్తుంది. మనిషి మనిషిలా ఉండలేడు. ఇతర పనిముట్లైన ఉత్పత్తి సాధనాల చేతిలోని పనిముట్టులా, డబ్బు అనే వస్తువు ఉపయోగించే ఒక వస్తువులా, వాస్తవికతను, సత్యాన్ని కోల్పోయిన పెట్టుబడిదారీ వర్గం ఉపయోగించుకునే వస్తువుగా మారిపోతాడు.

కేపిటలిజంలో వ్యక్తి పరాయీకరణ అనేది అదే వ్యవస్థలోని వైరుధ్య పూరిత అంశాల ప్రతిఫలనం, ఉత్పత్తి మాత్రమేనని మార్క్స్ వాదన. ఆ వైరుధ్యాలు ప్రధానంగా శ్రమశక్తి సరుకుగా మారిపోవడం, ఉపయోగపు విలువపై మారకపు విలువ ఆధిపత్యం. అప్పుడు పరాయీకరణ చారిత్రకం. దాన్ని పుట్టించిన పరిస్థితులను తొలగించడంతోనే పరాయీకరణను తొలగించవచ్చు. **మనిషి తనను తాను మార్చుకోవడానికి సమాజాన్ని మార్చి తీరాలి**.

ఆల్తూజర్ అభిప్రాయం ప్రకారం, మన గురించి, సమాజం గురించి, అందులో మన పాత్రగురించి మన ఆలోచనలు, వాటి నిర్మాణం భావజాలానికి, అంతిమంగా సామాజికార్థిక పరిస్థితికి సంబంధించినవై ఉంటాయి.

## భారత దేశంలో వినిమయ తత్వం, పర్యవసానాలు.

నయా ఉదారవాదం, గ్లోబలైజేషన్లతో భారత దేశంలో వినిమయ తత్వం చాల వేగంగా పెరుగుతోంది. 2017 నాటికి దేశంలో డిజిటల్ లావాదేవీలు 16 లక్షల కోట్ల రూపాయిలకు పెరిగాయట. భారతదేశ పట్టణాలు పల్లెల్లోకి టీవీ ప్రవేశించక ముందు సామాజిక మార్పులో మీడియా పాత్ర చాలా స్వల్పమని విశ్లేషకులు నిర్ధారించారు.(జాన్సన్ 2001). భారీ స్థాయి సినిమా పరిశ్రమ, పత్రికలు వున్నా అంతగా ప్రభావం చూప లేకపోయాయి. ఇప్పుడు దేశమంతా టీవీ అత్యవసర వస్తువై పోయింది. వినిమయం అనేది భారత పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నానాటికి మరింత బలంగా హోదాకు చిహ్నంగా మారుతోంది. కమ్యూనిష్టు రాష్ట్ర మైన కేరళలో కూడా ప్రజలు వినిమయ తత్వంలో తప్పు లేదని భావిస్తున్నారు. (ఒసెల్లా & ఒసెల్లా 1999)

2000 లో భారతదేశంలో అడ్వర్టైజ్ చేస్తున్న బ్రాండ్ల సంఖ్య 14,800 కాగా 2005 నాటికి అది 75,900 కి పెరిగింది (కూక్సే 2005). అడ్వర్టైజింగ్ లక్ష్యం మధ్య తరగతి హిందువులని, హైందవేతరులు ఈ ప్రకటనల్లో అరుదుగా కనిపిస్తున్నారని 2005 లో జరిగిన ఒక అధ్యయనంలో తేలింది. ఇది అడ్వర్‌టైజింగ్ పరిశ్రమ అపరిపక్వతనే కాక, 80%గా వున్న హిందువుల సాధారణ సాంస్కృతిక ఆధిపత్యాన్ని కూడా తెలియచేస్తుంది. భారతీయ టీవీ పరిశ్రమ చేసే వాణిజ్య ప్రకటనల్లో చాలా త్వరగా విపరీతమైన మార్పులు వస్తున్నాయి. ప్రధానంగా చిన్న పిల్లలను లక్ష్యంగా చేస్తున్నారు. ఒక అధ్యయనం ప్రకారం 1992 నాటికే మొత్తం దేశంలో టీవీ వాణిజ్య ప్రకటనల్లో 35% పిల్లలను ఉద్దేశించినవే. వీటిలో అత్యధిక భాగం ఆహార పదార్థాలకు సంబంధించినవి. ఇది ఇప్పుడు ఇంకా బాగా పెరిగిపోయింది. చిన్న పిల్లలు అల్లరి చేయకుండా చేసే ఒక తాయిలంగా తల్లిదండ్రులు టీవీని పరిగణిస్తున్నారు. టీవీకి సెల్‌ఫోను జతకలిసింది. పిల్లలు టీవీలో చూసి అవి కావాలని మారాం చేస్తే, వారు చెప్పినట్లుగా వినేలా చేయడానికి బొమ్మలు, చిప్స్ వగైరా కొని ఇస్తున్నారు.

దేశ జనాభాలో 25% రోజుకి ఒక డాలరుకంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నా ఏటికేడు పేదరికం తగ్గుతోంది. 2004 సంవత్సరం నాటికి 30 కోట్లుగా వున్న మధ్య తరగతి 2025 నాటికి దేశ జనాభాలో 50% కి చేరుకుంటుందని ఒక అంచనా. 2004 నుండి 2009 నాటికి గృహాల్లో వినిమయం రెట్టింపు అయిందని మెరిల్ లించ్ అంచనా.

పేదరికం నుండి బయట పడటానికి విద్య ఒక టికెట్‌గా చాల మందికి ఉపయోగపడినా అందులో దిగువ కులాల వారు తక్కువే. అగ్ర వర్ణాలలో వారసత్వంగా వచ్చిన ఆస్తిపాస్తులే ఉన్నత వర్గ హోదాను ఇచ్చేవి. ఆ పరిస్థితి మారింది. సమర్థత, శ్రమించే తత్వం, యాజమాన్య నైపుణ్యాలు ఇప్పుడు వారసత్వ ఆస్తి స్థానాన్ని ఆక్రమించాయి.

భారత సమాజంలో మధ్య తరగతి వేగంగా మార్పులకు లోనవుతోంది. ఈ వర్గం అత్యంత ప్రభావ శీలంగా మారింది. 1999 అధ్యయనం ప్రకారం అత్యధిక వినిమయం ఈ వర్గమే చేస్తోంది. పట్టణ హిందూ మధ్య తరగతి గ్లోబలైజేషన్ శక్తులకు, సమాజంలోని ఇతర విభాగాలకు మధ్య మధ్యవర్తి పాత్రను పోషిస్తున్నది. గ్రామీణ భారతం టెలివిజన్ చూపించే మధ్యతరగతి ప్రమాణాలనే నానాటికి మరింతగా అనుసరించే ప్రయత్నం చేస్తోందని ఈ అధ్యయనంలో తేలింది. అదే సమయంలో యావత్ భారతదేశంలోని మధ్య తరగతి ప్రజల్లో అత్యధికులకు ఎన్నారైలు ఒక ఆదర్శ నమూనాగా నిలుస్తున్నారు.

పైకి ఎదుగుతున్న వృత్తి నిపుణులైన జీతగాళ్ళు చాలా బిజీ జీవితం గడుపుతుంటారు. తాము సామాజిక నిచ్చెన మీద పై మెట్టుపై ఉన్నట్లు స్పష్టంగా కనిపించాలని చాల ప్రయాస పడుతుంటారు. ఉన్నతోద్యోగావకాశాలు వీరిని ఒక ప్రాంతంలో ఉండనివ్వవు. దీనివల్ల కుటుంబ సంబంధాలలో మార్పులు వస్తాయి. తల్లిదండ్రులు తమతో వుండటం సాధారణంగా కుదరదు. బంధు వర్గంతో నిత్య సంబంధాలు లోపిస్తాయి. తల్లిదండ్రులు, బంధువుల పట్ల తమ ప్రేమను ముఖ్యంగా బహుమతులతో తెలియచేసే ప్రయత్నం చేస్తారు. దీన్తో వినిమయం పెరుగుతుంది. బంధుగణంతో విందులు, వినోదాలు, వేడుకల్లో పాల్గొనే అవకాశాలు బాగా తగ్గిపోవడంతో షాపింగ్, ఖరీదైన రెస్టారెంట్లలో భోజనం, సహోద్యోగులతో చేసుకునే పార్టీలు హోదా ప్రదర్శన స్థలాలుగా ఉంటాయి. ఇవన్నీ విపరీతమైన ఖర్చు, వినిమయాలతో కూడినవే.

సంస్కృతిలో ఆహారపు అలవాట్లు ఒక ప్రధాన అంశం. సాధారణంగా, భారతీయ మధ్య తరగతి ప్రజలు నిలవ వున్న, చల్లారిన ఆహారాన్ని తీసుకోవడానికి ఇష్టపడరు. నిజానికిది వేడి వాతావరణంలో ఆరోగ్యాన్ని రక్షించే ఆచరణాత్మక అలవాటు. వేడి వాతావరణంలో వండిన ఆహారం

త్వరగా పాడై పోతుంది. మసాలా దినుసులు ఎక్కువగా వాడటం నూనెలో ఎక్కువగా వేయించడం కూడా వండిన ఆహారం త్వరగా పాడవకుండా వుండటానికే! ఉద్యోగాలు చేసే స్త్రీలకు రెండు పూటలా వంట చేసే సమయం దొరకదు. అతి తక్కువ సమయంలో వంట పూర్తి చేయగలిగే విద్యుత్ గృహోపకరణాలు వీరికి అందుబాటులోకి వచ్చాయి. సాంప్రదాయ వంటలను ఇష్టపడే మధ్య తరగతి ప్రజలు సులువుగా చేసే వంటకాలకు, విధానాలకు అలవాటు పడుతున్నారు. వంటకాలను నిలవ ఉంచడానికి రిఫ్రిజిరేటర్‌ను విస్తృతంగా వినియోగి స్తున్నారు. గేస్ పొయ్యి, ప్రెషర్ కుక్కర్‌లు వంట సమయాన్ని గణనీయంగా తగ్గించాయి. మిక్సీ, గ్రైండర్, మైక్రో ఓవెన్ లాంటి అనేక గృహోపకరణాలు సర్వసాధారణంగా అందరి ఇళ్లలో ఉంటున్నాయి. మైక్రో ఓవెన్‌ను రిఫ్రిజిరేటర్లో నిలవ ఉంచిన పదార్థాలను వేడి చేసుకోవడానికే ఎక్కువ ఉపయోగిస్తున్నారు. ఇవన్నీ కాక సర్వ సిద్ధం అయిన ఇడ్లీ, దోశల పిండి, ఒత్తి సిద్ధంగా ఉండే చపాతీలు, నూడిల్స్ వగైరాలు మార్కెట్‌లో లభ్యం. నిలవ పచ్చళ్ళూ, పొడుల మార్కెట్ చాల పెద్దది. ఇవన్నీ కాక వండిన కూరలు, సాంబారు వగైరా అమ్మే కర్రీ పాయింట్లు బాగా పెరిగాయి. ఇవన్నీ వినిమయాన్ని పెంచేవే. ఉద్యోగాలు చేసే గృహిణులకు ఇవి ఉపశమనం కలిగించినా, మోతాదుకు మించి పిండిపదార్థాన్ని తినడం, పోషకవిలువలు లోపించి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇదిలా ఉంటే ఈ ఉపకరణాలన్నీ అవసరాలు మాత్రమే కాక సామాజిక హోదా సూచికలుగా కూడా మారి పూర్తికాలం ఇంటి పనికే పరిమితమైన గృహిణులు కూడా ఇవన్నీ కొంటున్నారు. వీరి వంట పనికి పట్టే సమయం బాగా తగ్గిపోయి, టెలివిజన్ చూడటానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అది వీరిలో వస్తు వ్యామోహాన్ని, మూఢ భక్తిని విపరీతంగా పెంచివేస్తున్నది. భక్తి మంచి వ్యాపార సరుకు, వినిమయ సరుకు గానే కాక, వాణిజ్య ప్రకటనలద్వారా వినిమయ తత్వాన్ని పెంచి పోషించేదిగా అవతరించింది. ఎక్కువ సమయం టీవీ చూడటానికి అలవాటు పడటంవల్ల ఈ గృహిణులు

తీవ్ర మానసిక, శారీరక అనారోగ్యాలకు గురవుతున్నారు. టీవీని ఇంటిపట్టున ఉండే స్త్రీలే ఎక్కువ చూస్తున్నారు అనే వాస్తవాన్ని గ్రహించిన టీవీ వ్యాపారులు వారిని మానసిక బానిసలు, వ్యసనపరులు చేసేలా స్త్రీ పాత్రలే ప్రధాన విలన్లుగా సీరియల్లు, మూఢ భక్తిని ప్రచారం చేసే కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇవి చాల మంది స్త్రీలలో తప్పుడు భావోద్వేగాలను పెంచి వారి వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేస్తున్నాయి.

భారతదేశంలో కుళ్ళు కాలువ మీద టిఫిన్ బడ్డీ మొదలుకొని ఎవరి స్థాయికి తగ్గ రెస్టారెంట్లు వారికున్నాయి. ఇక్కడ ఆహారపు రుచి మాత్రమే కాక హోదా కీలక పాత్ర పోషిస్తున్నది. వీటిలో భోజనం చేయడం ఒక ప్రధాన సాంస్కృతిక పరిణామానికి దారితీస్తున్నది. భారతీయులలో 20% శాకాహారులని ఒక అంచనా. ఉన్నత మధ్య తరగతి వారు తమ హోదా చూపడానికి ప్రతిష్టాత్మకమైన రెస్టారెంట్లకు వెళుతుంటారు. ఇవన్నీ విదేశీ ప్రభావంతో, విదేశీ వంటకాలను కూడా వడ్డించేవి మాత్రమే కాక ప్రధానంగా ఇవి మాంసాహార వంటకాలకు ప్రసిద్ధి చెంది ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉన్నత మధ్యతరగతి వారు పూర్తి శాకాహారులుగా కొనసాగలేక పోతున్నారని కొన్ని అధ్యయనాలు తెలిపాయి. బాజపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాకాహారాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలు ఆరంభించింది. శాకాహారం హిందూ మత ఆచారంగా చూపే ప్రయత్నం చేస్తోంది. కాని వేదాలు, ఇతిహాసాలు వీరి వాదనలకు మద్దతును ఇవ్వవు. మాంసాహారం ముస్లిం, దళిత ప్రజల సాంస్కృతిక లక్షణంగా చిత్రించే ప్రయత్నాలు చేస్తోంది.

## నిరంతరం మారుతున్న ఐడెంటిటీలు

పట్టణ హిందూ మధ్యతరగతి సాంస్కృతికంగా చాల వేగంగా మారుతోంది. వీరి ఐడెంటిటీ వారి జీవిత విధానం చేత, మీడియా చేత నిర్మించబడుతోంది. ఇవి రెండూ పెట్టుబడిదారీ వినిమయ వాదం ప్రేరేపించేవే! మరో పక్క సాంప్రదాయ భారతీయునిగా వుండాలనే కోరిక 'మానసిక బలాత్కారం' గా పని చేస్తోంది. కాని భౌతిక జీవితానిదే పైచేయిగా వుంది. ఆహార, విహారాలు, వేష భాషలు, పని పాటలు, వినోదం మొదలైనవన్నీ పెట్టుబడిదారీ సంస్కృతికి అనుగుణంగానే ఉంటున్నాయి. హిందువుగా వుండాలనే ఆకాంక్షను కూడా సొమ్ము చేసుకోగలిగే మేరకు పెట్టుబడి ఆయా రంగాల్లో ప్రవేశించింది. మత సంస్థలు, దేవస్థానాలు పెట్టుబడిదారీ వ్యాపార ధోరణిని అలవరచు కున్నాయి. అతని భౌతిక జీవితాన్నే కాక ఆధ్యాత్మిక జీవితాన్ని కూడా పెట్టుబడిదారీ సంస్కృతి ఆవహించింది. తన సాంప్రదాయకత్వాన్ని తనకు తాను రుజువు చేసుకోవడానికి, ఇతరులకు చాటడానికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఇరుసు లాంటి డబ్బు చాలా అవసరం. ఫలం, పుష్పం, పత్రం, తోయం.... ఇవేవీ ఊరకే రావు. పూజలు, వ్రతాలు, దైవ దర్శనాలు, తీర్థ యాత్రలు, యజ్ఞాలు, యాగాలు అన్నీ డబ్బుతో ముడిపడినవే. అన్నీ మారకపు విలువలే! సాంప్రదాయ హిందువు గుర్తింపు ఉచితంగా రాదు. ఖర్చు చేసి పొందాలి. చివరకు వైరాగ్యం, సాంప్రదాయ సింప్లిసిటీ కూడా ఖర్చుతో కూడిన వ్యవహారమే.

ఇలా జీవితాలన్నింటినీ పెట్టుబడిదారీ సంస్కృతి ఆవహించిన పరిస్థితుల్లో సాంప్రదాయ హిందూ, లేదా భారతీయుడు అనే గుర్తింపు నిలుపుకోవాలని అనుకోవడం భ్రమే. ఆత్మవంచనే! ఈ ఐడెంటిటీలో వైరుధ్యం కొనసాగుతుంది. వాటిని సమన్వయం చేయడానికి పరస్పర విరుద్ధమైన,

హాస్యాస్పదమైన విధంగా ప్రవర్తిస్తుంటారు. శృతిమించిన వినిమయ తత్వంతో అతి ఖరీదైన విదేశీ వస్తువులు, కార్లు కొనే వ్యక్తి భక్తి వైరాగ్యాలను ప్రబోధించే ప్రవచనాలకు హాజరవుతుంటాడు, లేదా టీవీలో శ్రద్ధగా వింటాడు. తలకి నల్లని రంగు వేసుకున్న ప్రవచనకారుడు భక్తి, జ్ఞాన, కర్మ, వైరాగ్య యోగాల గురించి గుక్క తిప్పుకోకుండా ఉపన్యసిస్తుంటే తన్మయత్వం ప్రదర్శిస్తుంటాడు. ఆధునిక వస్త్ర ధారణతోపాటు బొట్టు కూడా పెట్టుకుని, బ్రాహ్మణ యువకులైతే అందమైన క్రాపులో కనబడీ కనబడకుండా రెండు వెంట్రుకల పిలక ఉంచుకొని తమ సాంప్రదాయ ఐడెంటిటీని నిలుపుకుంటారు. హిందూ జాతీయ వాదులు సాంప్రదాయానికి, ఆధునికతకు మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించే ప్రయత్నంలో బయట ఆధునికునిగా ఇంట్లో సాంప్రదాయ వాదిగా ఉండమని సూచిస్తూ ఇంట్లో సాంప్రదాయాన్ని, మతాన్ని కాపాడే బాధ్యత స్త్రీలదేనని సెలవిచ్చారు. దీన్నే పార్థా చటర్జీ 'కొత్త పితృస్వామ్యం' అన్నాడు. జాతీయ సంస్కృతి యొక్క ఆధ్యాత్మిక గుణం వ్యక్తమయ్యే ప్రధాన కేంద్రంగా ఇంటిని ఉంచే బాధ్యత స్త్రీలదేనని వీరి అలిఖిత శాసనం. విద్యాధికులైన మధ్యతరగతి పురుషులు కూడా వారి భారతీయతను, హైందవ సాంప్రదాయాన్ని కాపాడే బాధ్యతను స్త్రీలపైనే ఉంచుతున్నారు. వంట, పూజలు, కుటుంబ సంబంధాలు స్త్రీలే నిర్వహించాలని డిమాండు చేస్తున్నారు. విదేశాల్లో పెరిగిన భారతీయ యువకులు వారి భారతీయతను కాపాడే వారిగా భారతదేశంలో పెరిగిన యువతులనే పెళ్ళి చేసుకోవాలని కోరుకుంటున్నారు. 2002లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం 69% స్త్రీలకు ఉద్యోగం చెయ్యడానికి తండ్రి, భర్త, కొడుకుల అనుమతి కావాలని తేలింది.

భారతీయ మధ్యతరగతి యువతులు శారీరకంగా మానసికంగా దుర్భర హింసను అనుభవిస్తున్నారు. వీరి ఐడెంటిటీకి ఇంచుమించు ఏకైక ప్రమాణం అందం. అందానికి ఒక ప్రధాన కొలమానం 'కరువు పీడిత శరీరం'. వీరు అర్ధాకలితో అలమటిస్తూ పోషకాహార లోపంతో అనేక శారీరక రుగ్మతలతో బాధపడుతున్నారు. 1994-2000 సంవత్సరాల మధ్య ఏకంగా ఆరు గురిని

'మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్' లు గా ఎంపిక చేసి సౌందర్య సాధనాల వ్యాపారాన్ని అనేక రెట్లు పెంచుకున్నారు పెట్టుబడిదారులు. ఇది భారతీయ మధ్య తరగతి స్త్రీల పాలిట శాపం అయ్యింది. టెలివిజన్, ఇంటర్నెట్‌ల ద్వారా పరిచయం అయ్యే పాశ్చాత్య దేశాల పడుచులు అనుభవిస్తున్న స్వేచ్ఛ పట్ల ఆకర్షణ, భారతీయ సాంప్రదాయం విధించే నియమ నిబంధనలు, పని వత్తిడి, పోషకాహార లేమి,అన్నీ కలిసి యువతులపై తీవ్ర ఒత్తిడి కలుగజేసి వారిలో మానసిక ఆందోళన, క్రుంగుబాటులకు గురి చేస్తున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే వీరికి పుట్టబోయే పిల్లల ఆరోగ్యం గురించి ఊహించడానికే భయంగా ఉంటుంది.

# 11. అడ్వర్‌టైజింగ్

20 వ శతాబ్దంలో అడ్వర్‌టైజింగ్ అత్యంత శక్తివంతమైన ప్రచార వ్యవస్థగా అవతరించింది. ఇంత శక్తివంతమైన ప్రచారం మానవాళి చరిత్ర ఎరుగదు. దీన్ని, ఇది పెంచుతున్న వినిమయ సంస్కృతినీ, ఇతర సాంస్కృతిక విలువలనూ సకాలంలో అడ్డుకోకపోతే ఈ ప్రపంచం, జీవరాశి అతి త్వరలో అంతరిస్తాయి అనడానికి ఎటువంటి సందేహం అక్కర లేదు.

“కేపిటలిజం అమల్లో ఉన్న సమాజాల్లో సంపద సరుకులు అమిత సంచయనంగా దర్శనమిస్తుంది” అని మార్క్స్ కేపిటల్ ఆరంభంలోనే చెబుతాడు. చరిత్రలో ఏ ఉత్పత్తి విధానంలోనూ ఇంత భారీ ఉత్పత్తి జరగలేదు. మార్క్స్ తన విశ్లేషణ సరుకుతో ప్రారంభించాడు. సరుకులను భారీగా ఉత్పత్తిచేస్తే సరిపోదు. వాటిని అమ్మి లాభం గడించాలి. అంటే సరుకులు పంపిణీ, మారకం, వినిమయం అనే వలయాన్ని పూర్తి చేయాలి. ఈ వలయం పూర్తి కాకపోతే వ్యవస్థ కూలిపోతుంది. అందుచేత భారీస్థాయిలో ఉత్పత్తితో పాటు అంతే స్థాయిలో అమ్మకాలు చేయగలగాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని ఇపుడు పెట్టుబడిదారులకు ఉత్పత్తి ఒక సమస్య కాదు. అమ్మకాలు, వినిమయం ప్రధాన సమస్య. వినిమయమే ప్రధాన విషయంగా అవతరించిన వ్యవస్థ కాబట్టి వినిమయ సంస్కృతి అంటున్నారు. ఆ వినిమయాన్ని పెంచడానికి పుట్టుకొచ్చిందే అడ్వర్‌టైజింగ్ పరిశ్రమ. ఈ పరిశ్రమ మంచి నిపుణులనూ, సృజనాత్మక శక్తి ఉన్న వారినీ నియమించుకుని వినిమయాన్ని ప్రోత్సహించే విధంగా ప్రచారం సాగిస్తుంది. ఈ ప్రచారం ద్వారా వారు ఒక రకమైన సంస్కృతిని నిర్మిస్తారు. అందులో వాంఛలూ, గుర్తింపు (identity) సరుకుల్లో సంలీనమై పోతాయి. అప్పుడు మృత ప్రపంచపు వస్తువులు, మానవ సామాజిక సామర్ధ్యాలు, లక్షణాలతో లేచి వస్తాయి. ప్రజా చైతన్యాన్ని సరుకుల వినిమయానికి అనుకూలంగా మార్చే ప్రయత్నం 20 వ శతాబ్దంలోను, నేడు జరుగుతున్నంత ఎక్కువగా గత

చరిత్రలో ఎన్నడూ జరగలేదు. ఒక్క అమెరికా దేశంలోనే సంవత్సరానికి 175 బిలియన్ డాలర్లు ఈ ప్రచారానికి ఖర్చు చేస్తున్నారు. మన దేశంలో ఈ ఖర్చు సంవత్సరానికి 10 బిలియన్ డాలర్లు. అంటే సుమారు ఆరు లక్షల కోట్ల రూపాయలు పైగానే.

ఇంత భారీ ఖర్చు చేస్తున్న ఈ ప్రచార పరిశ్రమ అంత భారీగానూ, విస్తృతం గానూ సమాజంలో దర్శనమిస్తున్నది. ప్రచారం, దాన్ని అనుసరించి వినిమయం మన సంస్కృతిలో రోజు రోజుకి మరింత ఎక్కువ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. మన దైనందిన జీవితంలో అడుగడుగునా, అష్ట దిక్కులా, ఆకాశంలో, కాలి కింద (అమెరికాలో Foot Path ల పై కూడా ప్రకటనలు ఉంటాయి) అన్ని జాగాల్లోనూ ఏదో ఒక ప్రచారం కనిపిస్తుంది. ప్రచారంలేని జాగా మనకు కనిపించదు. దీనంతటి ప్రభావాన్నీ విస్మరించలేని సాంస్కృతిక అధ్యయన కారులు సాంస్కృతిక రంగం అనేది కేవలం ఉత్పత్తి-వినిమయ వ్యవస్థకు అనుబంధంగా మారిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రస్తుతం ప్రకటన కర్తలు పోటీ పడేది, ఆందోళన చెందేది తమ తోటి బ్రాండ్ల ప్రకటనకర్తల గురించి కాదు. హోరెత్తిస్తున్న మొత్తం ప్రచారంలో తాము వినియోగదారుని దృష్టిని ఆకర్షించగలమా, లేదా అని. ప్రకటనలు నానాటికి మరింతగా సాంస్కృతిక రంగాన్ని ఆక్రమిస్తున్నా విడి బ్రాండ్లు వినియోగదారుని దృష్టిని ఆకర్షించడం కష్టమైపోతున్నది. వినియోగదారుల్లో చాలామంది ప్రకట నలను తప్పించుకునే దారులు వెతుకుతున్నారు. అందుచేత ప్రకటనకర్తలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తున్నది. మరింత డబ్బు కుమ్మరించవలసి వస్తోంది. ప్రకటనలు ప్రచారంగా కాకుండా వార్తల్లో పరోక్షంగా వినియోగ దారుని మనసులో నాటుకునేలా అనేక మార్గాలు అనుసరిస్తున్నారు. అంటే రాజకీయాలకు సంబంధించిన పెయిడ్ న్యూస్‌లా అన్న మాట.

సాధారణంగా ప్రకటనలు, ప్రచారం ఏదేనా సరుకుకి డిమాండ్ కల్పిస్తోందా అని చర్చిస్తుంటారు. మనమిక్కడ చర్చించ వలసింది ప్రకటనల సామాజిక శక్తి గురించి, సమాజంపై ప్రచార రంగ ప్రభావం గురించి. మనకు సంబంధించి అడ్వర్‌టైజ్‌మెంట్ యొక్క సాంస్కృతిక పాత్ర ప్రధానం గానీ, దాని మార్కెటింగ్ పాత్ర కాదు. ఒక సమాజం తన గురించి తాను కథలు చెప్పుకునే, విలువలను వివరించి వ్యక్తీకరించే, మంచి చెడ్డలు, మరణం, అమరత్వాలను నిర్వచించే రంగమే సంస్కృతి. కానీ మన సమాజాల్లో ఈ సాంస్కృతిక జాగా మొత్తాన్ని ప్రకటనలూ, ప్రచారాల కథలూ, కథనాలూ ఆక్రమించి ఆధిపత్యం చలాయిస్తున్నాయి. ఎలా ప్రవర్తించాలి? ఏది మంచి? ఏది చెడు? ఏవి విలువలు మొ. అన్నీ ప్రచార రంగమే నిర్దేశిస్తున్నది.

## ఆనందం -Happiness.

ప్రతీ సమాజం ఆనందం గురించి ఒక కథనం చెప్పాలి. ఆ కథనం వ్యక్తులు ఎలా సంతృప్తిగా ఉండగలరు, స్వీయగతంగా, వస్తుగతంగా ఎలా బాగుగా(subjectively and objectively good) ఉండగలరు అనేది చెప్పగలగాలి. ఇక్కడ అడ్వర్‌టైజింగ్ సంస్కృతి చొరబడి ప్రత్యేకమైన పరిష్కారా లూ, సమాధానాలూ మన సమాజానికి అందిస్తున్నది. భారీస్థాయిలో సరుకుల వినిమయం జరగాలి. మరింత భారీగా వాటి ఉత్పత్తి జరగాలి. వస్తు సేవల వినిమయమే ఆనందం. ఇదీ ప్రకటనల రంగం మనకు ఇచ్చే సందేశం. ఈ రంగంలో ప్రతి ఒక్క ప్రకటనా ఇచ్చే సందేశమిదే. వస్తువులకూ, ఆనందానికీ ఉన్న సంబంధం అంత బలమైనదా అనే సందేహం గానీ, ఆలోచన గానీ రానివ్వకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటుంది. కనీస జీవితావసరాలు తీరినా, తీరకపోయినా మానసిక అవసరాలను కల్పించి వాటిని తీర్చుకోమని బలాత్కరిస్తుంది. అందుకే మంచి ఆహారం, వసతి లేని వారు సైతం అప్పు చేసి అయినా ఖరీదైన బైకు కొనడం మనం చూస్తున్నదే!

హోదా, గుర్తింపూ, గౌరవం, పేషన్ వంటి వాటిని కల్పించి వాటికి లొంగి సరుకులు కొని తీరాలని బ్లాక్ మెయిల్ చేస్తుంది. సరుకులు కొనకపోతే నీకు వ్యక్తిత్వమే లేదు పొమ్మంటుంది. ఈ ఊరించడాలూ, బుజ్జగింపులూ, ఆశపెట్టడాలూ, బెదిరింపులూ, బ్లాక్ మెయిలింగ్ అన్నీ ఆ ప్రకటనల్లో అంతర్లీనంగా ఉంటాయి. నువ్వు ఎక్కువ వస్తువులు వినియోగించి, వినిమయంచేసి ఆర్థికాభివృద్ధికి, నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడకపోతే నువ్వసలు దేశభక్తుడివే కాదు. ఈ విషయం చెప్పడానికి ప్రకటనల రంగం సరిపోకపోతే నేరుగా ప్రభుత్వాలే రంగంలోకి దిగతాయి. ట్రేడ్ సెంటర్ టవర్ల కూల్చివేత(9/11) అనంతరం ప్రజలు భయపడి షాపింగ్ మాల్స్‌కి వెళ్లడం మానేస్తే వారం తిరక్కుండానే అధ్యక్షుడు బుష్ ప్రజలు యధా విధిగా షాపింగ్ చెయ్యాలని విజ్ఞప్తి చేసారు. దుర్మార్గమైన విషయం ఏమిటంటే ఆకలి, పేదరికం, నిరుద్యోగం, తాండవిస్తున్న మూడవ ప్రపంచదేశాల్లో కూడా ఈ ప్రకటనల రంగం ప్రజలకు సమృద్ధత, వాంఛల అందమైన చిత్రాలను పంచుతుంది.

'వస్తు సంపదలు కలిగి ఉండటం, వినియోగించడమే ఆనందమా?' అనే ప్రశ్న వేస్తే సర్వసాధారణంగా 'కాదు' అనే సమాధానం స్పష్టంగా వినిపిస్తుంది.1945 నుండి నేటి వరకూ జరిగిన 'ఆనంద సర్వేలు'(Happiness surveys) అన్నీ కూడా మంచి జీవితానికి కావలసిన కనీస సదుపాయాలు సమకూరిన తర్వాత మనిషికి భౌతికేతర(non-material) అంశాలు చాలా కావాలని తేల్చాయి. ప్రేమ, కుటుంబం,స్నేహితులు సామాజిక జీవితం ఒక వైపు, ఆర్థిక విజయాలు మరో వైపూ ఉంచి మీరు ఏమి కోరుకుంటారని అడిగినప్పుడు అత్యధిక శాతం ప్రజలు కనీస ఆర్థిక భద్రత తర్వాత మొదటి సముదాయాన్నే కోరుకుంటున్నారని తేలింది. వాటితోపాటు స్వతంత్ర ప్రతిపత్తి, తమ జీవితం తమ అధీనంలో ఉండటం, ఆత్మగౌరవం, మంచి కుటుంబ సంబంధాలు, టెన్షన్ లేని విశ్రాంతి సమయం, సన్నిహిత మిత్రులు, ప్రేమ, ప్రణయాలను కోరుకుంటున్నట్టు చెప్పారు. నిజానికి ఇవన్నీ మంచి

జీవితానికి అవసరమైనవి. పేదరికపు స్థాయికి కొంత పైన ఉన్నవారికి కేవలం వస్తు సంపదలు సంతృప్తినివ్వడం లేదని కూడా తేలింది.

అయితే వినిమయ సంస్కృతికి అనుబంధమైన ప్రకటనల పరిశ్రమ పైన తెలిపిన కోరికల గురించి మాట్లాడదనుకుంటే పొరపాటు. సరుకులను ఎంచుకోవడంలో నీకు సంపూర్ణ స్వేచ్ఛను కల్పిస్తామంటుంది. ఈ సరుకులన్నీ నీ జీవితాన్ని నీ అధీనంలో ఉంచుకోవడానికి అత్యవసరం అంటుంది. మా వస్తు, సేవల కొనుగోలు ద్వారా నీవు నీ ఆత్మగౌరవం నిలుపుకోవచ్చు. అవి లేకుండా నీ ఆత్మగౌరవాన్ని కాపాడుకోలేవు. మంచి కానుకలను ఇవ్వడం ద్వారా కుటుంబ సంబంధాలను మెరుగు పరచుకోవచ్చు. నీ జేబు బరువును బట్టి నీకు విలాసవంతమైన విశ్రాంతిని అమ్ముతాము. మంచి పార్టీలు ఇచ్చి మంచి స్నేహితులను సంపాదించుకోవచ్చు. ప్రేమను, ప్రణయాన్నీ కూడా ద్విగుణీ కృతం చేసే సరుకులు సదా సిద్ధం. 'నువ్వు ఇవేవీ చేయకుండా నీ గొంతెమ్మ కోర్కెలను కేవలం నీ ప్రవర్తనతో సాధించలేవు' అని బల్ల గుద్ది చెబుతుంది. సామాజిక జీవితపు ఆనందానికీ, మార్కెట్ అమ్మే సరుకులకూ సంబంధం లేదనే విషయాన్ని అందరికన్నా ముందుగా గ్రహించింది అడ్వర్ టైజింగ్ పరిశ్రమే. అందుకే 1920 తర్వాత నుండి ఆ పరిశ్రమ సామాజిక సంబంధాలకూ, సరుకులకూ విడదీయలేని సంబంధం ఉన్నదనే భ్రమలను వినియోగదారులకు కల్పించడంలో కృషిచేసి విజయవంతం అయ్యింది. ఇవి భ్రమలే అయినా చాలా ఆకర్షణీయమైనవీ, శక్తివంతమైనవీ, నిరోధించ లేనివి. వాస్తవ జీవితం ఏ విధంగా చూసినా నిరాశా పూరితంగా ఉన్నప్పుడు మనిషి తెలిసి కావాలని పగటికలలను ఆశ్రయిస్తాడని అందరికీ తెలిసిందే. కేపిటలిస్టు సమాజంలో పోటీ, పరాయితనంతో బాధపడే వ్యక్తి సామాజిక సంబంధాల ద్వారా ఆనందం పొందే దారి కనిపించనప్పుడు ఊహలనూ, భ్రమలనూ ఆశ్రయిస్తున్నాడు. పెట్టుబడిదారీ సమాజపు వినిమయ సంస్కృతి చేసే ప్రకటనల సామర్థ్యం ఎంత గొప్పదంటే మనిషి పగటి కలలను, ఆ కలల ప్రపంచాన్ని కూడా అడ్వర్‌టైజింగ్ పరిశ్రమ ఆక్రమించేయ గలిగింది. అందుకే

ఒక అడ్వర్‌టైజింగ్ ఎక్జిక్యూటివ్ ఇలా వ్యాఖ్యానించాడు. "అడ్వర్‌టైజింగ్ ప్రజల ప్రవర్తనను ప్రతిఫలించదు. వారు కనే కలలను ప్రతిఫలిస్తుంది”

అది మన ఎమోషన్స్‌ను సంగ్రహించి వాటిని తన సరుకులతో తెగని విధంగా ముడివేసి పొట్లం కట్టి తిరిగి మనకు అందిస్తుంది. ఈ అర్ధంలో చూసినప్పుడు అడ్వర్‌టైజింగ్ నిజంగా ప్రతిబింబించేది సంస్కృతి యొక్క స్వాప్నిక జీవితాన్నే. ప్రకటన కర్తలు ప్రేమ, కుటుంబం, స్నేహం, సాహసం, సెక్స్ మొ. వాటి గురించిన మన కోర్కెలను మన కలలుగా మార్చేస్తాయి. అడ్వర్ టైజింగ్ అనేది ఒక ఫాంటసీ ఫేక్టరీ. అది సామాజిక సంబంధాల గురించిన మన కోర్కెను ముడి సరుకుగా సంగ్రహించి దాన్ని అనేక విధాలుగా మార్చి సరుకులు, సేవలతో మనం గుర్తు పట్ట లేనంతగా, విడదీయలేనంతగా కలిపి మనకు అందించే సమాచారంగా మార్చి వేస్తుంది. కలల సాకారానికి వినిమయం తప్పనిసరి షరతు.

ఇక్కడ దారుణమైన వక్రోక్తి (irony) ఏమిటంటే అర్థవంతమైన మానవ సంబంధాలనుండి మనం సాధించగల సంతృప్తి నుండి మనల్ని దూరంగా లాగేసి మనకు ఆ సంతృప్తిని ఇవ్వలేని సరుకుల వైపు మనల్ని తోస్తుంది. అంటే ఆనందంగా ఉండే అవకాశాలను మనకు లేకుండా చేస్తున్నది. మనం నిజంగా కోరుకునే మన కోర్కెల ప్రపంచం వినిమయ సంస్కృతి ఎంతమాత్రమూ కాదు. ఆ విధంగా అది సామాజిక మార్పుకు పెద్ద మానసిక ప్రతిబంధకంగా తయార య్యింది. ఈ ప్రచారమంతా మత్తు మందుల వలె (drugs)పని చేస్తున్నది. ప్రజలను ఆ మత్తుకు బానిసలను చేసే పనిలో ఉంది.

అడ్వర్‌టైజ్‌మెంట్ గురించి ఒక కవిత చూడండి.

# నూర్పిళ్ళు

వాడు దిన పత్రిక పేజీల

పాదులో

ముందుగా ఓ ప్రకటన గింజను

విత్తుతాడు

బుల్లితెర పొలమ్మీద కూడా

కాసిని

విజ్ఞాపనల

విత్తనాలు చల్లుతాడు

నువ్వు వాడాల్సిన

షేవింగ్ బ్లేడును

శిల్పాశెట్టి చేత

సర్టిఫై చేయిస్తాడు

నడి బజారు

హోర్డింగుల్లో

సచిన్నూ,

షారుక్‌నూ నిలబెట్టి

నీకు అక్కర్లేని 'వస్తువును'గూడా

నువ్వు కావాలనుకునేట్టు

ఒప్పిస్తాడు

టిప్‌టాప్‌గా డ్రస్ చేసుకున్న

కుర్రాణ్ణి

నీ ఇంటికే నేరుగా పంపిస్తాడు

వ్యాక్యూమ్ క్లీనర్ డిమాన్‌స్ట్రేషన్

చేయించి, మీ ఆవిడ చేత

గిరిజనుల కొండ చీపుర్ను

గిరవాటు వేయిస్తాడు

ఒక్కటి నువ్వు కొంటే చాలు

అదనంగా పొందబోయే

సదుపాయాలను

ఆఫర్లు ఆఫర్లుగా నీ ముందు

అంగాంగ ప్రదర్శన చేయిస్తాడు

గ్యారంటీ వారంటీల గేలం విసిరి

రాబోయే రోజులగ్గాడా నువ్వు
గుప్పెట్లో వుండేట్లు
చూసుకుంటాడు
ముంబయి
ఆకాశ సౌధంలో
కూచుని
తన ఆక్టోపస్
బాహువులు
విస్తరించి
యస్.యం.యస్.
అరబ్బు ఒంటెగా

మారి నీ సెల్లు
గుడారంలో పాదం
మోపుతాడు
ఎలాగైతేనేం నీ కాళ్ళకు
ప్రచారార్భాటాల సంకెళ్ళ గొలుసు
తగిలిస్తాడు
వ్యాపార మెలకువల ఫెర్టిలైజర్స్
గుప్పించి
లాభాల నూర్పిళ్ళుగా
చేసుకోవడం
వాడికి బహుబాగా తెలుసు.

**-సిహెచ్.వి.బృందావనరావు**

ప్రజాశక్తి సవ్వడి - 19.07.2010

అనువాద వ్యాసం

# 12. ప్రస్తుత పెట్టుబడిదారీ సంస్కృతి
## ఒక విమర్శ

శిష్టుల (elite) అధిక పోగుచేత కారణంగా ప్రస్తుత ప్రపంచంలో గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని సామాజిక అసమానతలు, విస్తృతమైన, భారీ స్థాయి మాంద్యం వ్యాపించాయి. అదే సమయంలో అమెరికాలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ వామపక్షాలు ప్రస్తుత ఆర్థిక స్థితిని సమర్ధవంతంగా సవాలు చేసే భావాలను ప్రతిపాదించడంలో విఫలమవుతున్నాయి. వామ పక్షాల కార్యక్రమాలు మరింతగా మార్కెట్ నియంత్రణలు సడలించడానికి, గుత్త పెట్టుబడి మరింతగా సంఘటితం కావడానికీ తోడ్పడుతున్నాయి. నయా ఉదారవాదం (Neo Liberalism) దాని బద్ధ శత్రువులను కూడా ఎలా వశపరచుకున్నదో ఎవరికీ అర్థం కావడం లేదు.

"దీనికి కారణం ఏమిటంటే 'శత్రుత్వం' అనే భావన వామ పక్ష రాజకీయ భావజాలంలో చెరిగిపోయింది.- - - - గ్లోబలైజేషన్ శక్తులు తమ రాజకీయ రూపాన్ని విడిచి మనమందరం తలవంచవలసిన 'విధి' (fate) గా అవతరించాయి."- ఎర్నెస్టో లక్లాం,[1] షాంతల్ మూఫ్.[2]

వామ పక్షాలు శత్రుత్వం, హెజమని(నాయకత్వం ద్వారా ఆధిపత్యం) లను వదిలి చేర్పు, సర్దుబాట్లు (inclusion and reconciliation) ను ఆశ్రయించి బహుళ సంస్కృతివాద నీతిని ఆశ్రయించాయి. ఈ నీతి ఛాందస వాదాన్ని (fundamentalism) తిరస్కరిస్తుంది. ఈ దృష్టితోనే అమెరికా వామపక్షాలు ఒబామాను చూశాయి. ఇదే సమయంలో గతంలో మార్క్సిస్టు–లెనినిస్టులు శత్రుత్వపు మహా కథనాలను (grand narrations) నిర్మించి వయోజన ఓట్లను రెండు ధృవాలుగా విభజించి నట్లుగానే దక్షిణ పక్షం (the Right) అత్యంత ధైర్య సాహసాలతో ఖాళీగా ఉన్న హెజమని స్థానాన్ని

ఆక్రమించింది. హెజమనిపై పోరాటాన్ని విడిచిన లెఫ్ట్ 'రాయితీలు, సహనం' సందేశాన్ని మాత్రమే ఏకైక ఆయుధంగా ధరించి తన స్థానాన్ని తాను కాపాడుకోలేని శక్తి హీనురాలు అయ్యింది.

దీని ఫలితంగా నయా ఉదారవాద భావజాలం ఒక జీవిత విధానంగా మారింది. ఈ ప్రపంచ దృక్పథం దైనందిన జీవిత విధానంగా లెఫ్టిస్టులతో సహా ప్రజలందరిని ఆవహించింది. ఇది దైనందిన జీవిత ఆచరణ, ఆలోచనలకు సంబంధించిన పదజాలాన్ని సమకూరుస్తుంది. నైతికత గురించి ఆక్షేపించ లేని భావాలను ప్రోత్సహిస్తుంది. నయా ఉదారవాదం అనేది కేవలం అదనపు విలువ ను సొంతం చేసుకునే పన్నాగం మాత్రమే కాదు. దాని నిజమైన అర్థంలో దైనందిన జీవితానుభవానికి చెందిన ప్రతీ అంశంలోనూ తెలియకుండానే చొరబడే ఒక సాంస్కృతిక తర్కం. నయా ఉదారవాద తర్కం వర్గ విభేదాలు, మతాలు, సాంస్కృతిక అనుబంధాలు, రాజకీయ విధేయతలకు అతీతంగా అందరిలోనూ చొరబడుతుంది. అది ప్రవచించబడేది కేవలం న్యూయార్క్ స్టాక్ ఎక్సేంజిలోనో, యూనివర్శిటీల ఆర్థిక శాస్త్ర విభాగాల్లోనో, వరల్డ్ బేంకు, ఐ.ఎం.ఎఫ్. చలువరాయి సమావేశ మందిరాల్లోనో మాత్రమే కాదు. అభ్యుదయ వేదికలూ, అభ్యుదయ వాదులూ అని అందరూ అనుకునే ఐక్య రాజ్య సమితి మానవాభివృద్ధి కార్యక్రమంలోనూ, అమెరికా యూనివర్శిటీల్లో చక్కర్లు కొట్టే ఫేషనబుల్ పర్యావరణ వాదులూ, లింగ, జాతి, సమాన న్యాయం కావాలని వాదించే బృందాలు, అన్ని రకాల 'మహా దాతల' చేత కూడా బోధించబడు తోంది. మరోలా చెప్పాలంటే ***నయా ఉదారవాదం సంపద, వనరుల పునః పంపిణీ కోరే రాడికలిజం లేని అభ్యుదయవాద రాజకీయాలకు జన్మనిచ్చింది.*** ప్రస్తుత ప్రపంచంలో కూడా చాల వరకూ 'అభ్యుదయ రాజకీయ వాదులంతా' వారి ప్రత్యర్థులతో సమానంగా నయా ఉదారవాద భావాలను వంటబట్టించు కున్నారు.

వామ పక్షాలు చేస్తున్న విమర్శ నయా ఉదారవాద ప్రాథమిక షరతులను ఆమోదించడమే కాక నిజానికి అంతిమంగా నయా ఉదారవాదాన్ని ప్రోత్స హించే ప్రత్యామ్నాయాలను అందిస్తున్నది. దీనికి కారణం ఒక ద్వంద్వ ప్రక్రియ. గత కొన్ని దశాబ్దాలుగా మార్కెటింగ్ వ్యూహాలు అసమ్మతిని తన పంచను చేర్చుకుని (co-opt) తిరుగుబాటును (rebellion) పొట్లం కట్టి వినిమయ సరుకుగా అమ్మగలుగుతున్నాయి. అదే సమయంలో పేదరికం, అసమానతలు అనే సమస్యలను 'అభివృద్ధి' మంత్ర జపంతో పూర్తిగా రాజకీయేతరం చేసేయ గలిగాయి.

నయా ఉదారవాదాన్ని ఇబ్బంది పెట్టే రాడికల్ విమర్శ లేని ఇటువంటి పరిస్థితుల్లో నయా ఉదారవాద మార్కెట్ నిపుణులు సామాన్యుల అహేతుక ప్రేరణలను (irrational impulses) తమకు అనుకూలంగా మార్చుకుంటు న్నారు. సమాజం శిక్షితులు, మంద (elite, mass) గా విడిపోయి ఉంటుం దని ఈ నిపుణుల అభిప్రాయం. అలా ఎలైట్‌కు, మాస్‌కు ఎవరికి కావల్సింది వారికి అమ్ముతారు. మొత్తం మీద నయా ఉదారవాదం 'మెజారిటీ సమ్మతి' ని (ఆమోదం,అంగీకారం) సమర్ధవంతంగా ఉత్పత్తి చేయగలుగుతోంది.

మొత్తంగా చూసినప్పుడు 'బలాత్కరించే వినిమయ వాదాన్ని' (కొనకుండా ఉండలేని పరిస్థితి, కొనాలనే తీవ్ర కాంక్ష) కొనుగోలుశక్తి లేని వారితో సహా అందరిలోనూ నయా ఉదారవాదం నాటగలిగింది. ఇది సహజంగా ఉత్పత్తి పెరుగుదలతో వచ్చింది కాదు. పోటీవల్ల వచ్చింది. ఇందులో పరిశ్రమలు, శ్రామికులు, ప్రభుత్వాలు అందరూ భాగస్వాములే. *నయా ఉదారవాద వ్యవస్థలో సంస్కృతి ప్రజలనుండి మార్కెట్ శక్తుల చేతుల్లోకి పోయింది. సంస్కృతికి సంబంధించిన వివిధ అంశాలన్నీ వెనక పట్టుపట్టి వినిమయ వాదం అత్యధిక భాగాన్ని ఆక్రమించింది.* మంచి పాట వినాలన్నా, సినిమా చూడాలన్నా అన్నీ సరుకులే. అన్నీ ఆర్థిక అంశాలే. అన్నిటినీ కొనాల్సిందే. మనం డబ్బు చెల్లించి చూసే సినిమా, టీవీ, అన్ని పత్రికలూ తిరిగి మనలో

మనల్ని దివాలా తీయించే వినిమయ వాదాన్ని పెంచే గొప్ప సాధనాలు. షాపింగ్ మాల్స్, సినిమా కాంప్లెక్స్‌లు అన్నీ వినిమయ వాదాన్ని పెంచేవే !

యూరప్ ఫాసిజం బారినుండి ప్రాణ రక్షణకు పారిపోయిన విమర్శనాత్మక సిద్ధాంతులు(Critical Theorists)- మార్క్యూజ్,[3] సార్త్ర,[4] అడార్నో,[5] ఆల్తూసర్ వగైరా -1960 లలో విపరీతంగా ప్రచారంలో ఉన్న 'కమ్యూనిస్టు నియంతృత్వం' సమస్యకు పరిష్కారాలు వెదకడంలో తలమునక లయ్యారు. అమెరికా కేపిటలిజం మీద వారు చేసిన విమర్శ మార్క్సిస్టు సూత్రాలపై ఆధారపడినదే అయినా వారు ప్రధానంగా 'తప్పుడు చైతన్యం' మీద కేంద్రీకరించారు. వర్గం, శ్రమ, దోపిడీలపై విమర్శ స్థానాన్ని 'నియంతృత్వ సమాజాల్లో వ్యక్తి స్వేచ్ఛను అణచి వేయడం పై విమర్శ' ఆక్రమించింది. విద్యార్థి ఉద్యమాల అంతిమ లక్ష్యం 'వ్యక్తి స్వీయ వ్యక్తీకరణకు స్వేచ్ఛ' అయింది.

సామెత చెప్పినట్టు అమెరికా కేపిటలిజంపై వీరి విమర్శ కేపిటలిజం యొక్క మరింత ప్రమాదకర రూపాలు పుట్టుక రావడానికి కారణమైంది. వ్యక్తి ఐడెంటిటీని కీర్తించే, అత్యంత కొత్త మార్కెట్ అవకాశాలను కల్పించే, సృజనాత్మక స్వీయ వాంఛితాలు లభించే పెట్టుబడిదారీ రూపం అవతరించింది. విశ్వసనీయ స్వీయ వ్యక్తీకరణకు వినిమయదారుల ఉద్వేగాలకు ప్రతిస్పం దించిన కంపెనీలు వివిధ లైఫ్ స్టైల్ లేదా ఐడెంటిటీ సరుకులను (సేవలు ఇందులో భాగమే) అమ్మసాగాయి. ఈ మార్కెటింగ్, వినిమయ తర్కం ప్రకారం వ్యక్తి తన అద్వితీయ (unique) ప్రామాణిక స్వీయత(self)ను తను కోరు కున్న సరుకులను కొనడం ద్వారా వ్యక్తీకరించుకుంటాడు. క్రమేణ 'కౌంటర్ కల్చర్' మార్కెటింగ్ చేయగల ఐడెంటిటీగా మారి పోయింది. కేపిటలిజం యొక్క కొత్త చైతన్యమే 'తిరుగుబాటు చైతన్యం' అయ్యింది. ఇది లెఫ్ట్ పై చెరగని ముద్ర వేసింది.

15 ఏళ్ల క్రితమే, లండన్ ఎయిర్ పోర్టులో విప్లవానికి సంకేతం అయిన వీరుడు చేగువేరా ముఖచిత్రాన్ని ముద్రించిన చొక్కాను(Cashmere Cardigan) 200 డాలర్లకు అమ్ముతున్నారు. "కొత్త కేపిటలిస్ట్ నీతి ప్రకారం అహంభావ పూరిత వినిమయంలో దానికి విరుద్ధమైన దాని ధర చేరి ఉంటుంది" అని జిజెక్[6] అంటాడు .

వీటన్నిటిలోనూ సరుకు సంకేతం సంస్థాగత శక్తి గుర్తును తెలుపుతుంది. అలాగే సృజనాత్మక స్వీయ వ్యక్తీకరణ సేవలోనూ ఈ శక్తి గురించి ప్రజల బాధ్యత లేకపోవడాన్ని కూడా తెలుపుతుంది. 'చే' చిత్రం ముద్రించిన చొక్కా ధరించిన వాడు ఒక పోలో మేచ్‌లో కనిపిస్తాడు గాని ఒక నిరసన ప్రదర్శనలో కనిపించడు. ఇలాంటి కొన్ని వినిమయాలు ప్రధాన స్రవంతిని తిరస్కరించే సంకేతాలు. ఈ వేళ 'అసమ్మతి' అనేది గొప్ప విలువైన సరుకు. (చిరిగిన జీన్స్ ఖరీదు ఎక్కువ) సమర్ధ విమర్శనాత్మక చర్యలు, కేపిటలిస్టు వైపరీత్యాల విమర్శల స్థానంలో ప్రత్యామ్నాయ వినిమయ నీతి ప్రవేశించింది. ఈ నీతి కేపిటలిజాన్ని బలోపేతం చేసేదిగా ఉంది. నయా ఉదారవాద యుగంలో కేపిటలిజం ఒక ఉత్పత్తి విధానం మాత్రమే కాదు. అది ఒక ప్రతిఘటన రూపం కూడా. అయితే ఆ ప్రతిఘటన ఎప్పటికీ ఉత్పత్తి విధానాన్ని అధిగమించదు. ఇలా అసమ్మతిని స్వాయత్తం చేసుకునే చర్యను కేపిటలిజం బలపడే చట్రంగా అర్ధం చేసుకోవాలి. అది బలపడటానికి ఇది ఎలా దోహద పడుతుందంటే కేపిటలిజం ప్రతిఘటన, తిరుగుబాటు, అసమ్మతులను తన లక్ష్యాలను నెరవేర్చే విధంగా నిర్వహించగలుగుతోంది. ఈ లక్ష్యం ఏమిటంటే మూలంలో దోపిడీ స్వభావం గల హయాంలో నానాటికి మరింత ఎక్కువగా సరుకులకు వినిమయ డిమాండును సృష్టించడమే. నిష్క్రియాత్మకంగా ప్రదర్శించే ఐడెంటిటీ, వైవిధ్య భరిత వినిమయ వాదాలతో రాజకీయ విప్లవం పట్ల గాఢ వాంఛను కొనివేయ గలుగుతున్నది. కేపిటలిజం 'ప్రజలు తమ అసలు సిసలు అద్వితీయ స్వీయతను వ్యక్తీకరించు కొనగలుగుతున్నారు' అనే భావాన్ని కలిగిస్తోంది. దానివల్ల ఎంపిక స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కలిగి ఉన్నామనే

భ్రమలను వారికి కలిగించ గలుగు తోంది. అంతిమంగా ప్రతివ్యక్తీ విభిన్నంగా, అద్వితీయంగా ఉండాలను కుంటున్నారు గానీ అందరూ అదే చేయడంవల్ల ఎవరి ప్రత్యేకతా ఏమీ ఉండటం లేదు. తమ ఐడెంటిటీ సంకేతాలను (సరుకులను) కొనుగోలు చేయడం ద్వారా పదిమందితో ఉండే ఉమ్మడి పోలికలను విభిన్నత అనే అతి పలుచని పారదర్శక ముసుగులో కప్పిపుచ్చుతున్నారు.

వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 'విప్లవాత్మక' సిద్ధాంతం కేపిటలిజానికి కొత్త రూపాల వినిమయాన్ని అందించడమే కాక, కొత్త ఉత్పత్తి పద్ధతుల తర్కాన్ని సమకూర్చింది. కంపెనీలు అధికార దొంతరల ఫేక్టరీ క్రమ శిక్షణా వ్యవస్థలకు స్వస్తి చెప్పటం ఆరంభించాయి. దానికి బదులుగా మరింత వెసులుబాటుతో కూడిన శ్రామికుని స్వీయ నియంత్రణ, వైయక్తిక బాధ్యతలను ప్రోత్సహించసాగాయి. దీని వల్ల దోపిడీ మరింత సమర్ధవంతమైంది.

## అభివృద్ధి మంత్రం, సుగుణాల సరుకు (virtuous commodity)

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్న అతి తీవ్ర అసమానతలు అభ్యుదయ వాదుల ప్రధాన వాస్తవ సమస్య అయ్యాయి. దీనికి వారు ఇంచుమించు ఏకగ్రీవంగా ప్రతిపాదించే పరిష్కారం 'సస్టైనబుల్', 'కమ్యూనిటీ', 'ఇంక్లూజివ్' వగైరా అభివృద్ధి.

చేగువేరా చొక్కా తొడిగి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనటం వీరికి ఒక విప్లవాత్మక చర్య. యువజనులు అమెరికా కేపిటలిజం వైపరీత్యాలు, వినిమయ వాదాలపట్ల తమ అయిష్టతను వ్యక్తం చేయడానికి విదేశాలకు వెళ్లి పేదరికంతో బాధపడుతున్న సమూహాలను ఉద్ధరించ పూనుకుంటున్నారు. అతి ముఖ్యమైన రాజకీయ సమస్యలపై స్పందించకుండా తమను తాము విశ్వ పౌరులుగా చెప్పుకుంటున్నారు. తమ అనుభవాలను, తమ ఐడెంటిటీని

'కౌంటర్ కల్చర్' గా చూపించు కోవడానికి ఉపయోగించు కుంటున్నారు. ఆ విధంగా వారు తమ వ్యక్తిత్వాన్ని దేనికి బద్ధం కాని 'రాడికల్ మూస' లో వ్యక్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

వారు హోండురాస్, ఘనా లాంటి దేశాల నుండి తిరిగి వచ్చి బీదలతో పనిచేసిన, ఆకలితో నకనక లాడుతున్న పిల్లలని ఎత్తుకుని, బావులు తవ్వుతూ, స్కూలు భవనాలు నిర్మిస్తూ చెమటతో తడిసి, ఇలా అనేక రకాల పనుల్లో నిమగ్నమైన ఫోటోలను ఫేస్ బుక్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఇలాంటి ఫోటోలు గొప్ప 'సాంస్కృతిక పెట్టుబడి'. ఎందుకంటే ఈ ఫోటోలు, వాటి సందేశం అత్యంత విలువైన 'ప్రత్యామ్నాయ' వైయక్తిక కథనాన్ని అందిస్తాయి. ఇవి చాలా విలువైనవి. ఒక అభివృద్ధి కార్యక్రమంలో అనుభవం భవిష్యత్తులో మంచి జీతం గల ఉద్యోగానికి దగ్గరి దారి. ఎందుకంటే అలాంటి సృజనాత్మక చొరవ చాలా పోటీమయ కంపెనీలకు కావాలి. ఇలాంటి ప్రత్యామ్నాయ ఐడెంటిటీ కల్పించు కున్న యువకులు కాలేజీ చదువు పూర్తయిన తర్వాత తరచుగా అభివృద్ధి రంగంలో ఉద్యోగం కోరుకుంటున్నారు. వారక్కడ మంచి జీతం తీసుకుంటూ ప్రపంచ పేదరికపు సమస్యలను ఎదుర్కొంటారు. రాజకీయ క్రియాశీలత స్థానంలో 'వృత్తి పర అభివృద్ధి' పని నిలిచింది. ఈ విప్లవం వినిమయ దారీ జీవన విధానాలకు సరిపడినదే. 'అభివృద్ధి శ్రామికులు' మంచి జీతాలు తీసుకుంటూ 'తమని తాము అమ్ముకుంటున్నాము' అనే భావం ఏమాత్రం కలిగి ఉండరు.

గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధి భావనే సరుకు సంకేతంలోకి చేరిపోతోంది. సుదూర ప్రాంతాల్లోని దుర్భర దారిద్ర్యంపై యుద్ధం చేయడానికి నువ్వు ఇంకెంత మాత్రం అమెరికా, పశ్చిమ దేశాల్లోని సౌకర్యాలను వదులు కోవాల్సిన అవసరం లేదు. నువ్వు చేసే ప్రతి కొనుగోలుతో -అదెంత చిన్నదైనా సరే- నువ్వు ప్రపంచ పేదరికాన్ని పారద్రోల వచ్చు. స్టార్ బక్స్‌లో గాని మరో చోట గాని ఎర్ర గుర్తు గల నీళ్ళు, బూట్లు, బట్టలు, ఎలక్ట్రానిక్స్ వగైరా ఏవి

కొన్నా అభివృద్ధి కార్యక్రమంలో నీవు భాగస్వామివి కావచ్చు. ఆయా సరుకులపై వచ్చే లాభంలో కొంత భాగం బాగా వెనుకబడిన దేశాల్లోని పేదరికాన్ని తొలగించడానికి, ఆకలితో అలమటించే పిల్లల ఆకలి తీర్చడానికి ఉపయోగి స్తామని కంపెనీలు వాగ్దానం చేస్తున్నాయి. ఉదా: ప్రొడక్ట్ రెడ్, గేప్ (G.A.P.), యాపిల్, నైకీ లాంటి ఫ్రాంచైజీలలో రెడ్ గుర్తు వేసిన వస్తువులపై లాభాల్లో సగం ఆఫ్రికాలో ఎయిడ్స్ సమస్యను ఎదుర్కొనేందుకు వెళుతుంది. వారి నినాదం 'రెడ్ కొనండి. జీవితాన్ని రక్షించండి...అంతే'.( buy red, save lives.. its that simple).

'సుగుణాల సరుకు' అనేది జిజాక్ చెప్పిన కల్చరల్ కేపిటలిజానికి అతి గొప్ప ఉదాహరణ. ఆయన ఇలా అన్నాడు. "ప్రాథమికంగా మనం సరుకులను వాటి ఉపయోగాన్ని బట్టి గాని, స్టేటస్ సింబల్‌గా కానీ కొనం. అవి ఇచ్చే అనుభవాన్ని పొందేందుకు కొంటాం. మన జీవితాలను సంతోషదాయకం, అర్థవంతం చేసుకోడానికి కొంటాం." నువ్వు కేవలం కాఫీ, వాటర్, ఆర్గానిక్ యాపిల్స్ మాత్రమే కొనడం లేదు. నువ్వు ఒక ఐడెంటిటీని, అంటే విమర్శ నాత్మక చైతన్యం, కాస్మోపాలిటన్ గ్లోబల్ అవేర్‌నెస్, బీదలపట్ల శ్రద్ధ కలదన్న ఐడెంటిటీని కూడా కొంటున్నావు. నువ్వు 'ఆలోచనాపరుడైన, ప్రత్యామ్నాయ దృక్పథంగల మంచి వ్యక్తిని' అనే ఫీలింగ్‌ను కూడా కొంటున్నావు. మరోలా చెప్పాలంటే కంపెనీలు కేవలం సరుకులనే కాక ఫీలింగ్స్‌ను కూడా అమ్ముతున్నాయి. కటిక దరిద్రం ఉనికి, దాన్ని తీర్చుతున్నాం అనే భ్రమ ఇచ్చే సంతోషం వాటికవిగా సరుకులై పోయాయి. అంటే వాటిని కొనొచ్చు, అమ్మవచ్చు.

ఇది 1970లలో మొదలైన లైఫ్ స్టైల్ మార్కెటింగ్‌కు విస్తరణే. కానీ కౌంటర్ కల్చర్ ఉద్యమం నేపథ్యంలో పుట్టుకొచ్చిన వినిమయ వాదానికి కొత్త కల్చరల్ కేపిటలిజం ఒక అదనపు దినుసును చేర్చింది. అదే మంటే సరుకు వినిమయాన్ని కేవలం కీలక స్వీయ వ్యక్తీకరణకు వాహకమే కాక

వినిమయాన్ని నిరోధించేదిగా చూపగలుగుచున్నది. జిజాక్ చాలా సమంజసంగా చెప్పినట్టు *సరుకు మోక్షాన్ని ఇచ్చే గుణాన్ని సంతరించుకుంది. సరుకు మన వ్యక్తిగత సంతోషానికే కాక మన నైతిక శ్రేయస్సుకు కూడా కీలకం అవుతున్నది. నువ్వు వినిమయం చేసే క్రమంలో వినిమయ వాద పాపాల నుంచి నీ విముక్తిని కొనుగోలు చేస్తావు. కాని ఈ ఆరాధన (fetish) ఇంకా ముందుకు పోతుంది. వినియోగదారులుగా మన ముక్తినే కాక వేదనాభరిత ప్రపంచ ముక్తిని కూడా సరుకు వాగ్దానం చేస్తుంది. అంతే కాక మాస్ కేపిటలిస్ట్ కన్సంప్షన్ వల్ల వచ్చే సమస్యలను వ్యక్తులు మరింతగా మాస్ కేపిటలిస్ట్ కన్సంప్షన్ జరపడం ద్వారా పరిష్కరించగలరనే భ్రమను పెంచి పోషిస్తుంది. అంటే ఈ ఫెటిషిజం వల్ల వ్యక్తులు తాము మరిన్ని సరుకులు కొనడం ద్వారా ప్రపంచ పేదరికాన్ని పరిష్క రించగలం అనుకుంటారు.*

ఇది మార్క్స్ చెప్పిన సరుకుల సంకేతారాధన కు అదనపు మాయ పొరను కప్పుతుంది. నిజం ఏమిటంటే సరుకు మరింత విముక్తిదాయకం, మరింత మోక్ష దాయకంగా  కనిపిస్తూ గతంలో ఎన్నడూ లేనంతగా సరుకు వెనుక నున్న ఉత్పత్తి సంబంధాలను కనబడకుండా చేస్తుంది. ఉదాహరణకు 'నోబెల్ బహుమతి గ్రహీత' మహమ్మద్ యూనస్[7] (బంగ్లాదేశ్‌లో గ్రామీణ బేంక్ వ్యవస్థాపకుడు) అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేద చిన్నారుల కోసం రెండు డాలర్ల ఖరీదు చేసే బూట్లను తయారుచేయడానికి నైకీ (nike) తో కలిసి 'సోషల్ బిజినెస్' ప్రారంభించాడు. ప్రపంచ వ్యాపితంగా అభివృద్ధి కాముకులు ఈ ప్రతిపాదనను ఎంతగానో మెచ్చుకున్నారు. అయితే వీరు గుర్తించని, మరుగు పరిచే సత్యం ఏమిటంటే రెండు డాలర్ల బూట్లు తయారుచేయడానికి మూడవ ప్రపంచ దేశాల శ్రామికులను ముఖ్యంగా బాల కార్మికులను దోచుకోవాల్సి ఉంటుంది. ఈ హింసాత్మక ఉత్పత్తి సంబంధాలను మరుగు పరిచిన 'సుగుణాల రాశి సరుకు' అది పరిష్కరించాలను కొనే పేదరికాన్ని పునరుత్పత్తి చేస్తుంది.

ఈ వైరుధ్యానికి సమాంతరమైనది, మరింత విశాలమైనది దాతృత్వ తర్కం. దాతృత్వం లేదా భారీ స్థాయిలో అభివృద్ధి సహాయం అనేవి అధిక లాభాలతోనే సాధ్యం. కాని అంత భారీ స్థాయి లాభాలను ఆర్జించాలంటే మరెక్కడో శ్రమను, పర్యావరణాన్ని దోచుకోవాల్సి ఉంటుంది. 'చర ఉత్పత్తి ఖర్చు' లుగా  కేపిటల్ కన్నా శ్రమ, పర్యావరణాలను మోసగించడం, దోచుకోవడం సులభం. ఎందుకంటే కేపిటల్ అప్పటికే ఇతర కేపిటలిస్టుల లాభంతో 'స్థిర పెట్టుబడి' గా వస్తుంది. మరీ ముఖ్యంగా విదేశీ పెట్టుబడి అతి తక్కువ నియంత్రణలతో ప్రవేశించి శ్రామికులకు జీవిక వేతనాలు (living wages) కన్నా తక్కువ చెల్లించడమే కాక, వారు చేసే కాలుష్యానికి, విధ్వంసానికి పరిహారం ఇవ్వకుండా భారీ లాభాలను ఆర్జిస్తుంది. ఈ విధంగా కేపిటలిజం తన సొంత పునరుత్పత్తి ఖర్చులను బయట దేశాలపై రుద్దుతుంది. అప్పుడు వైరుధ్యం ఏమిటంటే దాతృత్వం చూపడానికి కావల్సినంత లాభం పోగేసే ప్రక్రియే కచ్చితంగా ఆ దాతృత్వం పరిష్కరిస్తున్నట్టు నటిస్తున్న సమస్యల సృష్టి కర్త. జిజాక్ గొప్పగా చెప్పినట్టు "ఈ దాతృత్వ కృషి అంతా తాను ఒక చేత్తో చేసిన విధ్వంసాన్ని మరో చేత్తో రిపేరు చేయాలనుకుంటుంది."

సుగుణాల సరుకు యొక్క కీలక ట్రిక్కు ఏమంటే దానాలు లక్ష్యాలకు – అంటే ఉదాహరణకు ఆఫ్రికా పేద పిల్లలకు- చేరతాయి. ఇది ఉత్పత్తి రంగానికి ఆవల, ఒక నిశ్చల, సహజ అవసర పరిస్థితిగా కనిపిస్తుంది. సుగుణాల సరుకు ఇవ్వ చూపే పరిష్కారం ఒక భ్రమ. ఒక ఫెటిష్. వినియోగదారులు నిజంగా మెరుగైన ప్రపంచాన్ని కొనడం లేదు. వారు మెరుగైన ప్రపంచం కోసం కొంటున్నాము అనే భ్రమతో వచ్చే ఒక సంతోషాన్ని కొంటున్నారు. ఇదే కమోడిటీ ఫెటిషిజాన్ని నిర్మించే వినబడని మంత్రోచ్చారణ. ప్రస్తుత రేటులో వినిమయాన్ని కొనసాగిస్తూనే, వినిమయ పెట్టుబడిదారీ విధానంలోని అసమానతలపై తిరుగుబాటు చేసేందుకు ప్రజలను అనుమతిస్తుంది. ఈ విధంగా కేపిటలిజం తనపై విమర్శను తన అధీనంలోకి తెచ్చుకుంటుంది. అది తన 'వ్యతిరేకతను' కూడా అమ్ముతుంది. కేపిటలిజం పట్ల ప్రజలకు ఉన్న

అసంతృప్తిని, చెడ్డ భావనను అది ఒక మార్కెట్‌గా మలుచుకుని మరిన్ని సరుకులతో, గతంకంటే మరింత ప్రమాదకరమైన సరుకులతో అగాధాన్ని నింపుతుంది.

అచ్చు ఇలాంటి అహేతుకతే మరింత విశాలంగా 'అభివృద్ధి కార్యక్ర మాల' కు ప్రాతిపదిక. దీని ఊహ ప్రకారం ప్రపంచంలోని ప్రతీ ఒక్కరూ అభివృద్ధి చెందిన ప్రపంచంలోని ప్రాథమికమైన మధ్య తరగతి స్థాయికి ఎదగగలిగేలా చూడాలి. ఇది పూర్తిగా అసంబద్ధమైన ఫాంటసీ తప్ప మరోటి కాదు. ఎందుకంటే సగటు అమెరికన్‌తో సమానంగా ప్రపంచ ప్రజలందరు వినిమయం చేయాలంటే దానికి భూగోళపు వనరులు సరిపోవు. చాలా భూగోళాలు కావాలి. ఇక్కడ మరింత ముఖ్యవిషయం ఏమిటంటే ప్రథమ ప్రపంచం యొక్క సంపద అంతా మూడవ ప్రపంచ పేదరికంపై ఆధారపడి ఉన్నదనే నిజాన్ని ఈ ఫాంటసీ మరుగు పరుస్తుంది. అమెరికన్లు అనుభవించే అతి భారీ సంపద అంతా ఒక పద్ధతి ప్రకారం బీద దేశాల వనరులను, శ్రమను దోచుకోకుండా సాధ్యం కాదు.

ఈ దోపిడీ సంబంధాలన్నీ సాధారణ 'అభివృద్ధి' ప్రవచనంలో దాచి వేయబడతాయి. ఉదా: పేదరికం, వెనుకబాటుతనం, ఒక స్థిర పరిస్థితి గానూ, చరిత్ర, రాజకీయం, అధికారాలకు బయటి విషయం గానూ కనిపిస్తాయి. ఈ దృక్పథమే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలనే రాజకీయేతర పరిష్కారాన్ని చూపుతుంది. అభివృద్ధి అనేది రాజకీయేతర యంత్రంగా పని చేస్తుంది. అది అసమ్మతి వాదుల విప్లవాత్మక వాంఛను కేపిటలిజంతో నిష్క్రియాత్మక సహజీవనంగా రూపొందిస్తుంది. సేవా దృక్పథం గల విద్యార్థులు, బిల్ గేట్స్ వంటి 'మహా దాత'లు ప్రపంచ వ్యాపిత వర్గ విభజనను ఎపుడూ ఎదుర్కోకుండానే ప్రపంచ పేదరికాన్ని పరిష్కరిస్తున్నట్టు నటించే అవకాశాన్ని ఈ అభివృద్ధి కార్యక్రమాలు కల్పిస్తాయి. ఇవి, అంటే అభివృద్ధి కార్యక్రమాలు, సంపద పోగు చేతనూ వినిమయాన్ని కొనసాగిస్తూనే

తమ గురించి తమకు మహా దాతలు గానూ, చివరకు విప్లవకారులు గానూ కూడా సద్భావం కలిగి ఉండే అవకాశాన్ని ఇస్తున్నాయి. 'అభివృద్ధి పుక్కిటిపురాణం' సంపద, పేదరికం రెండూ వేరు వేరు విషయాలు అయినట్టు, ధనవంతుల సంపదను ఎప్పుడూ ప్రశ్నించకుండానే బీదల పేదరికాన్ని తొలగించగల మనే నమ్మకాన్ని వారు కలిగి ఉండేందుకు సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే **'అభివృద్ధి' అనేది కేపిటలిజాన్ని ప్రశ్నించకుండానే అది సృష్టించిన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తుంది.**

1970ల నుండి అభివృద్ధి అనేది మిగిలిన ప్రపంచంలో నయా ఉదారవాదానికి ప్రధాన వాహనంగా ఉపయోగపడింది. ప్రపంచ బేంక్, ఐ.ఎం.ఎఫ్. లు ఇచ్చిన అభివృద్ధి రుణాల స్ట్రక్చరల్ అడ్జెస్ట్ మెంట్ షరతులు వలస వాదం నుండి విముక్తి అయిన దేశాలలో రుణ గ్రహీతలైన దేశాలు వాణిజ్య నిబంధనలను తొలగించాలని, సామాజిక వ్యయం తగ్గించాలని, కార్మికుల, పర్యావరణ రక్షణలను తొలగించాలనే నిబంధనలు పెట్టుబడిపై గొప్ప లాభాలను సంపాదించి పెట్టాయి. అదే సమయంలో బీదలపై విధ్వంసకర ఫలితాలను చూపాయి. స్వేచ్ఛా మార్కెట్ సృష్టించిన సమస్యలను పరిష్కరించ డానికి మార్కెట్‌కు మరింత స్వేచ్ఛను ఇవ్వాలని 'అభివృద్ధి మంత్రం' శాసిస్తుంది. అది కేపిటలిజం వైరుధ్యాలపై కేపిటలిజాన్ని విస్తరింపజేయడం ద్వారా యుద్ధం చేయాలని కోరుతుంది. 40 సంవత్సరాల తరువాత బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టిన తర్వాత అసమానతలు, పేదరికం మరింత విస్తృతం గానూ, లోతుగానూ పెరగడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

(ఈ అధ్యాయం Jason Hickel (UK) and Arsalan Khan(USA)అనే anthropologists రచించిన "The Culture of Capitalism and the Crisis of Critique" అనే వ్యాసానికి సంక్షిప్త స్వేచ్ఛానువాదం.)

## Notes:

1.Ernesto Laclau (6.10.1915-13.4.2014) Argentina- said to be the inventor of Post Marxist Political Theory.

2. Chantal Mouffe- born 17.6.1943-Post-Marxism- she had been in long time collaboration with Laclau.

3.Herbert Marcuse (19.7.1898-29.7.1979) German-American philosopher-associated with Frankfurt School.

4.Jean-paul Charles Aymard Sartre (21.6.1905-15.4.1980) French Philosopher-Existentialism, Marxism etc. -embraced Marxism, but did not Joined the communist party.-Nobel prize awarded, but rejected by him.

5.Theodar W Addarno (11.9.1903-6.8.1969)- leading member of Frankfurt School.

6.Slavoj Zizek - Born 21.3.1949. -Yugoslavia-staunch critic of capitalism, neoliberalism- he calls himself a 'political radical'.

7. Muhammad Yunus -Born 26.6.1940- Bangladesh Banker-awarded Nobel Peace prize.

# 13. మార్క్సిజం-సంస్కృతి

## (MARXISM AND CULTURE)

సమగ్రమైన మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతమంటూ ఒకటి ఇంకా రూపొందలేదని పలుసార్లు చెప్పుకున్నాం. అయితే అటువంటి సిద్ధాంతం ఇప్పుడు అత్యవసరం. మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతానికి కావాల్సిన సైద్ధాంతిక విషయాలను మార్క్సిజం పరిధిలో వెతకడం తప్ప మనకు మరో దారి లేదు. అటువంటి సాంస్కృతిక సిద్ధాంతం సర్వకాలికంగా ఉండదు. దాని తక్షణ కర్తవ్యం పెట్టుబడిదారీ సంస్కృతిని సమర్ధవంతంగా ప్రతిఘటించడమే!

1848 లో యూరప్‌ను ఆవహించిందని చెప్పిన భూతం సోవియట్ పతనంతో అంతరించిందని కొంతమంది సంతసించారు. కాని నేడు అది ఒక సిద్ధాంతంగా ప్రపంచమంతటినీ ఆవహించింది. దీనికి కారణం నానాటికి పెరుగుతున్న సామాజిక అనిశ్చితి, భయంకర దృశ్యాలతో నిండిన భవిష్యత్తు.

సార్త్ర చెప్పినట్లు **మార్క్సిజం "మన కాలపు తత్వశాస్త్రం."** మన ఆలోచనలు మార్క్సిజాన్ని అధిగమించి అట్టే దూరం వెళ్ళలేవు. ఎందుకంటే మార్క్సిజానికి జన్మనిచ్చిన పరిస్థితులు అలాగే ఉన్నాయి. ఇటీవలి కాలంలో విద్యావంతుల్లో మార్క్సిజం పట్ల విశేష ఆకర్షణ పెరిగిందని అందరికీ తెలుసు. మార్క్సిజం, దాని ఆలోచనా విధానం శ్రామికులు, పీడితుల కోసం రూపుదిద్దు కున్నవి. శ్రమశక్తి దోపిడీ, పీడన, అణచివేత, అన్యాయం ఉన్నంతకాలం మార్క్సిజానికి కాలం చెల్లదు.

అయితే మార్క్సిజం శ్రామికులు, పీడితులను అంతగా ఆవహించటం లేదనే మాట పచ్చి నిజం. మార్క్సిజానికి ప్రత్యామ్నాయం లేదని పీడిత జన పక్షపాతమున్న వారు అంగీకరిస్తున్నారు. అనేక సైద్ధాంతిక విజయాలు సాధించిన మార్క్సిజం ఆచరణలో ఎందుకు విజయవంతం కావడం లేదనే విషయం గురించి మేధో మధనం చేస్తూనే ఉన్నారు. ఆ ఆలోచనలనుండి

పుట్టుకొచ్చినవే వివిధ సాంస్కృతిక సిద్ధాంతాలు. ఇవి ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు సాంస్కృతిక రంగంలోనూ పోరాడవలసిన అవసరాన్ని నొక్కి చెబుతాయి. ఎందుకంటే ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తన దోపిడిని, అందుకోసం తన అధికారాన్ని కొనసాగించడానికి సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఒక ప్రధాన సాధనంగా వాడుతున్నది. అంతేగాక మార్క్సిజాన్ని నమ్మి పోరాడుతున్న నాయకులు, కార్యకర్తలు సైతం ఆచరణలో పెట్టుబడిదారీ సంస్కృతినే వంట పట్టించుకుంటున్నారని బలమైన విమర్శలున్నాయి.

మార్క్సిస్టు సిద్ధాంతం లక్ష్యం "ప్రపంచాన్ని మార్చడం." అందుచేత మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం కూడా స్థూలంగా ఆ లక్ష్యానికి అనుగుణంగా ఉండాలి. ప్రపంచాన్ని మార్చే ప్రయత్నానికి దోహదపడుతున్న సాంస్కృతిక విషయాలేమిటి? ఆ ప్రయత్నాన్ని అడ్డుకుంటున్న సాంస్కృతిక అంశాలు ఏమిటి? అనే విషయాలను అధ్యయనం చేయడం మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం యొక్క ప్రధమ ప్రాధాన్యత. వాటిని తెలుసుకోడానికి సంస్కృతి అంటే ఏమిటి? ప్రజల జీవితాల్లో దాని పాత్ర ఏమిటి? సంస్కృతి ఎలా రూపొందుతుంది? అనే విషయాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఇక్కడ మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అధ్యయనం చేసే ప్రధాన అంశాలలో కొన్నిటిని మాత్రమే అతి క్లుప్తంగా పరిచయం చేసుకోగలం.

## మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అధ్యయనం చేసే విషయాలు

ప్రధానంగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న దోపిడీ, అణచివేత, ఆధిపత్యం, అసమానతలకు గల ఆర్థిక మూలాలను గుర్తిస్తూనే వాటిలోని సాంస్కృతిక పార్శ్వాన్ని అధ్యయనం చేయాలి. వాటి నిర్మూలనకు చేసే రాజకీయ, ఆర్థిక పోరాటంలో సంస్కృతి నిర్వర్తించే పాత్రను మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం విశ్లేషించాలి. మానవజాతిని పట్టి పీడిస్తున్న ఆర్థిక అసమానతలు, సామాజిక పరాయీకరణ (social alienation) జాతి, మతం, వర్గం, కులం, లింగ

వివక్షలతో పాటు ఆర్థిక స్థోమతలను బట్టి ఏర్పడే అధికార భేదాలను, రాజకీయాన్ని మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అధ్యయనం చేస్తుంది. కళలు, సాంస్కృతిక విషయాలు సమాజ సభ్యులందరికి అందుబాటులోకి రావాలని ఆశించే మార్క్సిజం, కళలతో పాటు మొత్తం సామాజిక జీవితాన్ని అంతిమంగా నిర్ణయించే సామాజిక, ఆర్థిక పునాదిని అధ్యయనం చేస్తుంది. అయితే ఈ పుస్తకం పరిధిలో సాంస్కృతిక సిద్ధాంతంలోని కొన్ని అంశాలను మాత్రమే, అది కూడా కేవల పరిచయం మాత్రమే చేయగలం.

కోట్ల మంది శ్రామికులు, ఇతర పీడిత జనులు ఆర్థికంగా దోపిడీ చేయబడుతున్నారు. ఈ దోపిడీకి సంస్కృతి సాధనంగా ఉపయోగపడుతున్న దా? దోపిడీ వ్యతిరేక పోరాటంలో సంస్కృతిని ఉపయోగించగలమా? ఎలా ఉపయోగించగలం? మొదలగు విషయాలను మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అధ్యయనం చేయాలి. అంతేగాక సృజనాత్మక కార్యకలాపాలు కూలి పనిగా, సృజనాత్మక ఉత్పత్తులు సరుకులుగా మారిపోయి అవి మనిషికి ఇవ్వవలసిన ఆహ్లాదాన్ని ఇవ్వడం లేదు. 'స్థితి (being=అస్తిత్వం) చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అనేది మార్క్సిజంలో ఒక ప్రధాన సూత్రీకరణ. ఉదాహరణకు ఒక పుస్తకాన్ని చదవాలంటే దాన్ని కొనే స్తోమత ఉండాలి. లేదా కొనగల మిత్రులు మనం చదవడానికి ఇవ్వాలి. లేదా గ్రంథాలయం ఉన్న ఊళ్లో మనం ఉండాలి. ఇది చదవగల భాషా పరిజ్ఞానం, ఆ భాష నేర్చుకునే విద్య అన్నిటినీ మించి పుస్తకం చదవడానికి తగిన తీరిక సమయం ఉండాలి. రోజుకి 10-12 గంటలు, వారంలో ఏడు రోజులు పనిచేసే అసంఘటిత రంగ కార్మికులు భాష తెలిసినా ఈ పుస్తకం చదువుతారని, చదవాలని ఆశించడం అన్యాయమే కదా! అయినా ఆ పుస్తకంలోని భావాలు తీవ్ర ప్రభావం కలిగించేవి అయితే అవి నోటి మాట ద్వారా, ప్రదర్శనా కళల ద్వారా, పలు ఇతర మార్గాలలో మనల్ని చేరే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. ఇటువంటి సందర్భాలలో సంస్కృతి పని చేసే తీరును, చేయవలసిన విధానాలను అధ్యయనం చేయాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ జీవితానికి సంబంధించిన ఎంత స్వల్ప

విషయమైనా మార్క్సిజానికి పరాయిది కానట్లే, సాంస్కృతిక సిద్ధాంతానికీ పరాయిది కాదు.

కుల, మత, భాషా, ప్రాంతీయ తత్వాలను, లింగ వివక్షను, మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అధ్యయనం చేయాలి. పెట్టుబడి దారీ వ్యవస్థ వైఫల్యాలు వీటి పెరుగుదలకు కారణం అని పాత పాట పాడితే కుదరదు. ఇవే వైఫల్యాలు వర్గ చైతన్యం, వర్గ స్పృహ, వర్గ సంస్కృతులను ఎందుకు పెంచడం లేదు? అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం కష్టమే! మనం దీనికి జవాబు కోసం వెతికితే 'పెట్టుబడిదారీ సంస్కృతి, అందులో ప్రధానమైన 'వ్యక్తి వాదం' ప్రజల మనసుల్లోకి బాగా ఇంకిపోయాయి' అని చెప్పుకోవాలి. ప్రగతిశీల ప్రత్యామ్నా యం కనిపించడం లేదు. నిజానికి వ్యక్తివాదం సమాజంలోనే సాధ్యం. ఇతరులు న్నప్పుడే, వారితో వ్యవహరించే క్రమంలోనే స్వీయ చైతన్యం పుడుతుంది. స్వీయ చైతన్యాన్ని కేపిటలిజం వక్రమార్గం పట్టించి, కేపిటలిస్టు వ్యక్తివాదాన్ని కల్పించింది. అయితే మనిషి మరో మనిషితో మానసిక సంబంధం ఏమాత్రం లేకుండా జీవించలేడు. నరకప్రాయమైన ఒంటరితనాన్ని తప్పించుకోవడానికి మందిలో కలవాలి. మందిలో తన ఐడెంటిటీని వెతుక్కోవాలి. అయితే వ్యక్తులు సమిష్టి స్పృహతో, వర్గ స్పృహతో కలిస్తే కేపిటలిజానికి ప్రమాదం. అందుచేత కేపిటలిస్టు సంస్కృతి కులం, మతం, ప్రాంతం, భాష మొదలైన ప్రజల ఐడెంటిటీ, లేదా అస్తిత్వ రంగాలన్నిటినీ రాజకీయ యుద్ధ రంగాలుగా సమర్థవంతంగా మార్చి వేయ గలిగింది. స్వభావ రీత్యా కులం, మతం, ప్రాంతం మొదలైనవన్నీ ప్రజల్ని 'వర్గ రహిత' బృందాలుగా ఏకం చేసేవే! అయితే అదే సమయంలో ఇవి దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికపై ప్రజలు ఏకం కాకుండా ఆయా బృందాల మధ్య అధిగమించలేని అడ్డు గోడలను నిర్మిస్తాయి. వీటివల్ల వర్గం, వర్గస్పృహ ఏర్పడదు. అదే కేపిటలిజానికి శ్రీరామ రక్ష. ఇలాంటి వాతావరణంలో ప్రజల్లో సమిష్టి భావన పెంచడం కాని, వర్గ ప్రాతిపదికపై ఏకం చేయడం గాని అసాధ్యం. అప్పుడు సంస్కృతి అన్నిటి కన్నా అతి

ప్రధానమైన, జరూరు సమస్యగా అవతరిస్తుంది. అందుచేత మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం పెట్టుబడిదారీ సంస్కృతిని, దాని ప్రధాన అంశాలను అధ్యయనం చేయాలి. పెట్టుబడి దారీ యుగంలో ఇదే మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంత తక్షణ కర్తవ్యం. ప్రస్తుతం మార్క్సిస్టులతో సహా అందరు ఈ పెట్టుబడిదారీ సంస్కృతినే అధ్యయనం చేస్తున్నారు. పెట్టుబడిదారీ సంస్కృతి ప్రజల్లోకి వ్యాపిస్తున్న దారులను తెలుసుకోవడానికి ప్రధానంగా మీడియా పని తీరును, మరో ప్రధాన విషయమైన వినిమయ వాదాన్ని అధ్యయనం చేస్తున్నారు. అయితే ఈ అధ్యయనాలలో ఎక్కువ భాగం విద్యా విషయ సంబంధమైన అధ్యయనాలు. ప్రజలకు చేరే సాంస్కృతిక ఉద్యమాలు, అధ్యయనాలు, రచనలు, ప్రచారం, భావజాల పోరాటం వామపక్షాలు చేయాల్సి వుంది. సాంస్కృతిక రంగంలో మనం చేసే కృషి తక్షణ ఫలితాలను ఇవ్వదు. పెట్టుబడిదారీ సంస్కృతికి బలమైన ప్రతిఘటన నిర్మించకుండా ఆర్థిక, రాజకీయ రంగాల్లో విజయాలు సాధించలేమని నడుస్తున్న చరిత్ర మనకు తెలుపుతోంది. ఒకవేళ ఆ రంగాల్లో విజయాలు, రాజ్యాధికారం సాధించినా వాటిని నిలుపుకోలేమని గత శతాబ్దపు చరిత్ర నిరూపించింది. సాంస్కృతిక పోరాటం దానికదే లక్ష్యమైన స్వతంత్ర పోరాట రంగం కాదు. రాజకీయ, ఆర్థిక పోరాటాలకు అనుబంధంగా, అత్యవసరంగా చేయవలసిన పోరాటం. సంస్కృతి ముఖ్య లక్షణాలను, కొన్ని ముఖ్య సాంస్కృతిక సమస్యలను చూద్దాం.

## సంస్కృతి మానవ నిర్మితం

ఒక సిద్ధాంతి “సంస్కృతి పేర్కొనే ప్రపంచం మనిషి ప్రపంచం. పూర్తిగా మానవ నిర్మితం. ఈ అర్థంలో అది మానవుని ప్రమేయం లేకుండా స్వతంత్రంగా ఉనికిలో ఉండే ప్రాకృత ప్రపంచానికి, దైవ లోకానికి విరుద్ధమైనది.” అని చెప్పాడు.

సంస్కృతిని మానవ నిర్మిత 'ద్వితీయ ప్రకృతి' (second nature) అంటారు. మానవుడు ఒక జాతిగా ఆవిర్భవించి 25 లక్షల సంవత్సరాలు దాటినా సాంస్కృతిక జీవితం ప్రారంభమైన దగ్గర నుండే మనిషి ఒక కర్తగా స్వీయ ఎరుకను (self-awareness) పొందటం మొదలయ్యింది. మానవుడు ప్రకృతిని మార్చుతూ, అలా మార్చడంలో తను మారుతూ, మార్చే, మారే కార్యకలాపాల్లో సంస్కృతిని సృష్టిస్తూ, తిరిగి ఆ సంస్కృతి వల్ల స్వీయ ఎరుకను, స్వీయ సిద్ధిని(self-realization) పొందుతూ అభివృద్ధి చెందాడు.

సమాజంలో వ్యక్తుల ఉమ్మడి కార్యకలాపాల నుండి జనించిన సంస్కృతి వ్యక్తిగతమైనది కాదు. అది ఇంచుమించు స్వయం ప్రతిపత్తితో పని చేస్తున్నట్లు కనిపిస్తుంది. అదే సమయంలో సంస్కృతి వ్యక్తి స్వీయ సిద్ధికి అవకాశాలను కల్పించటంలో తరగని గనిలా ఉంటుంది. ఒకానొక చారిత్రక దశలోని వ్యక్తికి గల సాంస్కృతిక విలువల కన్నా సంస్కృతి చాలా ముందుకు పోయి ఉండ వచ్చు. లేదా కొంత వెనకబడవచ్చు. అంటే ఒక వ్యక్తి స్వీయ ఎరుకకు, సాంస్కృతిక విలువలకు వ్యక్తిగతం కాకుండా పోయిన సాంస్కృతిక అభివృద్ధి ప్రక్రియకు మధ్య అంతరం ఏర్పడుతుంది. దీన్నుండి ఏర్పడే సాంస్కృతిక ఘర్షణ ప్రతీ యుగంలోనూ ఎక్కువగానో, తక్కువగానో ఉండి తీరుతుంది. ఇది సాంస్కృతిక అభివృద్ధికి చోదక శక్తి. కందుకూరి వీరేశలింగం గారు తన కాలం సంస్కృతి కన్నా చాల ముందుకు వెళ్ళి ఆనాటి సంస్కృతితో ఘర్షణ పడి సాంస్కృతిక సంస్కరణకు పూనుకున్నారు. నేడు చాల మంది సంస్కృతిని రామాయణ కాలం నాటికి వెనక్కు మళ్ళించాలని ప్రయత్నిస్తూ వర్తమాన సంస్కృతితో ఘర్షణ పడుతున్నారు.

## సంస్కృతి చారిత్రకం

మనకు ప్రాచీన సంస్కృతి, వేద సంస్కృతి, హిందూ సంస్కృతి లాంటి మాటలు తరచూ వినబడుతుంటాయి. వేద కాలం నుండి మన సంస్కృతి ఎటువంటి మార్పు లేకుండా ఉందని అనుకోవాలా? వేద కాలంలో గో

మాంసం, మద్యం లేని యజ్ఞం లేదు. ఇప్పుడూ యజ్ఞాలు చేస్తున్నా నేటి పరిస్థితులకు అభ్యంతరం కాని కర్రలు రాపాడించి నిప్పు చేయడం లాంటివి తప్ప మిగిలినవి అన్నీ మారిపోయాయి. మద్యం లేదు. ఆవు స్థానంలో మేక వచ్చింది. ఆ మేక మాంసం కూడా తినరు. మేక పొట్ట కింద చిన్న ముక్కను తీసి యజ్ఞ గుండంలో వేస్తారు. యజ్ఞం అయిపోయిన తర్వాత గుండంలోని బూడిదను చిటికెడు తీసుకొని నీళ్ళలో కలుపుకొని తాగుతారు. వేద సంస్కృతి ప్రధానంగా యజ్ఞంతో ముడి పడినది. ఇప్పుడు యజ్ఞాలు చూస్తే సంస్కృతి మారిందని చెప్పాలా? మారలేదని చెప్పాలా? వేదకాలం తర్వాత ఎప్పుడో గో మాంస భక్షణ విషయంలో వేద సంస్కృతి కన్నా బలమైన సాంస్కృతిక నిషేధం వచ్చింది. గోవులు పూర్తిగా అంతరించే పరిస్థితి వచ్చి, పశు పోషణ నుండి సమాజం వ్యవసాయానికి మారుతున్న కాలంలో వ్యవసాయానికి ఎడ్లు అవసరం కనుక నిషేధం అమల్లోకి వచ్చిందని రాంభట్ల కృష్ణమూర్తి గారు చెప్పారు. ఇక్కడ మనకు రెండు విషయాలు తెలుస్తాయి. మారిన జీవన విధానానికి విరుద్ధమైన, లేదా అనుగుణ్యం కాని సాంస్కృతిక అంశాలు మారక తప్పదు. అదే సమయంలో కొత్త జీవన విధానానికి అవరోధం కాని కొన్ని అంశాలు కొనసాగే అవకాశం ఉంటుంది.

మార్క్సిజం సంస్కృతిని చారిత్రక ఉత్పాదితంగా చూస్తుంది. ఎన్నటికి మారని శాశ్వతమైన ‘మానవ స్వభావం’, ‘సంస్కృతి’ ఉండవని మార్క్సిజం వాదిస్తుంది. ఏదీ కాలానికి అతీతం కాదు. అన్ని సమాజాలు జీవిత మనుగడకు కావలసిన సాధనాలను, అలాగే అమలు అవుతున్న సామాజిక, ఆర్థిక సంబంధాలను, భావాలను ఉత్పత్తి, పునరుత్పత్తి చేస్తాయని మార్క్సిజం చెబుతుంది. సాధనాలు, సంబంధాలు మారినప్పుడు ఆలశ్యంగా అయినా భావాలు, సంస్కృతి మారి తీరాలి. అయితే సంస్కృతికి ఆర్థిక సంబంధాలకు ఉండే సంబంధం యాంత్రికమైనది కాదు. అనేక సాంస్కృతిక అంశాలు వేల ఏళ్ళు గడచినా అనేక వ్యవస్థలు మారినా నిలిచి ఉంటాయి. ఉపనిషత్తులలోని ‘అసతోమా సద్గమయ’ శ్లోకంలోని అసత్యాన్ని, చీకటిని, అజ్ఞానాన్ని,

మృత్యువుని జయించాలనే మానవ ఆకాంక్ష ఒక శాశ్వత విలువ అని చెప్పవచ్చు. ఇంకా వేల ఏళ్ళు అది నిలిచి ఉంటుంది. దేవతలను సంతృప్తి పరిచేందుకు జంతువులను బలి ఇచ్చే ఆచారం వేల ఏళ్లుగా కొనసాగుతోంది. ముగ్గులను వేసే సాంప్రదాయం వేల ఏళ్ల క్రితం నాటి తంత్ర వాదం లోనిది అంటారు. దాని అంతరార్థాన్ని ఎప్పుడో కోల్పోయినా ఒక అలంకరణగా కొనసాగుతున్నది.

ప్రజలు కచ్చితంగా సంస్కృతి ద్వారానే తమ చరిత్రను తాము నిర్మించుకుంటారు. మానవుడు తనను తాను సృష్టించుకునే ప్రక్రియే సంస్కృతి. మరో వైపు ప్రపంచాన్ని సృష్టించే ప్రాధమిక సామాజిక ప్రక్రియ సంస్కృతి. అది కూడా విశిష్టంగా వైవిధ్య భరిత జీవన విధానాలను సృష్టించే ప్రక్రియ. దీంతో పాటు ఆ విభిన్న జీవన విధానాలను సూచించేది సంస్కృతే!

## సంస్కృతి పాదార్థిక, ఆధ్యాత్మిక ఉత్పత్తుల సమ్మేళనం

సంస్కృతి అంటే అవేవో కళలు, ఉత్తమ అభిరుచులు, సంస్కారం మొదలైన ఆధ్యాత్మిక/మానసిక కార్యకలాపాలకు సంబంధించిన విషయంగా భావిస్తారు కొంత మంది. కాని మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అలా భావించే వీలు లేదు. 'స్థితి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అనేది మార్క్సిజంలో ప్రాధమిక తాత్విక సూత్రం అని చెప్పుకున్నాం. అంటే ఒక మనిషి జీవించే చారిత్రక యుగం, భౌగోళిక పరిస్థితులు, సామాజిక సంబంధాలలో అతని స్థానం, జీవితావసరాలను తీర్చుకునే విధానం మొదలైనవి అతని 'స్థితి' కాగా ఆ పరిస్థితుల నుండి అతనికి తన పరిసరాల పట్ల, వాటిలో తన స్థానం, వాటితో తనకు గల సంబంధాల గురించిన ఎరుకను సమాజంలో తను నేర్చుకున్న విధానాల ద్వారా అర్థం చేసుకున్నదే 'చైతన్యం' అని చెప్పవచ్చు. ఈ చైతన్యం తిరిగి అతని కార్యకలాపాలను నిర్దేశిస్తుంది. వస్తువు తయారు కాక ముందే దాని తయారీకి పూనుకున్నవాని మనసులో దాని రూపు ఉంటుంది, తయారీ ప్రక్రియలో పని విధానం గురించిన జ్ఞానం, నైపుణ్యాలు

వస్తాయి అని మార్క్స్ చెప్పిన దానికి అర్ధం ఇదే. దీని సారాంశం ఏమిటంటే జీవితంతో సంబంధం లేని చైతన్యం ఉండదనే. అందుచేత కేవలం ఆధ్యాత్మిక ఉత్పత్తులను సంస్కృతిగా భావించే వీలు లేదు. అన్ని మానసిక కార్యకలాపాలతో సహా మొత్తం జీవన విధానాన్ని పరిగణించాల్సిందే. స్థూలంగా చెప్పుకోవాలంటే అస్తిత్వం, చైతన్యాలకు సంబంధించిన రెండు రకాల కార్యకలాపాలతో కూడి ఉంటుంది సంస్కృతి. అయితే నేరుగా అస్తిత్వం కాని, అలాగే చైతన్యం కాని వాటికవిగా సంస్కృతి కావు అనే విషయం గ్రహించాలి. సంస్కృతిగా వ్యక్తమయ్యేవి చైతన్య రూపాలు, అస్తిత్వ రూపాలే గాని మొత్తం అస్తిత్వం, మొత్తం చైతన్యం సంస్కృతిలో భాగాలు కావు. నిర్ణయించేది స్థితి కాబట్టి ఆ స్థితిని పరిగణిస్తూ నిర్ణయించబడే చైతన్య సంబంధిత ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చి చర్చిస్తాం. చరిత్ర, జీవిత విధానాలతో ఏ మాత్రం సంబంధం లేని ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యకలాపాలు ఏమీ ఉండవు.

కాల గమనంలో సమాజ ఉత్పత్తి సామర్ధ్యం పెరిగి కొంతమంది కేవలం ఆధ్యాత్మిక ఉత్పత్తులకే పరిమితం కావచ్చు. అంటే విద్యాబోధన, కవిత్వం, సంగీతం లాంటి వాటికే తమ పూర్తి కాలాన్ని వెచ్చించే అవకాశం రావచ్చు. అయితే విద్యాభ్యాసానికి అత్యావశ్యకమైన భాష సామాజిక ఉత్పాదితం. అలాగే కవిత్వాన్ని, గానాన్ని విని ఆనందించే శిక్షణ మనిషి ఇంద్రియాలకు సమాజం నుండి చారిత్రకంగా లభించినదే. అందుచేత కళలు, లేదా ఆధ్యాత్మిక ఉత్పత్తులు మాత్రమే సంస్కృతి అనే నిర్వచనాన్ని, అలాగే పాదార్థిక, ఆధ్యాత్మిక ఉత్పత్తులు రెండూ ఒకటే అని చెప్పడాన్ని మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం అంగీకరించదు.

## సంస్కృతి-విద్య

ఆధిపత్య భావజాల శిక్షణ గానూ, విధేయ శ్రామికులను తయారుచేసే వ్యవస్థగానూ ఎక్కువమంది మార్క్సిస్టులు విద్యను పరిగణిస్తారు. అయితే అదే

విద్యా వ్యవస్థ నుండి దోపిడీని ప్రతిఘటించే విప్లవ భావాలు పుట్టడం కూడా మనం చూస్తాము. బూర్జువా వర్గ వారసులను, ప్రతినిధులను కూడా విద్యా వ్యవస్థే తయారు చేస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా బూర్జువా వర్గ భావజాల రక్షకులు, ప్రచారకులు, మేధావులను విద్యా వ్యవస్థ ఉత్పత్తి చేస్తుంది. నేడు మన దేశంలో విద్య లాభసాటి వ్యాపారం అయిపోయింది. దోపిడీదారుల ప్రయోజ నాలకే మొత్తం విద్యావ్యవస్థ ఉపయోగపడుతున్నా సమాజ పురోగమనానికి విద్య అవసరం. ప్రజలందరికీ విద్యనందించే బాధ్యతనుంచి కేపిటలిష్టు ప్రభుత్వం క్రమంగా తప్పుకుంటున్నది. మన విద్యాలయాల్లో సిలబస్ దొపిడీ దారుల ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందించినా వాటికి వ్యతిరేకంగా ఎదురు తిరిగే అవకాశాలను కూడా విద్యా వ్యవస్థ కల్పిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు లాభాలు పండించే టెక్నాలజీ, నిపుణులు కావాలంటే ప్రకృతి శాస్త్రాలను, గణితాన్ని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని విద్యార్థులకు గరపాలి. ఈ క్రమంలో అలవడిన సహేతుక అలోచనా విధానం సామాజిక శాస్త్రాల్లో బోధించే అహేతుక విషయాలకు ఎదురు తిరుగుతుంది. చాల మంది సర్దుకు పోవచ్చుగాని కొంతమందైనా తాము అలవర్చుకున్న శాస్త్రీయ దృక్పథంతో సమాజాన్ని పరిశీలించడం ప్రారంభిస్తారు. శ్రామిక కుటుంబాల నుండి ఎంత ఎక్కువ మంది విద్యావంతులైతే అంత మంచిది. సమాజంలోని అహేతుకత, అన్యాయం ఈ కుటుంబాల పిల్లలు స్వయంగా అనుభవిస్తూ ఉంటారు. అందుకే 'అందరికీ విద్య' కమ్యూనిష్టుల ప్రధాన డిమాండ్లలో ఒకటి కావాలి.

## సంస్కృతి- భాష

సమిష్టి శ్రమ అవసరాల నుండి భాష పుట్టింది. అలా పుట్టిన భాష చైతన్యానికి భౌతిక వాహకం అయ్యింది. చైతన్యం అంతా భాషలో వ్యక్తం కాదు. అయినా భాష లేకుంటే చైతన్యం ఉండదు. సంస్కృతిలో భాష ప్రధాన

భాగం. అంటే భాష ఒక్కటే సంస్కృతి కాదు. అయినా భాష లేని సంస్కృతి ఉండదు. ఏదేనా సంస్కృతి తన భాషను కోల్పోతే ఆ సంస్కృతి అంతరిస్తుంది. ప్రస్తుతం తెలుగు లాగే అనేక భాషలు అంతరించే దిశగా పయనిస్తున్నాయి. ప్రపంచ పెట్టుబడి తనకు అనుకూలమైన ప్రపంచ సంస్కృతిని రూపొందించే ప్రయత్నం లో ఉంది. అందులో భాగంగా తన భావజాలాన్ని సులభంగా వ్యాపింప చేయడానికి ఇంగ్లీషును రుద్దుతున్నది. తెలుగువారు తెలుగు చదవలేని, రాయలేని స్థితి వచ్చింది. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అని పిలుపునిచ్చే మనం ఆ పని స్థానిక సంస్కృతుల వినాశం ద్వారా జరగడానికి అంగీకరించం. బహుళ సంస్కృతులు కొనసాగుతూ అభివృద్ధి చెందడం వల్ల ప్రపంచ మానవాళి సాంస్కృతికంగా మరింత సంపద్వంతమౌతుందని భావిస్తాం. ప్రపంచంలోని ఎంత చిన్న బృందం మాట్లాడే భాష అయినా అంతరించి పోకూడదు. ప్రపంచ భాషలన్నీ తరతరాల మానవజాతి పోగేసిన గొప్ప సంపద. అన్ని భాషల నుండి అన్ని భాషలూ నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. కనుక స్థానిక భాషలను అంతం చేసే ప్రపంచ పెట్టుబడి యొక్క ఆధిపత్య సంస్కృతి పాత్రను అధ్యయనం చేయాలి, ప్రతిఘటించాలి.

## సంస్కృతి-భావజాలం

రాజకీయం, చట్టం, నీతి, సౌందర్యం, మతం, తాత్వికత మొ. వాటి దృక్పథాలు, భావాల వ్యవస్థను భావజాలం (ideology) అంటారు.

"వస్తూత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగిన వర్గమే మానసిక ఉత్పత్తి సాధనాలపై కూడా నియంత్రణ కలిగి ఉంటుంది. అందువల్ల మామూలుగా చెప్పుకోవాలంటే ఆ మానసిక ఉత్పత్తి సాధనాలు లేని వారి భావాలు వాటికి (పాలకవర్గ భావాలకు) లోబడి ఉంటాయి. ........అందుచేత వారు ఒక చారిత్రక యుగంలో ఒక వర్గంగా ఎంత విస్తృతి, వైశాల్యంతో పాలిస్తారో అంత విస్తృతం గాను ఇతర విషయాలతో పాటు .... ఆ యుగానికి చెందిన

భావాల ఉత్పత్తి, పంపిణీలను చేస్తారు. ఆ విధంగా వారి భావాలు ఆ యుగంలో పాలక భావాలు"—మార్క్స్,ఎంగెల్స్,1845. (జర్మన్ ఐడియాలజీ)

మార్క్స్ అభిప్రాయం ప్రకారం పారిశ్రామిక సమాజంలో 'సంస్కృతి' 'ఆధిపత్య భావజాలంగా' పనిచేస్తుంది. ఈ ప్రక్రియకు కొన్ని లక్షణాలున్నాయి.

1.అది, అంటే ఆధిపత్య భావజాలం, బూర్జువా (అంటే పాలక పెట్టుబడిదారీ వర్గం) దృక్పథాన్ని, ప్రయోజనాలను ప్రతిబింబించడమే కాక, వారి ఆధిపత్యాన్ని న్యాయ సమ్మతం చేస్తుంది.

2. ఆ ఆధిపత్య భావజాలం దానికి పునాదిగా వున్న ఉత్పత్తి సంబంధాల నుండి పుట్టి వాటినే వ్యక్తం చేస్తుంది. అందుకే మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఇలా రాశారు. "అసలు మీ భావాలు మీ బూర్జువా ఉత్పత్తి పరిస్థితుల నుండి, బూర్జువా ఆస్తి నుండి పుట్టుకొచ్చినవే కాని మరే మీ కావు".

3. ఆధిపత్య భావజాలం ఈ వ్యవస్థ సాంప్రదాయ సామాజిక నిర్మితాలైన 'వేతన శ్రమ' 'సరుకు రూపాల' ను సహజమైనవిగా, తప్పనిసరైనవిగా కనిపించేలా చేస్తుంది. "ప్రస్తుత ఉత్పత్తి విధానం ఆస్తి రూపాలనుండి పుట్టుకొచ్చే సామాజిక రూపాలను ప్రాకృతిక, సహేతుక నియమాలుగా రూపాంతరం చెందిస్తుంది". -మేనిఫెస్టో .

4. ఆధిపత్య భావజాలం వాస్తవికతను గురించిన తప్పుడు, వక్రీకరించిన దృశ్యాన్ని పుట్టిస్తుంది. ఈ పరిస్థితినే 'తప్పుడు చైతన్యం' అంటారు.

మార్క్స్ రచనల్లో భావజాలం అనేది ఎక్కువగా ఆధిపత్య సాధనంగా ప్రతికూల విషయంగా కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం విముక్తి చేసే, సానుకూల భావాలను కూడా భావజాలంగానే పరిగణిస్తున్నాము. భావజాలం అనేది కేవలం ప్రతికూలమా? లేక సానుకూలం కూడానా? అనే దానిపై చాల

వివాదాలున్నాయి. ఆయన ఆ భావనను ఉపయోగించిన చారిత్రక సందర్భాన్ని చూడాలని కొంత మంది వాదన. భావజాలం పట్ల ప్రతికూలం, సానుకూలం కాని తటస్థ అంశాలు మార్క్స్, ఎంగెల్సు లలో కూడా ఉన్నాయి. పాలకవర్గ భావజాలాన్ని మరో వర్గ దృక్పథంతో విమర్శించడాన్ని కూడా భావజాలంగా పరిగణించడం ద్వారా లెనిన్ భావజాలానికి సానుకూల అర్థాన్ని కూడా కల్పించాడు.

మనిషి తన జీవితావసరాలను తీర్చుకోడానికి చేసే సమిష్టి శ్రమ, అలా శ్రమించే క్రమంలో మనుషుల మధ్య ఏర్పడే సంబంధాల (ఉత్పత్తి సంబంధాలు=పునాది) వ్యవస్థ చేత మానవ జీవితానికి సంబంధించిన మిగిలిన విషయాలన్నీ పుట్టుకొస్తాయి, లేదా నిర్ణయించబడతాయి అనే స్థూల అవగాహన కలిగి ఉంటుంది మార్క్సిజం. దీంతో మెజారిటీ మార్క్సిస్టులకు పేచీ లేదు. ఉత్పత్తి సంబంధాలచేత నిర్ణయించబడే సంస్కృతికి (ఉపరి నిర్మాణానికి) స్వాతంత్ర్యం ఉందా లేదా? అనే ప్రశ్నతో సమస్య మొదలవుతుంది. ఎంగెల్స్ బ్రతికుండగానే ఈ వివాదం మొదలయింది. ఆయన "పునాది అంతిమ నిర్ణాయకమని చెప్పామే కానీ ఉపరి నిర్మాణానికి పాక్షిక స్వాతంత్ర్యం కూడా ఉండదని మేం (మార్క్స్, ఎంగెల్స్) చెప్పలేదు. ఉపరి నిర్మాణం తిరిగి పునాదిపై ప్రభావం చూపగలదు" అని వివరణ ఇచ్చాడు.

కానీ మార్క్స్, ఎంగెల్స్‌ల తర్వాత కాలంలో మార్క్సిజంలో పిడివాద ధోరణులు ప్రబలాయని విమర్శకుల అభిప్రాయం. మానవ చైతన్యం అంటే 'బాహ్య ప్రపంచం యొక్క స్వీయాత్మక ప్రతిబింబమని' మార్క్సిజం చెబుతుంది. ప్రతిఫలన సిద్ధాంతాన్ని అభివృద్ధిచేసే క్రమంలో పై ప్రవచనంలోని 'స్వీయాత్మక' అనే భావనకు క్రమంగా ప్రాధాన్యత తగ్గి బాహ్య ప్రపంచ ప్రతిబింబమే చైతన్యమనే అర్థం వచ్చేలా వివరించసాగారు. ఇది చారిత్రక భౌతికవాదంలో ఉపరి నిర్మాణం పునాది యొక్క ప్రతిబింబమని మొరటుగా

నిర్ధారించే పరిస్థితికి దారితీసింది. దీనివల్ల సంస్కృతి అనేది ఆర్థికవ్యవస్థ ప్రతిబింబమనే నిర్ధారణకు రావాల్సి వచ్చింది. అలాంటప్పుడు సంస్కృతిని విడిగా అధ్యయనం చేయడం, ఆ రంగంలో పనిచేయడం అవసరంలేదు. ఆర్థిక వ్యవస్థను మార్చితే సరిపోతుంది. ఆర్థిక వ్యవస్థను మార్చడానికి రాజ్యాధికారం సాధించాలి అంతే !

ఇక్కడే ఆచరణలో ఇబ్బందులు మొదలయ్యాయి. రాజ్యాధికారాన్ని సాధించడం ఎలా? ప్రజల చైతన్యాన్నీ ప్రజాస్వామ్య స్పృహని పెంచే పోరాటం చెయ్యాలి. దీనికి రాజకీయ పోరాటంతో పాటు భావజాల పోరాటం ఒక ముఖ్య సాధనం. భావజాల పోరాటం రాజకీయ పోరాటంలో పెన వేసుకుపోయి, దానికి ప్రేరణ, తగిన బలం అందిస్తుంది. భావజాలం సంస్కృతిలో ఒక ప్రధానభాగం. ఈ భావజాల ప్రాధాన్యతను ప్రపంచ పెట్టుబడి గుర్తించి, పెట్టుబడిదారీ అనుకూల భావజాలాన్ని అత్యంత సమర్ధవంతంగా ప్రచారం చేస్తున్నది. మొత్తం మీడియా, వినోద పరిశ్రమ అన్నీ పెట్టుబడి దారుల అధీనంలో ఉండి వారి ప్రయోజనాలకు అనుగుణంగా ప్రచారం చేస్తున్నాయి. పాలక వర్గాలు కేవలం ప్రచారం ద్వారా మాత్రమే కాక అవసరమైనప్పుడు బలప్రయోగంతో కూడా తమ భావజాల ఆధిక్యతను కాపాడుకుంటాయి. 19వ శతాబ్దంలో పాలక వర్గాలు కార్మికవర్గ వార్తా పత్రికలను, కరపత్రాలను, భౌతికంగా, హింసాయుత మార్గాల్లో అంతం చేయడమే దీనికి రుజువు. మన దేశంలో పాలకుల నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం క్రియాశీలంగా పనిచేస్తున్న అనేక మందిని ప్రభుత్వం జైలులో కుక్కడం మనం చూస్తున్నదే. కుల, మత, లింగ నేపధ్యంగా గల భావజాలం దన్నుతో జరుగుతున్న హింసాయుత దాడులను, ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకించే మేధావులను, మైనారిటీలు, దళితులను హత్యలు చేయడాన్ని మనం చూస్తున్నాం.

సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని సైనిక బలం ద్వారా కాక ప్రజల మనసులను ఆక్రమించడం, అధీనంలో ఉంచుకోవడం ద్వారా పాలిస్తోందని నోం చాంస్కీ లాంటి మేధావులు చెబుతున్నారు. అయితే మీడియా మొత్తం పెట్టుబడి అధీనంలో ఉందనే మాట నిజమైనా, ప్రజల జీవన పరిస్థితులు పెట్టుబడిదారీ వ్యతిరేక ప్రచారానికి అనుకూలంగా ఉన్నాయి. కమ్యూనిస్టులు తక్షణ ఆర్థిక రాజకీయ పోరాటాలకు ఇచ్చే ప్రాధాన్యత భావజాల పోరాటానికి ఇవ్వడం లేదనే విమర్శ ఉంది. తక్షణ సమస్యలపై పోరాటాల్లో భావజాల పోరాటాన్ని మిళితం చేయకుంటే దీర్ఘకాలిక ప్రయోజనం ఏమీ ఉండదు. ప్రజల చైతన్యం పెరగదు. అంటే మనం తక్షణ ఆర్థిక, రాజకీయ సమస్యల పరిష్కారానికి చేసే పోరాటంలో, 'పెట్టుబడిదారీ వ్యతిరేకత' కేంద్ర స్థానంలో ఉండాలి. అప్పుడు సంస్కృతి ఆ పోరాటంలో భాగమవుతుంది.

మార్క్సిజం గుడ్డి నమ్మకానికి వ్యతిరేకం. సహేతుక విశ్వాసాన్ని సమర్థిస్తుంది. ఇప్పుడు పెట్టుబడిదారీ ప్రపంచంలో మనిషి స్వార్థం ఇరుసుగా పనిచేస్తున్న అమానవీయ హేతువాదం రాజ్యమేలుతోంది. 'పొరుగువాని బాధలు చూసి మొహం తిప్పుకునేవాడు ఎద్దుతో సమానమనే' ప్రవచనాన్ని కేపిటలిస్టు హేతువాదం అంగీకరించదు. మనిషికి ఉండాల్సిన సామాజిక బాధ్యతలను తిరస్కరించి 'ప్రతి ఒక్కరూ తమ బాగుకోసం తాము కష్టపడితే అందరూ బాగుపడతారు కదా' అని తర్కిస్తుంది. 'సర్వేజనా సుఖినోభవంతు' అన్నా, 'మానవులంతా విముక్తులై స్వేచ్ఛగా జీవించ గలిగే సమాజం కావాలి' అనే ఆకాంక్ష అయినా కేపిటలిస్టు హేతువాదం ప్రకారం అసాధ్యమైన వ్యర్థ ఆశయాలు. నిజానికివి మహోన్నత మానవ విలువలు. విలువలు సంస్కృతిలో అతి ముఖ్య భాగం. 'ఆశయం' ఎంతమంది మహనీయులూ కోట్లాది మంది సాధారణ ప్రజలూ తమ జీవితాలను త్యాగం చేసేలా ప్రేరేపించిందో చరిత్ర మనకు చెబుతుంది. వారి ఆశయానికి ఆయువు పట్టు వారి భావజాలం. మానవుల ఆశయానికి గల ఆచరణాత్మక బలం, విలువలను వ్యక్తి స్వార్థమే ఏకైక మానవ విలువగా పరిగణించే పెట్టుబడిదారీ హేతువాదం అంగీక

రించదు. ప్రజల మనసులను ఆకట్టుకున్న భావాలు భౌతిక శక్తిగా మారతా యన్న మార్క్స్ మాటలు నిజమేనని చరిత్ర పలు మార్లు రుజువు చేసింది.

మరో వైపు అదే భావజాలం ఫాసిజం రూపంలో మహా మానవ మారణహోమం సాగించడానికి తోడ్పడిందని మనకు తెలుసు. 'పెట్టుబడిదారీ వ్యవస్థ అది ఉన్న రూపంలో అధికారంలో కొనసాగ లేనప్పుడు, దాని స్థానంలో ప్రజాస్వామ్య శక్తులు అధికారంలోకి రాగలిగే అంత బలంగా లేనప్పుడు ఫాసిజం తలఎత్తుతుంది' అని గ్రాంషీ మొదలుకుని యుగోస్లేవియా మార్క్సిస్టు మేధావుల వరకు చేసిన సూత్రీకరణలను వల్లించి సమాధానం చెప్పుకోవచ్చు. కమ్యూనిస్టుల వ్యూహాత్మక తప్పిదాలతో సహా రాజకీయార్థిక కారణాలనేకం చూపించ వచ్చు. అవన్నీ నిజమే కావచ్చు. అయితే హిట్లరు అన్ని కోట్ల మంది జర్మను ప్రజల్లో జాతి ద్వేషాన్ని ఎలా రెచ్చగొట్టగలిగాడు? లక్షలాది యూదులను అత్యంత క్రూరంగా చంపుతున్నా పట్టించుకోని కఠినాత్ములుగా ఎలా మార్చగలిగాడు. జర్మనులు మాత్రమే అసలు సిసలు ఆర్యులని, ప్రపంచాన్ని ఏలే అర్హత వారికే ఉందని నమ్మే అంత మూర్ఖత్వపు జాత్యహంకారాన్ని ఎలా ప్రేరేపించగలిగాడు? అనే ప్రశ్నకు బూర్జువా హేతువాదం గానీ రాజకీ యార్థశాస్త్రం గానీ సమాధానం చెప్పలేవు. ఈ ఫాసిస్టు ఉదంతం ప్రజల మనసులను ఆవహించిన భావజాలపు బలాన్ని సుస్పష్టంగా చూపింది. మన దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి జరుగుతున్న ప్రయత్నాలను చూస్తూనే ఉన్నాం. దాని సమర్ధకుల్లో ఎక్కువమంది విద్యావంతులే.

కమ్యూనిజం, ఫాసిజం వంటి ఉద్యమాలే కాక భావాలూ, ఆశయాలూ వ్యక్తులపై కూడా ఎంత బలంగా పనిచేస్తాయో చూడవచ్చు. ఆ మధ్య గంగానది పరిరక్షణకోసం ఒకాయన 90 రోజులు నిరాహార దీక్ష చేసి చనిపోయారని వార్తలొచ్చాయి.నదీ పరిరక్షణ ప్రాణాలను మించిన ఆశయం ఎలా కాగ లిగింది? వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా గడ్డ కట్టించే చలిలో

నడి రోడ్డుపై రైతులు నెలల తరబడి పోరాడుతున్నారంటే కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసమేనా? అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే తత్వం అందుకు తగ్గ భావజాలం వారి పోరాటం వెనుక లేవా? అటువంటి దారుణాలను ప్రభుత్వ రంగ ఉద్యోగులు రైతుల్లా ఎందుకు ప్రతిఘటించ లేకపోతున్నారు.ఉద్యోగుల ఉదాసీనత వెనుక సాంస్కృతిక భావజాల కారణాలు లేవా? ఇటువంటి సమస్యల గురించి ఆలోచిస్తే భావజాల ప్రాధాన్యత మనకు అర్థమవుతుంది.

వివిధ సామాజిక పరిణామాలను విశ్లేషించేటప్పుడు మెజారిటీ మార్క్సిస్టులకు ప్రతి విషయాన్నీ ఆర్థికానికి కుదించడం అలవాటయ్యిందని, ఇది మొరటు మార్క్సిజం అని ఒక విమర్శ. మన దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, కమ్యూనిస్ట్ ఉద్యమంలోనూ లక్షలాది మంది మహనీయులు తమ ఆస్తిపాస్తు లనూ సుఖసంతోషాలనూ కుటుంబాలనూ, చివరకు తమ జీవితాలను కూడా త్యాగం చేసారు. వీరి జీవితాలను కేవలం ఆర్థిక విశ్లేషణతో అర్థం చేసుకోలేము. ఆర్థిక విశ్లేషణ స్థూలంగా సమాజ గమన సూత్రాలను అర్థం చేసుకోడానికి అత్యంత ఆవశ్యకం. అంతిమంగా అన్నిటినీ ఆర్థికమే నిర్ణయించే సమాజంలో కూడా 'ఆదర్శం' అద్భుతాలు చేయగలదు. సమాజ ఆర్థిక చట్ర పరిధిలోనే మనం సాంస్కృతిక అంశాలను విశ్లేషించాలి. ఆ రంగంలో పని చేయాలి. అంతిమంగా సంస్కృతిని ఆర్థికమే నిర్ణయిస్తుంది అనే మాట నిజమే అయినా, భావాలకూ, సంస్కృతికి ఉండే సాపేక్ష స్వతంత్ర పాత్రను గ్రహించకపోతే విఫలమవుతాము.

ముసుగులోని ఆర్థిక ప్రయోజనాలే ప్రపంచాన్ని గురించిన ఆధిపత్య భావాలను నడిపిస్తాయని మార్క్సిజం వక్కాణిస్తుంది. అదే సమయంలో సంస్కృతి, భావాలు, మనల్ని విముక్తం చేయగలవని నమ్ముతుంది. ఇదెలా? మన అవగాహన విస్తరణకు అడ్డంపడే ఆర్థిక నిర్ణాయకాలు (economic determinants) మన అవగాహనకు ప్రాతిపదిక అవుతాయి. ఇది వైరుధ్య

పూరితంగా కనిపించవచ్చు. దోపిడీ, పీడనల వల్ల దుర్భర జీవితం గడుపుతున్న వారు తమ బాధలకు కారణం పూర్వ జన్మ పాపమని, కర్మ అని, లేదా ఈ జన్మలో కష్టాలు అనుభవిస్తే, స్వర్గంలో గాని, మరో జన్మలో గాని సుఖిస్తామని పాలకులు చేసే ప్రచారానికి లొంగిపోయి ఉండవచ్చు. లేదా ఆధునిక పెట్టుబడిదారీ సంస్కృతిని, భావజాలాన్ని వంటబట్టించు కొని ఉండవచ్చు. వ్యక్తివాదం తలకెక్కి తోటివారినుండి, సమాజం నుండి ఎలియనేట్ అయి ఉండవచ్చు. అన్యాయం జరుగుతున్నా ఉదాసీనంగా ఉండిపోయే వారి జీవన పరిస్థితులు ఆ ఉదాసీనతను ఏ క్షణంలోనైనా వదులు కోవడానికి కావలసిన ప్రాతిపదికను కలిగి ఉంటాయి. ఇక్కడ కావలసిందల్లా స్వీయాత్మక అంశంతో కూడిన క్రియాశీల చొరవ. దీన్ని బట్టి మనకు తెలిసేది ఏమంటే ఏ జీవన పరిస్థితులు పాలకవర్గ భావజాల సారాంశాన్ని నిర్ణయిస్తాయో, అవే పరిస్థితులు ఆ భావజాలాన్ని తిరస్కరించడానికి అవసరమైన సరంజామాని సమకూరు స్తాయి. అయితే సర్వ సుఖాలకు, వ్యక్తిత్వ వికాసానికి, అభివృద్ధికి వస్తు సంపదలు, డబ్బు మాత్రమే కొలమానమనే పెట్టుబడిదారీ భావజాలాన్ని ఎదుర్కోవడం అంత సులభం కాదు. దానికి గంభీరమైన కృషి కావాలి.

భావజాలం కచ్చితంగా ఆర్థిక జీవితానికి అనుగుణంగా ఉంటుందని మార్క్సిజం చెప్పదు. గత వాసనలు బలంగానే ఉంటాయి. కార్మిక వర్గం అన్ని రకాల ఆధిపత్యాన్ని, అణచివేతను వ్యతిరేకిస్తుందని మనం చెబుతాము. కాని ప్రపంచ వ్యాపితంగా జరిపిన సర్వేల ప్రకారం కార్మికుల్లో పురుషాధిక్యత, స్త్రీలు, పిల్లలను అణచి ఉంచడం చాల ఎక్కువని తెలుస్తోంది. కుటుంబ పోషణ బాధ్యతను తీసుకోక పోవడమే కాక మద్యం మత్తులో భార్య, పిల్లలను హింసించే పురుష శ్రామికులనేకమందిని చూస్తూనే ఉన్నాం. రాజకీయాలనుండి, వివిధ సామాజిక సమస్యలనుండి ప్రజలను దూరంగా ఉంచడానికి అనేక బూర్జువా ప్రభుత్వాలు మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఇవన్నీ మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం తప్పించుకోలేని సమస్యలు.

## పరాయీకరణ (alienation)

మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం చర్చించవలసిన అతి ముఖ్య సమస్యల్లో పరాయీకరణ ఒకటి. మనిషి శ్రమించి ఒక వస్తువును తయారుచేస్తే ఆ వస్తువులో తన సారాన్ని, తనను తాను చూసుకుంటాడు. తన సామర్థ్యాలు, వ్యక్తిత్వాలను ఆ వస్తువులో ఆవిష్కరించుకుంటాడు. తను చేసిన వస్తువు తన పాదార్థిక అవసరాలు తీర్చడమే కాక మానసిక అవసరాలను కూడా తీరుస్తుంది. ఆ వస్తువును తయారుచేయడంలో తన నైపుణ్యాలను పెంపొం దించుకోవడమే కాక, తన వ్యక్తిత్వాన్ని సమగ్రం చేసుకొని అభివృద్ధి చేసు కుంటాడు. మనిషి జీవితంతో ఇంతగా ముడిపడిపోయిన ఉత్పత్తి ప్రక్రియ, దాని ఫలితమైన వస్తువుతో మనిషికి ఉన్న అన్ని సంబంధాలు తెగిపోవడమే పరాయీకరణకు ప్రప్రథమ, ప్రధాన కారణం.

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియలో శ్రామికుడు పనిచేసే ముడి పదార్థం, పని స్థలం, పనిముట్లు, యంత్రాలు, చివరిగా తయారైన వస్తువు ఏవీ కూడా శ్రామికుడికి చెందవు. అతని శ్రమ వస్తువులోకి చేరి అందులో నిక్షిప్తమై ఉన్నా అది కూడా తన శ్రమగా భావించలేడు. పెట్టుబడిదారు శ్రామికుని శ్రమను కాక నిర్దిష్ట కాలం శ్రమించే శక్తిని(శ్రమశక్తిని) అన్ని సరుకులలాగానే శ్రామికుని నుండి కొంటాడు. శ్రామికుడు చేతులూపుకుంటూ పని స్థలానికి వెళ్లి ఒప్పందం ప్రకారం కొన్ని గంటలు పనిచేసి తనకు రావాల్సిన వేతనం తీసుకుని ఇంటికి వస్తాడు. ఉత్పత్తి అయిన వస్తువు అతనికి చెందదు. ఆ వస్తువులో తనను, తన శ్రమను, సామర్థ్యాలనూ, వ్యక్తిత్వాన్ని చూసుకోలేడు. ఆ వస్తువు తనది కాకపోయినా 'తన శ్రమవల్ల తయారైంది' అనే భావన కూడా మిగలదు. ఎందుకంటే పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రధానంగా శ్రమ విభజన, యంత్రాల ద్వారా జరుగుతుంది. ఒక వస్తువును అనేక దశల్లో అనేకమంది ఉత్పత్తి చేస్తారు. అందుచేత ఏ ఒక్కరూ ఆ వస్తువు తమ ఉత్పత్తి అని అనుభూతి చెందలేరు. మరో వైపు యంత్రాల వినియోగం ఎంత ఎక్కువైతే

అంతగానూ శ్రామికుని నైపుణ్యా లకూ సృజనాత్మక శక్తులకూ స్థానం లేకుండా పోతుంది. ఉదాహరణకు ఒక చేనేత కార్మికుడు ప్రతి చీరా తనకు నచ్చిన డిజైన్లతో విభిన్నంగా, వైవిధ్య భరితంగా నేసి వాటిలో తన పనితనాన్ని చూసుకుని మురిసిపోగలడు. భారీ యంత్రాలతో నడిచే వస్త్ర పరిశ్రమలో పనిచేసే కార్మికుడికి అటువంటి అవకాశం ఉండదు. ఆ కార్మికుడు చివరకు తను నేతలో ప్రావీణ్యమున్న నేతగాడిని అనే స్పృహను కూడా కోల్పోయి, రక్త మాంసాలున్న యంత్రంలా తయారవుతాడు. అప్పుడు ఏవీ అతనికి చెందవు. అతని శ్రమవల్ల తయారైన వస్తువు, అతని నైపుణ్యాలు, సామర్ధ్యాలు, సృజన శీలత, వ్యక్తిత్వం, చివరకు రోజులో ప్రధానభాగం అతనికి చెందవు. తనకు తాను పరాయివాడై పోతాడు.

ఇలా ఉత్పత్తి ప్రక్రియలో కార్మికుడు తన ఉత్పత్తులతో మానసికంగా వేరుపడి పోవడంతో ఈ పరాయీకరణ(alienation) మొదలవుతుంది. ఇది క్రమంగా అన్ని సామాజిక రంగాలకూ వ్యాపిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకు జీవించి ఉండాలనే కోరిక నిర్బంధంతో తన శ్రమశక్తిని అమ్ముకోక తప్పని 'స్వేచ్ఛాయుతులు' అయిన వ్యక్తులు కావాలి. ఫేషన్లకూ, హోదా చిహ్నాలకూ ప్రభావితులై అప్పు చేసి అయినా సరే సరుకులను కొనే వ్యక్తులు కావాలి. పెట్టుబడిదారీ వ్యవస్థలో 'వ్యక్తిస్వేచ్ఛ' మానవ విలువలకు సంబంధించిన స్వేచ్ఛ కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థను నడిపించే, లాభాలను పెంచే స్వేచ్ఛ. ఈ స్వేచ్ఛ లో సానుకూల అంశాలు చాలా తక్కువ. భూస్వామ్య వ్యవస్థ తాలూకు సామాజిక నిర్బంధాలను తొలగించడం ఒక సానుకూల అంశం. అదే సమయంలో సామూహిక జీవితానికి సంబంధించిన మానవ సంబంధాలనూ, అన్ని విలువలనూ ధ్వంసం చేయడం అత్యంత ప్రమాదకర పరిణామం. దీనివల్ల మనుషులకు తోటి మనుషులుతో ఉన్న అనుబంధాలన్నీ తెగిపోతాయి. మనిషి సమాజం నుండి, తన గ్రామం/పట్టణం, కులం, కుటుంబం, చివరకు తన నుండి తాను మానసికంగా వేరు పడిపోతాడు.

సమాజం, వర్గం, కులం, కుటుంబాల నుండి వేరుపడటం అందరూ చూస్తున్నదే, అందరూ అనుభవి స్తున్నదే!

పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రక్రియ అభివృద్ధి చెందే క్రమంలో సరుకుల ఆరాధన, పరాయీకరణా పుట్టుకొస్తాయి. మనిషి తను తయారుచేసిన వస్తువుల్లో తనను తాను చూసుకుని ఆనందిస్తాడని చెప్పుకున్నాం. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం లేకపోవడం, శ్రమ శక్తిని అమ్ముకోవడం, శ్రమ విభజనల వల్ల తను తయారుచేసిన వస్తువులను తన ఉత్పత్తులుగా భావించే అవకాశం లేకుండా పోతుంది. తన శ్రమా, నైపుణ్యాలూ, సృజనాత్మకతా, అభిరుచులూ చివరకు వ్యక్తిత్వం కూడా మూర్తీభవించిన వస్తువు తనది కాదు, పరాయిది. పైగా ఆ సరుకుల డిమాండ్, సరఫరాలు ప్రాధమికంగా తనకు భుక్తిని ఇచ్చే 'వేతన శ్రమ వ్యవస్థ' పై పెత్తనం చేస్తాయి. తను ఎక్కువ శ్రమించి ఎక్కువ సరుకులు తయారుచేస్తే పెట్టుబడి బలపడి అతన్నింకా దోచుకొని అణచి వేస్తుంది. లేదా ఆ సరుకులు మార్కెట్లో అమ్ముడుపోక తనకు పని లేకుండా చేస్తాయి. అంటే కార్మికుని వ్యక్తిత్వం మూర్తీభవించిన అతని ఉత్పత్తులు అతని నుండి వేరుపడి అతనికి పరాయివిగా అనేక సందర్భాలలో శత్రువులలా అతనిపై ఆధిపత్యం వహిస్తాయి. ఒక కుమ్మరి లేదా వడ్రంగి సొంతంగా పని చేసుకుంటున్నాడు అనుకోండి, అతనికి నచ్చిన సమయాల్లో పని చేస్తాడు. అంతకుమించి అతనికి నచ్చిన విధంగా అతని సామర్థ్యం, నైపుణ్యాలను బట్టి కుండ, లేదా కుర్చీ తయారుచేస్తాడు. తయారుచేసే క్రమంలో కానీ, తయారైన తర్వాత గానీ ఆ కుండ, కుర్చీ 'తనది కాదు' అనే భావన అతనికి కలగదు. అతని పని, ఆ పని ఫలితంగా తయారైన వస్తువు అతనివి కాకుండా పోవు. పరాయితనం అతన్ని బాధించదు. అందుకు విరుద్ధంగా శ్రమశక్తిని అమ్ముకునే శ్రామికుని ఆలోచనలు, కండరాల శక్తులను పనిలో అతని ఇచ్ఛానుసారం కాక, అతనికి వేతనమిచ్చేవారు చెప్పినట్లు వినియోగించాలి. అతని సొంత శక్తులు అతనివి కావు. తనకు

తాను పరాయివాడై పోయిన భావనతో బాధించబడతాడు. ఇది అతని మిగిలిన సామాజిక కార్యకలాపాలన్నింటిలో ప్రతిబింబిస్తుంది.

సరుకుల ఆరాధన, మూర్తీకరణ, పరాయీకరణా అనేవి భౌతిక జీవితంతో సంబంధం లేని, కేవల మానసిక వికారాలు కావు. అవి వాస్తవ పరిస్థితుల నుండి జనించిన భావనలే. మరి వాస్తవ పరిస్థితులను మార్చకుండా ఆ బాధించే భావనలను తొలగించడం సాధ్యమేనా? సాధ్యం కాదు. మరి వాస్తవ పరిస్థితులు ఎలా మారతాయి? మనుషులే మార్చాలి. అలా మార్చాలనే సంకల్పం మనుషులకు ఎలా వస్తుంది. మనల్ని బాధించే పరిస్థితుల గురించిన ఎరుక నుండి ఆ స్పృహ కలుగుతుంది. సరిగ్గా ఇక్కడే భావాలు లేదా సంస్కృతి యొక్క పాక్షిక స్వాతంత్రం, ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తాయి. భావాలూ, మానవ సంకల్పం ఎలాంటి పరిస్థితులను అయినా, చారిత్రక పరిస్థితులతో ప్రమేయం లేకుండా మార్చగలవని మనం చెప్పము. అలా చెబితే భావ వాదులమవుతాము. నిర్దిష్ట చారిత్రక దశ, వాస్తవ జీవన పరిస్థితులు అనుమతించిన పరిధికి లోపల పరిస్థితులను మార్చే ప్రయత్నం చేస్తే మార్క్సిస్టులం అవుతాము. ఆర్థిక విషయాలు పక్కనబెట్టి సాంస్కృతిక విషయా లు చూస్తే మనకు 'వ్యక్తి పూజ' భూస్వామ్య వ్యవస్థనుండి వచ్చిన సంస్కృతి. అది నేటికీ ప్రజల్లో బలంగా ఉంది. అది ప్రజాస్వామ్యానికి బద్ధవిరోధి, నియంతృ త్వానికి దగ్గరి బంధువు. వ్యక్తి పూజా ధోరణులకు, నియంతృత్వానికి వ్యతిరేకం గా పోరాడకుండా సోషలిజం కోసం పోరాడుతాము అనడం అబద్ధం. ఎందుకంటే ప్రజాస్వామ్యం సోషలిజానికి జీవ ధాతువు. రాబోయే యుగాల అతి ముఖ్య లక్షణాలు ప్రస్తుత పోరాటంలో ప్రధాన అంశాలుగా ఉండాలి, లేదా కనీసం వ్యతిరేకంగా ఉండకూడదు. అంబాని, ఆదానీలను సభ్యులుగా చేర్చుకుని సోషలిజం కోసం పోరాడుతున్నామని నమ్మించలేము కదా!

'అమానవీయ పరిస్థితుల్లో జీవిస్తున్న మానవులు ఆ అమానవీయ పరిస్థితులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో మాత్రమే తమ మానవత్వాన్ని నిలుపుకోగలరు, ధృవీకరించుకోగలరు' అనేది మార్క్సిస్టు భావన. సరుకుల ఆరాధన, పరాయీకరణలపై పోరాడటం ఎలా? సరుకుల ఆరాధన ఇపుడు వినిమయవాద సంస్కృతిలో వ్యక్తమవుతోంది. వినిమయ వాదానికి వ్యతిరేకం గా జరిపే పోరాటంలో కొంత ఫలితం తప్పక ఉంటుంది. ఆ పోరాటం ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదించాలి. ప్రాథమిక అవసరాలు తీరిన తరువాత ఆడంబరాలు, భౌతిక సంపదల పట్ల వ్యామోహం లేని సరళ జీవన విధానం అనేది మన సాంస్కృతిక నినాదం కావాలి. మనిషి తన సర్వ శక్తులనూ ఆధ్యాత్మిక ఉత్పత్తుల కోసం వెచ్చించాలి. అంటే కళలు, క్రీడలు, నైపుణ్యాలు, జ్ఞానం మొదలైనవి. ఇవన్నీ కమ్యూనిస్టు వ్యవస్థలో గాని సాధ్యం కావు కదా, ఇప్పుడెలా వాటిని ప్రచారం చేస్తాం? అలా చేయ వచ్చా? చేయాలి. అదే సంస్కృతి విశిష్టత. సుదూర భవిష్యత్తులో సాధించ కోరే లక్ష్యాలను అది చాల ముందుగానే ప్రతిపాదించగలదు.

పరాయీకరణపై యుద్ధానికి ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనే వారందరినీ ఏకం చేసే ప్రయత్నమే అస్త్రం. తయారైన వస్తువులో తనను తాను చూసుకోడా నికి వీలులేని పరిస్థితుల్లో ఆ వస్తువులు సమిష్టి శ్రమ ఉత్పాదితాలని, అవి ఏ ఒక్కరివి, లేదా పెట్టుబడిదారుడివి కాక సమిష్టి శ్రమ ఫలితాలనే స్పృహను పెంచగలగాలి. ఇది చాలా కష్టం. సమిష్టి ప్రయోజనాల కోసం చేసే పోరాటంలో ఇటువంటి అవగాహన కలిగించాలి. పోరాటాల్లో నిమగ్నమవుతున్న శ్రామికు లకు సైద్ధాంతిక అవగాహన కల్పించే కృషి తగినంత జరగడం లేదు. శ్రామికులకు ఉత్పత్తి, పంపిణీ ప్రక్రియల గురించిన అవగాహన కలిగేలా చేయాలి. ఒక ఫేక్టరీలో తయారైన వస్తువులు సమిష్టి శ్రమ ఫలితాలు అని తెలియజెప్పడం కష్టం కాదు. ఆ వస్తువులతో ప్రతిఒక్కరూ తాదాత్మ్యం చెందేలా చేయడం కష్టం. ప్రపంచ వ్యాపితంగా విస్తరించిన 'శ్రమ సహకారం' గురించి వాస్తవాలను తెలియజెప్పడం ద్వారా

ఎరుకను కలిగించడం కష్టం కాదు గానీ, ప్రపంచ శ్రామికులందరి శ్రమలోని సహకారాన్నీ అనుభూతి చెందేలా చేయడం కష్టమే. వ్యక్తివాద, జాతీయ, ప్రాంతీయ, కుల, భాష దురభిమానాలను ఎదిరిం చలేని స్థితిలో ఈ ఆశయం హాస్యాస్పదం అనిపిస్తుంది. కాని వేరే దారి లేదు. ప్రయివేటు ఆస్తి రద్దై కమ్యూనిజం వచ్చినపుడు మాత్రమే పరాయీకరణ అంతం అవుతుందని మార్క్స్ చెబుతాడు. ప్రయివేటు ఆస్తి భావనకు అవకాశం లేని సహకార సంఘాలు సమిష్టి భావనను పెంపొందించడంలో కొంత పాత్రను నిర్వహిస్తాయి. అయితే సహకార సంఘాలను పాలక వర్గాలు అన్నివిధాల నిరుత్సాహ పరుస్తాయి. ఎందుకంటే సొంత ఆస్తి వ్యవస్థ ద్వారానే ఉత్పత్తి సాధ్యం అనే ప్రచారం అబద్ధమని ఈ సంఘాలు రుజువు చేయగలవు.

## పర్యావరణం

లాభం ఏకైక ధ్యేయంగా పనిచేసే పెట్టుబడిదారీ వ్యవస్థ కొన్ని వేల మందిని బిలియనీర్లు, ట్రిలియనీర్లను చేస్తున్నది. అదే సమయంలో మొత్తం మానవజాతిని, భూగోళంపై జీవ రాశిని అంతం అంచులకు తోసి వేస్తోంది. 700 కోట్లకు పైగా ప్రజలకు ఈ పాపంలో ఎటువంటి భాగం లేకపోయినా ఫలితాన్ని అందరూ అనుభవించాలి. తమ పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థ తెచ్చిపెట్టిన పర్యావరణ సంక్షోభం అన్ని సంస్కృతులను అంతం చేసే అతిపెద్ద సాంస్కృతిక సమస్యను తెర పైకి తెచ్చింది. దీన్ని అధ్యయనం చెయ్యాలి.

1970 లలో ఒక అమెరికా విశ్వవిద్యాలయ ఆచార్యుని వాదన ఇలా వుంది. 'మధ్య యుగాల్లో జరిగిన క్రైస్తవ మత విచారణల్లో(inquisition) మంత్రగత్తెలను, శాస్త్రవేత్తలను దహనం చేయడం వల్ల మనం ఇంకా బ్రతికి ఉన్నాం. ఆ దహనాలు సైన్సు అభివృద్ధిని రెండు శతాబ్దాలు ఆపాయి. అవి జరగకుంటే గత (19 వ) శతాబ్దం లోనే ఈ భూగోళం పేలిపోయి ఉండేది.' ఇది సైన్సు వ్యతిరేక వాదనలా కనిపిస్తున్నా సైన్సు, సాంకేతిక పరిజ్ఞానాల

సాయంతో లాభం కోసం జరుగుతున్న భయంకర విధ్వంసాన్ని మనకు తెలుపుతోంది.

వర్తమాన మానవశాస్త్ర తత్వవేత్తలు భవిష్యత్తు గురించి భయంతో హెచ్చరిస్తున్నారు. రేపటి సామాజిక, సాంస్కృతిక వ్యవస్థ మరిన్ని చీలికలు, పేలికలు గావించబడవచ్చు. ప్రకృతి బిడ్డగా మానవుడికే ప్రత్యేకమైన జీవ పరమైన ధర్మాలను అస్సలు పట్టించుకోకపోతే విధ్వంసం తప్పదు.

## 'సమాజం' అనేది ఏదీ లేదు

మార్కెట్, దాని ప్రచార యంత్రాంగం 'సమాజం' అనే భావనను 'శత్రు పూరిత భావన' గా చూస్తాయి. బ్రిటిష్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్ "సమాజం వంటిది ఏదీ లేదు. కేవలం, వ్యక్తులు, వారి కుటుంబాలే ఉన్నాయి." (There is no such thing as 'Society'. There are just individuals and their families)" అని ప్రకటించారు. మార్కెట్ సమాజాన్ని ఎలా చూస్తుందో అదే థాచర్ ప్రకటించారు. మార్కెట్ 'సమాజం' అనే భావనను ఎందుకు వ్యతిరేకిస్తుంది? 'సమాజం' అనే దాని ఉనికిని గుర్తిస్తే సామాజిక సంబంధాలను, విలువలను గుర్తించాలి. సమాజంలోని ఆకలి, దరిద్రం, రోగాలు, నిరుద్యోగం, నేరాలు మొ. అన్నిటినీ కలిపి చర్చించాల్సి వస్తుంది. అదీగాక తమ సరుకులను కొనే వినియోగదారుడికి అటువంటి సామాజిక స్పృహ ఉండటం తమ ప్రయోజనాలకు విరుద్ధం. మార్కెట్‌కు తన స్వార్థం, గుర్తింపు, హోదాల కోసం ఆరాటపడే ఇతర జంజాటాలు లేని 'పరిశుద్ధ కొనుగోలుదారు' కావాలి. ఏ మేరకు వ్యక్తికి సామాజిక స్పృహ ఉంటుందో ఆ మేరకు ఆ వ్యక్తి కొనుగోలుదారుగా విఫలమవుతాడు. వ్యక్తిలోని దురాశ, స్వార్థం మార్కెట్‌కు కావలసిన సుగుణాలు. వాటిని ప్రోత్సహిస్తుంది. వ్యక్తిలోని మంచితనం, ఇతరుల గురించి ఆలోచన, దయ లాంటి గుణాలు

మార్కెట్‌కు వ్యతిరేకమైన గుణాలు. ఒకవేళ వ్యక్తిలోని దయ, జాలి లాంటి గుణాలను సంతృప్తి పరచుకోవాలన్నా, దానికి మార్కెట్ తను అమ్మే కొన్ని ప్రత్యేక సరుకులను కొనడం ఒక్కటే మార్గం అని చెబుతుంది. మన దాతృత్వం, సామాజిక బాధ్యతలు కూడా మార్కెట్ ద్వారా, సరుకుల ద్వారానే జరగాలి. గ్లోబల్ వార్మింగ్, పర్యావరణ కాలుష్యాలను అదుపుచేయాలనే వాంఛ తగినంతగా ప్రజల్లో పెరిగితే వాటికోసం కూడా సరుకులతో మార్కెట్ సిద్ధమవుతుంది. కాలుష్యం నుండి వ్యక్తులను కాపాడే పరికరాలను ఇప్పటికే అమ్మటం ఆరంభించింది కదా!

## ఐడెంటిటీ

ఐడెంటిటీకి వ్యక్తిగత, సామాజిక కోణాలు రెండూ ఉంటాయి. ఐడెంటిటీ అంటే, ఒక వ్యక్తి తన గురించి తాను కలిగి ఉండే స్వీయాత్మక భావన (the subjective concept that a person holds of him /herself). ఈ నిర్వచనం ప్రకారం ఐడెంటిటీ అనేది ఆవశ్యకంగా వస్తు గత సారాంశాన్ని సూచించేది కాదు. అది స్వీయాత్మక మానసిక అనుభవం స్థాయిలో ఉంటుంది. ఈ ఐడెంటిటీ ఒకటి కాదు, అనేకం. ఒక వ్యక్తి ఐడెంటిటీ ఆ వ్యక్తి శారీరక పరిధిని దాటి భౌతిక వస్తువులను చేర్చుకునేందుకు విస్తరిస్తుంది. సైకాలజీ గతంలో బాడీ ఇమేజ్‌ను ఐడెంటిటీ పరిధిలో చేర్చలేదు. పరిశోధనల్లో తేలిన దాని ప్రకారం వ్యక్తి శరీరం గురించి ఆ వ్యక్తికి ఉండే ఆలోచనలు, అనుభూతులు ఐడెంటిటీ పరిధిలోకే వస్తాయి. బాడీ ఇమేజ్ అనేది తన శరీరం గురించి ఒక వ్యక్తికి గల స్వీయాత్మక భావన.

వస్తు సంబంధమైన, శారీరక సంబంధమైన రెండు ఐడెంటిటీలు వినిమయ సంస్కృతిలో చాల ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అడ్వర్‌టైజింగ్ లో రెండు రకాల ఆదర్శప్రాయ ఐడెంటిటీలు సమృద్ధిగా ఉంటాయి. వాటిలో ఒకటి సంపద్వంతమైన లైఫ్‌స్టైల్ తో మంచి జీవితాన్ని గడిపే ప్రజలు కాగా, రెండోది బాడీ పెరఫెక్ట్. వీటిని విలువలుగా వ్యక్తులు జీర్ణించుకుంటారు.

స్వరూపం, అందం, పరఫెక్ట్ బాడీ అనేవి చాలా కాలంగా చాల మంది బాలికలు, స్త్రీల ఐడెంటిటీకి కీలకంగా ఉంటూ వచ్చాయి. వారు బాల్యం నుండే వాళ్ళ శరీరాలను ఇతరులను ఆకర్షించడానికి ఉపయోగించాలని సమాజం నుండి నేర్చుకుంటారు. వారు తమని 'అందరు చూసి అంచనా వేసే వస్తువులు' గా చూసుకోవడం నేర్చుకుంటారు. ఈ విషయంలో 'స్త్రీ సౌందర్యం' అనే బలమైన సామాజిక-సాంస్కృతిక ఆదర్శం కోసం వత్తిడి నిరంతరం తిరిగి బలోపేతం చేయబడుతుంది. అతి సన్నని శరీరం సౌందర్యంగా పరిగణించ బడుతోంది. గ్లామర్ మోడల్స్ ఉండాల్సిన దాని కన్నా 20% తక్కువ బరువు ఉంటున్నారు. అదే సమయంలో అమెరికా సైకియాట్రిక్ అసోసియేషన్ 15% కన్నా తక్కువ బరువు ఉన్నట్లైతే అనరెక్సియా (anorexia=ఆకలి లేకపోవడం) కి సూచనగా పరిగణిస్తున్నది. ఆరోగ్యవంతమైన బరువుకు ప్రమాణం 18.5 BMI(Body Mass Index) కాగా, ప్రపంచ ప్రఖ్యాత మోడల్స్ BMI 14 లేదా 15 గా ఉన్నది. అందు చేత స్త్రీల 'బాడీ పరఫెక్ట్' చాలా సన్నని శరీరం.

అయితే 'అందంగా కనిపించడం' అనేది ఇంకెంత మాత్రమూ స్త్రీలకే పరిమితమై లేదు. సామాజిక-సాంస్కృతిక రంగంలో పురుషుల శరీరాకృతికి ప్రాధాన్యత చాల వేగంగా పెరుగుతున్నది. ఆకర్షణీయమైన శరీరాకృతి పట్ల యువకుల వ్యామోహం కొన్ని సందర్భాలలో యువతుల వ్యామోహాన్ని మించి పోతున్నది. దీన్ని 'Adonis Complex' అంటున్నారు. మీడియా కండలు తిరిగిన పురుష శరీరాలను ఆదర్శంగా చూపిస్తున్నది. అతి సన్నని స్త్రీ మోడల్స్ ను ప్రదర్శించే ఫేషన్ రంగం పటిష్టమైన శరీరాకృతి కల పురుషులను మాత్రమే ఇప్పుడు మోడల్స్‌గా చూపుతున్నది. ముఖ్యంగా చెడ్డీల వంటి వాటి వాణిజ్య ప్రకటనల్లో ఈ ధోరణి మరింత ఎక్కువగా వుంది.

ప్రస్తుతం మన దేశంలో మతం, లింగం, కులం, ప్రాంతం, భాష మొదలగునవి మనుషులకు ఐడెంటిటీ కల్పించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తు

న్నాయని చెప్పవచ్చు. నేను హిందువును అనే స్పృహను ప్రతీ హిందువులోనూ కల్పించి ఏకం చేయాలని సంఘ్ పరివారం, దానికి అనుకూలురైన ప్రవచన కారులు, మీడియా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. పూజలు, మత పరమైన తంతులు, పండుగలు వగైరాలో గతంలో ఉండే వైవిధ్యాన్ని తగ్గించి చాలావరకు ఒకే పద్ధతులను ప్రవేశ పెట్టగలుగుతున్నారు. అలాగే ప్రధాన మత శాఖలైన శైవ, వైష్ణవాల మధ్య విభేదాలు బయటకు రాకుండా ఉభయులూ చాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరి ప్రయత్నాలకు ప్రధాన అడ్డంకిగా వున్నది కులం. ప్రతీ హిందువుకు మతంతో పాటు వచ్చే తప్పనిసరి గుర్తింపు కులం. ఈ కుల గుర్తింపు హిందువులందరినీ ఏకం చేసే ప్రయత్నానికి ప్రధాన అడ్డంకిగా వుంది. వర్గ స్పృహ లోపించిన, పరాయీకరణ బాధిస్తున్న పరిస్థితుల్లో మన ప్రజలు కులం, మతం, ప్రాంతం మొ. వాటిలో తమ ఐడెంటిటీని వెతుక్కుంటున్నారు. చాలా కాలంగా కులాన్ని ప్రజలను విభజించే ప్రధాన రాజకీయ సాధనంగా వాడుతున్నారు. రోజువారీ రాజకీయాల్లో ప్రజల్లో కుల స్పృహ తగ్గకుండా అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. కులం లేని హిందూ మతం ఉండదు. శూద్ర కుల స్పృహను హిందూ మతం అధిగమించ గలిగింది. అయితే దళితులకు హిందూ సమాజంలో సమాన స్థానం కల్పించడం అసాధ్యం. అందుచేత కులం గుర్తింపును రద్దు చేయకుండానే ఆ అడ్డంకిని అధిగమించి హిందూ గుర్తింపుతో అందరినీ ఏకం చేయడానికి సంఘ్ పరివారం ఎంచుకున్న మార్గం ముస్లిం, దళిత ద్వేషం ప్రాతిపదికగా హిందువులను ఏకంచేయడం. ఇందులో ముస్లిం ద్వేషం కుహనా దేశభక్తి యుత జాతీయ గుర్తింపుగా ఉపయోగ పడుతోంది.

## శ్రేయస్సు (Well-being)

సైకాలజీ సాంప్రదాయకంగా విచారం, అనారోగ్యాల గురించిన అంచనాల గురించి ఎక్కువ పట్టించుకునేది. ఇటీవలి కాలంలో అది వ్యక్తి

శ్రేయస్సును పెంచేవాటిపై దృష్టి పెట్టింది. శ్రేయస్సులో అతి ముఖ్యమైన అంశం స్వీయాత్మక మైన ఆనందానుభూతి. మంచి, చెడ్డ సంఘటనలు ఆనందాన్ని తాత్కాలికంగా ప్రభావితం చేస్తాయి. మెజారిటీ వీటిని సర్దుబాటు చేసుకోగలరు. ఒక అధ్యయ నం ప్రకారం, లాటరీ నెగ్గిన వారి ఆనందం, ప్రమాదం జరిగి చక్రాల కుర్చీకి పరిమితమైన వారి విషాదం తక్షణ స్పందనల రీత్యా తీవ్ర స్థాయిలో పూర్తి విరుద్ధ మైనవి. అయినా కొంత కాలం తర్వాత వారు తమ గత ఆనంద స్థాయికి చేరుకున్నారని రుజువయ్యింది. అయితే సంతోషం, లేదా ఆనందాన్ని నిర్వచించ డం, కొలవడం సాధ్యం కాదు. జీవితం పట్ల సంతృప్తి, గడచిన మన జీవితం పట్ల మన అంచనా, వీటితో పాటు తరచుగా సానుకూల భావోద్వేగాలను అనుభూతి చెందడం, ప్రతికూల భావోద్వేగాలు లేకపోవడం మొదలైన కొన్ని ముఖ్య విషయాల ద్వారా వాటిని ఉజ్జాయింపుగా అంచనా వేయవచ్చు. ఆ విధంగా ఒక వ్యక్తి గురించి అతని/ఆమె అంచనాలు, అంటే తన జీవితం పట్ల, శరీరాకృతి పట్ల సంతృప్తి, ఆత్మ గౌరవం, లేదా వాటి పట్ల అసంతృప్తి, లేదా ఆందోళన, క్రుంగుబాటు మొ. వాటిని శ్రేయస్సుకు ప్రమాణాలుగా పరిగణించ వచ్చు. అంతే గాక తనకున్న వస్తు సంపద, శరీరాకృతిల పట్ల అసంతృప్తి తీవ్ర మానసిక, శారీరక అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతుంది. వీటిలో అస్తవ్యస్త ఆహార ధోరణులు (eating disorders), వినిమయ వస్తువుల నిర్బంధ కొనుగోలు తత్వం మొ. ముఖ్యమైనవి. భౌతిక అవసరాలతో పాటు మానసిక అవసరాలు తీరినప్పుడు మాత్రమే మనిషి తాను క్షేమంగా వున్నానని భావిస్తాడని సైకాలజీ వాదిస్తుంది. వస్తు సంపదలు ప్రదర్శించటం, హోదా, గుర్తింపు మొదలై నవి మనిషి శ్రేయస్సు, క్షేమాలకు తప్పనిసరి అవసరాలని ప్రతి ఒక్కరు నమ్మేలా చేస్తుంది కేపిటలిస్టు వ్యవస్థ.

## మధ్యవర్తిత్వం (Mediation)

ఉదాహరణకు ఒక శ్రామికుడు ఒక చెప్పుల తయారీ పరిశ్రమలో పనిచేస్తుంటే అతను చెప్పులు మాత్రమే కాక మారకపు విలువను ఉత్పత్తి చేస్తున్నాడన్న మాట. వాటిని(ఆ సరుకులను) కొంత డబ్బుకి అమ్మవచ్చు. ఇక్కడ శ్రామికుని శ్రమ విలువ ఎంతంటే ఆ సరుకు మారకపు విలువనుండి అంటే అమ్మకపు ధరనుండి ముడిసరుకులు, ఇతర ఖర్చులు తీసేయగా మిగిలినది. ఇందులో కొంత భాగమే కూలిగా శ్రామికుడికి ముడుతుంది. ఉత్పత్తి అయిన చెప్పులు లేదా సరుకులకు, మారకపు విలువతో పాటు సామాజిక, సాంస్కృతిక విలువ కూడా ఉంటుంది. ఈ విధంగా శ్రామికుని శ్రమ ఆ సరుకు మారకపు విలువకు, వాటి (చెప్పుల) సామాజిక, సాంస్కృతిక, సంకేత(symbolic) విలువకు మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నది.

మార్క్సిజంలో మధ్యవర్తిత్వం సమస్యను 'నిర్ణయం' సమస్యగా చర్చిస్తున్నారు. అంటే సమాజ మనుగడకు పనిచేసే కర్తలు (actors) వారిని బంధించే సామాజిక నిర్మాణాలను ఎలా నడుపుతారు అనేది. మార్క్స అభిప్రాయం ప్రకారం శ్రామికుని శరీరానికి ప్రకృతికి మధ్య మధ్యవర్తిగా ఒక గతితార్కిక సంబంధాన్ని ఏర్పరిచే శ్రమే ప్రాధమిక మధ్యవర్తి. శ్రమ ఆవిధంగా మనుషులకు, ప్రాకృతిక ప్రపంచానికీ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తుంది. అయితే ఒకసారి శ్రమ మూర్తీకృతం (reified) అయితే లేదా ఒక సరుకుగా అమూర్తం చేయబడితే, అది, అంటే శ్రమ దాని యజమాని అయిన శ్రామికుని నుండి పరాయిదై (alienated) ఇతర సరుకులలాగానే మారకం అవుతుంది. ఒకసారి ఇలా జరిగితే మధ్యవర్తిత్వం నెరపే, నిర్ణాయక కారణాంశం (factor) పెట్టుబడి అవుతుంది. అప్పుడు పెట్టుబడిదారుడే వేతనాలను- శ్రమ మారకపు విలువను- నిర్ణయిస్తాడు. ఇక శ్రామికుడికి మిగిలినది శ్రమశక్తి లేదా శ్రమించే సామర్థ్యం మాత్రమే! అదే అతని పోషణకు ఏకైక ఆధారం. అందుచేత వీలైనంత ఎక్కువ మొత్తానికి తన శ్రమశక్తిని అమ్మాలని

శ్రామికుడు ప్రయత్నిస్తాడు. దీనిలో నున్న అంతరార్థం ఏమిటంటే ఈ శ్రమశక్తికి విలువ ఉంది. అది డబ్బులో వ్యక్తమవుతుంది. అంటే ఇక్కడ డబ్బు మధ్యవర్తి అవుతుంది. దీంతో అన్ని సంఘర్షణా క్షేత్రాల పోరాట ఫలితాన్ని నిర్ణయించే కర్తగా డబ్బు ఎలా పని చేస్తుంది అనేదే ఆ పోరాటాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తుంది. అంటే సంఘర్షణలు డబ్బుకోసం జరుగుతాయి.

## మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతానికి ప్రాతిపదిక ఏమిటి?

కారల్ మార్క్స్ పేరుతో ముడిపడిన 'మార్క్సిజం'[1] ఆయన రచనల నుండి రాబట్టిన ఒక సిద్ధాంతం. ఇది ప్రధానంగా జీవిత భౌతిక పరిస్థితుల నిర్ణయాత్మక పాత్రను కేపిటలిజం చలన సూత్రాల అభివృద్ధిని, మానవ కార్యకలాపాల చారిత్రక విశిష్టతను వక్కాణిస్తుంది.

మానవుల ప్రథమ ప్రాధాన్యత తమ జీవితావసరాలను శ్రమ, పనిముట్లను ఉపయోగించి ఉత్పత్తి చేయడమేనని, ఏం చెయ్యాలన్నా మనిషి ముందు జీవించి ఉండాలని మార్క్స్ వాదించాడు. ఉత్పత్తికి అవసరమైన పనిముట్లు, భూమి, భవనాలు వగైరాను ఉత్పత్తి సాధనాలు అంటారు. వస్తూత్పత్తి కోసం పనిచేసే క్రమంలో మనుషుల మధ్య ఏర్పడే సంబంధాలను ఉత్పత్తి సంబంధాలు అంటారు. ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాలను కలిపి 'ఉత్పత్తి విధానం' (mode of production) అంటారు. ఈ 'ఉత్పత్తి విధానం' అనేది మార్క్సిజంలో కేంద్ర భావాభివర్గం (central category). ఉత్పత్తి విధానం యొక్క వ్యవస్థీకరణ కేవలం వస్తువుల ఉత్పత్తి, పంపిణీల మధ్య సమన్వయానికి సంబంధించిన విషయం కాదు. అలా కాకపోగా అది అంతర్గతంగా ప్రజల మధ్య సహకారం, సమన్వయాలు, అధికారం, ఘర్షణలతో కూడిన సంబంధా లతో ముడి పడినది. ఉత్పత్తి విధానంలో అంతర్భాగమైన సామాజిక శత్రుత్వాలు చారిత్రక మార్పుకు చోదక శక్తి అని మార్క్సిజం భావిస్తుంది. మార్క్సిజంలో ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వడంవల్ల, మానవ సంబంధాలకు సంబంధించిన ఇతర అంశాలు అంటే చైతన్యం,

సంస్కృతి, రాజకీయాలు మొదలైనవి స్థూలంగా ఆర్థిక సంబంధాల చేత నిర్మించబడతాయి అని మార్క్సిజం భావిస్తుంది. మార్క్సిజం ప్రకారం చరిత్ర అనేది ఒడిదుడుకులు లేని నిరంతర పరిణామ ప్రక్రియ కాదు. అది అతి ముఖ్యమైన అవరోధాలు అంతరాయాలతో కూడి సాగుతుంది. ఈ విధంగా ఆదిమ ఉత్పత్తి విధానం నుండి భూస్వామ్యం, తరువాత కేపిటలిజం వరకూ విభిన్న భౌతిక నిర్మాణాలు, సామాజిక సంబంధాలతో చరిత్ర గమనం సాగిందని మార్క్స నిరూపించాడు. ఈ మార్పులు ప్రధానంగా ఉత్పత్తి విధానంలోని అంతర్గత వైరుధ్యాలు, మరీ ముఖ్యంగా వర్గపోరాటం ద్వారా జరుగుతాయి.

మార్క్స, ఎంగెల్స్‌లు రూపొందించిన 'పునాది-ఉపరి నిర్మాణం' భావన ప్రకారం, ఆర్థికం అంటే జీవితావసరాలు, ఇతర భౌతిక వస్తువుల ఉత్పత్తి, ఆ ఉత్పత్తి ప్రక్రియలో ఏర్పడే మానవ సంబంధాలను పునాది అన్నారు. ఆ పునాదిపై నిర్మితమైన వాటన్నిటినీ ఉపరి నిర్మాణం అన్నారు. అంటే రాజ్యం, చట్టం, న్యాయం, సంస్కృతి, భావజాలం మొదలైనవన్నీ ఉపరి నిర్మాణం అన్నమాట. ఉత్పత్తి సంబంధాలతో, అంటే పునాదితో సంబంధం లేకుండా ఉపరి నిర్మాణం ఉండదు. అంటే పునాదితో సంబంధం లేకుండా మన ప్రస్తుత అధ్యయన విషయమైన సంస్కృతి కూడా ఉండదు. ఉత్పత్తి విధానం మారినప్పుడు కొత్త ఉత్పత్తి విధానానికి అవసరమైన, అనుగుణమైన మార్పులు వస్తాయి. తన ప్రయోజనాలకు పూర్తి వ్యతిరేకమైన సాంస్కృతిక విషయాలతో ఉత్పత్తి వ్యవస్థ ఘర్షణపడి వాటిని మార్చి వేస్తుంది. మనదేశంలో కులవృత్తుల వ్యవస్థ పెట్టుబడిదారీ విధానానికి ఏ మేరకు అడ్డంకిగా ఉందో ఆ మేరకు కుల నిబంధనలను సడలింపు చేసింది. తనకు ఇబ్బంది కాని మేరకు కుల వ్యవస్థను సహిస్తున్నది, ప్రోత్సహిస్తున్నది కూడా! అంటే ఒక శ్రామికునిగా, వినియోగదారునిగా భారతీయ పెట్టుబడిదారీ వర్గానికి మనుషుల పట్ల కుల వివక్ష లేదు. అయితే ఆ వర్గ పాలన కొనసాగడానికి ఓటర్లు కులాలవారీగా ఎంత ఎక్కువ విడిపోతే అంత మంచిది. కేవల కుల విభజన సరిపోనప్పుడు

అన్ని కులాలు కలిసి ముస్లిం, దళిత ద్వేషంతో హిందువులుగా ఏకమై తమ అధికారాన్ని నిలబెట్టాలి. పెట్టుబడిదారీ వర్గం ప్రజల అవసరాలను తీర్చడంలో విఫలమైనా, అనేక సంక్షోభాలలో కూరుకు పోతున్నా ప్రజల సంస్కృతిని మార్చి తన పాలన కొనసాగించ గలుగుతున్నది. మరీ ముఖ్యంగా ప్రజలు తన ఆధిపత్యానికి ఎదురు తిరగకుండా వారి సంస్కృతిని తీర్చిదిద్ద గలిగింది. ఈ పెట్టుబడిదారీ సాంస్కృతిక సంకెళ్ళను బద్దలు చేయకుండా వామపక్షాలు ప్రజలను సమీకరించ లేవు, వర్గ పోరుకు సన్నద్ధం చేయలేవు.

ఉత్పత్తి సంబంధాలను బట్టి చరిత్ర చారిత్రక యుగాలుగా (ఆదిమ, బానిస, భూస్వామ్య, పెట్టుబడిదారీ వగైరా) లంఘనాలతో (leaps) ముందుకు సాగుతుంది. ప్రతీ చారిత్రక యుగంలోనూ నిర్దిష్ట ఉత్పత్తి సంబంధాలకు అనుగుణంగా ఉపరి నిర్మాణం కూడా మారుతుంది. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి -అంటే సాంకేతిక పరిజ్ఞానం, దాన్ని ఉపయోగించి పనిచేసే మానవ నైపుణ్యాలు అభివృద్ధి- చెంది ఉత్పత్తి సంబంధాలు (పునాది) మారవలసిన అగత్యం ఏర్పడుతుంది. "చేతి యంత్రం (hand mill) భూస్వామి గల సమాజాన్ని ఇస్తే, ఆవిరి యంత్రం పారిశ్రామిక పెట్టుబడిదారు గల సమాజాన్ని ఇస్తుంది". – మార్క్స్ .

ఉపరి నిర్మాణ మంటే కుటుంబం, రాజకీయం, చట్టం, మతం, సంస్కృతి మొదలైనవి. ఇవి అమలులో కొచ్చిన ఉత్పత్తి సంబంధాలను సమర్థించటానికి అనుగుణంగా మారుతుంటాయి. కేపిటలిస్టు ఉత్పత్తి విధానంలో చట్టాలు, రాజకీయాలు, కుటుంబ సంబంధాలు, చివరకు మత నమ్మకాలు కూడా ఆ విధానానికి అనుగుణంగా మారిపోతాయి. డబ్బు పెట్టుబడిగా పెట్టి మరింత డబ్బు రాబట్టడమే ఈ వ్యవస్థ సారం. దీనికి అనుగుణంగానే చట్టాలు ఉంటాయి. నూటికి 90 మందికి ఎటువంటి ఆస్తి ఉండదు. అయినా ఆస్తి హక్కుకు మిగిలిన అన్ని హక్కుల కన్నా రాజ్యాంగ రక్షణ ఎక్కువ. ప్రజలందరికీ కావలసిన విద్య, వైద్యం, ఉద్యోగ హక్కులకు అటువంటి రక్షణ

ఉండదు. జీవించే హక్కు ప్రాథమిక హక్కు అయినా అమలు కాదు. భూస్వామ్య సమాజానికి అవసరమైన ఉమ్మడి కుటుంబాలు, పితృస్వామ్యం నేడు అవసరం లేదు. ఆనాడు 'భక్తి ఉంటే చాలు పండు, పువ్వు, ఆకు, నీళ్ళు ఏమిచ్చినా స్వీకరిస్తాను' అని గీతలో కృష్ణుడు చెబితే నేడు భక్తికి కొలమానం డబ్బే అయ్యింది. దేవునికి ఎంత ఖరీదైన కానుకలిస్తే, లేదా ఎంత ఎక్కువ ఖర్చుచేసి మత కార్యక్రమాలు నిర్వహిస్తే అంత ఎక్కువ భక్తి ఉన్నట్లు లెక్క. నలభై కోట్ల విలువైన కిరీటాన్ని దేవుడికి ఇచ్చి తన పాపాలను మాఫీ చేసుకునే ప్రయత్నాన్ని మనం చూశాము. ఇలా మొత్తం విలువలన్నీ పెట్టుబడిదారీ విధానానికి అనుగుణంగా మారిపోతాయి. ఈ ఉపరి నిర్మాణ రూపాలన్నీ కలిసి ఒక భావజాలంగా రూపొందుతాయి.

ఇక్కడ ముఖ్య విషయం ఏమంటే ఏది నిర్ణయాత్మకం అనేది మాత్రమే కాదు. సంస్కృతికి, ఆర్థికానికి మధ్య తేడాను కూడా స్పష్టంగా గుర్తించాలి. ఆర్థికం పునాది మాత్రమే కాక కొన్ని సమయాల్లో అది 'సాంస్కృతిక నమూనా' కూడా అనే స్పష్టమైన అవగాహన ఉండాలి.

మార్క్సిజం పెట్టుబడిదారీ దోపిడీ నుండి మానవజాతిని విముక్తం చేసి ఈ ప్రపంచాన్ని మానవులకి శ్రేయోదాయకంగా మార్చడాన్ని గురించి వివరించే సాధారణ(general) సిద్ధాంతం. ఈ సాధారణ సిద్ధాంతం విశాల క్రీడా మైదానం అనుకుంటే ఆ మైదానం హద్దుల లోపల ప్రత్యేక (particular) సాంస్కృతిక సిద్ధాంత ఆటను ఆడాలి. లైను దాటి ఆడిన ఆట చెల్లదు. మార్క్సిజం సాధారణ నియమాలను ఉల్లంఘించి చేసే సాంస్కృతిక అధ్యయనాలు మార్క్సిజానికి చెందవు.

మార్క్స్ ఆలోచనకు ఉన్న గొప్ప బలం ఏమిటంటే అధికారం, ఆర్థిక జీవితాలకు సంస్కృతిని క్రమబద్ధ మార్గాల్లో అనుసంధానించే సామర్థ్యం. అందరూ అంగీకరించిన విధంగా దీనివల్ల సంస్కృతి స్వతంత్రతను సిద్ధాంతీకరించే వీలు లేకుండా పోయింది. ఈ మార్క్సిస్టు దృక్పథంలో సమిష్టి

భావజాలాన్ని వైయక్తిక ప్రవర్తనను 'ఆర్థికమే' నిర్ణయిస్తుంది. 20 వ శతాబ్దంలో మార్క్సిస్టు చింతనను మార్క్స్ ప్రతిపాదించిన అజెండాపై భారీ స్థాయిలో విస్తరించడం జరిగింది. అదే సమయంలో సంస్కృతి, వర్గం, ఆధిపత్యాల మధ్య సంబంధాన్ని కనుక్కునేందుకు గొప్ప కృషి జరిగింది. కేపిటలిజం మనుగడలో బావరూపం(ideal), పాదార్థికాల కీలక పాత్రను ప్రధానంగా గుర్తిస్తూనే ఇదంతా జరిగింది. ఈ అన్వేషణలో కేపిటలిజం, మానవ స్వీయాత్మకత (human subjectivity =కర్తృత్వం) భావజాల శక్తుల ద్వారా ఆలోచించడంలో పరాయీకరణ, సరుకీకరణ (commodification =సరుకుగా మార్చడం) భావనలు చాల ఉపయోగకర సాధనాలని రుజువు అయ్యింది.

మార్క్సిజం ప్రకారం సంస్కృతి అనేది సామాజికంగా వ్యవస్థీకృతమైన మానవ అస్తిత్వ పరిస్థితుల (జీవితానికి అవసరమైన భౌతిక, ఆధ్యాత్మిక అవసరాలు) ఉత్పత్తితో ముడిపడిన భౌతిక శక్తి. అలాగే నిర్ణయాత్మక చారిత్రక పరిస్థితుల్లో సామాజిక అస్తిత్వం సంతరించుకున్న రూపాలను సంస్కృతి సూచిస్తుంది. ఈ భావం 'పునాది-ఉపరి నిర్మాణం' భావనలో వ్యక్తమవుతుంది. దీని ప్రకారం సాంస్కృతిక ఉపరి నిర్మాణం ఆర్థిక ఉత్పత్తి విధానంచే తీర్చి దిద్దబడుతుంది, నిర్ణయించబడుతుంది. ఇది ఒక 'సాంస్కృతిక భౌతికవాద' రూపం.

పీటర్ గోల్డింగ్, గ్రామ్ మర్డాక్[2] అనే సామాజిక వేత్తల అభిప్రాయం ప్రకారం "సవిమర్శనాత్మక సాంస్కృతిక రాజకీయార్థశాస్త్రానికి నాలుగు చారిత్రక ప్రక్రియలు ప్రత్యేకంగా చాలా కీలకమైనవి. 1) మీడియా వృద్ధి 2) కార్పొరేట్ విస్తరణ 3) సరుకీకరణ 4) మారుతున్న రాజ్యం, ప్రభుత్వాల జోక్యం పాత్ర ".

అయితే ప్రస్తుతం ఈ సామాజిక అంశాలను మార్క్సిస్టులు కాని వారు కూడా చర్చిస్తున్నారు అనే వాదనలున్నాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ

అంశాల సంక్లిష్ట పరస్పర సంబంధాల గురించి మాట్లాడే సాంస్కృతిక విశ్లేషణా సిద్ధాంతాలన్నీ ప్రత్యక్షంగా, లేదా పరోక్షంగా మార్క్స్ రచనల నుండి ప్రేరణ పొందినవే. చాల మంది ఆ విషయం అంగీకరిస్తారు కూడా.

మామూలుగా చెప్పుకోవాలంటే సాంస్కృతిక అధ్యయనాలు మార్క్సిజంలో భాగం కాదు. నిక్కచ్చిగా చెప్పాలంటే 'మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతం' ఇంకా రూపొందాల్సి ఉంది. సాంస్కృతిక అధ్యయన కారులు మార్క్సిజంను విమర్శిస్తూనే (అందరూ కాదు) దాన్నుంచి గొప్ప సాయాన్ని పొందారు. 'చారిత్రక భౌతికవాదాన్ని అంగీకరించము' అని చెబుతూనే అదే దృక్పథం తో పరిశోధించిన, రాసిన చరిత్రకారుల లాగానే మార్క్సిస్టులు కాని వారు కూడా సాంస్కృతిక అధ్యయనాల్లో మార్క్సిజంపై ఆధారపడటం తప్పనిసరి అయ్యింది.

## మార్క్సిజంపై వచ్చే విమర్శలు.

1. కేపిటలిజం అంతం, వర్గ రహిత సమాజ ఆవిర్భావం అనే కచ్చితమైన లక్ష్యాన్ని చరిత్ర గమనానికి ఆపాదించే లక్ష్యాత్మకవాదం[3] (teleology) మార్క్సిజంలో అంతర్గతంగా వుంది.

2. మార్క్సిజంలోని కొన్ని భాగాలలో సంస్కృతిని ఆర్థికవ్యవస్థ పనితీరు దృష్ట్యా వివరించాలనే నియతి వాదం[4] అంతర్గతంగా వుంది.

3. కేపిటలిజం కేవలం మనుగడ సాగించడం కాక రూపాంతరం చెంది, విస్తరించి విజయవంతం అవుతున్నట్లు కనిపిస్తోంది.

4. అదే సమయంలో విస్తృత స్థాయిలో కార్మికవర్గ విప్లవాలు జరగకపోవడమే కాక సాధించిన వాటిని కూడా ఆ వర్గం కోల్పోతున్నది.

తొలి విమర్శకులు సంస్కృతిని ఆర్థికంచే నిర్ణయించబడే 'భావజాల సంబంధి' గా భావించారు. కాని తర్వాత ఆల్తూజర్, విలియమ్స్ మరి

కొందరు సంస్కృతిని భౌతిక ఆచరణగా, పనిగా భావించారు. అంటే సంస్కృతి పని (work) చేత నిర్ణయించబడుతుంది, లేదా సంస్కృతే ఒక శ్రమ రూపం.

చాలా ఎక్కువగా వినిపించే విమర్శ ఏమిటంటే 'మార్క్సిస్టులు సంస్కృతిని గతంలో ఎప్పుడూ అంతగా ప్రాధాన్యత లేని విషయంగానే చూశారు. మార్క్స్, ఎంగెల్స్‌లు సాహిత్యం, కళలను రాజకీయ, చారిత్రక దృక్పథంతో చర్చించినా రాజకీయ, ఆర్థిక వ్యవహారాలలో సంస్కృతి పాత్రను విస్మరించారని, సంస్కృతికి, సమాజానికి గల సంబంధం 'ఐడియాలజీ' వంటి అత్యంత అస్పష్ట భావనపై ఆధారపడి ఉందనీ' విమర్శ. మార్క్స్ సమగ్రమైన సాంస్కృతిక సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయలేదనే మాట నిజమే. కాని ఆయన మొత్తం రచనలను లోతుగా పరిశీలిస్తే సంస్కృతిని చిన్న చూపు చూడలేదని అర్థమవుతుంది. అయినప్పటికీ సాంస్కృతిక అధ్యయనాలలో మార్క్సిజం కేంద్ర స్థానంలో ఉంటూ వచ్చింది. దీనికి ఒక కారణం దాని సమగ్ర దృక్పథం. సంస్కృతికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని మార్క్స్, ఎంగెల్స్ లను విమర్శించిన వారు సైతం మార్క్సిజాన్ని విస్మరించి సంస్కృతిని అధ్యయనం చేయలేని పరిస్థితి ఉంది. ఎందుకంటే మార్క్సిజం ఏ విషయాన్ని సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాల నుండి వేరు చేసి పరిశీలించ లేని సైద్ధాంతిక ఆవశ్యకతను కల్పించింది. అంతేగాక 'వివిధ శాస్త్రాల మధ్య అధిగమించలేని హద్దులు ఉండవు' అనేది కూడా మార్క్సిజంలో కీలక విషయం.

'కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఇజ్దానోవిజం[5] ('Zhdonovism') రూపంలో సంస్థాగతం చేసింది. 'సోషలిస్టు రియలిజం' సిద్ధాంతాన్ని రెండవ, మూడవ ఇంటర్నేషనల్స్ ఆమోదించాయి. దీంతో సంస్కృతి కేవలం ఆర్థిక సంబంధాల ప్రతిఫలనంగా కుదించబడింది. ఎందుకంటే సంస్కృతిని పూర్తిగా వర్గమూలాలు, ఉత్పత్తి విధానాలచేత

నిర్ణయించబడేదిగా పరిగణిస్తే, అప్పుడు దాని రాజకీయాలను నిర్వచించడం సులువు.' అనేది మరొక ప్రధాన విమర్శ.

ఈ రకం మార్క్సిజం (ఇజ్దానోవిజం) విలక్షణత ఏమంటే అది సాంస్కృతిక ఆచరణలకు ప్రత్యేకతను ఏమీ ఇవ్వదు. అలాగే ఆ సాంస్కృతిక కార్యకలాపాలు సామాజిక సంబంధాలను ప్రభావితం చేయగలవని గాని, రాజకీయ ఆధిపత్యాన్ని ప్రతిఘటించగలవని గాని భావించదు. సాంస్కృతిక రూపాలను సర్వ సాధారణంగా ఒకానొక వర్గానికి సంబంధించినవిగా పరిగణిస్తుంది. దీని ప్రకారం ఆధిపత్య సంస్కృతి ఆధిపత్య వర్గాలకు సంబంధించినదై ఉండి ఆ వర్గాల ప్రయోజనాలను, వాస్తవికతకు అది చెప్పే భాష్యాన్ని ప్రతిఫలిస్తుంది. శ్రామిక వర్గ సంస్కృతి సోషలిస్టు రియలిజం ప్రమాణాలను అందుకో కలిగినప్పుడు దానికి విప్లవ జేజే లు చెబుతుంది..

పై విమర్శలో మార్క్సిస్టులు ఆలోచించవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. ఈ విమర్శ మితిమీరిన సూక్ష్మీకరణ/కుదింపు (reduction). మార్క్సిస్టు సైద్ధాంతిక దృక్పథం గొప్ప లోచూపును ఇచ్చింది. సాంస్కృతిక ఉత్పత్తిలో రాజకీయ, సామాజిక అంశాల ప్రాధాన్యతను ఎజెండాలో చేర్చింది. తద్వారా ఉన్నత కళలను అనాలోచితంగా ఆదర్శం చేయడాన్ని సమర్ధవంతంగా సవాలు చేసింది. అంతేకాదు సాంప్రదాయ మార్క్సిజంలో అత్యంత కుదింపు తత్వంతో కూడిన అంశాలను కూడా ఎవరూ సులభంగా కొట్టి పారేయ లేరు. ప్రతిఫలన (reflection) సిద్ధాంతాలు తరవాత కాలంలో వచ్చిన అన్ని మరింత పరిణితి చెందిన/పరిష్కరించిన  మార్క్సిజాలకు, అలాగే చారిత్ర కంగా లేదా రాజకీ యంగా చేసే వ్యాఖ్యానాలకు కావలసిన ప్రధాన ముడి సరుకు అంతా అందించాయి.

**ముగింపు**.

మార్క్సిస్టు సిద్ధాంతంలో అంతర్గత మధనం వల్ల మాత్రమే కాక విశాల దృష్టిలో చూసినప్పుడు సామాజిక నిర్మాణంలో వచ్చిన మార్పులు –ముఖ్యంగా సాంకేతిక రంగ మార్పులు– మార్క్సిజంలో మార్పులకు, చేర్పులకు, తిరిగి నిర్వచించడానికి ప్రధాన కారణమయ్యాయి. అంతకుముందు లేని అనేక కొత్త సమస్యలను విశ్లేషించాల్సిన అవసరం మార్క్సిజానికి ఎదురు అయ్యింది. పాశ్చాత్య దేశాల్లో మారిన ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నుండి పాశ్చాత్య మార్క్సిజం[6] (western Marxism) పుట్టుకొచ్చింది. మార్క్సిజానికి అలా మొట్టమొదటి ప్రధాన సవరణ ప్రయత్నాలు రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో జరిగాయి. దీనికి తక్షణ కారణాలు ఫాసిజం విజృంభించడం, యూరపు కార్మికవర్గం సోషలిస్టు విప్లవం కోసం సంఘటితం కావడంలో విఫలం కావడం, సోవియట్ యూనియన్ లో 'స్టేట్ కమ్యూనిజం' స్థాపన. ప్రధానమైన మరో పరిణామం రెండవ పారిశ్రామిక విప్లవం –సమాచార, సాంకేతిక విప్లవం– ప్రారంభం కావడం.

ఇరవయ్యో శతాబ్దంలో కేపిటలిజంలోను కార్మిక వర్గంలోను వచ్చిన మార్పుల రీత్యా కల్చరల్ స్టడీస్ అవసరం ముందుకు తోసుకుని వచ్చింది. అదీగాక సామాజిక జీవితంలో మానవ చైతన్యం మరింత క్రియాశీల, సృజనాత్మక పాత్రను పోషించడం ప్రారంభం అయ్యిందని చరిత్ర రుజువు చేసింది.

మానవ క్రియాశీలతకు ప్రాధాన్యతను ఇచ్చే ఈ రకమైన మానవతావాద మార్క్సిజానికి బీజాలు మార్క్స్, ఎంగెల్స్ లోనే ఉన్నాయి. ఈ మానవతావాద మార్క్సిజం 'పునాది–ఉపరి నిర్మాణం' నమూనాలో అంతర్గతంగా ఉన్న పునాది ఉపరి నిర్మాణాన్ని నిర్ణయిస్తుందనే భావన గురించి తిరిగి ఆలోచించే, విశ్లేషించే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రయత్నంలో ముఖ్యంగా 1950, 60 లలో అప్పటివరకూ వున్న 'సంస్కృతి అంటే కళలు, జ్ఞానం' అనే అధికార

నిర్వచనం కాస్తా మారిపోయి ఆంత్రొపాలజి చెప్పే 'మొత్తం జీవిత విధానాలు' అనే నిర్వచనానికి దగ్గరగా రాసాగింది.

ముఖ్యంగా ఈ మార్క్సిస్టు మానవతావాదుల తరం తన దృష్టిని సాంస్కృతిక రంగ వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం మీద కేంద్రీకరించింది. అలాగే విభిన్న సాంస్కృతిక క్షేత్రాలను వివరించడం, నిర్వచించడం మీద కృషి చేసింది. తద్వారా సంస్కృతి ఒక కీలక రాజకీయ సమస్య అని నిరూపించింది. అంతేగాక మార్క్సిస్టు మానవతావాదాన్ని రెండోసారి తిరిగి కనుక్కోవడం సామాజిక వ్యవస్థలో బహుళ సంస్కృతులు ఉన్నాయనే విషయాన్ని విమర్శకులు గుర్తించేందుకు దారి తీసింది. చాల సందర్భాలలో ఇది శ్రామికవర్గ సంస్కృతి ఉనికి కొనసాగుతున్నదని, చివరకు పాలక వర్గాల ఆధిపత్య సాంస్కృతిక ఆచరణలకు వ్యతిరేకంగా తిరిగే అవకాశాలున్నాయని గుర్తించేం దుకు దారితీసింది.

ఈ ప్రభావాలన్నిటి వల్ల సాంస్కృతిక సిద్ధాంతం ఇపుడు ప్రజాస్వామ్యం, రాజకీయ అలయెన్సులు మొదలైన రాజకీయ భావనలను, ఆధిపత్య నిర్మాణాలు, ఆత్మాశ్రయత వంటి అనుభవాలను కూడా అధ్యయనం చేయసాగింది. అలాగే అది కళ, చరిత్ర, తత్వశాస్త్రం, సైన్సు, నీతి శాస్త్రం, సమాచార సంజ్ఞా పద్ధతిని, సాంకేతిక శాస్త్రాన్ని అధ్యయనం చేస్తుంది. సాంస్కృతిక సిద్ధాంతం వర్గం, సామాజిక ఐడెంటిటీ, వర్గపోరాటం, విప్లవం మొ... భావనలను తిరిగి పరిశీలించడంలో నిమగ్నం అయ్యింది. అలాగే సుఖ సంతోషాలు, స్థలం, కాలం మొదలైన వాటిని అధ్యయనం చేయడానికి నడుము బిగించింది. సాంస్కృతిక సిద్ధాంతానికి సామాజిక అనుభవం, దైనందిన జీవితాల నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం లక్ష్యం అయ్యింది. చివరకు ఉత్పత్తి యొక్క పునాదులు, అధికార నిర్మాణాలు కూడా! వీటన్నింటి వల్ల సాంస్కృతిక సిద్ధాంతాన్ని, దాని పరిధిని నిర్వచించడం అసాధ్యంగా మారింది.

ఈ రెండో తరం మానవతావాద మార్క్సిస్టులు 'సాంస్కృతిక మార్క్సిస్టులు (Cultural Marxists)' గా పేరుపడ్డారు. వీరు వ్యక్తి గాను, సామాజికం గాను క్రియాశీల మానవ కర్తను వారి సైద్ధాంతిక దృక్పథానికి కేంద్రం చేశారు.

అయితే ఈ హ్యూమనిస్టు మార్క్సిజాన్ని లూయిస్ ఆల్తూజర్ ఘాటుగా విమర్శిస్తూ అనేక వ్యాసాలు రాశాడు. ఆ వ్యాసాలన్నీ 'For Marx' అనే పేరుతో 1965 లో పుస్తకంగా ప్రచురితం అయ్యాయి. మానవ కర్తే ఒక చారిత్రక ఉత్పాదితం అని, సామాజిక సంబంధాల సమాకలనమని, అతడి కర్తృత్వం ఆవశ్యకం, ప్రధానం, శాశ్వతం కాదని వాదించాడు. స్వీయాత్మకత అనేది సాంస్కృతికంగా నిర్ణయించబడుతుంది. చారిత్రకంగా లభ్యమైన పరిస్థితులలో కర్త చేసే భావజాల కార్యకలాపాల ఫలితమే సబ్జెక్టివిటీ. అంతేగాక సామాజిక వ్యవస్థను సాపేక్షంగా స్వయం ప్రతిపత్తిగల కార్యకలాపాల నిర్మాణంగా తిరిగి భావించడం జరిగింది. ఐడియాలజీకి కీలక, నిర్ణయాత్మక ప్రభావాన్ని కల్పించడం జరిగింది. 'ప్రతీ సామాజిక కార్యకలాపం అన్ని స్థాయిల సామాజిక నిర్మాణంచే అధికంగా నిర్ణయించబడుతుంది' అనే సూత్రీకరణ భావజాలం ద్వారా పని చేస్తుంది. సామాజిక కార్యకలాపాలన్నీ ఆర్థిక సంబంధాల ప్రభావం వల్ల మాత్రమేనని చెప్పలేము.

"సంస్కృతి అంటే మనిషి సమాజ సభ్యునిగా సముపార్జించుకున్న జ్ఞానం, నమ్మకం, కళ, నైతిక విలువలు, చట్టం సాంప్రదాయం తదితర సామర్థ్యాలు, అలవాట్లు" అని టైలర్ నిర్వచించాడని ముందు చెప్పుకున్నాం. పరిణామ వాదులైన మోర్గాన్[7] ఎంగెల్స్‌లు ఆయన ఆలోచనని స్వీకరించి నాగరికత యొక్క అనేక అభివృద్ధి దశల్లో (ఆటవిక, అనాగరిక మొ..) ప్రతీ దశా సాంస్కృతికంగా నిర్దిష్టమైనదనే సత్యాన్ని కనుగొన్నారు. ఈ సూత్రం భౌతికవాద నియమాలకు అనుగుణమైనది. దీని ప్రకారం ఒకానొక సాంకేతికాభివృద్ధి స్థాయి ఒక రకమైన మతాన్ని, కుటుంబ నిర్మాణాన్ని, అంతరాలను, ఇతర సాంప్రదాయాలను తెచ్చి పెడుతుందని భావించారు.

ఉదా. విశాల రాజ్యం, దానికి ఒక రాజు అనే వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రకృతి శక్తుల, గ్రామ దేవతల ఆరాధనకు ప్రాధాన్యత తగ్గి ఒకే దేవతను ఆరాధించడ మొదలయ్యింది. అలాగే సొంత ఆస్తి వ్యవస్థ వచ్చిన తర్వాతే దంపతీ వ్యవస్థ, పిల్లలను తండ్రి పరంగా గుర్తించడం ప్రారంభమై బహు భర్తృత్వం అంతరించింది. అందువల్ల సామాజిక అభివృద్ధిలో ప్రతీ దశా, దాని ఉప దశ, దానికే ప్రత్యేకమైన సంస్కృతిని కలిగి ఉంటాయి.

ఇదిలా ఉండగా మానవజాతి శాస్త్రవేత్తలు, క్షేత్ర పరిశోధకులు నమ్మకాలు, సాంప్రదాయాలు, విలువలు, క్రతువుల తీరులు చాలా కాలం పాటు కొనసాగుతున్నట్లు కనుగొన్నారు. మరో వైపు అలా కొనసాగటానికి కారణాలు చాలా ఉంటాయి. ఇవి చాలా పెద్ద ఎత్తున చర్చలకు వాదోప వాదాలకు, సైద్ధాంతిక విభేదాలకు దారి తీస్తున్నాయి.

సమాజాన్ని గురించిన దృక్పథంలో ఏకాభిప్రాయ సాధనా ధోరణి మార్క్సిస్టు సాంప్రదాయంలో ఉంది. ఆధిపత్యం అత్యధికంగా వున్న ఏ రకం సమాజంలో అయినా సరే ఆధిపత్య సంస్కృతే ఉమ్మడి సంస్కృతిగా మారే ధోరణి ఉంటుంది. ఎందుకంటే ఆధిపత్య వర్గాలు అధీన వర్గాలపై సామాజిక నియంత్రణా సాధనాల ద్వారా 'తప్పుడు చైతన్యం' గా సంస్కృతిని రుద్దగలవు. దీనికి ఉదాహరణ ప్రస్తుత బూర్జువా సమాజమే. కేపిటలిజం మలిదశ అభివృద్ధిలో అధీన వర్గాలలో వర్గ, విప్లవ చైతన్యం రగులుతుందని మార్క్స భావించాడు. ఇప్పటికి 'వర్గ చైతన్యం' అనేది తగ్గిపోతున్నదే గాని పెరిగే సూచనలు కనిపించడం లేదు. కేపిటలిస్టు సంస్కృతి కార్మిక వర్గంతో సహా వామ పక్షాలను కూడా పూర్తిగా ఆవహించింది.

మార్క్యూజ్, హాబర్మాస్ మొ.. నియో-మార్క్సిస్టు విమర్శనాత్మక సోషియాలజిస్టుల అభిప్రాయం ప్రకారం రాజ్య సాంకేతిక పరిపాలనా సాధనాలు ప్రజలను కేపిటలిస్టు విలువలను, ఆకాంక్షలను ఆమోదించే స్థితికి

తేగలిగాయి. ఈ పనిని రాజ్య వ్యవస్థ మాస్ మీడియా ద్వారా, భ్రమలు, మత్తు కలిగించే సంక్షేమ రాజ్య శక్తుల ద్వారా చేయగలుగుతుందని వీరి వాదన.

మార్క్సిస్టు సాంస్కృతిక సిద్ధాంతానికి అవసరమైన సైద్ధాంతిక ప్రాతిపదికను కల్పించే ప్రయత్నం చాలామంది మహనీయులు చేశారు. అత్యంత ప్రముఖుల్లో అతి కొద్దిమంది గురించి మాత్రమే తెలుసుకున్నాం. ఈ పుస్తకంలో పేర్కొనని ప్రముఖులు చాల మంది ఉన్నారు.

Notes

1.తమ సిద్ధాంతాన్ని మార్క్స్ పేరుతో 'మార్క్సిజం' అని పిలవడమే సమంజసమని ఎంగెల్స్ తన అభిప్రాయాన్ని సుస్పష్టంగా చెప్పాడు. అందుకే అప్పట్లో ఎవరూ 'మార్క్స్-ఎంగెల్సిజం' అనలేదు.

2. Peter Golding (UK),Graham Murdock (USA) sociologists.

3. లక్ష్యాత్మక వాదమంటే ముందే నిర్ధారించిన ప్రయోజనాలను సాధించేందుకు లక్ష్య నిర్దేశక నియమాలను ఏర్పరచడం. వివరంగా తెలుసుకునేందుకు నేను కూర్చిన మార్క్సిస్టు తత్వ శాస్త్ర నిఘంటువు చూడండి.LSC ప్రచురణ.

4. కారణ కార్యత్వాన్ని చివరి వరకూ పొడిగించితే, యాదృచ్ఛికాన్ని తిరస్కరిస్తే, భవిష్యత్తు అంతా ముందు జరిగిన ఘటనలే నిర్ణయిస్తాయి అనే నిర్ధారణకు రావలసి ఉంటుంది. అదే నియతి వాదం.

5. Andrie Zhdanov (1896-1948) ప్రతిపాదించిన సాంస్కృతిక సిద్ధాంతం. సోవియట్ కల్చరల్ పాలసీ నిర్దేశకునిగా స్టాలిన్ ఇతన్ని నియమించాడు.

6. Western Marxism అనేది సెకండ్ ఇంటర్నేషనల్, సోవియట్ మార్క్సిస్టు భాష్యాలకు విరుద్ధంగా, ముఖ్యంగా యూరపులో అభివృద్ధి చెందినది.
7. లూయీ హెన్రీ మోర్గాన్. 'పురాతన సమాజం' పుస్తక రచయితగా తెలుగు వారికి సుపరిచితుడు.